
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే
నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 170

బుధవారం 10-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

KANCHI, DHARMAVARAM, POCHAMPALLY, UPPADA BANARAS AND MORE

SHILPA KALA WORK SAREE MRP ₹999 — GET SECOND SAREE @ 9* ONLY

AKSHYA PATTU SAREE MRP ₹1699 — GET SECOND SAREE @ 19* ONLY

PARINAYA PATTU SAREE MRP ₹2699 — GET SECOND SAREE @ 29* ONLY

HANDLOOM SAREES

BUY 2 @ ₹499* KERALA COTTON	BUY 2 @ ₹666* HANDLOOM COTTON	BUY 2 @ ₹799* SOMANUR HL SAREE
BUY 2 @ ₹899* VENKATAGIRI HL SAREE	BUY 2 @ ₹999* SOFT SILK SAREE	BUY 2 @ ₹999* VENKATAGIRI HL SAREE
BUY 2 @ ₹1199* ARUPUKOTTAI HL SAREE	BUY 2 @ ₹1699* KANCHI COTTON SAREE	BUY 2 @ ₹2099* KANCHI COTTON SAREE

PATTU SAREES

YAMINI PATTU BUY 2 ₹1199*	MALABAR PATTU BUY 2 ₹1499*	SOWBHAGYA PATTU BUY 2 ₹1599*
KANJEEVARAM PATTU BUY 2 ₹1799*	MEENAKSHI PATTU BUY 2 ₹1899*	GANDHARVA PATTU BUY 2 ₹2499*
MAHADEVA PATTU BUY 2 ₹2999*	KAUSHALYA PATTU BUY 2 ₹3399*	

CHUDIDAR DRESS MATERIALS

DRESS MATERIAL COMBO PACK BUY 6 @ ₹999*

BUY 2 @ ₹899* COTTON PRINTED DRESS MATERIAL	BUY 2 @ ₹999* COTON WORK DRESS MATERIAL	BUY 2 @ ₹999* CHUDIDAR READY MADE	BUY 2 @ ₹1099* FANCY DRESS MATERIAL
BUY 2 @ ₹1299* READYMADE CHUDIDAR	BUY 2 @ ₹1499* STRAIGHT CUT CHUDIDAR	BUY 2 @ ₹1799* FANCY CHUDIDAR	BUY 2 @ ₹1999* PARTY WEAR CHUDIDAR

GAGRAS

DIGITAL PRINT GAGRA BUY 2 @ ₹999 | FANCY GAGRA BUY 2 @ ₹1699 | BRIDAL GAGRA BUY 2 @ ₹1999

MENS WEAR

BUY 4 @ ₹999* MENS DENIMS	BUY 2 @ ₹1299* COTTON TROUSER	BUY 2 @ ₹1299* MENS DENIMS
BUY 5 @ ₹999* CASUAL SHIRTS	BUY 2 @ ₹1499* FASHION DENIMS	BUY 2 @ ₹1499* FASHION TROUSERS

U.S. POLO ASSN. — GET A BACKPACK WORTH ₹6999 FOR ₹699 ON PURCHASE OF ₹10999; GET A TROLLEY BAG WORTH ₹7999 FOR ₹799 ON PURCHASE OF ₹16999; BUY 2 40% OFF | BUY 1 30% OFF *On Selected Items

ARROW USA·1851 — GET ₹3000* OFF On purchase of 16999*; GET ₹2000* OFF On purchase of 12999*

KILLER this is us — GET ₹2000* OFF On purchase of 10995*; GET ₹1000* OFF On purchase of 6995*

OXEMBERG — On purchase of 2999* GET ₹1999* BACK PACK @ ₹199*

THINC — GET ₹2500* OFF On purchase of 9999*; GET ₹1500* OFF On purchase of 7999*

COOL COLORS CASUALS — On purchase of 2999* GET ₹1499* BACK PACK @ ₹199*

URBAN THRIVE BUY 2 @ ₹1999*

MODE BUY 2 @ ₹1499*

*Conditions Apply

KIDS WEAR

GIRLS LOWER BUY 3 @ ₹499	GIRLS T-SHIRT BUY 4 @ ₹499	GIRLS COTTON FROCKS BUY 2 @ ₹599

GIRLS COTTON FROCKS BUY 3 @ ₹699

GIRLS T-SHIRT BUY 4 @ ₹799

BOYS FASHION T-SHIRTS BUY 4 @ ₹799

GIRLS NIGHT SUIT BUY 2 @ ₹599

GIRLS COTTON FROCKS BUY 3 @ ₹599

GIRLS COTTON FROCKS BUY 2 @ ₹699

BED SHEETS

A/C BLANKET BUY 2 @ ₹199* | COTTON TOWEL BUY 5 @ ₹249* | B MILL BED SHEET BUY 2 @ ₹399*

30% OFF ON SELECTED ITEMS ONLY

BUY 1 GET 1 FREE ON SELECTED ITEMS ONLY

UPTO 51% OFF


అన్నిరకాల వస్త్రాలపై సరికొత్త స్టాక్‌తో...

CMR SHOPPING MALL The joy of life

ఆంధ్రప్రదేశ్ | తెలంగాణ | ఒడిశా

బస్‌స్టేషన్ ఎదురుగా, ఉప్పల్ 7660002086 | భాగ్యలత కమాన్ ప్రక్కన, హయత్‌నగర్ 8886607973 | బస్‌స్టాండ్ ఎదురుగా, మేడ్చల్ 7799909527

BHEL సర్కిల్, HP పెట్రోల్ బంకు ప్రక్కన 8886607978 | విజయ డెయిరీ ఎదురుగా, షాద్‌నగర్ 7799918624 | ఇండియన్ ఆయిల్ బంక్ ప్రక్కన, మియాపూర్ క్రాస్ రోడ్స్


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 170

బుధవారం 10-9-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



శుభారంభంపై గురి

ఆసియా కప్‌లో నేడు యూఏఈతో భారత్ తొలి పోరు -14లో



పీసీఓఎస్ అండ్ ఫిట్‌నెస్

క్రికెటర్ సచిన్ కూతురు సారా టెండూల్కర్ ఫిట్‌నెస్ మంత్రం -13లో


బంగారం బుల్లెట్ ర్యాలీ!

రూ. 5,080 ఒక్క రోజే పెరిగిన ధర

రూ. 1,12,750 కొత్త ఆల్‌టైమ్ గరిష్టం

43% ఈ ఏడాదిలో పెరిగింది

న్యూఢిల్లీ: కనకం 'ల'కారం దాటినా తగ్గేదేలే అంటూ కొనుగోలుదారులకు చుక్కలు చూపిస్తోంది! కొన్నిరోజులుగా రూ. లక్షపైనే కదలాడుతున్న పుత్తడి ఒక్కసారిగా మళ్లీ హైజంప్ చేసింది. బంగారం ధర మంగళవారం బుల్లెట్‌లా దూసుకెళ్లింది. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాముల రేటు ఏకంగా రూ. 5,080 పెరిగి రూ. 1,12,750 స్థాయికి చేరింది. దేశీయంగా బంగారానికి ఇది మరో కొత్త ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి. అంతేకాదు.. ఒకేరోజు పసిడి ఇంతలా పెరగడం కూడా ఇదే తొలిసారి కావడం గమనార్హం. వెండి ధర సైతం కిలోకు రూ. 2,800 లాభపడటంతో రూ. 1,28,800 స్థాయిని తాకింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లోనూ బంగారం 3,698 డాలర్ల వద్ద సరికొత్త గరిష్ఠాన్ని నమోదు చేసింది. 'బంగారం మరో రికార్డు స్థాయిని చేరింది. ఈ ఏడాది ఎప్పటికప్పుడు కొత్త గరిష్ఠాలు నమోదు చేస్తూ అంతర్జాతీయ మార్కెట్లో 35 శాతం పెరిగింది. సెంట్రల్ బ్యాంక్‌ల నుంచి బలమైన డిమాండ్‌కు తోడు ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)లోకి పెట్టుబడుల రాక, అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల కోత అంచనాలు.. బంగారం, వెండిలో రికార్డు బ్రేకింగ్ ర్యాలీకి కారణమవుతున్నాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతుండటం, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్ వార్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపిస్తాయన్న ఆందోళనలు సైతం సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారం ధరలకు మద్దతుగా నిలుస్తున్నట్టు గాంధీ వివరించారు.



మళ్లీ దిద్దాల్సిందే!

గ్రూప్-1 మెయిన్స్‌పై తేల్చి చెప్పిన హైకోర్టు



- మార్చిలో ఇచ్చిన జనరల్ ర్యాంకింగ్ లిస్ట్ రద్దు.. తుది మార్కుల జాబితా కూడా..
- జవాబు పత్రాలు మాన్యువల్‌గా పునఃమూల్యాంకనం చేయాలి
- ఆ మేరకు ఫలితాలు ప్రకటించి పోస్టులు భర్తీ చేయాలి... మూల్యాంకనం సాధ్యం కాకుంటే మళ్లీ మెయిన్స్ పరీక్ష పెట్టండి
- ఈ ప్రక్రియంతా 8 నెలల్లో పూర్తవ్వాలి
- నోటిఫికేషన్, నిబంధనల మేరకు పరీక్ష జరగలేదు... కమిషన్ చర్యలు మెయిన్స్ పరీక్షల పవిత్రతను దెబ్బతీశాయి
- ఒకరి మార్కులు మరొకరికి తెలియకుండా చేయడం పారదర్శకతను దెబ్బతీస్తోందన్న న్యాయమూర్తి
- రెండు హాల్ టికెట్ల జారీపై కమిషన్ వివరణ నమ్మశక్యంగా లేదని వెల్లడి
- మొత్తం సమస్యను రెండు కేటగిరీలుగా విభజించి, అంశాల వారీగా తీర్పు

సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాలను మళ్లీ దిద్దాల్సిందేనని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ)కు హైకోర్టు తేల్చిచెప్పింది. మార్చి 10న వెలువరించిన తుది మార్కుల జాబితా, మార్చి 30న ప్రకటించిన జనరల్ ర్యాంకింగ్ జాబితా(జీఆర్‌ఎల్)ను రద్దు చేసింది. గ్రూప్-1 మెయిన్స్‌కు సంబంధించిన అన్ని సమాధాన పత్రాలను మాన్యువల్‌గా తిరిగి మూల్యాంకనం చేసి ఫలితాలను ప్రకటించాలని ఆదేశించింది. సంజయ్‌సింగ్ అండ్ అదర్స్ వర్సెస్ యూపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, అలహాబాద్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు మేరకు మోడరేషన్ పద్ధతిని వర్తింపజేయాలని స్పష్టం చేసింది. ఆ ఫలితాల ఆధారంగా 563 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇది సాధ్యంకాని పక్షంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష రద్దు చేసి ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన అందరికీ తిరిగి మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియంతా మంగళవారం నాటి ఉత్తర్వుల కాపీ అందిన రోజు నుంచి 8 నెలల్లో పూర్తి చేయాలంటూ కీలక తీర్పు వెలువరించింది. 2024 అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనంలో అవకతవకలు, అసమానతలు చోటుచేసుకున్నాయని, దీనిపై న్యాయ విచారణ జరిపించాలని కోరుతూ సిద్దిపేట శివనగర్‌కు చెందిన కె.పర్శరాములుతో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని విచారించిన జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు సుదీర్ఘ వాదనల అనంతరం.. జూలై 7న తుది తీర్పు రిజర్వు చేశారు. తాజాగా మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ కేసుకు సంబంధించిన మొత్తం సమస్యను విధానపరమైన, మూల్యాంకన విధానం అనే రెండు కేటగిరీలుగా విభజించవచ్చునని న్యాయమూర్తి తెలిపారు. ఒక్కో కేటగిరీలోని అంశాల వారీగా తీర్పు ఇచ్చారు.

1) విధానపరమైన అంశాలు..

రెండు హాల్ టికెట్ల జారీ: 2024 ఫిబ్రవరి 19న టీజీపీఎస్సీ ఇచ్చిన నోటిఫికేషన్‌లో రెండు హాల్‌టికెట్ల ప్రస్తావన ఎక్కడా లేదు. కానీ వేర్వేరు హాల్ టికెట్లు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. కమిషన్ వివరణ కూడా అస్పష్టంగా ఉంది. యూపీఎస్సీనే ఒక హాల్‌టికెట్ ఇస్తున్నప్పుడు.. ఇక్కడ రెండు ఎందుకనే దానిపై వివరణ నమ్మశక్యంగా లేదు. 2011లో ఇదే విధానం అనుసరించినట్లు కమిషన్ పేర్కొన్నా.. ఆ డాక్యుమెంట్లను సమర్పించలేదు. నోటిఫికేషన్ లేదా నిబంధనల మేరకు పరీక్ష జరగలేదని ఈ కోర్టు అభిప్రాయపడుతోంది.

కేంద్రాల కేటాయింపు: 18, 19 పరీక్షా కేంద్రాల్లో మహిళా అభ్యర్థులకే ప్రాధాన్యత మిగతా 12వ పేజీలో ▶

కొత్త ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఘన విజయం

- తమిళనాడు నుంచి ఈ పదవిని చేపట్టనున్న మూడో నేతగా ఘనత
- ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో రాధాకృష్ణన్‌కు 452, సుదర్శన్‌రెడ్డికి 300 తొలి ప్రాధాన్యత ఓట్లు
- 152 ఓట్ల తేడాతో గెలుపొందిన ఎన్డీయే కూటమి అభ్యర్థి.... మొత్తం పోలైన ఓట్లు 767.. వాటిలో చెల్లనివి 15 ఓట్లు
- 98.20 శాతంగా నమోదైన పోలింగ్.. ఓటింగ్‌కు గైర్హాజరైన 13 మంది ఎంపీలు
- ఇండియా కూటమి నుంచి పలువురు ఎంపీల క్రాస్‌ఓటింగ్
- సుదర్శన్‌రెడ్డికి 324 ఎంపీల మద్దతుందని భావించినా 300 ఓట్లకే పరిమితం
- రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, ఖర్గే శుభాకాంక్షలు
- ఎంపీల తీర్పును అంగీకరిస్తున్నట్లు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ప్రకటన


ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలుపుతున్న ప్రధాని మోదీ


జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: దేశ 15వ ఉపరాష్ట్రపతిగా బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమొక్రటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ) తరఫున పోటీ చేసిన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి పక్షాల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిపై ఆయన ఘన విజయం సాధించారు. రాధాకృష్ణన్ 452 ఓట్లు సాధించగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి 300 ఓట్లు పొందారు. దీంతో 152 ఓట్ల తేడాతో రాధాకృష్ణన్ మిగతా 3వ పేజీలో ▶


మంటల్లో నేపాల్ పార్లమెంట్ భవనం

ఆగ్రహ జ్వాలల్లో హిమాలయ రాజ్యం

- నేపాల్‌లో ఆందోళనలు మహోగ్రరూపం
- రెండోరోజూ రెచ్చిపోయిన యువత
- పార్లమెంట్‌కు నిప్పుపెట్టిన ఆందోళనకారులు
- నైతిక బాధ్యతగా పదవీత్యాగం చేసిన ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ
- మంటల్లో కాలి చనిపోయిన మాజీ ప్రధాని ఖనాల్ సతీమణి

6 లో

కొత్త దళపతి.. తిప్పరి తిరుపతి!

మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లా కోరుట్లకు చెందిన తిప్పరి తిరుపతి అలియాస్ దేవుజీని ఆ పార్టీ ఎన్నుకున్నట్టు తెలిసింది. తీవ్ర నిర్బంధం ఉన్నా, ఇటీవల జరిగిన సమావేశంలో తిరుపతిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. 5 లో

'సాక్షి'పై కక్ష సాధింపు

అక్రమ కేసులో.. 'సాక్షి' ఎడిటర్‌కు నోటీసులు

- నిన్నటిదాకా 'సాక్షి' కార్యాలయాలపై టీడీపీ నేతలు, పోలీసుల దాడులు..
- ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై తాజాగా పలు సెక్షన్ల కింద అక్రమ కేసులు నమోదు చేసిన కూటమి సర్కారు
- ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఓ నేత మాట్లాడిన అంశాలను వార్తగా ప్రచురించడంపై కేసు
- డీఎస్పీల పదోన్నతుల్లో లంచాల వ్యవహారంపై కథనం రాసినందుకు మరో అక్రమ కేసు
- ఎమర్జెన్సీని మించిన అరాచకం.. దేశంలో తొలిసారి చూస్తున్నాం: పాత్రికేయ సంఘాలు
- చంద్రబాబు సర్కారు అప్రజాస్వామిక చర్యలు, మీడియాపై అణచివేత విధానాలను ఖండించిన పాత్రికేయ సంఘాలు, సీనియర్ జర్నలిస్టులు
- అభ్యంతరాలుంటే వివరణ కోరాలేగానీ అక్రమ కేసులు బనాయించడం ఏమిటని విస్మయం

2 లో

ఇదండీ సంగతి


అబ్బే! అదేం లేదు! ప్రతి విద్యార్థికి ఒక ఎలుకల బోను అందించి తక్షణమే చర్యలు తీసుకున్నాం!!


కేంద్రమంత్రి గడ్కరీతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ చామల

అభివృద్ధికి కొత్త 'దారులు'

ఫ్యూచర్ సిటీ-అమరావతి-బందరు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుమతి ఇవ్వండి

- రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం పనులకు కూడా...
- శ్రీశైలం మార్గంలో ఎలివేటెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సీఎం రేవంత్‌రెడ్డి వినతులు
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా సమావేశం

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో రహదారి నెట్‌వర్క్ విస్తరణ, విద్యాభివృద్ధికి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, నిర్మలా సీతారామన్‌ను మంగళవారం ఆయన వేర్వేరుగా కలిసి ఈ అంశాలపై వినతిపత్రాలు సమర్పించారు. హైదరాబాద్ సమీపంలోని 'భారత్ ఫ్యూచర్ సిటీ'నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మీదుగా బందరు ఓడరేవు వరకు 12 వరుసల రహదారి నిర్మించాలని నితిన్ గడ్కరీని కోరారు. ఈ ప్రతిపాదిత మార్గంలో 118 కిలోమీటర్లు తెలంగాణ పరిధిలో ఉంటుందని సీఎం వివరించారు. రీజినల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) పనులను మిగతా 3వ పేజీలో ▶

మాదక ద్రవ్యాలపై అప్రమత్తంగా ఉండాలి

విదేశీయులతో జాగ్రత్త.. యువతకు 'ఈగల్' హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాలో స్థానిక యువతను భాగస్వాముల్ని చేస్తున్నారని, అలాంటి విదేశీయులతో అప్రమత్తంగా ఉండాలని ఈగల్ హెచ్చరించింది. అద్దెకు ఇళ్లు ఇచ్చేముందు.. యజమానులు ఒకటికి రెండుసార్లు 'గుర్తింపు' నిర్ధారణ చేసుకోవాలని సూచించింది. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాల గురించి తెలిస్తే.. వెంటనే పోలీసులకు తెలియజేయాలని పేర్కొంది. నైజీరియన్ పెడ్లర్లు గోవాలోని విలాసవంతమైన విల్లాల్లో కార్యకలాపాలు సాగిస్తూ హైదరాబాద్, గోవాకు మాదక ద్రవ్యాలను సరఫరా చేస్తున్నారని ఈగల్ పేర్కొంది. నైజీరియన్లు వీసా వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారని.. నకిలీ గుర్తింపు, పాస్‌పోర్ట్‌లతో ప్రవేశిస్తున్నారని వివరించింది. మాదక ద్రవ్యాల లాభాలను హవాలా మార్గాల ద్వారా స్వదేశానికి రప్పిస్తూ.. దాన్ని వస్తువులను కొనుగోలు చేయడానికి ఉపయోగిస్తారని తెలిపింది. విదేశీ పెడ్లర్ల అరెస్టు, బహిష్కరణ మాత్రమే సరిపోదని.. వీసా/పాస్‌పోర్ట్ తనిఖీలను కఠినతరం చేయాల్సి ఉందని అభిప్రాయపడింది. తాజాగా జరిపిన దాడుల్లో డ్రగ్ మనీ లాండరింగ్‌లో సాయం చేస్తున్న రాజస్థాన్, గోవా, ఢిల్లీ, ముంబై, అహ్మదాబాద్‌లకు చెందిన మరో 16 మందితో పాటు చేతన్ మాఫ్జీ, రోనక్ ప్రజాపతి, చేతన్‌సింగ్, గగన్‌లను అరెస్టు చేశామని వెల్లడించింది. మొత్తంగా 20 మంది అరెస్టు చేసి.. రూ.3.08 కోట్లు స్వాధీనం చేసుకున్నామని ఈగల్ వెల్లడించింది.

'సాక్షి'పై కక్ష సాధింపు..

అక్రమ కేసులో 'సాక్షి' ఎడిటర్‌కు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి సర్కారు ఘోర వైఫల్యాలు.. అంతులేని అవినీతి, అక్రమాలపై ప్రజల పక్షాన ఎప్పటికప్పుడు ఎండగడుతున్న 'సాక్షి' మీడియాపై చంద్రబాబు ప్రభుత్వం దమనకాండను ప్రదర్శిస్తోంది. ఎమర్జెన్సీ దురాగతాలను తలదన్నేలా బరి తెగిస్తోంది. 'సాక్షి' కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని టీడీపీ నేతలు గతంలో పలుచోట్ల దాడులకు తెగబడగా ఇటీవల విజయవాడ ఆటోనగర్‌లోని ప్రధాన కార్యాలయంలో అర్ధరాత్రి పోలీసులు చొరబడి అరాచకంగా వ్యవహరించడం తెలిసిందే. గతంలో కార్యాలయాలపై దాడులకు పురిగొల్పగా.. ఇప్పుడు వార్త ప్రచురించినందుకు నోటీసులు, అక్రమ కేసులు నమోదు చేయడం విభ్రాంతి కలిగిస్తోంది. ఓ రాజకీయ పార్టీ నేత మాట్లాడిన అంశాలను ప్రచురించినందుకు మీడియాపై కేసులు పెట్టి ఎఫ్ఐఆర్ నమోదు చేయడం దేశ చరిత్రలో ఎప్పుడూ జరిగిన దాఖలాలు లేవని ప్రజాస్వామికవాదులు, పాత్రికేయ సంఘాలు పేర్కొంటున్నాయి. ప్రజల గొంతుకగా నిలిచే మీడియా గొంతు నులిమే యత్నాలను తీవ్రంగా ఖండిస్తున్నారు. అధికారులతో ఫిర్యాదులు ఇప్పించడం.. ఆ వెంటనే 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసు నమోదు చేయడం కూటమి సర్కారుకు పరిపాటిగా మారింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు వస్తే.. వాటిని ఖండివచ్చు లేదా సంబంధిత అధికారి లేదా పదవిలో ఉన్న నాయకుడు పరువు నష్టం దావా వేసుకునే వీలుంది.



అయితే చంద్రబాబు సర్కారు కొత్త సంస్కృతికి తెర తీసింది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించడం... ఎడాపెడా అక్రమ కేసులు నమోదు చేసి కోర్టుల చుట్టూ తిప్పే ప్రక్రియను ఎంచుకుంది. పత్రికలో ప్రభుత్వ వ్యతిరేక వార్త వస్తే చాలు.. వెంటనే కేసు రిజిస్టర్ చేయాలనేలా మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త విలేకరుల సమావేశంలో మాట్లాడిన అంశాలను వార్తగా ప్రచురించినందుకు తాడేపల్లి పోలీసులు 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై అక్రమ కేసు నమోదు చేశారు. అక్రమ కేసు నమోదు చేయడమే కాకుండా.. బీఎన్ఎస్ఎస్ 35 (3) కింద నోటీసులు జారీ చేశారు. పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ గతనెల 16వ తేదీన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రియల్ ఎస్టేట్ మాయలో చంద్రబాబు ప్రభుత్వం అమరావతిని బతికించుకోవడం కోసం కొండవీటి వాగు వరద నీటిని కృష్ణా, గుంటూరు, అప్పాపురం ఛానళ్లకు మళ్లించి పొన్నూరు నియోజకవర్గంలో 72 వేల ఎకరాల్లో పంటల పొలాల ముంపునకు కారణమైందని ఆరోపించారు. దీనికి సంబంధించి.. 'అమరావతి కోసం పొన్నూరును ముంచేశారు' శీర్షికన ప్రచురించిన వార్తపై గుంటూరు ఛానెల్ సెక్షన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ అవినాష్ ఫిర్యాదు చేయడంతో తాడేపల్లి పోలీసులు 518/2025 కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తాడేపల్లి పోలీసు స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సోమవారం హైదరాబాద్‌లోని 'సాక్షి' కార్యాలయానికి చేరుకుని ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డికి నోటీసులు అందచేశారు. బీఎన్ఎస్ఎస్‌లో సెక్షన్లు 353(1), 61(2), డిజాస్టర్ మేనేజ్‌మెంట్ యాక్ట్ 2025 సెక్షన్ 54 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అందచేసిన నోటీసుల్లో పేర్కొన్నారు. దీనితో మరో అక్రమ కేసులోనూ ఎస్ఐ నోటీసులు అందజేశారు. పోలీసు శాఖలో డీఎస్పీల నుంచి అదనపు ఎస్పీలుగా పదోన్నతులు కల్పించడానికి లంచాలు డిమాండ్ చేస్తున్నట్లు రాసిన 'పైసా మే ప్రమోషన్' కథనంపై తాడేపల్లి పోలీసులు మరో అక్రమ కేసు నమోదు చేశారు. ఈ అక్రమ కేసులో 61(2), 196(1),353(2) రెడ్‌విత్ 3(5) బీఎన్ఎస్ఎస్, పోలీసుల్లో అసంతృప్తిని రెచ్చగొట్టడం 1922 చట్టం కింద అక్రమ కేసులు నమోదు చేసి నోటీసులు ఇవ్వడం గమనార్హం.

తీవ్రంగా ఖండించిన పాత్రికేయ సంఘాలు, సీనియర్ జర్నలిస్టులు

'సాక్షి' దినపత్రిక ఆంధ్రప్రదేశ్ ఎడిషన్‌లో ప్రచురితమైన వార్తకు సంబంధించి ఏకంగా పత్రిక సంపాదకుడు ఆర్.ధనంజయరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జీ, రిపోర్టర్, వార్తను వెబ్ ఎడిషన్‌లో ప్రచురించినందుకు ఇన్‌చార్జీగా ఉన్న ధనుంజయ్‌రెడ్డిపై చంద్రబాబు నేతృత్వంలోని కూటమి సర్కారు అక్రమ కేసులు బనాయించి నోటీస్‌లు ఇవ్వడాన్ని పలు జర్నలిస్టుల సంఘాల నేతలు, సీనియర్ జర్నలిస్టులు, సంపాదకులు తీవ్రంగా ఖండించారు. పత్రికలో ఏదైనా వార్త వస్తే దానిపై అభ్యంతరాలుంటే వివరణ కోరడం లేదా రిజాయిండార్ ఇవ్వడం ఆనవాయితీ కాగా ఏకంగా అక్రమ కేసులు మోపి 'సాక్షి' జర్నలిస్టులను కోర్టుకు ఈడ్చటాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగేలా, ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగించేలా ఏపీ ప్రభుత్వం ఆదేశాలతో పోలీసులు వ్యవహరించడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై జర్నలిస్టుసంఘాల నేతలు, సీనియర్ పాత్రికేయుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

ఖండన ఇవ్వకుండా సంపాదకుడిపై కేసులా?



దినపత్రికలు ప్రచురించే వార్తల్లో పొరపాట్లు ఏమైనా ఉంటే, అసత్యాలు రాస్తే సంబంధిత వ్యక్తులు గానీ సంస్థలు గానీ ప్రభుత్వం గానీ వాస్తవాలు తెలియచేస్తూ వివరణ ఇచ్చుకోవడం, వక్రీకరణలు ఉంటే ఖండించడం ఒక పద్ధతి. వార్తాపత్రిక అసత్యాలు రాస్తే సదరు వివరణ గానీ ఖండన గానీ ప్రచురించాల్సిన బాధ్యత పత్రికలది. పత్రికలు స్వయంగా రహస్య వార్తలు లేదా ఎవరైనా విలేకరుల గోష్ఠి నిర్వహించి చెప్పే వార్తలలో కూడా తప్పులుంటే సవరణ పంపిస్తే వేయాల్సిందే. పత్రికలు ఆ పని చేయకపోతే చట్టపరమైన చర్యలకు పూనుకునే అధికారం సదరు పార్టీలకు, వ్యక్తులకు ఉంటుంది. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆ జీవోను సవరించి సమాచార శాఖ కమిషనర్‌కు ఉన్న అధికారాలను ఆయా శాఖల కార్యదర్శులకు బదిలీ చేస్తూ కొత్త ఉత్తర్వులు జారీ చేసింది. దీనిమీద అప్పటి ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ, దాని వందిమాగధ మీడియా చేయని రభస లేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛ గొంతు నులిమేస్తున్నదని హాహాకారాలు చేశారు. తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒక విధంగా.. అధికారంలో ఉన్నప్పుడు మరో విధంగా పత్రిక స్వేచ్ఛ, భావ ప్రకటన స్వేచ్ఛ ఉంటాయని కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో భావిస్తోంది. ప్రభుత్వ చర్యలను జర్నలిస్ట్ సంఘాలు, బుద్ధిజీవులు ప్రతిఘటించాలి. - దేవులపల్లి అమర్, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ స్టీరింగ్ కమిటీ మెంబర్

రాజ్యాంగ హక్కుల హననం..





'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన ఒక వార్త విషయంలో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఏకంగా ఎడిటర్‌పై పోలీసు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. అమరావతి కోసం పొన్నూరు అనే ప్రాంతాన్ని ముంచేశారు అంటూ వైఎస్సార్ సీపీకి చెందిన ఒక నాయకుడు చేసిన ఆరోపణను ఆయన వ్యాఖ్యల రూపంలోనే 'సాక్షి'లో ప్రచురించారు. దానిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే అదే పత్రికాముఖంగా ఖండించాలేగానీ ఈ విధంగా పోలీస్ కేసులు పెట్టడం ఎంత మాత్రం సమంజసం కాదు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా మీడియా స్వేచ్ఛను హరిస్తూ పోలీస్ కేసులు పెడితే జర్నలిస్ట్ సంఘాలుగా చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరిస్తున్నాం. 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డిపై నమోదు చేసిన పోలీస్ కేసును వెంటనే ఉపసంహరించుకునేలా అక్కడి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

- అల్లం నారాయణ, ఆస్కాని మారుతి సాగర్, తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు సంఘం

ప్రజా వ్యతిరేకతను తట్టుకోలేక మీడియాపై దాడి..



ఏపీలో పరిస్థితి చూస్తుంటే... పోలీస్‌రాజ్యం మినహా ప్రజారాజ్యం నడుస్తున్నట్లు కనిపించడంలేదు. ఎల్లో మీడియా తమ అవసరం కోసం ప్రభుత్వంలో లోపాలు ఎత్తిచూపుతూ వార్తలు రాస్తే కేవలం రిజాయిండర్ లేదా వివరణ మాత్రమే అడుగుతున్నారు. చంద్రబాబు పర్యవేక్షణలోని 'సూర్యఘర్'పై వారు వార్తలు రాస్తే ఖండన మాత్రమే ఇచ్చారు. అదే 'సాక్షి' పత్రిక అమరావతికి సంబంధించి ప్రెస్‌కాన్ఫరెన్స్ వార్తను మాత్రమే రాస్తే ఎడిటర్‌కు నోటీస్‌లు ఇవ్వటాన్ని చూస్తుంటే.. పత్రికాస్వేచ్ఛను హరించాలనే తాపత్రయమే కనిపిస్తోంది. సాక్షిలో ప్రచురితమైన వార్తకు ఖండన ఇవ్వకుండా, వివరణ కోరకుండా నేరుగా కేసులు పెట్టడాన్ని చూస్తుంటే జర్నలిజం స్ఫూర్తికి విరుద్ధంగా గా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. చంద్రబాబు విపక్షంలో ఉండగా సీఎంతో సహా ఎవరి మీద పడితే వారి మీద నానా విమర్శలు చేశారు. ఇప్పుడు తనపై వాస్తవాలు రాస్తున్నా భరించలేకపోవడం ప్రజాస్వామ్య హననమే. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడమే. తమ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను తట్టుకోలేక సాక్షి మీడియాపై, సోషల్ మీడియాపై దాడి చేస్తున్నారు. కూటమి సర్కార్, పోలీసులు అనుసరిస్తున్న విధానాలనే ప్రామాణికంగా తీసుకున్నట్లైతే గతంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎల్లో మీడియాపై వందల కేసుల పెట్టి ఉండొచ్చు. కానీ అలా జరగలేదు. గతంలో ఎల్లోమీడియా, టీడీపీ నేతలు అరాచకంగా వ్యవహరిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఇష్టం వచ్చినట్లుగా ప్రవర్తించారు.- కొమ్మినేని శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్ట్

చంద్రబాబు స్వభావానికి తగ్గట్టుగానే..



చంద్రబాబు ప్రభుత్వం తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకుంటోంది. చంద్రబాబు ఒక ప్రజాస్వామ్యవాది అనే ఆలోచన గతంలోనూ ఇప్పుడూ ఎవరికీ లేదు. ఆయన రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి లేదు. ఆ తర్వాత కూడా ఇన్నేళ్లలో అదే అప్రతిష్ఠ నిలబెట్టుకుంటున్నారే గానీ కొత్తగా సాధించింది ఏమీ లేదు. అదే క్రమంలో తాజాగా సాక్షి ఎడిటర్‌పై కొంతకాలంగా వరుసగా చేస్తున్న ఆరోపణలు, అర్థం పర్థంలేని చర్యలు దీనినే బలపరుస్తున్నాయి. ఇవన్నీ చూస్తుంటే చంద్రబాబు లక్షణాలు, స్వభావానికి తగ్గట్టుగానే ప్రవర్తిస్తున్నారని భావించేందుకు బలం చేకూరుతోంది. తనను తానే ఎక్స్‌పోజ్ చేసు కుంటున్నారు. ఈ విషయంలో ఒక్క పత్రికా సమాజమే కాదు.. మొత్తంగా నాగరిక, ప్రజా స్వామిక వాదులంతా ఖండించాల్సిన విషయమిది.

- టంకశాల అశోక్, సీనియర్ పాత్రికేయులు

బెడిసి కొడతాయి..



సాక్షి లేదా మరేదైనా పత్రిక ఇచ్చిన వార్తా కథనాలతో ప్రభుత్వం విభేదిస్తే తప్పకుండా ఖండించవచ్చు. తమ కోణంలో చెప్పవచ్చు. దానిపై ఆ సంస్థ స్పందించకపోతే నోటీసులు ఇచ్చి చట్టరీత్యా చర్య తీసుకోవచ్చు. కానీ నేరుగా కేసులు, నోటీసులు, దాడులు లాంటి వంటి చర్యలు సరికాదు. సోషల్ మీడియాపైనా కొత్త చట్టం తెస్తామని కీలక నేతలు చెబుతున్నారు. ఈ విధంగా విమర్శలపై విరుచుకుపడటం ఏ విధంగానూ సరికాదు. ఇలాంటి ధోరణులకు ఎవరు పాల్పడినా బెడిసి కొడతాయి. వీటిని మీడియా అంగీకరించదు.

- తెలకపల్లి రవి, రాజకీయ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్ట్


ఎమర్జెన్సీని తలదన్నే పరిస్థితులు



ప్రస్తుతం చోటు చేసుకుంటున్న పరిణామాలు చూస్తుంటే ఎమర్జెన్సీని తలదన్నే పరిస్థితులు కనిపిస్తున్నాయి. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించేలా 'సాక్షి' ఎడిటర్‌పై వరుసగా కేసులు పెడుతుండడాన్ని పత్రికా స్వేచ్ఛపై దాడిగానే చూడాలి. అంతకు ముందు కూడా 'సాక్షి' ఎడిటర్ నివాసానికి వెళ్లి సోదాలు జరపడం లాంటి చర్యలు ఖండనార్హం. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఏదిపడితే అది ఇష్టారాజ్యంగా రాసిన వార్తాపత్రికలున్నాయి. అయినప్పటికీ గత ప్రభుత్వం సంయమనం పాటించింది.

- పి.విజయబాబు, సీనియర్ పాత్రికేయులు

ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త నుంచి ఉపరాష్ట్రపతి దాకా..



సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్ఎస్)లో మొదలైన ప్రస్థానం.. ద్రవిడ గడ్డపై కమలం జెండాను రెపరెపలాడించిన పోరాటం.. గవర్నర్‌గా రాజ్యాంగబద్ధ పాలనకు అందించిన సహకారం.. వెరసి అంతిమంగా చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్‌ను భారత ఉపరాష్ట్రపతిని చేశాయి. తమిళనాడులోని ఒక సామాన్య ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త నుంచి ఉపరాష్ట్రపతి వరకు సీపీ రాధాకృష్ణన్ సాగించిన సుదీర్ఘ రాజకీయ యాత్ర మంగళవారం విజయతీరాలకు చేరింది. పార్టీ సిద్ధాంతాలే శ్వాసగా, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ అధిష్టానం అప్పగించిన ప్రతి బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించిన నాయకుడికి దక్కిన అత్యున్నత గౌరవం ఇది. రాధాకృష్ణన్ నియామకం కేవలం ఒక వ్యక్తికి దక్కిన పదవిగా కాకుండా బీజేపీ భవిష్యత్ రాజకీయ వ్యూహాలకు ముఖ్యంగా 'మిషన్ సౌత్'కు అద్దం పడుతోంది. రాధాకృష్ణన్ ఎంపిక వెనుక కమలదళం రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక కోణాలు దాగిఉన్నాయి.

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్ విజయ ప్రస్థానం ఇదీ..

జాతీయవాద రాజకీయాలకు ఆదరణలేని తమిళనాట 16వ ఏటనే సంఘ్‌లో చేరిక	1998, 1999 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరు ఎంపీగా ఘన విజయం	2004 నుంచి 2007 వరకు తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా సేవలు	బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషి..

సిద్ధాంత పునాదులు.. సంఘ్‌లో శిక్షణ

➤ తమిళనాడులోని తిరుప్పూరులో 1957 అక్టోబర్ 20న జన్మించిన రాధాకృష్ణన్.. చిన్నతనం నుంచే ఆర్‌ఎస్ఎస్ భావజాలానికి ఆకర్షితులై పూర్తిస్థాయి కార్యకర్తగా మారారు. జాతీయవాద రాజకీయాలకు ఆదరణ లేని తమిళనాట.. ద్రవిడ ఉద్యమమే ఊపిరిగా సాగే సామాజిక వాతావరణంలో.. రాధాకృష్ణన్ తన 16వ ఏటనే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరారు. అది ఆయన జీవితాన్ని, రాజకీయ భవిష్యత్తును నిర్దేశించిన కీలక మలుపు. అప్పటి నుంచే జాతీయవాదం, హిందుత్వం, క్రమశిక్షణ, దేశ సేవ వంటి సంఘ్ మౌలిక సిద్ధాంతాలు ఆయనలో బలంగా నాటుకుపోయాయి. పార్టీ నిర్మాణం, క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమవడం, సైద్ధాంతిక స్పష్టత వంటి లక్షణాలను ఆయన అక్కడే అలవర్చుకున్నారు. 1974లో నాటి జనసంఘ్ తమిళనాడు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీకి రాధాకృష్ణన్ ఎన్నికయ్యారు. 1980లో బీజేపీ ఆవిర్భావంతో లాంఛనంగా అందులో చేరి నాటి అగ్రనేత అటల్ బిహారీ వాజ్‌పేయికి అనుచరుడిగా మారారు. ఈ పునాదే ఆయన్ను తర్వాతి రాజకీయ జీవితంలో ఎదురైన ఎన్నో సవాళ్లను తట్టుకొనేలా చేసింది.

ద్రవిడ కోటలో సంచలనం..

➤ రాధాకృష్ణన్ రాజకీయ ప్రస్థానంలో 1998, 1999 కోయంబత్తూరు లోక్‌సభ విజయాలు అత్యంత కీలకమైనవి. 1998 ఎన్నికలకు కొన్నిరోజుల ముందు కోయంబత్తూరులో ఇస్లామిక్ ఉగ్రవాద సంస్థ 'అల్–ఉమ్మా'జరిపిన వరుస బాంబు పేలుళ్లతో నగరం దద్దరిల్లింది. ఈ ఘటన జరిగినప్పుడు అధి కారంలో ఉన్న డీఎంకేపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత, అభద్రతాభావం ఆందోళన రేకెత్తించింది. ఈ వాతావరణంలో దేశభక్తి, హిందూ రక్షణ నినాదాలతో బీజేపీ బరిలోకి దిగింది. రాధాకృష్ణన్‌ను జాతీయవాదానికి ప్రతీకగా చూసిన ప్రజలు ముఖ్యంగా హిందూ ఓటర్లు ఏకతాటిపైకి వచ్చి ఆయనకు పట్టంకట్టారు. ద్రవిడ పార్టీల ఆధిపత్యానికి సవాల్ విసురుతూ ఒక జాతీయ పార్టీ అభ్యర్థి అక్కడ గెలవడం సంచలనం సృష్టించింది. 1999లోనూ అదే ఊపును కొనసాగించి రెండోసారి గెలవడం ద్వారా అది గాలివాటు విజయం కాదని ఆయన నిరూపించారు.

దక్షిణాదిపై గురి

➤ రాధాకృష్ణన్ అభ్యర్థిత్వం వెనుక బీజేపీ స్పష్టమైన రాజకీయ ప్రణాళిక కనిపిస్తుంది. దక్షిణాదిలో పార్టీ విస్తరణపై దృష్టిపెట్టిన కమలదళం.. తమిళనాడుకు చెందిన వ్యక్తిని, అందులోనూ బలమైన హిందుత్వ నేపథ్యం ఉన్న నాయకుడిని ఉపరాష్ట్రపతిని చేయ డం ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రజలకు, కార్యకర్తలకు ఒక సందేశం పంపినట్లయింది. ఈ పరిణా మం భవిష్యత్తులో పొత్తులు, పార్టీ విస్తరణకు మార్గం సుగమం చేయనుంది.

వివాదరహిత, సౌమ్య ముద్ర

➤ గవర్నర్‌గా రాధాకృష్ణన్ పనితీరు వివాదరహితంగా ఉంది. ఇప్పుడు రాజ్యసభ చైర్మన్‌గా, ప్రతిపక్షాలు బలంగా ఉన్న సభను నడిపించడానికి ఆయన సౌమ్య స్వభావం, రాజ్యాంగ పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడతాయి. ఇది వ్యూహాత్మకంగా సరైన ఎంపిక. రాధాకృష్ణన్ ప్రస్థానం ఒక వ్యక్తి విజయగాథ మాత్రమే కాదు.. ఇది ఆధునిక బీజేపీ రాజకీయాలకు ప్రతిబింబం. సైద్ధాంతిక నిబద్ధత, సంస్థాగత విధేయత, వ్యూహాత్మక రాజకీయ ప్రయోజనం .. ఈ మూడు అంశాలనూ సమన్వయం చేస్తూ బీజేపీ అధిష్టానం తీసుకున్న నిర్ణయం.

పార్టీయే శాశ్వతం.. ఓడినా చెదరని పట్టుదల

➤ రెండుసార్లు ఎంపీగా గెలిచినప్పటికీ ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో రాధాకృష్ణన్ ఓటమిని చవిచూశారు. అయినా ఆయన నిరాశ చెందలేదు. అధికారం లేనప్పుడే అసలైన నాయకత్వ పటిమ బయటపడుతుందన్నట్లుగా ఆయన పార్టీ నిర్మాణానికే సమయాన్ని కేటాయించారు. 2004–07 మధ్య తమిళనాడు బీజేపీ అధ్యక్షుడిగా ఆ రాష్ట్రంలో పార్టీకి సంస్థాగత రూపాన్ని ఇవ్వడానికి తీవ్రంగా శ్రమించారు. బూత్‌స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయడం, కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించడంపై దృష్టిపెట్టారు. నదుల అనుసంధానం, ఉగ్రవాద నిర్మూలన, ఉమ్మడి పౌరస్మృతి అమలు, డ్రగ్స్‌రహిత రాష్ట్రం తదితర డిమాండ్లతో 93 రోజుల పాటు సుమారు 19 వేల కి.మీ. మేర ఆయన రథయాత్ర చేపట్టారు. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఓడిన రాధాకృష్ణన్.. పదవులున్నా లేకున్నా పార్టీని, సిద్ధాంతాన్ని అంటిపెట్టుకొనే ఉన్నారు. ఈ లక్షణమే ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వంటి అగ్రనేతల దృష్టిలో ఆయ న్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. 2023 ఫిబ్రవరిలో కేంద్రం ఆయన్ను జార్ఖండ్ గవర్నర్‌గా నియమించింది. ఆ తర్వాత నాటి తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజీనామాతో తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. 2024 జూలైలో మహారాష్ట్ర గవర్నర్‌గా నియమితులయ్యారు. ఈ ఏడాది జూలైలో అప్పటి ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ ఆకస్మిక రాజీనామాతో బీజేపీ అధినాయకత్వం రాధాకృష్ణన్ ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బరిలో నిలిపింది.

రాధాకృష్ణన్‌కు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి శుభాకాంక్షలు



సాక్షి, న్యూఢిల్లీ: భారత 15వ ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన చంద్రపురం పొన్నుస్వామి రాధాకృష్ణన్‌కు కేంద్ర, బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సాధారణ కార్యకర్తగా జీవితాన్ని ప్రారంభించి, క్రమశిక్షణతో, అకుంఠిత దీక్షతో నమ్మిన సిద్ధాంతం కోసం అహర్నిశలు శ్రమించిన వ్యక్తి అంటూ కొనియాడారు. కిందిస్థాయి నుంచి ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన ఆయన జీవిత ప్రయాణం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. 'జార్ఖండ్, తెలంగాణ, పుదుచ్చేరి, మహారాష్ట్ర గవర్నర్‌గా మీరు అందించిన సేవలు గుర్తుంటాయి. రాజకీయ, పరిపాలనా రంగంలో మీ నిబద్ధత, నిజాయితీకి మీరు చేసిన ప్రజాసేవకు ఈ పదవి సరైన గుర్తింపు. రాజ్యసభ చైర్మన్‌గా, ఉపరాష్ట్రపతిగా దేశ రాజ్యాంగానికి మరింత వన్నెతెచ్చేలా మీ పదవీకాలం కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'అంటూ కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

మండలి భవనం పనులు వేగవంతం చేయాలి

శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసన మండలి భవనం పనులను వేగవంతం చేయాలని, రానున్న సమావేశాలు ఈ భవనంలోనే నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర శాసనసభ ప్రాంగణంలోని తెలంగాణ శాసన మండలి భవనం (హెరిటేజ్ బిల్డింగ్) పునర్నిర్మాణ పనులను ఆయన శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, లెజిస్లేటివ్ సెక్రటరీ నరసింహా చార్యులుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పనులను పరిశీలించడానికి వస్తారని, పనుల్లో ఎలాంటి జాప్యం చేయకూడదని ఆదేశించారు. హెరిటేజ్ భవనం అయినందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆర్ అండ్ బీ అధికారులు, అగాఖాన్ సంస్థ ప్రతినిధులతో అసెంబ్లీ స్పీకర్ చాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఆహార భద్రతా కార్డులను పునఃసమీక్షించాలి

- పౌరసరఫరాల ముఖ్యకార్యదర్శి డీఎస్ చౌహాన్
- డీఎఫ్‌పీడీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన కేంద్ర ఆహార భద్రతా కార్డుల (ఎన్ఎఫ్ఎస్‌సీ) విషయంలో పునఃసమీక్ష జరపాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. సబ్సిడీ బియ్యం అందుకుంటున్న అనర్హులైన రేషన్ కార్డుదారులను తొలగించి, అర్హులైన కొత్త లబ్ధిదారులను ఎన్ఎఫ్ఎస్‌సీ జాబితాల్లో చేర్చాలని అభ్యర్థించింది. ఆహార ధాన్యాల సేకరణ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం (డీఎఫ్‌పీడీ) ఆధ్వర్యంలో ఏడో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ మంగళవారం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు ఉమ్మడిగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెండు రాష్ట్రాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ ముఖ్యకార్యదర్శి డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పేదలందరికీ ఆహార భద్రతా కార్డుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఎన్ఎఫ్ఎస్‌సీ కార్డులు 65 లక్షల వరకు ఉన్నాయని, పదేళ్లుగా వీటిలో మార్పులు లేవని అన్నారు. కేంద్రం జారీ చేసిన కార్డుల్లో అనర్హులను తొలగించడం ద్వారా అర్హులైన వారికి కొత్తగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వర్క్‌షాప్‌లో డీఎఫ్‌పీడీ, ఎఫ్‌సీఐ, తెలంగాణ పౌర సరఫరాల సంస్థ, మార్క్‌ఫెడ్, కర్ణాటక పౌర సరఫరాల కార్పొరేషన్ సహా రెండు రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు పాల్గొన్నారు.

కొత్త ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

▶ మొదటి పేజీ తరువాయి

గెలుపొందినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీసీ మోదీ మంగళవారం రాత్రి ప్రకటించారు. దీంతో రాధాకృష్ణన్ త్వరలోనే ఉపరాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేపట్టనున్నారు. తమిళనాడు నుంచి ఈ పదవిని అధిష్టించిన సర్వేపల్లి రాధాకృష్ణన్, వెంకట్రామన్‌ల తర్వాత మూడో నాయకుడిగా సీపీ రాధాకృష్ణన్ చరిత్రకెక్కారు.

ఘన విజయం...

ఉపరాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ నూతన పార్లమెంట్ భవనంలోని 'వసుధ ఎఫ్–101'లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. ఈ పోలింగ్‌లో మొత్తంగా 767 మంది ఎంపీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రస్తుతం రాజ్యసభలో 6, లోక్‌సభలో ఒక ఖాళీ స్థానాన్ని పక్కనబెడితే లోక్‌సభలో 542 మంది, రాజ్యసభలో 239 మంది కలిపి 781 మంది ఎంపీలు ఓటింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. అయితే ముందే ప్రకటించినట్లుగా బీఆర్ఎస్‌కు చెందిన నలుగురు ఎంపీలు, ఏడుగురు బీజేడీ ఎంపీలతోపాటు శిరోమణి అకాలీదళ్ ఎంపీ ఒకరు, స్వతంత్ర ఎంపీ సరబ్‌జీత్‌సింగ్ ఖల్సా ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. దీంతో మొత్తంగా 767 (98.2 శాతం) ఓట్లు పోలయ్యాయి. విజయానికి అవసరమైన ఓట్లను 377గా నిర్ణయించారు. సాయంత్రం 6 గంటల నుంచి ఓట్లను లెక్కించి రాత్రి 7:30 గంటలకు ఫలితాన్ని ప్రకటించారు. మొత్తం పోలైన 767 ఓట్లలో చెల్లని ఓట్లు 15 ఉండగా మిగిలిన 752 ఓట్లలో రాధాకృష్ణన్‌కు 452 మొదటి ప్రాధాన్యతా ఓట్లు లభించాయని.. జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి 300 మొదటి ప్రాధాన్యత ఓట్లు వచ్చాయని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పీసీ మోదీ ప్రకటించారు.

మిన్నంటిన సంబరాలు..

సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించిన వెంటనే బీజేపీలో సంబరాలు మొదలయ్యాయి. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసం ముందు తమిళనాడు సంప్రదాయాలతో కూడిన సాంస్కృతిక కార్యక్రమాలు మొదలయ్యాయి. సీపీ రాధాకృష్ణన్‌కు బీజేపీ ఎంపీలతోపాటు ఆయనకు మద్దతిచ్చిన పక్షాల ఎంపీలు శుభాకంక్షలు తెలిపారు.

అనుకున్నట్లే క్రాస్ ఓటింగ్

➤ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అందరూ ఊహించినట్లే క్రాస్ ఓటింగ్ జరిగినట్లు తెలిసింది. ఇండియా కూటమిలోని పక్షాలు, తమకు మద్దతుగా వచ్చిన ఆప్ సహా ఇతర చిన్నాచితక పార్టీలతో కలిసి కాంగ్రెస్ కనీసం 324 ఓట్లు వస్తాయని అంచనా వేసింది. పోలింగ్ జరుగుతున్న సమయంలోనే ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ప్రతిపక్షాలు ఐక్యంగా నిలబడ్డాయి. కూటమికి చెందిన 315 మంది ఎంపీల్లో అందరూ ఓటింగ్ కోసం హాజరయ్యారు'అని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. అయితే కాంగ్రెస్ పేర్కొన్నట్లుగానే 15 ఓట్లు క్రాస్ ఓటింగ్ అయ్యాయి. దీంతోపాటు చెల్లని ఓట్లు సైతం ఇండియా కూటమి పక్షాల వేనని ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే 20–25 ఓట్లు ఎన్డీఏ అభ్యర్థికి క్రాస్ ఓటింగ్ జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మరోవైపు రాధాకృష్ణన్‌కు ఎన్డీయే కూటమిలోని 427 మంది ఎంపీల మద్దతు ఉందని బీజేపీ కాగితంపై లెక్కలేసుకోగా పోలింగ్‌లో మాత్రం అంతకన్నా ఎక్కువగానే ఓట్లు లభించాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ నేతృత్వంలో నిర్వహించిన సమర్థవంతమైన ఫ్లోర్ మేనేజ్‌మెంట్ కారణంగా ఎన్డీయే సునాయాస విజయం సాధించిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఎన్డీఏ కూటమి పక్షాలకు రెండ్రోజులపాటు నిర్వహించిన శిక్షణా తరగతులు, మిత్రపక్షాలతో సమన్వయం, పోలింగ్‌కు ముందు ప్రాంతాలవారీగా ఎంపీలతో సమన్వయం రాధాకృష్ణన్ గెలుపునకు దోహదం చేసిందని చెబుతున్నారు.


రాష్ట్రపతి, ప్రధాని, అమిత్ షా, ఖర్గే శుభాకాంక్షలు

ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన సీపీ రాధాకృష్ణన్‌కు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా సహా పలువురు శుభాకాంక్షలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టులు చేశారు. 'ఉపరాష్ట్రపతిగా ఎన్నికైన రాధాకృష్ణన్‌కు అభినందనలు. ప్రజా జీవితంలో దశబ్దాల గొప్ప అనుభవం, దేశ పురోగతికి గణనీయంగా దోహదపడుతుంది. విజయవంతమైన, ప్రభావవంతమైన పదవీకాలం కోసం మీకు ఇవే నా శుభాకాంక్షలు'అని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తన సందేశాన్ని 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'రాధాకృష్ణన్‌కు ఎంపీగా, వివిధ రాష్ట్రాల గవర్నర్‌గా గొప్ప అనుభవం ఉంది. ఆయన పార్లమెంటరీ జోక్యాలు ఎల్లప్పుడూ చురుకై నవి. గవర్నర్‌గా పదవీకాలంలో, సాధారణ పౌరులు ఎదుర్కొన్న సవాళ్లను పరిష్కరించడంపై దృష్టి పెట్టారు. ఈ అనుభవాలు ఆయనకు శాసన, రాజ్యాంగ విషయాలపై అపార జ్ఞానం ఉందని నిర్ధారించాయి. ఆయన స్ఫూర్తిదాయకమైన ఉపరాష్ట్రపతి అవుతారని నాకు నమ్మకం ఉందని'ప్రధాని మోదీ పేర్కొన్నారు. రాధాకృష్ణన్ నాయకత్వ లక్షణాలను, పరిపాలనపై ఆయనకున్న లోతైన జ్ఞానాన్ని అమిత్ షా ప్రశంసించారు. రాధాకృష్ణన్ అనుభవం, అట్టడుగు స్థాయి నేపథ్యం దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, అణగారిన వర్గాలకు సేవ చేయడానికి సహాయపడతాయని షా విశ్వాసం వ్యక్తం చేశారు. ఎగువ సభ సంరక్షకుడిగా ఆయన కొత్త పాత్రలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసినప్పటి నుంచి పెదవివిప్పని జగ్‌దీప్ ధన్‌ఖడ్.. సీపీ రాధాకృష్ణన్ విజయం నేపథ్యంలో తొలిసారి స్పందించారు. ప్రజాజీవితంలో రాధా కృష్ణన్‌కు ఉన్న అపార అనుభవంతో ఉపరాష్ట్రపతి కార్యాలయం మరింత ఖ్యాతిని పొందుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు లేఖ రాశారు.

ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నాం: ఖర్గే

'ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు. ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శన్ రెడ్డి పోరాటానికి మా హృదయపూర్వక కృతజ్ఞతలు. రాధాకృష్ణన్ పార్లమెంటరీ సంప్రదాయాల అత్యున్నత నైతికతను నిలబెట్టుకుంటారని, ప్రతిపక్షాలకు గౌరవాన్ని ఇస్తారని, ఒత్తిళ్లకు లొంగరని ఆశిస్తున్నా. వర్షాకాల సమావేశాల్లో జగదీప్ ధన్‌ఖడ్ అకస్మాత్తుగా రాజీనామా చేశారు, ఇది ఎందుకు అనేది ఎప్పటికీ వివరించలేం. రాజ్యాంగ స్థానాలపట్ల గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత మనపై ఉంది'అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు.





ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేందుకు మంగళవారం పార్లమెంటులో ఓటు వేస్తున్న ప్రధాని మోదీ, కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ

తొలి ఓటు వేసిన ప్రధాని

ఉపరాష్ట్రపతి ఎన్నికల ఓటింగ్‌కు దూరంగా బీఆర్ఎస్, బీజేడీ, శిరోమణి అకాలీదళ్

సాక్షి, న్యూఢిల్లీ: ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ తొలి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పోలింగ్ మొదలైన వెంటనే నూతన పార్లమెంట్ భవనంలోని 'వసుధ ఎఫ్–101'కు చేరుకున్న ప్రధాని తొలి ఓటు వేశారు. ఆయన వెంట పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుతోపాటు కేంద్ర మంత్రులు జితేంద్రసింగ్, అర్జున్‌రామ్ మేఘ్వాల్, రామ్మోహన్ నాయుడు ఉన్నారు. అనంతరం ప్రధాని పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్‌లలో వరద ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు వెళ్లారు. మాజీ ప్రధాని, రాజ్యసభ ఎంపీ దేవెగౌడ చక్రాల కుర్చీలో వచ్చి ఓటు వేశారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ, ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు సుమారు 11 గంటల సమయంలో వచ్చి ఓటు వేశారు. వారి తర్వాత కేంద్ర హోంమంత్రి అమిత్ షా, స్పీకర్ ఓంబిర్లా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఒడిశాకు చెందిన బిజు జనతాదళ్ (బీజేడీ), పంజాబ్‌కు చెందిన శిరోమణి అకాలీదళ్, తెలంగాణలోని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఈ ఎన్నికలకు దూరంగా ఉన్నాయి. పోలింగ్ ప్రారంభానికి కొన్ని గంటల ముందు లోధిరోడ్‌లోని రామాలయంలో సీపీ రాధాకృష్ణన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్లమెంట్‌కు చేరుకొని అక్కడి నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఇక ఇండియా కూటమి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి సైతం ఉదయం 10.30 గంటల సమయంలో పార్లమెంట్ ప్రాంగణానికి చేరుకొని కూటమి ఎంపీలతో భేటీ అయ్యారు. ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు (టీడీపీ), సంజయ్ కుమార్ ఝా (జేడీయూ వర్కింగ్ ప్రెసిడెంట్), షిండే శివసేనకు చెందిన శ్రీకాంత్ షిండే, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజులు పోలింగ్ ఏజెంట్లుగా పనిచేశారు. జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డి తరఫున కాంగ్రెస్ ఎంపీలు సయ్యద్ నసీర్ హుస్సేన్, మాణిక్కం ఠాగూర్, శతాబ్ది రాయ్ పోలింగ్ ఏజెంట్లుగా వ్యవహరించారు.

తీర్పును అంగీకరిస్తున్నా..

నన్ను నమ్మి ఓటేసిన ఎంపీలకు కృతజ్ఞతలు

ఇండియా కూటమి ఉప రాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఇండియా కూటమి అభ్యర్థిగా తనను నిలబెట్టిన ప్రతిపక్ష పార్టీలకు జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీలు ఇచ్చిన తీర్పును, ప్రజాస్వామ్య ప్రక్రియలపై ఉన్న గట్టి నమ్మకంతో తాను వినయంగా స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రయాణం గొప్ప గౌర వాన్ని, అనుభవాన్ని ఇచ్చిందని గుర్తు చేసుకున్నారు. అలాగే ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా విజయం సాధించిన సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఫలితాల తర్వాత సుదర్శన్‌రెడ్డి మీడియాకు లేఖ విడుదల చేశారు. 'భారత ఉప రాష్ట్రపతి పదవికి జరిగిన ఎన్నికల్లో ఎంపీలు తమ తీర్పును వెలువరించారు. ఈ ప్రయా ణం నాకు లభించిన గొప్ప గౌరవం, నా జీవితాన్ని రాజ్యాంగ నైతికత, న్యాయం, ప్రతి వ్యక్తి గౌరవానికి మార్గనిర్దేశనం చేసిన విలువల కోసం నిలబడే అవకాశాన్ని నాకు అందించింది. ఫలితం నాకు అనుకూలంగా లేకపోయినా, సమష్టిగా ముందుకు సాగడానికి ఓ లక్ష్యంతో ప్రయత్నించాం. నన్ను ఉమ్మడి అభ్యర్థిగా నిలబెట్టిన ప్రతిపక్ష పార్టీల నాయకులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు'అంటూ ఆయన లేఖలో ప్రస్తావించారు.

రాధాకృష్ణన్‌ది చరిత్రాత్మక విజయం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

సాక్షి, హైదరాబాద్: భారత ఉప రాష్ట్రపతి ఎన్నికలో ఎన్డీయే అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ 152 ఓట్ల మెజారిటీతో చరిత్రాత్మక విజయాన్ని సాధించడం పట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు హర్షం వ్యక్తంచేశారు. ఎంబీసీ వర్గానికి చెందిన నాయకుడిగా, దేశ ప్రజల సంక్షేమం, సమాజ సమన్వయానికి సీపీ రాధాకృష్ణన్ నిత్యం కృషి చేస్తున్నారని శుభాకాంక్షలు తెలిపారు. భారత 17వ ఉపరాష్ట్రపతిగా ఆయన ఎన్నికవడంతో దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ మరింత బలపడుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశాభివృద్ధికి, స్థిరతకు ఇది శక్తివంతమైన సంకేతంగా నిలుస్తుందని భావిస్తున్నట్లు రాంచందర్‌రావు తెలిపారు.

అభివృద్ధికి కొత్త 'దారులు'





మంగళవారం ఢిల్లీలో స్పీకర్ ఓంబిర్లా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిసిన సీఎం రేవంత్. చిత్రంలో మల్లు రవి, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

వేగవంతం చేయాలని కోరారు.

శ్రీశైలానికి ఎలివేటెడ్ కారిడార్ నిర్మించండి

హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి వెళ్లే మార్గంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ప్రాంతంలో వన్యప్రాణులకు ఇబ్బంది కలగకుండా మన్ననూర్–శ్రీశైలం మధ్య నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సీఎం రేవంత్ ప్రతిపాదించారు. దీనితో పాటు రావిర్యాల–ఆమనగల్–మన్ననూర్ మార్గాన్ని నాలుగు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారిగా, రద్దీ అధికంగా ఉన్న రాజీవ్ రహదారికి ప్రత్యామ్నాయంగా హైదరాబాద్–మంచిర్యాల మధ్య కొత్త గ్రీన్‌ఫీల్డ్ రహదారిని మంజూరు చేయాలని కోరారు. సీఎం విజ్ఞప్తులపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు. సీఆర్ఐఎఫ్ కింద ప్రతిపాదించిన రూ.868 కోట్ల పనులకు వారంలోగా అనుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. బందరు పోర్టుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారిపై ఈ నెల 22న హైదరాబాద్‌లో ఎన్‌హెచ్, ఎన్‌హెచ్ఏఐ అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

రూ.30 వేల కోట్లతో విద్యా ప్రణాళిక

తెలంగాణలో విద్యా రంగాన్ని సమూలంగా మార్చేందుకు తమ ప్రభుత్వం రూ.30 వేల కోట్లతో ప్రణాళిక రూపొందించిందని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌కు రేవంత్ రెడ్డి వివరించారు. మంగళవారం ఢిల్లీలోని నార్త్ బ్లాక్ కార్యాలయంలో ఆమెను కలిసి.. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు, ఇతర విద్యా సంస్థల అభివృద్ధికి ఉద్దేశించిన రూ.30 వేల కోట్ల ప్రణాళికకు అనుమతులివ్వాలని కోరారు. 105 నియోజకవర్గాల్లో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో పాఠశాలలో 2,560 మంది చొప్పున సుమారు 2.70 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు. ఈ స్కూళ్లకు రూ.21 వేల కోట్లు, ఇతర ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి రూ.9 వేల కోట్లు వెచ్చించనున్నట్లు చెప్పారు. నిధుల సమీకరణకు ఏర్పాటు చేసే ప్రత్యేక కార్పొరేషన్‌కు అనుమతి ఇవ్వడంతో పాటు ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయింపు ఇవ్వాలని సీఎం కోరారు. గత ప్రభుత్వం అధిక వడ్డీలకు చేసిన అప్పుల రీస్ట్రక్చర్‌కు అనుమతించాలని విన్నవించారు. సీఎం విజ్ఞప్తులపై నిర్మలా సీతారామన్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం. సీఎం వెంట ఎంపీలు రేణుకా చౌదరి, మల్లు రవి, పోరిక బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కేంద్ర ప్రాజెక్టుల సమన్వయ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎంపీలతో సీఎం అల్పాహార భేటీ..

ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి ఓటింగ్‌కు ముందు రాష్ట్ర ఎంపీలతో అల్పాహార భేటీ జరిపారు. ఇండియా కూటమి అభ్యర్థి బి.సుదర్శన్‌రెడ్డికి అనుకూలంగా ఓటేయడంపై వారికి మరోసారి అవగాహన కల్పించారు. ఇక ఇదే సమయంలో కేంద్ర మంత్రి ప్రల్హాద్ జోషి నివాసంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ఎంపీల సమావేశానికి తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తోపాటు ఎంపీలంతా పాల్గొన్నారు.

సాక్షి
బుధవారం, 10 సెప్టెంబర్ 2025

తిరగబడిన నేపాల్!

చిన్న నిప్పురవ్వ చాలు... పెనుమంటలు ఎగిసిపడటానికి! ఒక్క కారణమే చాలు... అసంతృప్తి పెల్లుబుకటానికీ, అధికార పీఠాల్ని కూలదోయటానికీ!! ఆ మధ్య శ్రీలంకలో, మొన్న బంగ్లాదేశ్‌లో, నెల క్రితం ఇండోనేసియాలో రోడ్లపైకి వెల్లువలా వచ్చిపడిన యువత శక్తేమిటో నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి గ్రహించలేకపోయారు. నిరసనంటే తెలియని, ఉద్యమమంటే ఎరుగని 'జెన్ జీ' తరాన్ని తక్కువ అంచనా వేశారు. అందుకే అవినీతి వ్యతిరేక ఉద్యమం మొదలై 36 గంటలు కాకుండానే ఆయనకు పదవీ భ్రష్టత్వం తప్పలేదు. అధ్యక్షుడు రాంచంద్ర పౌడ్వాల్ సైతం రాజీనామా చేశారు. కానీ ఈలోగా హింస పెల్లుబికి పార్లమెంటుకు నిప్పంటుకుంది. అధ్యక్షుడు, ప్రధాని భవంతులు తగలడిపోయాయి. మంత్రుల నివాసాలూ, పార్లమెంటు ఉన్న సింఘా దర్బార్ ఆవరణ ఉద్యమకారుల లక్ష్యంగా మారింది. మంత్రుల్ని రక్షించటానికి ఆర్మీ హెలికాప్టర్లు రంగ ప్రవేశం చేయాల్సివచ్చింది. మాజీ ప్రధాని, పాలకపక్షంలో భాగస్వామిగా ఉన్న నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ దేవ్‌బా, ఆయన భార్య విదేశాంగమంత్రి అర్జూ రమా దేవ్‌బా, నేపాల్ మావోయిస్టు పార్టీ నేత, మాజీ ప్రధాని ప్రచండ తదితరుల ఇళ్లపై దాడులు చేయగా, దేవ్‌బా దంపతులపై దౌర్జన్యం చేసి, నెత్తురోడుతున్న దేవ్‌బాను ఈడ్చుకెళ్లారు. భద్రతా దళాల కాల్పుల్లో 19 మంది మరణించగా, దాదాపు 500 మంది గాయపడ్డారని చెబుతున్నారు.

చెప్పుకోదగిన నాయకుడు లేకున్నా సోమవారం ఉదయం వందల మందితో మొదలైన ఉద్యమం మధ్యాహ్నానికే వేలసంఖ్యకూ, అటు తర్వాత లక్షల్లోకి మారింది. దేశ రాజధాని కఠ్మాండూను దాటి జిల్లాలకు వ్యాపించింది. లాఠీచార్జి, బాష్పవాయు గోళాలు, రబ్బరు బుల్లెట్లు, చివరకు కాల్పులు ఫలితాన్నివ్వలేదు సరిగదా... ఆగ్రహించిన గుంపులు అధికార సౌధాలపై పడ్డాయి. హింసకు దిగొద్దన్న వినతులు బేఖాతరు కావటంతో ఉద్యమాన్ని విరమిస్తున్నామని నిర్వాహకులు ప్రకటించాల్సి వచ్చింది. మొదట ఉద్యమం శాంతియుతంగా ప్రారంభమైంది. దానికి ప్రభుత్వమే ఆజ్యం పోసింది. సామాజిక మాధ్యమాల ద్వారా పిలుపందుకుని వస్తున్న విద్యార్థులు, యువతతో ఆ ప్రాంతం నిండుతుండగానే ప్రభుత్వం యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర 26 వెబ్‌సైట్లను నిలిపివేసింది. ఆ మాధ్యమాలు పన్నులు చెల్లించకపోవటం వల్లే నిలిపేశామని సంజాయిషీ ఇచ్చినా నిజమేమిటో అందరికీ తెలుసు.

కనబడే కారణం మాధ్యమాల నిషేధమే అయినా అక్కడ నెలకొన్న ఆర్థిక సంక్షోభం అసలు హేతువు. సగటున రోజుకు రెండు వేలమంది పొట్టనింపుకోవటానికి దూర తీరాలకు వలసపోయే దుఃస్థితి నెలకొంది. దీన్ని సరిచేయకపోగా ప్రాజెక్టులన్నీ అవినీతిమయంగా మారాయి. సంపన్నుల పిల్లలు విదేశాల సందర్శనకు పోయి విలాసాల్లో గడుపుతూ సామాజిక మాధ్యమాల్లో ఆ దృశ్యాలు షేర్ చేయటం సహజంగానే నిరుద్యోగంతో దుర్భర జీవనం సాగిస్తున్న యువతలో ఆగ్రహాన్ని కలిగించింది. ఇందుకు ప్రస్తుత పాలక పక్షంలోని సీపీఎన్(యూఎంఎల్), నేపాలీ కాంగ్రెస్‌లతోపాటు అరకొర సీట్లతో కింగ్‌మేకర్‌గా మిగిలిపోయిన మావోయిస్టు పార్టీ సైతం సిగ్గుపడాలి. శ్రీలంకలో మూడేళ్ల క్రితం, నిరుడు బంగ్లాదేశ్‌లో, నేడు నేపాల్‌లో ఒకే మాదిరి దృశ్యాలు కనిపించటం యాదృచ్ఛికం కాదు. ఈ మూడు ఉద్యమాలూ యువత, విద్యార్థుల నాయకత్వంలోనే జరిగాయి. మూడింటి మధ్యా కనబడే మరో పోలిక ఏమంటే... వీటికి చైనాయే అధిక వడ్డీలకు అప్పులిచ్చి ఆర్థికంగా కుంగదీసింది. ఉదాహరణకు నేపాల్ పౌర విమానయాన మౌలిక సదుపాయాల మెరుగు కోసమంటూ తలపెట్టిన పోఖరా అంతర్జాతీయ విమానాశ్రయానికి చైనా ప్రధాన రుణదాత. 2,200 కోట్ల డాలర్ల ఈ ప్రాజెక్టు రెండేళ్ల క్రితం సాకారమైంది. కానీ అది వృథా వ్యయమని కొన్నాళ్లకే తేలిపోయింది. అందులో 10.5 కోట్ల డాలర్లకు పైగా అవినీతి జరిగిందని నిర్ధారణ అయింది. ఆ రుణాన్ని రీషెడ్యూల్ చేయాలని నేపాల్ కోరుతున్నా చైనా ససేమిరా అంటోంది. బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్(బీఆర్ఐ) ప్రాజెక్టు కూడా కష్టాల్లో పడింది. సరిగ్గా ఆగ్రహ జ్వాలల్లో నేపాల్ మండుతుండగా ఓలి శర్మ చైనా పర్యటన ముగించుకుని రావటం గమనించదగ్గది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.తదియ రా.6.28 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** రేవతి రా.7.46, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ఉ.8.28 నుండి 9.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.31 నుండి 12.19 వరకు, **అమృత ఘడియలు:** సా.5.28 నుండి 6.57 వరకు, **సంకటహర చతుర్థి.**

సూర్యోదయం : 5.50
సూర్యాస్తమయం: 6.05
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇదెక్కడి న్యాయం?

విశ్లేషణ


సంజయ్ హెగ్డే

దోషులుగా నిర్ధరణ కాకముందే మన యువతీ యువకులు ఐదేళ్ళకు పైగా జైలులో మగ్గుతూంటే మన ప్రజాస్వామ్యం గురించి ఏమని చెప్పుకోగలం? ఉమర్ ఖాలిద్, శర్జీల్ ఇమామ్ నేడు అటువంటి స్థితిలోనే చిక్కుకున్నారు. వారు దోషులుగా ప్రకటితులైనవారు కాదు. విచారణలో ఉన్న ఖైదీలు. నిర్దోషులుగానే ఇప్పటికీ భావించవచ్చు. అయినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాల నివారణ చట్టం (యు.ఎ.పి.ఎ.) వల్ల ఢిల్లీ హైకోర్టు 2025 సెప్టెంబర్ ఆదేశం మేరకు వారు ఇప్పటికీ జైలులోనే ఉన్నారు. వారు కుట్ర పన్నారనడానికి వారి ప్రసంగాలను, కరపత్రాలను, వాట్సాప్ గ్రూపులను సాక్ష్యాధారంగా తీసుకున్నారు. వేలాది పేజీల భారం కింద విచారణ కుంటుపడుతూ వచ్చింది. కేసులు ఏళ్ళకొద్దీ నానుతూ ఉంటే, స్వేచ్ఛను తొక్కి ఉంచడానికి లేదని సాక్షాత్తూ సుప్రీంకోర్టు కె.ఏ. నజీబ్ కేసు (2021)లో హెచ్చరించింది. ఆ హెచ్చరికను పెడచెవిన పెట్టినట్లే కనిపిస్తోంది.

విచారణ రంగస్థలమా?

విచారణ దశలో ప్రాసిక్యూషన్ చెబుతున్నదాన్నే పరిగణనలోకి తీసుకోవాల్సిందని జడ్జీలకు నిర్దేశిస్తున్న 'వటాలీ' తీర్పు (2019) పూర్వ ప్రమాణంపైనే హైకోర్టు ఆధారపడింది. తాను 'మినీ విచారణ'ను ఏమీ నిర్వహించడం లేదని కోర్టు చెబుతోంది. కానీ, ప్రబలంగా లేని సాక్షుల ప్రకటనలను అది వేదవాక్యంగా తీసుకుంది. అహింసకు ప్రేరేపిస్తున్న ప్రసంగాలు రక్తపాతానికి ఇచ్చిన పిలుపులయ్యాయి. అటువంటి కారణాలపై స్వేచ్ఛను నిరాకరిస్తే, ఇంక విచారణ రంగస్థలం కాక మరేమవుతుంది?

కుట్రలను పరోక్షంగా కూడా రుజువు చేయవచ్చు. కానీ, ప్రాసంగిక సాక్ష్యాధారాలైనా కనీసం ఒకదానితో ఒకటి పొసగేవిగా ఉండాలి. ఇక్కడ పౌరసత్వ సవరణ చట్టం పట్ల అసమ్మతిని ఢిల్లీని బుగ్గి చేసే బృహత్ పథకం గాటన కట్టారు. ఉమర్ ఖాలిద్ 2020 ఫిబ్రవరిలో చేసిన అమరావతి ప్రసంగాన్నే తీసుకోండి. ఆయన 24-02-2020న నిరసనలు చేపట్టవలసిందిగా విజ్ఞప్తి చేశారు. అమెరికా అధ్యక్షుడి అధికారిక పర్యటన కూడా కాకతాళీయంగా, అదే రోజున చోటు చేసుకుంది. ''హింసాయుత అల్లర్లను ప్రేరేపించేందుకే ఉద్దేశపూర్వకంగా ఆ రోజును ఎంచుకొన్నారు. అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేందుకే ఆ పని చేశారు'' అని కోర్టు పేర్కొంది. అయితే, ''హింస పట్ల హింసతో మేం ప్రతిస్పందించం. ద్వేషం పట్ల ద్వేషంతో మేం ప్రతిస్పందించం. వారు ద్వేషాన్ని వ్యాప్తి చేస్తే, మేం దానిపై ప్రేమతో స్పందిస్తాం. వారు మమ్మల్ని లాఠీలతో కొడితే, మేం త్రివర్ణ పతాకాలను చేతబూనుతాం'' అని ఆయన సభికులతో అన్నట్లుగా వాస్తవిక రాతప్రతి వెల్లడిస్తోంది.



ప్రజాస్వామ్యంలో నిరసన ఒక భాగం

శర్జీల్ ఇమామ్ విషయంలో... ఆయన జామియా, అలీగఢ్, అసన్‌సోల్, గయలలో చేసిన ప్రసంగాలను ప్రముఖంగా పేర్కొంది. ''భారతదేశంలోని మిగిలిన ప్రాంతం నుంచి ఢిల్లీని శాశ్వతంగా విడగొట్టేస్తాం'' అని ఆయన అన్నమాటలను కోర్టు ఉదాహరించింది.

నిరసన ప్రదర్శనల్లో సాధారణ దృశ్యాలైన రోడ్డు దిగ్బంధనాలు, బైఠాయింపులను ఉగ్రవాదానికి ప్రాథమిక సాక్ష్యాధారాలుగా ఉన్నత స్థానం కల్పించింది. అదే అలీగఢ్ ప్రసంగాన్ని విశ్లేషిస్తూ అలహాబాద్ హైకోర్టు ''హింసకు పురికొల్పేది నిస్సందేహంగా ఏదీ లేదు'' అని కనుగొన్న అంశాన్నీ, బెయిలు మంజూరు చేసిన విషయాన్నీ తీర్పు విస్మరించింది.

శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుకు రక్షణ కల్పిస్తున్న రాజ్యాంగంలోని 19వ అధికరణాన్ని తీర్పు గుర్తించకపోలేదు. అందుకు అది మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్‌ను ఉటంకించింది. ఇమ్రాన్ ప్రతాప్‌గఢీ కేసులో సుప్రీం కోర్టు 2025లో తీసుకున్న నిర్ణయాన్ని కూడా ప్రస్తావించింది. అయినా కూడా, పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక నిరసన ప్రదర్శనలు స్వభావసిద్ధంగా హింసాయుతమైనవని ప్రాసిక్యూషన్ చేసిన వాదనను అంగీకరించింది. భారతదేశంలో ఏ నిరసన ప్రదర్శన అయినా అవాంతరాలు సృష్టించేదిగానే ఉంటోంది.

దండి యాత్ర, ఎమర్జెన్సీ వ్యతిరేక ర్యాలీల నుంచి చిల్లరమల్లర నిరసనలు, యాత్రలు, బైఠాయింపులు, రోడ్డు దిగ్బంధనాలు మన ప్రజాస్వామిక సరళిలో భాగంగా ఉంటూ వస్తున్నాయి. అటువంటి చర్యలను 'ఉగ్రవాద కార్యకలాపాలు'గా ముద్ర వేయడం ప్రజాస్వామ్యాన్నే నేరమయం అనడం అవుతుంది.

ఈ కేసులోని పలువురు సహ నిందితులు (దేవాంగనా కలితా, నటాషా నర్వాల్, ఆసిఫ్ ఇక్బాల్ తన్హా) ఇప్పటికే బెయిలుపై బయటకు వచ్చారు. సూత్రప్రాయంగా చూస్తే, వారి సరసన ఉన్న ఇతరులకూ అదే రకమైన ఊరట లభించాలి. కోర్టు దీన్ని కూడా పట్టించుకోలేదు. ''తొలుతటి బెయిలు ఉత్తర్వులను పూర్వ ప్రమాణంగా తీసుకోవడానికి లేదు'' అని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అది ఇందుకు వాడుకుంది. కానీ, ఖాలిద్, ఇమామ్ పాత్ర ఇప్పటికే విడుదలైనవారి కన్నా పెద్దది ఏమీ కాదు. ఏ విధంగానో చెప్పుకుండానే, వారి ప్రమేయం 'తీవ్ర'మైనదని ప్రకటించడం ద్వారా, చట్టం ముందు అందరూ సమానులేనన్న మౌలిక సూత్రాన్ని కూడా కోర్టు పట్టించుకోలేదు.

ఈ కేసు కేవలం ఖాలిద్ లేదా ఇమామ్ గురించినది కాదు. భారతదేశంలో అసమ్మతికి ఉన్న తావు గురించినది. నిరసనను ఉగ్రవాదంగా చూస్తే, ఇక సమీకరించడానికి ఎవరు సాహసిస్తారు? వాట్సాప్ గ్రూపులు కుట్రలైతే వాటిలో చేరేందుకు ఎవరు సాహసిస్తారు? పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక నిరసన ప్రదర్శన రాజ్యాంగబద్ధంగా సమీకరించినదే. దాన్ని ఉగ్రవాద కుట్రగా చిత్రించడం ద్వారా కోర్టు ఒక మొత్తం ఉద్యమాన్ని చట్టవిరుద్ధం చేస్తోంది.

పౌర ప్రజాస్వామ్యం స్వేచ్ఛ, భద్రత రెండింటినీ కాపాడుకొని తీరాలి. దామాషాయే అసలు పరీక్ష. మాటలకు, నిరసన ప్రదర్శనలకుగాను, విచారణకు నోచుకోకుండా ఐదేళ్ళు జైలులో గడపడం దామాషా కిందకు రాదు. దోషిగా నిరూపణ కాకుండానే శిక్ష వేయడమవుతుంది. పార్లమెంట్ కూడా తన బాధ్యత నుంచి తప్పించుకోలేదు. బెయిలును నిరాకరించే చట్టం ప్రజాస్వామ్యాన్ని కూడా బలహీనపరచేది అవుతుంది. 'ఉపా'లోని సెక్షన్ 43(డి)(5) సరిగ్గా అదే పని చేస్తోంది. దాన్ని సత్వరం సంస్కరించవలసి ఉంది. ఇక్కడ పణంగా ఉన్నది ఒక్క కేసు కాదు, మొత్తం గణతంత్రం.

వ్యాసకర్త సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)


ఉమర్ ఖాలిద్

రోడ్డు దిగ్బంధనాలు ప్రజాస్వామిక సరళిలో భాగం. అటువంటి చర్యలను 'ఉగ్రవాద కార్యకలాపాలు'గా ముద్ర వేయడం ప్రజాస్వామ్యమే నేరమయం అనడం అవుతుంది.


శర్జీల్ ఇమామ్

ఈ కేసు కేవలం ఉమర్ ఖాలిద్, లేదా శర్జీల్ ఇమామ్ గురించినది కాదు. నిరసనను ఉగ్రవాదంగా చూస్తే, ఇక జనాన్ని సమీకరించడానికి ఎవరు సాహసిస్తారు?

మార్పు... మంచికే(నా)!?

సింపుల్‌గా....

కొద్ది రోజులుగా అంతటా ప్రతిధ్వనిస్తున్న మాట... జీఎస్టీ (వస్తు, సేవల పన్ను). మునుపటి జీఎస్టీ శ్లాబుల్ని సవరిస్తూ, కేంద్రంలోని మోదీ సర్కార్ తీసుకున్న కొత్త జీఎస్టీ రేట్ల నిర్ణయం పట్ల వివిధ అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అధికార పక్షం వీటిని 'నెక్స్ట్ జనరేషన్ సంస్కరణలు' అంటే, విపక్షాలేమో ఈ పని కనీసం ఏడెనిమిదేళ్ళ ముందే చేయాల్సిందని పెదవి విరుస్తున్నాయి. అయితే, స్థూలంగా మాత్రం... అధికార, ప్రతిపక్షాలు రెండూ ఈ మార్పును స్వాగతించడం అరుదైన పరిణామం. ఇంతకీ ఈ సెప్టెంబర్ 22 నుంచి అమలులోకి రానున్న కొత్త జీఎస్టీ రేట్ల కథా కమామిషేంటి!?

ఇప్పుడేం జరిగింది?

జీఎస్టీ కౌన్సిల్ పన్ను సంస్కరణలు చేపట్టింది. గతంలో 5, 12, 18, 28 శాతం అంటూ నాలుగు జీఎస్టీ శ్లాబులుంటే, వాటిని 5 శాతం, 18 శాతం అనే రెండు శ్లాబులకే కుదించింది. దీనివల్ల టూత్‌పేస్ట్, పాలు, పాస్తా నుంచి ఏసీలు, టీవీలు, చిన్న కార్లు, బైకుల దాకా అనేకవాటిపై పన్ను తగ్గుతుంది. బ్యాండేజీలు, వైద్య పరీక్షల కిట్లు సహా అనేక వైద్య వస్తువులూ చౌకవుతాయి. భవన నిర్మాణం, బీమా రంగాల్లోనూ కొంత మేలు జరగనుంది. ఇక, చేనేత, నూలు రంగాలను అతి తక్కువ శ్లాబు రేటులోకి తెచ్చారు కానీ, రూ. 2500 పైబడిన ధరలున్న దుస్తుల్ని 18 శాతంలో పడేశారు. ఫలితంగా పెళ్ళిబట్టల నుంచి ఉలెన్ల దాకా ఖరీదవుతాయి. అలాగే కొత్తగా 40 శాతం జీఎస్టీ శ్లాబు తెచ్చారు. హై-ఎండ్ వాహనాలు, పొగాకు ఉత్పత్తులు దానిలోకి వస్తాయి.

గత చరిత్ర

ఒకప్పుడు రాష్ట్రాల స్థాయిలోనూ, కేంద్రం స్థాయిలోనూ ఎంట్రీ ట్యాక్స్, వ్యాట్ (వ్యాల్యూ యాడెడ్ ట్యాక్స్), ఆక్ట్రాయ్, లగ్జరీ ట్యాక్స్ లాంటి రకరకాల పన్నులుండేవి. వాటి స్థానంలో ఏకీకృత పన్ను వ్యవస్థ ఉండాలనే ఆలోచనతో 2017లో కొత్తగా తెచ్చినదే – జీఎస్టీ. ఒక్కమాటలో... ఎవరైనా ఏదైనా కొంటున్నా, లేదా సేవలు పొందుతున్నా గమ్యస్థానంలో విధించే పన్ను ఇది. జీఎస్టీ, దాని బిల్లులతో అనేక వ్యాపారాలు లాంఛనంగా ఆర్థికవ్యవస్థలో భాగం కావాల్సొచ్చింది. ఆదాయ పన్ను కొందరికే పరిమితమైతే, విస్తృత పరిధితో జీఎస్టీ ప్రభుత్వానికి మంచి ఆదాయమార్గమైంది.



ఇప్పుడెందుకీ మార్పులు?


జీఎస్టీని సరళతరం చేయాలంటూ వివిధ వర్గాలు చాలాకాలంగా డిమాండ్ చేస్తూ వచ్చాయి. కానీ, ప్రభుత్వ ఆదాయం తగ్గుతుందని గతంలో సర్కార్ తటపటాయించింది. అయితే, తక్కువ పన్ను రేట్లతో ఖర్చు కలిసొచ్చిన జనం, చేతిలో మిగిలిన పైసలతో మరిన్ని వస్తువులు కొంటారనే భావనను అంగీకరించింది. తద్వారా వస్తువులకు గిరాకీ, దాంతో వస్తూత్పత్తి పెరుగుతాయి. మరిన్ని పెట్టుబడులు, మరింత ఉపాధి వస్తాయి. ఇదొక ఆగని ఆర్థిక చక్రభ్రమణం. మరోపక్క అమెరికా వేసిన ట్యారిఫ్‌ల భారానికీ, ఈ రేట్ల సవరింపునకూ సంబంధం లేదని సర్కారు వారి మాట. కానీ, భారత్ నుంచి దిగుమతులపై అమెరికా విధించిన 50 శాతం ట్యారిఫ్ వల్ల తగిలే ఎదురుదెబ్బను తగ్గించడానికి ఇది ఉపకరిస్తుందనేది నిజం.

ఇక ఏమవుతుంది?

కొత్త నిర్ణయంతో 453 వస్తువుల జీఎస్టీ మారగా, అందులో 413 వస్తువుల రేటు తగ్గిందని ఎస్బీఐ ఆర్థిక పరిశోధనా విభాగం విశ్లేషణ. మొత్తానికి, జీఎస్టీ సంస్కరణల నిర్ణయం పరోక్ష పన్నుల వ్యవస్థలో ఓ కొత్త అధ్యాయం. కానీ, జీఎస్టీ రేట్ల తగ్గింపు తుది ప్రయోజనం కస్టమర్లకు అందు తుందా, సంస్థలు వాటిని సామాన్యులకు అందనిస్తాయా అని సందేహాలూ లేకపోలేదు. జీఎస్టీ తగ్గింపు వల్ల ప్రభుత్వ ఖజానాకు పడే రూ. 48 వేల కోట్ల గండి పైనా ఆందోళనలున్నాయి. తమకు ఆదాయం తగ్గుతున్నందున 40 శాతం శ్లాబులోని వాటిపై ఇప్పటికే ఉన్న సెస్‌ను కొనసాగించాలనీ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు కోరుతున్నాయి. కౌన్సిల్ ఆ డిమాండ్‌ను తోసిపుచ్చడంతో రాష్ట్రాలు ప్రత్యామ్నాయం చూసుకోక తప్పదు.

సోషల్ టాక్


క'లిపి'తే!



దక్షిణ భారత భాషలైన తమిళం, తెలుగు, కన్నడ, మలయాళాల మధ్య; అలాగే దక్షిణ, ఉత్తర భాషల మధ్యా అనుసంధానంగా దేవనాగరి లిపిని వాడుకలోకి తేవటం వల్ల దేశంలోని అన్ని ప్రాంతాలకూ అత్యంత ప్రయోజనం చేకూరుతుంది.

– బి.డి. జెట్టి, భారత మాజీ ఉప రాష్ట్రపతి


ఆరుగురు



ఇద్దరు మనుషులు కలిస్తే ఆరుగురితో సమానం. ఒక్కొక్కరిలో ముగ్గురు ఉంటారు. బయటికి కనిపించే మనిషి. లోపలి మనిషి. బయటివాళ్లు చూసే మనిషి! దేశాలకూ ఇది వర్తిస్తుంది. చేతులు కలిస్తే సాధ్యం కానిది ఏముంటుంది?

– ఆంటోనియో గుటెర్రెస్, ఐరాస సెక్రటరీ జనరల్


లేపనం



ఇతరుల పట్ల ప్రేమ భావనతో ఉన్నప్పుడు మన మనసుకు శాంతి లభిస్తుంది. ప్రేమతో చేసే పనులు ప్రపంచంలోని గాయాలను మాన్పుతాయి. అందరమూ కలిస్తే లోతైన గాయాన్ని కూడా నయం చేసేంత బలమైన, సముద్రమంతటి దయను సృష్టించగలం.

– దలైలామా, బౌద్ధ గురువు

స్పష్టత



టీమ్ లీడర్‌లుగా మనం సరైన నిర్ణయాలు తీసుకోలేకపోతే, మన కింద పని చేస్తున్న వారిని కూడా ఇబ్బందుల్లో పడేస్తాం. మంచి చెడుల్లో స్పష్టత లేకపోతే, నాయకత్వం వైపు నుంచి తప్పులే జరుగుతాయి.

– పల్లోంజీ షాపూర్జీ మిస్త్రీ (1929–2022), బిలియనీర్

గెలుపు



ఒక టోర్నమెంట్ గెలిచిన వెంటనే, లేదా ఏదైనా మంచి పని చేసిన వెంటనే అప్పటికప్పుడు మాత్రమే నాలో సంతోషం ఉంటుంది. ఆ తర్వాత దానిని మరచిపోయి, వెంటనే నా తర్వాతి పనికి సిద్ధం అవుతాను. వార్మప్, కూల్ డౌన్‌లు కూడా ఉండవు.

– అనాహత్ సింగ్, స్క్వాష్ ప్లేయర్

నాయకత్వం



మంచి నాయకత్వం అంటే తన కింది వారు ఎదగాలనే దృఢ సంకల్పంతో కంపెనీ అభివృద్ధికి ప్రణాళికలు వేసి, ఆ దిశగా కృషి చెయ్యటం! టీమ్‌కి నిర్దేశించిన బాధ్యతలలో కనీసం 20 శాతం వారికి సహాయం చేసేవిగా ఉండేలా చూడటం!!

– అనిష్ షా, మహీంద్రా గ్రూప్ సీఈవో

ప్రైవేటు పగ్గాల పన్నాగం!

ఇన్ బాక్స్

చంద్రబాబు నాయకత్వాన ఉన్న కూటమి ప్రభుత్వం ఏపీలోని 10 మెడికల్ కాలేజీలను పీపీపీ (ప్రభుత్వ–ప్రైవేట్–ప్రజల భాగస్వామ్యం)లో ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానంలో భాగమే ఈ పీపీపీ. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 18 మెడికల్ కాలేజీలు ఉంటే, ప్రైవేట్ యాజమాన్యంలో 17 కాలేజీలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆధ్వర్యంలో కాలేజీలు ఏర్పడినప్పుడు పేద విద్యార్థులు కూడా వైద్య విద్యను పొందగలుగుతారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ మెడికల్ కాలేజీల కన్నా ప్రైవేట్ వైద్య కళాశాలలే ఎక్కువ ఏర్పాటు అవుతున్నాయి. గత రాష్ట్ర ప్రభుత్వం 18 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి, పనులు కూడా ప్రారంభించింది. అవి పూర్తి అయితే 1,050 మెడికల్ సీట్లు అదనంగా ఏపీ విద్యార్థులు పొందుతారు. నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీలను పూర్తి చేయకుండా, వాటిల్లో 10 కాలేజీలను పీపీపీ పద్ధతిలో ప్రైవేట్‌పరం చేయటం వల్ల పేద విద్యార్థులకు మెడికల్ విద్య దూరమౌతుంది.

ప్రభుత్వ అధీనంలో ఉన్నప్పుడు కాలేజీ సీట్లన్నీ తక్కువ ఫీజుతో విద్యార్థులకు అందుబాటులో ఉంటాయి. ప్రైవేట్ పరం చేయటం వల్ల అత్యధిక సీట్లు మేనేజ్‌మెంట్ చేతుల్లో ఉంటాయి. అవి పొందాలంటే కోట్లాది రూపాయలు ఫీజు రూపంలో చెల్లించాలి. అంత డబ్బు పేద విద్యార్థులు చెల్లించలేరు కాబట్టి వైద్యవిద్య సంపన్న వర్గాలకే పరిమితం అవుతుంది. మెడికల్ కాలేజీలు ప్రభుత్వ అధీనంలో ఉంటే పేద విద్యార్థులకు వైద్య విద్యతో పాటు, పేదలకు వైద్యం కూడా అందుతుంది. సీఎం చంద్రబాబు మొదటి నుండి ప్రభుత్వ రంగాన్ని వ్యతిరేకిస్తూ, ప్రైవేట్ రంగానికి అనుకూలంగా ఉన్నారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయన ఒక్క మెడికల్ కాలేజీ కూడా కట్టకపోవటం విద్యను ప్రైవేట్‌పరం చేయటంలో భాగమే!


మెడికల్ కాలేజీలతో పాటు పేదల వైద్యాన్ని కూడా ప్రైవేట్ సంస్థలకు చంద్రబాబు కట్టబెట్టారు. వై.ఎస్. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 2007లో 'రాజీవ్ ఆరోగ్యశ్రీ' పథకాన్ని ప్రారంభించారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ పథకం అమలు ఆగిపోయింది. ఆసుపత్రులకు 300 కోట్లు బకాయిలు చెల్లించక పోవటంతో అవి ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేశాయి. ఫలితంగా కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఇప్పుడు ఆరోగ్యశ్రీని ప్రైవేటు బీమా సంస్థలకు కట్టబెట్టేలా మార్పులు చేస్తోంది. ఇది అన్యాయం. ముందు బకాయిల మొత్తం ఆసుపత్రులకు చెల్లించి, వైద్య సేవలను పునరుద్ధరించాలి. బీమా సంస్థలకు ఆరోగ్యశ్రీ అప్పగింతను విరమించాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు కల్పించి ప్రజలకు వైద్యం అందించాలి.

– బొల్లిముంత సాంబశివరావు
రైతు కూలీ సంఘం (ఆం.ప్ర.) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

డేటా పాయింట్

టూ వీలర్లు... 45 శాతం మరణాలు!

2023లో దేశంలో 4.80 లక్షలకు పైగా రోడ్డు ప్రమాదాలు జరిగి 1.73 లక్షల మంది మరణించారు. ద్విచక్ర వాహనాలపై జరిగిన ప్రమాదాల్లో 77,539 మంది ప్రాణాలు కోల్పోయారు. మొత్తం మరణాల్లో ఇవి దాదాపు 45 శాతం.



ఆందోళనను జయిస్తే...



మనం ఆందోళనలో ఉన్నట్లనిపిస్తే వెంటనే దాని నుంచి బయటపడటానికి ప్రయత్నించడం సర్వసాధారణం. దాని పరిష్కారం కోసం ప్రత్యామ్నాయాన్ని కనుగొనడానికి ఆలోచిస్తాం. కానీ అతిగా ఆలోచించడమూ ఆందోళనకు ఓ కారణం. కనుక ఆందోళన చెందుతున్నప్పుడు ఏమీ చేయకపోవడమే ఉత్తమ మార్గం అంటారు ఓషో. జాగరూకతతో ఉండటమే ప్రధానం.

ఇందుకు సంబంధించి 'బోకుజు' అనే జెన్ తత్వవేత్త గురించి ఒక చిన్న కథను చూద్దాం. ఆయన ఒక గుహలో నివసించారు. కొన్నిసార్లు పగటిపూట లేదా రాత్రి కూడా, ఆయన తన పేరునే తాను బిగ్గరగా 'బోకుజు' అని పిలుచుకునేవారు. తరువాత ఆయనే 'అవును, నేను ఇక్కడ ఉన్నాను' అనేవారు. ఆయన వాలకం చూసి శిష్యులు ఓరోజు అడిగారు, 'మీరు మీ పేరునే బిగ్గరగా పిలుచుకుని, నేను ఇక్కడే ఉన్నాను' అని ఎందుకు అంటున్నారు?' అని. అప్పుడు బోకుజు 'నేను ధ్యానంలోకి వెళ్ళినప్పుడు, నన్ను నేను గుర్తుచేసుకోవడానికి నా పేరు చెప్పుకుంటానంతే. నేనలా నా పేరు పిలుచుకున్నప్పుడు, 'నేను ఇక్కడ ఉన్నాను' అని చెప్పడం ద్వారా నా ఆలోచన మాయమవుతుంది' అని అన్నారు.

అయితే ఆ తర్వాత ఓ రెండు మూడు సంవత్సరాలు, ఆయన తన పేరును పిలుచుకోలేదు. ఎందుకని అడిగితే ఆయన ఇలా అన్నారు: 'కానీ బోకుజు ఎల్లప్పుడూ ఇక్కడే ఉంటాడు. కాబట్టి పిలవవలసిన అవసరం లేదు. ముందు, నేను అతణ్ణి కోల్పోయేవాడిని. ఆందోళన నన్ను మరచిపోయేలా చేసింది. కాబట్టి నేను బోకుజును గుర్తుంచుకోవలసి వచ్చింది. ఆందోళన మాయమైంది. ఇప్పుడు నాకా అవసరం లేదు. కనుక మీరూ ఆందోళన చెందుతున్నప్పుడు నాలా చేయండి. అప్పుడు తేడాను అనుభవించండి. ఆందోళన ఉండదక్కడ! ఆందోళనను దాటి ఒక నిశ్చలస్థితికొస్తారు. అవగాహన కలిగిన తర్వాత, ఆందోళన అక్కడ లేదనీ, అది మాయమైందనీ మీరు గ్రహిస్తారు' అని శిష్యులకు జ్ఞానబోధ చేశారు.

– యామిజాల జగదీశ్

క్లుప్తంగా...

మార్కెట్ యార్డుల సమస్యలు పరిష్కరించాలి

వ్యవసాయ మంత్రి తుమ్మలకు మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఫోరం లేఖ


సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మార్కెట్ యార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని, అవసరమైన నిధులు కేటాయించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌ల ఫోరం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఫోరం అధ్యక్షుడు ముప్పా గంగారెడ్డి, గౌరవాధ్యక్షుడు చిలుక మాధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.నర్సింహ యాదవ్ కలిసి 33 జిల్లాల్లోని మార్కెట్ కమిటీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ వినతిపత్రం అందించారు. మార్కెట్ యార్డుల ఖర్చుల కోసం అవసరమైన ఎల్‌ఓసీ ఫైళ్లను వెంటనే ఆమోదించాలని, పనుల కోసం బిల్లుల చెల్లింపుల్లో జాప్యం తలెత్తకుండా చూడాలని కోరారు. మార్కెట్ యార్డుల అభివృద్ధి కోసం ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, రాష్ట్రంలో అమల్లో ఉన్న 5 ప్రతిపాదిత కార్పొరేషన్లను రద్దు చేసి, మార్కెట్ కమిటీల అధీనంలో ఉంచాలన్నారు. రాష్ట్ర స్థాయి గ్రేడ్ చైర్మన్‌లకు రూ.లక్ష, జిల్లా గ్రేడ్ చైర్మన్‌లకు రూ.50 వేలు, మండల స్థాయి చైర్మన్‌లకు రూ.25 వేలు గౌరవవేతనంగా ఇవ్వాలని విన్నవించారు. యార్డుల్లో కనీసం రూ.5 లక్షల వరకు పనుల ఆమోదం స్థానిక అధికారులకే అప్పగించాలని, గ్రామాల్లో రోడ్లు, లింక్ రోడ్ల నిర్మాణం, యార్డుల అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు.

లిడ్‌క్యాప్ భూములను పరిరక్షించాలి

సాక్షి, హైదరాబాద్: లిడ్‌క్యాప్ భూములను పరిరక్షించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ కోరారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మాదిగ మేధావుల ఫోరం చైర్మన్ ఆరేపల్లి రాజేందర్‌తో కలిసి వినతిపత్రం అందజేశారు. లిడ్‌క్యాప్‌ను పునరుద్ధరించాలని, చైర్మన్, డైరెక్టర్లను నియమించాలని కోరారు. రూ.12 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి మాదిగ నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

సీజ్ చేసిన నల్లబెల్లం రైతులకివ్వండి

- రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచన



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఎక్సైజ్ శాఖాధికారులు సీజ్ చేస్తున్న నల్లబెల్లాన్ని రైతులకు తక్కువ ధరకు విక్రయించాలని రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి సూచించారు. రైతులు నల్లబెల్లాన్ని సేంద్రియ ఎరువుల తయారీలో వాడుతున్నారని ఆయన తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని.. సీజ్ చేసిన నల్లబెల్లాన్ని రైతులకు అందిస్తే సాగుకు సాయం చేసినట్లేనని అభిప్రాయపడ్డారు. ఈమేరకు దీనిపై చర్చించేందుకు ఆయన మంగళవారం సచివాలయంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో సమావేశమయ్యారు. ఇటీవల రైతు కమిషన్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పర్యటించినప్పుడు.. చాలా మంది రైతులు నల్ల బెల్లంతో సేంద్రియ ఎరువు తయారీని తమ దృష్టికి తెచ్చారని మంత్రికి వివరించారు. ఎక్సైజ్ శాఖ అధికారులు సీజ్ చేసిన నల్లబెల్లాన్ని.. కొంతకాలానికి అడవుల్లో లేదంటే ఇతర ప్రాంతాల్లో పారబోస్తున్నారని వివరించారు. అలా వృథాగా పారబోయడం కంటే.. రైతులకు ఇస్తే.. సేంద్రియ ఎరువు ఉపయోగానికి వాడుకునే అవకాశం ఉంటుందన్నారు. తన ప్రతిపాదనకు ఎక్సైజ్ శాఖ మంత్రి సానుకూలంగా స్పందించినట్లు కోదండరెడ్డి తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో కమిషన్ సభ్యుడు భూమి సునీల్, కమిషన్ మెంబర్ సెక్రటరీ గోపాల్, కమిషన్ అధికారి హరివెంకట ప్రసాద్, ఆదర్శ రైతు కోటిరెడ్డి ఉన్నారు.

కొత్త దళపతి.. తిరుపతి

- మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా 'తిప్పరి' అలియాస్ దేవుజీ
- ఆయన స్వస్థలం కరీంనగర్ జిల్లా కోరుట్ల



సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/కోరుట్ల: మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లా కోరుట్లకు చెందిన తిప్పరి తిరుపతి అలియాస్ దేవుజీని ఆ పార్టీ ఎన్నుకున్నట్టు తెలిసింది. పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాళ్ల కేశవరావు బస్తర్ డివిజన్‌లోని నారాయణపూర్ జిల్లా అడవుల్లో భద్రతాదళాలతో జరిగిన కాల్పుల్లో మే 21వ తేదీన మరణించారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. మే 21 తర్వాత పొలిట్‌బ్యూరో, కేంద్ర మిలటరీ కమిషన్ సంయుక్త సమావేశం జరగకపోవడంతో పార్టీ ప్రధాన కార్యదర్శి పదవికి ఎవరినీ ఎన్నుకోలేదు. తీవ్ర నిర్బంధం ఉన్నా, ఇటీవల జరిగిన సమావేశంలో తిరుపతిని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. తిరుపతి కేంద్ర మిలటరీ కమిషన్ చీఫ్‌గా, పొలిట్ బ్యూరో సభ్యునిగా పనిచేశారు. తిరుపతి ఎన్నికతో రెండోసారి కరీంనగర్ జిల్లాకు పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు లభించినట్టు అయ్యింది. పీపుల్స్‌వార్ నుంచి కొండపల్లి సీతారామయ్యను తప్పించిన తర్వాత కరీంనగర్ జిల్లా బీర్పూర్‌కు చెందిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు.వృద్ధాప్యం పైబడడంతో ఆయన ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం జిల్లా కోట బొమ్మాళికి చెందిన నంబాళ్ల కేశవరావు మావోయిస్టు పార్టీ సుప్రీం లీడర్‌గా వ్యవహరించారు. ప్రస్తుతం పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తిప్పరి తిరుపతికి ముప్పాళ్ల లక్ష్మణ్‌రావుకు ప్రియశిష్యునిగా పార్టీలో పేరుంది. మిలటరీ ఆపరేషన్లలో దిట్టగా పేరున్న ముఖ్య నేతల్లో ఒకరైన దేవుజీకి ఈ బాధ్యతలు అప్పగించడమే సముచితంగా ఉంటుందని పార్టీ భావించినట్టుగా సమాచారం. దండకారణ్యంలో పార్టీ కార్యకలాపాల నిర్వహణకు ప్రతికూల పరిస్థితులు నెలకొనడం, రెడ్ కారిడార్ ఏరియాలో చాలా భూభాగాన్ని బలగాలు కైవసం చేసుకున్నాయి. పార్టీ ప్రధాన నాయకులే లక్ష్యంగా బలగాలు ఆపరేషన్లు చేపడుతున్న క్రమంలో ఎదురు దాడులు చేయాల్సిన ఆవశ్యకతను కూడా కేంద్ర కమిటీ నాయకులు గమనించినట్టుగా తెలుస్తోంది. ఈ కారణంగానే అటు మిలటరీ ఆపరేషన్లు, ఇటు రాజకీయ వ్యవహారాల్లో భాగస్వామ్యం ఉన్న దేవుజీకి బాధ్యతలు అప్పగించినట్టు సమాచారం. కాగా, మడావి హిడ్మాకు మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జ్‌తోపాటు ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ బాధ్యతలు అప్పగించారు.



కోరుట్లలో తిరుపతి కుటుంబానికి చెందిన ఇల్లు

కమలేశ్ విచారణలో

విజయవాడలోని పోరంకికి చెందిన నాగరాజు అలియాస్ కమలేశ్ ఆలియాస్ రామకృష్ణ మావోయిస్టు పార్టీలో 34 ఏళ్ల పాటు పనిచేశారు. ఈ ఏడాది జూలై 26న ఏపీ పోలీసుల ముందు లొంగిపోయాడు. వారి విచారణలో మావోయిస్టు కొత్త సారథిగా తిరుపతిని ఎన్నుకున్నట్టు కమలేశ్ వెల్లడించాడని రెండు రోజులుగా ప్రచారం జరుగుతోంది.

ఇంజనీర్ కావాలనుకొని..

కోరుట్లలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన తిప్పరి వెంకటనర్సయ్య-గంగుబాయి దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. వీరిలో పెద్ద కుమారుడైన తిరుపతి చిన్నప్పటి నుంచి చదువులో రాణించేవాడు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఆయన.. 1980లో పదో తరగతి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఆ తర్వాత ఇంజనీర్ కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ఎంపీసీలో చేరాడు. అప్పటికే కాలేజీలో ఏబీవీపీ, ఆర్ఎస్‌యూ విద్యార్థి సంఘాల మధ్య తీవ్రమైన గొడవలు జరిగాయి. ఈ ప్రభావానికి గురైన తిరుపతితోపాటు పలువురు విద్యార్థులపై పోలీసుల నిర్బంధం సాగింది. అయినా, ఇంటర్ పూర్తి చేసి 1982లో కరీంనగర్‌లోని ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ తీసుకున్నారు. అక్కడా విద్యార్థి సంఘాల మధ్య జరిగిన గొడవల్లో తిరుపతిపై కేసులు నమోదయ్యాయి. దీంతో డిగ్రీ పూర్తి కాకముందే మల్లోజుల కోటేశ్వర్‌రావు ముఖ్య అనుచరుడు మెట్‌పల్లి మండలంలోని కొండ్రికర్లకు చెందిన సాయిని ప్రభాకర్ ఆధ్వర్యంలో తిరుపతితోపాటు మరికొందరు అడవి బాట పట్టినట్టు సమాచారం .1984లో బస్తర్‌కు వెళ్లి అక్కడే అంచెలంచెలుగా ఎదిగారు.

బస్తర్ బాధ్యతలు హిడ్మాకు



మడ్వి హిడ్మా

కేంద్ర కమిటీలో స్థానం సంపాదించిన తొలి ఛత్తీస్‌గఢ్ మావోయిస్టుగా పేరున్న మడ్వి హిడ్మాకు మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ ఇన్‌చార్జ్‌తో పాటు ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ బాధ్యతలు అప్పగించారు. గెరిల్లా దాడులు చేయడంలో దిట్టగా పేరున్న హిడ్మాకు బస్తర్ ప్రాంతంలో భద్రతా దళాల దూకుడుకు బ్రేకులు వేసేపని అప్పగించినట్టు తెలుస్తోంది. తెలంగాణతో సరిహద్దులు పంచుకునే సుక్మా, బీజాపూర్ జిల్లాలతో కూడిన దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ మావోయిస్టు పార్టీలో అత్యంత కీలకమైంది. ఒకప్పుడు ఐదువేల మందికి పైగా సాయుధ మావోయిస్టులు ఈ కమిటీలో ఉండేవారు. ఇప్పటికీ మావోయిస్టు పార్టీలో అత్యధిక సాయుధులు ఈ కమిటీలోనే ఉన్నారు. దీంతో రాబోయే రోజుల్లో దండకారణ్యం దద్దరిల్లే అవకాశం కనిపిస్తోంది. దండకారణ్యం బాధ్యతలు ఇప్పటివరకు కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ చూస్తుండగా, ఇక్కడే ఉన్న జనతన సర్కార్ బాధ్యతలు మరో కేంద్ర కమిటీ సభ్యురాలు సుజాత అలియాస్ మైనా నిర్వర్తిస్తున్నారు. కొత్తగా హిడ్మా ఈ పోస్టులోకి రావడంతో ఆ ఇద్దరికి ఏ విధులు అప్పగిస్తారనేది స్పష్టత రావాల్సి ఉంది.

మిలిటరీ బాధ్యతల్లో మిసిర్ బెస్రా: కేంద్ర కమిటీలో ముగ్గురు పొలిట్‌బ్యూరో సభ్యులు ఉన్నారు. వీరిలో తిప్పిరి తిరుపతి జనరల్ సెక్రటరీగా ఎన్నికవడంతో సెంట్రల్ మిలిటరీ కమిషన్ బాధ్యతలు జార్ఖండ్‌కు చెందిన మిసిర్ బెస్రాకు అప్పగించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇక మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోనుదాదా అలియాస్ అభయ్ ఆ పార్టీకి సంబంధించిన రాజకీయ వ్యవహారాలు చూస్తున్నారు.

కేంద్రం నిర్ణయంతో పత్తి రైతులకు నష్టమే

అమెరికా పత్తిపై సుంకాన్ని ఎత్తివేయడం సరికాదు: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: అమెరికా నుంచి దిగుమతి అయ్యే పత్తిపై ఉన్న సుంకాలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయడం సరికాదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పత్తి ఉత్పత్తిదారుల్లో ఒకటైన భారతదేశం అమెరికా ఒత్తిడికి తలొగ్గి పత్తి దిగుమతులపై అమలులో ఉన్న 11 శాతం సుంకాన్ని ఎత్తివేసిందని, ఈ నిర్ణయం దేశీయ రైతులకు తీవ్రమైన దెబ్బ అని మంగళవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తంచేశారు. గత ఆగస్టు 19 నుంచి ఈనెల 30 వరకు మాత్రమే సుంకాన్ని ఎత్తివేస్తున్నట్టు తొలుత ప్రకటించి, ఇప్పుడు ఈ మినహాయింపును డిసెంబర్ 31 వరకు పొడిగించడం రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకమన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన 50 శాతం దిగుమతి సుంకాల ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ప్రత్యామ్నాయంగా ఫినిష్డ్ గూడ్స్ ఎగుమతులకు ఆర్థిక సాయం/రీఫండ్లు, ఆర్‌టీడీఈపీ మెరుగులు, ఫ్రైయిట్ సబ్సిడీలు లాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాల్సింది పోయి, దేశీయ పత్తి రైతులను అమెరికాకు త్యాగం చేయడం అన్యాయమని చెప్పారు. ఈ నిర్ణయం వల్ల మన రైతులు ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు (సీసీఐ) పెద్ద నష్టం కలుగుతుందని మంత్రి తుమ్మల వివరించారు. ప్రస్తుతం సీసీఐ ధర ఒక కాండీకి (355.6 కిలోలు) రూ.56,000-57,000 ఉండగా, దిగుమతి పత్తి ధర రూ.49,000-51,000 మధ్యనే ఉంటుందని, తద్వారా దేశీయ పత్తికి మార్కెట్ లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా కంపెనీలు మోన్శాంటో వంటి సంస్థల ద్వారా జన్యుమార్పు పత్తి విత్తనాలను భారత్‌లోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాయని, బీటీ పత్తి విత్తనాల వాడకం పెరిగితే జీవ వైవిధ్యం, ఆహార భద్రతకు ముప్పు ఏర్పడుతుందని నిపుణులు హెచ్చరించారన్నారు.

యూరియా కొరతను అధిగమించాలంటే...

దేశవ్యాప్తంగా యూరియా, ఎరువుల కొరత తీవ్రమైన స్థాయిలో కనిపిస్తోందని, 2024 ఆగస్టులో 86.43 లక్షల టన్నులుగా ఉన్న యూరియా నిల్వలు, 2025 ఆగస్టులో కేవలం 37.19 లక్షల టన్నులకు పడిపోయాయని అన్నారు. ఈ పరిస్థితిని అధిగమించడానికి ఒమన్, ఖతర్, యూఏఈ వంటి దేశాలతో దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం, రష్యాతో రూపాయి-రూబుల్ వాణిజ్య ఒప్పందాలు ప్రోత్సహించడం, అవసరమైతే భారతదేశానికి ప్రత్యేక యూరియా ప్లాంట్లను ఆ దేశాల్లో ఏర్పాటు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు.

మార్క్‌ఫెడ్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ

యూరియా సరఫరాకు నోడల్ ఏజెన్సీ అయిన మార్క్‌ఫెడ్ కార్యాలయాన్ని మంత్రి తుమ్మల మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 10.30 గంటలకు జాంబాగ్‌లోని మార్క్‌ఫెడ్ కార్యాలయానికి వచ్చిన ఆయన అప్పుడప్పుడే వస్తున్న సిబ్బందిని, అధికారులను చూసి అవాక్కయ్యారు. ఉదయం పదిన్నర గంటలైనా ఉద్యోగులు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్‌ది అవకాశవాద రాజకీయం

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



సాక్షి, యాదాద్రి: కీలకమైన ఉప రాష్ట్రపతి ఎన్నిక సమయంలో బీఆర్ఎస్ పార్టీ అవకాశవాదంతో వ్యవహరించిందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. ఆయన భువనగిరి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. సామాజిక న్యాయాన్ని రక్షించేందుకు, రాజ్యాంగంలోని మౌలిక విలువలను కాపాడేందుకు ప్రతిపక్షాలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా నిలిచాయన్నారు. ఎన్నికకు దూరంగా ఉండి బీఆర్ఎస్ పార్టీ పరోక్షంగా బీజేపీకి మద్దతు ఇచ్చిందని విమర్శించారు. రాష్ట్రాలకు అమ్మకం పన్ను అనేది ముఖ్యమైన ఆదాయమని, జీఎస్టీ వచ్చిన తర్వాత కేంద్రం.. రాష్ట్రాలకు రావలసిన ఆదాయానికి గండి కొట్టిందన్నారు. సమావేశంలో సీపీఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గన్‌పార్కు వద్ద మాజీ సర్పంచుల నిరసన

పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్

నాంపల్లి (హైదరాబాద్): తెలంగాణ పంచాయతీరాజ్ శాఖమంత్రి పదవికి గౌరవం దక్కేలా గ్రామ పంచాయతీల్లో చేసిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంగళవారం గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్తూపంవద్ద మాజీ సర్పంచులు నల్లబ్యాడ్జీలు ధరించి కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ ఆధ్వర్యంలో నిరసన సభ జరిగింది. 'గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయండి.. గ్రామ అభివృద్ధికి తోడ్పడండి'అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 21 నెలలు కావొస్తున్నా.. గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడం మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యానికి తూట్లు పొడవటమే అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య, కేశబోయిన మల్లయ్య, అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గండేడ్ కేజీబీవీలో ఇంకుడుగుంత నిర్మాణం



ఇంకుడుగుంత నిర్మాణ పనులు

సాక్షి ఎఫెక్ట్

గండేడ్: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నెలకొన్న సమస్యలపై మంగళవారం 'సాక్షి'ప్రధాన సంచికలో 'అంతటా అపరిశుభ్రత దుర్గంధం 'శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్థానిక అధికారులు స్పందించారు. కేజీబీవీ ఆవరణలో వర్షపు నీరు నిలువ ఉండకుండా ఇంకుడుగుంత నిర్మాణ పనులను ప్రారంభించారు. తరగతి గదుల్లో ఫర్నిచర్ బిగింపు పనులు కూడా ప్రారంభమయ్యాయి. పాఠశాలలో ఇంకుడుగుంత ఏర్పాటుతో దుర్గంధం, దోమల బెడద తగ్గనున్నట్లు ఉపాధ్యాయిని రాధిక పేర్కొన్నారు.

కూలిన హాస్టల్ పైకప్పు

- ముగ్గురు విద్యార్థులకు స్వల్ప గాయాలు



మునిపల్లి(అందోల్): సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం లింగంపల్లి గురుకుల పాఠశాల హాస్టల్ పైకప్పు మంగళవారం మధ్యాహ్నం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. సంఘటన జరిగిన సమయంలో విద్యార్థులంతా మధ్యాహ్న భోజనానికి వెళ్లడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, ప్రమాదంలో రవీందర్ అనే ఆరో తరగతి విద్యార్థి తలకు గాయాలు కాగా.. మరో ఇద్దరు చిన్నారులు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని జహీరాబాద్ ఆస్పత్రికి తరలించగా ఇద్దరు విద్యార్థులకు చికిత్స అందించి పంపించగా.. రవీందర్‌కు వైద్యం అందజేస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనం పైకప్పు.. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఒక్కసారిగా కూలిందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

యూరియా కోసం చెప్పులతో కొట్లాట




సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో చెప్పులతో కొట్టుకుంటున్న మహిళా రైతులు, దుబ్బాకలో యూరియా కోసం బారులు

- సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో చోటుచేసుకున్న ఘటన
- బారులు తీరినా బస్తా కూడా దొరకని వైనం

గజ్వేల్‌రూరల్/గరిడేపల్లి/దుబ్బాక/బీబీపేట: ఎప్పుడు వస్తుందో... ఎప్పుడు ఇస్తారో తెలియక యూరియా కోసం రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్ని చోట్ల రాస్తారోకోలు, ఆందోళనలు చేస్తుండగా, మరికొన్ని చోట్ల ఘర్షణలకు దిగుతున్నారు.

- సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో మంగళవారం యూరియా టోకెన్ల కోసం బారులు తీరిన మహిళా రైతులు ఒకరినొకరు చెప్పులతో కొట్టుకున్నారు. దీంతో ఒక్కసారిగా అక్కడున్న వారంతా ఆందోళనకు గురయ్యారు. ఏం జరుగుతుందో తెలియక అయోమయానికి గురయ్యారు.
- వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటుకాలపల్లిలోని జాతీయ రహదారిపై యూరియా కోసం రైతులు ధర్నా చేశారు. రాయపర్తి మండలం పెర్కవేడులో యూరియా కోసం టోకెన్లు ఇస్తున్నారని తెల్లవారుజాము నుంచే రైతువేదిక వద్ద మహిళా రైతులు బారులుతీరారు.
- మహబూబాబాద్ జిల్లాలోని కురవి, మహబూబాబాద్ మండలాల్లో పీఏసీఎస్ కేంద్రాల వద్ద కూడా బారులుతీరారు. నర్సింహులపేట మండలంలోని పెద్దనాగారం స్టేజీ వద్ద వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు.
- కామారెడ్డి జిల్లా బీబీపేట మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రానికి మంగళవారం యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. అలసిపోయి, నీరసించిన తర్వాత రైతులు క్యూలైన్లో రాళ్లు, చెప్పులు, చెట్ల కొమ్మలు పెట్టారు.
- సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌కు రైతులు పెద్ద సంఖ్యలో వచ్చి క్యూలైన్లలో నిలబడ్డారు. కేవలం 15 నుంచి 20 మందికి మాత్రమే రెండు బస్తాలు ఇచ్చి స్టాక్ అయిపోయిందని చెప్పడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. దీంతో అక్కడ ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.

ఆగ్రహ జ్వాలలు

నేపాల్‌లో మహోగ్రరూపం దాల్చిన ఆందోళనలు

- రెండోరోజూ రెచ్చిపోయిన విద్యార్థులు, యువత
- పోలీసులతో ఘర్షణ, హింసాత్మక ఘటనల్లో 22కు పెరిగిన మరణాలు
- పార్లమెంట్‌కు నిప్పుపెట్టిన ఆందోళనకారులు
- నైతిక బాధ్యతగా పదవీత్యాగం చేసిన ప్రధానమంత్రి కేపీ శర్మ ఓలీ
- మంటల్లో కాలి చనిపోయిన మాజీ ప్రధాని ఖనాల్ సతీమణి
- నేపాల్‌తో సరిహద్దు వద్ద పహారాను కట్టుదిట్టంచేసిన భారత్
- కాఠ్మండు మేయర్ బాలెన్‌ను కొత్త ప్రధానిగా చేయాలన్న ఆందోళనకారులు
- కర్ఫ్యూలోనూ వీధులను కదనరంగంలా మార్చిన విద్యార్థులు
- ఆర్థిక మంత్రిని రోడ్డుపై పరుగెత్తించి కొట్టిన యువకులు
- రక్తమోడిన మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బా దంపతులు
- అగ్నికి ఆహుతైన పలువురు నేతల ఇళ్లు
- రాజకీయ పార్టీల ప్రధానకార్యాలయాలూ ధ్వంసం
- జైళ్లను బద్దలుకొట్టి వందలాది ఖైదీలను విడిపించిన నిరసనకారులు
- శాంతించాలంటూ జెన్‌జెడ్ వర్గాన్ని చర్చలకు ఆహ్వానించిన సైన్యం

కాఠ్మండు/న్యూఢిల్లీ: సోషల్ మీడియా యాప్‌లపై నిషేధంతోపాటు విద్యార్థులు, యువత సోమవారం మొదలెట్టిన ఆందోళనలు మెరుపు వేగంతో నేపాల్‌ను చుట్టేసి దేశాన్ని సంక్షోభ కుంపట్లోకి నెట్టేశాయి. సామాజిక మాధ్యమాల సేవలను పునరుద్ధరిస్తున్నామని కేపీ శర్మ ఓలీ సారథ్యంలోని ప్రభుత్వం కొద్ది గంటల్లోనే స్పష్టంచేసినా అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. రాజధాని కాఠ్మండు మొదలు దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు, యువత తమ నిరసనజ్వాలలను మరింతగా ఎగదోస్తూ ఏకంగా పార్లమెంట్ భవనానికి నిప్పు పెట్టారు. మంగళవారం ఆందోళనలను అణచివేసేందుకు పోలీసులు, సైన్యం రంగంలోకి దిగాయి. కాళీమతిలో పోలీస్‌సర్కిల్‌కు నిప్పుపెట్టి అధికారులపై దాడి చేయడంతో పోలీసులు కాల్పులు జరిపారు. దీంతో ఇద్దరు చనిపోయారు. దీంతో కాల్పులు, పరస్పర ఘర్షణ ఘటనల్లో మరణాల సంఖ్య మంగళవారానికి 22కు పెరిగింది. 300 మందికిపైగా గాయపడ్డారు. కట్టలు తెంచుకున్న యువాగ్రహాన్ని తగ్గించే లక్ష్యంతో ప్రధాన మంత్రి కేపీ శర్మ ఓలీ మంగళవారం తన పదవికి రాజీనామాచేశారు. భద్రంగా ఇంటి నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లేందుకు నేపాల్ ఆర్మీ చీఫ్ అశోక్ రాజ్ సిగ్దెల్‌ను బతిమాలుకున్నట్లు వార్తలొచ్చాయి. ఆందోళనకారుల నిరసన కార్యక్రమం అదుపుతప్పి మాజీ ప్రధానమంత్రి, తాజా మంత్రులపై భౌతికదాడులదాకా వెళ్లింది. ప్రధాని ఓలీకి చెందిన భక్తపూర్‌లోని బాల్కోట్ నివాసాన్ని ఆందోళనకారులు తగులబెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఝులనాథ్ ఖనాల్ ఇంటికి ఆందోళనకారులు నిప్పుపెట్టారు. ఈ మంటల్లో చిక్కుకుని ఆయన భార్య రాజ్యలక్ష్మీ చిత్రకార్ తీవ్రంగా గాయపడ్డారు. హుటాహుటిన ఆమెను సమీప కీర్తిపూర్ బర్న్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయారు. ఎటు చూసినా ఆస్తుల విధ్వంసం, వినాశనంతో నేపాల్ నిలువెల్లా రక్తమోడింది. దుకాణాల లూటీలు, పౌరుల భయాందోళనల నడుమ ప్రధాని రాజీనామాతో ఎట్టకేలకు సైన్యం పూర్తిస్థాయిలో రంగంలోకి దిగి శాంతిభద్రతల పరిరక్షణ బాధ్యతలను తన చేతుల్లోకి తీసుకుంది. పరిస్థితులను తమకు అనుకూలంగా మల్చుకుని ప్రజల ఆస్తులను ధ్వంసంచేస్తూ లూటీలకు తెగించిన వాళ్ల అంతుచూస్తామని ఆర్మీ చీఫ్ హెచ్చరించారు. దేశాన్ని పట్టిపీడిస్తున్న అవినీతి, రాజకీయ వారసత్వం, సంపన్న, ఉన్నతస్థాయి వర్గాల ఆధిపత్యంపై ఇప్పటికే విసిగిపోయిన యువత తాజాగా సామాజికమాధ్యమాలపై హఠాత్తుక నిషేధం విధించడంతో వాళ్లలో ఆగ్రహం పెల్లుబికి మహోద్యమంగా మారడంతో దేశ భవిష్యత్తు ఇప్పుడు అగమ్యగోచరంగా తయారైంది.

పెల్లుబికిన ఆగ్రహం

పరిస్థితిని మరింతగా కట్టుతప్పొద్దనే ఉద్దేశంతో ప్రభుత్వం కర్ఫ్యూను విధించింది. అయినాసరే వేలాదిమంది విద్యార్థులు, యువత 'జెన్ జెడ్'కూటమిగా ఏర్పడి రాజధాని కాఠ్మండు మొదలు పట్టణాలదాకా విధ్వంసానికి తెగించారు. మాజీ ప్రధానమంత్రులు మొదలు తాజా కేబినెట్ మంత్రులు, కీలక నేతల దాకా ముఖ్యమైన వ్యక్తుల ఇళ్లకు నిప్పంటించారు. ప్రధాన రాజకీయ పార్టీల ప్రధాన కార్యాలయాలనూ ధ్వంసంచేశారు. కనిపించిన ప్రతి ఒక్క రాజకీయ నేతను చితకబాదారు. దేశాధ్యక్షుడు రాంచంద్ర పౌడెల్, మాజీ ప్రధాని పుష్పకమల్ దహాల్(ప్రచండ), ప్రస్తుత కమ్యూనికేషన్స్ మంత్రి పృథ్వీ సుబ్బా గురుంగ్, మాజీ హోం మంత్రి రమేశ్ లఖ్వార్, మాజీ ప్రధాని షేర్ బహదూర్ దేవ్‌బాల ఇళ్లను నాశనంచేశారు. ఆందోళనలు కాఠ్మండులోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్నీ తాకాయి. దీంతో ముందుజాగ్రత్తగా అంతర్జాతీయ విమానసర్వీసులను రద్దుచేసి ఎయిర్‌పోర్ట్‌ను అధికారులు తాత్కాలికంగా మూసేశారు.

ఎటుచూసినా విధ్వంసమే

ఆందోళనలను ఏ దశలోనూ అడ్డుకోలేక పోలీసులు చేతులెత్తేయడంతో విద్యార్థులు, నిరసనకారుల విధ్వంసకాండ ఆకాశమే హద్దుగా సాగింది. పార్లమెంట్, దేశాధ్యక్షుని కార్యాలయం, ప్రధాని నివాసం, సుప్రీంకోర్టు భవనం, ప్రధాన రాజకీయ పార్టీల హెడ్‌ఆఫీస్‌లు, సీనియర్ నేతల ఇళ్లు, మీడియా కార్యాలయాలు ఇలా ప్రతి దేశంలోని కీలక భవంతులన్నీ ఆందోళనకారుల ఆగ్రహజ్వాలల బారినపడ్డాయి. డల్లూ ఏరియాలోని మాజీ ప్రధాని ఝులానాథ్ నివాసానికి నిప్పుపెట్టారు. కపన్ ప్రాంతంలోని నేపాలీ కాంగ్రెస్ నేత ఇంటిని తగులబెట్టారు. సింఘదర్బార్‌లోని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల సముదాయం భవనానికీ నిప్పుపెట్టారు. మహారాజ్‌గంజ్‌లోని అధ్యక్షకార్యాలయం, బలువతార్‌లో ప్రధాని అధికారి నివాసం సైతం నిప్పురవ్వల వర్షంలో కాలిపోయాయి. టిన్‌కునేలో కాంతిపూర్ టెలివిజన్ ఆఫీస్‌ను ధ్వంసంచేశారు. బుద్ధనీలకంఠ ప్రాంతంలోని మాజీ ప్రధాని షేర్‌బహదూర్ దేవ్‌బా ఇంట్లో చొరబడి దేవ్‌బా, భార్య అర్జూ రాణాలను రక్తంకారేలా కొట్టారు. దీంతో ప్రాణభయంతో ఆయన పచ్చికబయళ్లకు పరుగులుపెట్టారు. విషయం తెల్సుకుని సైన్యం రంగంలోకి దిగి ఆయనను నిరసనకారుల బారినుంచి కాపాడింది. దేవ్‌బా కుమారుడు జైబీర్‌కు చెందిన కాఠ్మండులో హిల్టన్ ఐదునక్షత్రాల హోటల్‌కు, అర్జూకు చెందిన ఖుమల్తార్‌లోని ఉలెన్స్ పాఠశాలకు, తోఖాలో మాజీ ప్రధాని బాబూరామ్ భట్టారాయ్ ఇంటికి నిప్పుపెట్టారు. ఆర్థిక మంత్రి బిష్ణు ప్రసాద్ పౌడెల్‌ను వీధిలో పరుగెత్తించిమరీ చితక్కొట్టారు. వెనక నుంచి ఆయన్ను ఒకతను వీపుమీద ఎగిరి తన్నుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. గోశాల, లూభూ, కాళీమతి పోలీస్‌పోస్ట్‌లకూ నిరసనకారులు నిప్పుపెట్టారు. కలాంకీ, కాళీమతి, తహచల్, బనేశ్వర్, నైకాప్, ఛియాసల్, ఛపగావ్, థేచో ఇలా ప్రతి ప్రాంతంలో పెను విధ్వంసం సృష్టించారు. టైర్లు తగలబెట్టి రోడ్లపై రాకపోకలను నిలిపేశారు. కమ్యూనిస్ట్ పార్టీ ప్రధాన కార్యాలయ భవనం ఎక్కి పార్టీ జెండాను చింపేశారు. పోఖ్రా పట్టణంలో ఆందోళనకారులు కారాగారం గోడలు బద్దలుకొట్టారు. దీంతో జైలులోని 900 మంది ఖైదీలు బయటకు పరుగులుతీశారు. కాఠ్మండూలోని నఖూ జైలుకూ ఇదే గతి పట్టింది. దీంతో ఇక్కడి ఖైదీలు విడుదలయ్యారు. వీరిలో మాజీ హోం మంత్రి రవి లమీచ్చానే సైతం ఉన్నారు. ఇదే అదనుగా కొన్ని అల్లరిమూకలు దుకాణాలను లూటీ చేశాయి.



సింఘదర్బార్‌లో పోలీస్‌జాకెట్ వేసుకుని నినదిస్తున్న ఆందోళనకారుడు


కాఠ్మండులో జాతీయజెండా పట్టుకుని ఆందోళన చేస్తున్న నిరసనకారుడు


అగ్నికి ఆహుతవుతున్న ప్రధాని ఇల్లు

దిగిపోవాలని డిమాండ్ చేసి దింపేశారు

మంగళవారం ఉదయం ప్రధాని కేపీ శర్మ ఓలీ కార్యాలయాన్ని చుట్టుముట్టిన వందలాది మంది ఆందోళనకారులు తర్వాత లోపలికి చొరబడి శర్మను వెంటనే గద్దె దిగాలని మొండిపట్టుపట్టారు. ''కేపీ దొంగ, దేశాన్ని వీడిపో''అంటూ పెద్దగా నినాదాలు చేశారు. తప్పని పరిస్థితుల్లో వెంటనే ఆయన తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు దేశాధ్యక్షుడు రాంచంద్రకు లేఖ రాశారు. ''నేపాల్ అసాధారణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. పరిస్థితి కుదుటపడేందుకు రాజ్యాంగబద్ధంగా, రాజకీయంగా తగు పరిష్కారం కనుగొనేందుకు వీలుగా ప్రధాని పదవి నుంచి వైదొలుగుతున్నా''అని 73 ఏళ్ల సీనియర్ కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్(యునిఫైడ్ మార్కిస్ట్–లెనినిస్ట్) నేత శర్మ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. వెంటనే రాజీనామాను అధ్యక్షుడు ఆమోదించారు. అయితే నూతన మంత్రివర్గం ఏర్పడేదాకా ఆయనే ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగుతారని దేశాధ్యక్షుడు చెప్పారు. నేపాల్ కాంగ్రెస్ పార్టీ అండతో గత ఏడాది జూలైలో శర్మ నాలుగోసారి ప్రధాని పదవిని చేపట్టడం తెల్సిందే. శర్మ దిగిపోవాలని నేపాల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గగన్ థాపా సైతం అంతకుముందే డిమాండ్‌చేశారు. చైనాతో సత్సంబంధాలు కొనసాగించే శర్మ తరచూ భారతవ్యతిరేక విధానాలను అవలంభించే నేతగా అప్రతిష్ట మూటగట్టుకున్నారు. గత షెడ్యూల్ ప్రకారం ఈనెలలోనే భారత్‌లో పర్యటించాల్సి ఉండగా ఆలోపే పదవీ సన్యాసం చేశారు. అయితే శర్మ దేశాన్ని వీడి దుబాయ్‌కు వెళ్లనున్నారని, ఆయన కోసం రన్‌వే మీద హిమాలయ ఎయిర్‌లైన్స్ విమానాన్ని సిద్ధంగా ఉంచారని వార్తలొచ్చాయి.


కేపీ శర్మ ఓలీ

బాణసంచా కాల్చి.. పారిపోకుండా ఆపి..

నేపాల్ నుంచి పారిపోయేందుకు నేతలకు హెలికాప్టర్ సేవలను అందిస్తోందన్న పుకార్లతో సిమ్రిక్ ఎయిర్‌లైన్స్ భవంతిని ఆందోళనకారులు తగలబెట్టారు. భైసేపతి మంత్రుల క్వార్టర్స్ నుంచి మంత్రులు విదేశాలకు హెలికాప్టర్లలో పారిపోతున్నారన్న వార్తలతో విద్యార్థులు అప్రమత్తమయ్యారు. వెంటనే ఎయిర్‌పోర్ట్ రన్‌వేల సమీపంలో బాణసంచా, రాకెట్లు కాల్చారు. దీంతో ఆకాశంలో పొగచూరింది. డ్రోన్లు ఎగరేసి, పౌర లేజర్‌లైట్లు రన్‌వే వైపు ప్రసరింపజేసి విమాన రాకపోకలను అడ్డుకోవాలని ప్రజలకు ఆందోళనకారులు సోషల్‌మీడియా వేదికగా పిలుపునిచ్చారు. అయితే అప్పటికే కొన్ని హెలికాప్టర్లు అక్కడి నుంచి వెళ్లిపోయాయని వార్తలొచ్చాయి. కొందరు మంత్రులు, వీవీఐపీలు ఆర్మీ బ్యారెక్‌లలో తలదాచుకున్నారు.

పార్లమెంట్‌ను రద్దుచేయండి: బాలెన్ షా

యువతలో విపరీతమైన ఆదరణ ఉన్న కాఠ్మండు నగర మేయర్, 35 ఏళ్ల బాలేంద్ర షా మాత్రం వెంటనే పార్లమెంట్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ''నిరసనకారులు శాంతించాలి. విద్యార్థి బృందాలు తక్షణం ఆర్మీ చీఫ్‌తో చర్చలకు సంసిద్ధమవ్వాలి. అంతకుముందే పార్లమెంట్‌ను రద్దుచేయాలి''అని అన్నారు. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని, తాము ఎంపీలుగా రాజీనామా చేస్తామని రాష్ట్రీయ స్వతంత్ర పార్టీకి చెందిన 21 మంది ఎంపీలు ప్రకటించారు. ఉద్యమానికి తమ పూర్తి మద్దతు తెలిపారు. తాను సైతం రాజీనామా చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ప్రదీప్ యాదవ్ చెప్పారు.

చర్చించుకుందాం.. రండి

ఆందోళనను విడనాటి చర్చలకు రావాలని జెన్ జెడ్ విద్యార్థి, యువలోకానికి దేశాధ్యక్షుడు రాంచంద్ర పౌడెల్ పిలుపునిచ్చారు. శాంతి, సుస్థిరతకు అందరం పాటుపడుతున్నామంటూ నేపాల్ ఆర్మీ చీఫ్ అశోక్‌రాజ్ సిగ్దెల్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏక్ నారాయణ్ ఆర్యల్, హోం సెక్రటరీ గోకర్ణ దవాడీ, సాయుధ పోలీసు బలగాల చీఫ్ రాజు ఆర్యల్, ఐజీ చంద్ర కుబేర్, జాతీయ దర్యాప్తు విభాగ సారథి హుత్రాజ్ థాపా సంతకాలు చేసి ఒక సంయుక్త ప్రకటన విడుదలచేశారు. అయితే 26 సోషల్‌మీడియా సైట్ల పునరుద్ధరణతోపాటు వాక్ స్వాతంత్ర్యం, ప్రభుత్వ ఉద్యోగుల్లాగా రాజకీయనేతలకూ రిటైర్మెంట్ వయసును ప్రకటించాలని పలు డిమాండ్లను యువత ప్రభుత్వం ముందుంచింది. మంత్రులు, ఉన్నతవర్గాల కుటుంబాలే సకల సౌకర్యాలను పొందుతున్నాయని ఉద్యమకారులు సోషల్‌మీడియాలో ప్రచారాన్ని మొదలెట్టారు. పరిస్థితిని చక్కదిద్ది ప్రభుత్వం, ఆర్మీ దేశంలో మళ్లీ శాంతిని నెలకొల్పాలని నేపాల్‌లోని ఆస్ట్రేలియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జపాన్, ద.కొరియా, బ్రిటన్, అమెరికా రాయబార కార్యాలయాలు సంయుక్త ప్రకటనలో అభ్యర్థించాయి. ఉద్యమాలు శాంతియుతంగా సాగాలని హింసాత్మక పథం పనికిరాదని ఐక్యరాజ్య సమితి సైతం హితవు పలికింది.

సియాచిన్‌లో విషాదం

మంచు చరియలు పడి ముగ్గురు జవాన్లు మృత్యువాత

లేహ్: ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన యుద్ధక్షేత్రం లద్దాఖ్‌లోని సియాచిన్‌లో మంగళవారం విషాదం చోటుచేసుకుంది. విధి నిర్వహణలో ఉన్న సైనికులపై మంచు చరియలు విరిగి పడగా ముగ్గురు సజీవ సమాధి అయ్యారు. నియంత్రణ రేఖ వెంబడి 20 వేల అడుగుల ఎత్తులో ఉన్న సియాచిన్ హిమానీనదంలో సాధారణ ఉష్ణోగ్రత అత్యంత శీతలంగా మైనస్ 60 డిగ్రీల సెల్సియస్ నమోదవుతుంటుంది. ఇక్కడ మంచు చరియలు విరగడం సర్వసాధారణం. మంగళవారం ఘటన చోటుచేసుకున్న వెంటనే యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టిన సైన్యం ఒక ఆర్మీ కెప్టెన్‌ను కాపాడింది. విగతజీవులైన మరో ముగ్గురు జవాన్ల మృతదేహాలను వెలికితీసింది. ప్రాణాలు కోల్పోయిన వారిని గుజరాత్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్‌లకు చెందిన వారిగా గుర్తించారు. 2021లో సియాచిన్‌లో మంచు చరియలు విరిగి ఇద్దరు సైనికులు అసువులు బాశారు. దాదాపు ఆరు గంటల పాటు సాగిన తీవ్ర అన్వేషణతో 8 మంది సైనికులను కాపాడుకోగలిగారు. 2022లో అరుణాచల్‌ప్రదేశ్‌లోని కమెంగ్ సెక్టార్‌లో సంభవించిన అవలాంచెలో అత్యధికంగా ఏడుగురు జవాన్లు మృత్యువాతపడ్డారు. గల్లంతైన మూడు రోజుల తర్వాత వీరి మృతదేహాలను గుర్తించగలిగారు. 2022లో కొండచరియలు విరిగిపడిన సందర్భాల్లో సహాయక చర్యల కోసం ప్రత్యేకంగా స్వీడన్ నుంచి సామగ్రిని తెప్పించారు.

హిమాచల్‌లో మళ్లీ విరిగిన కొండచరియలు

కులులో కుటుంబంలోని ఐదుగురు మృతి

సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని కులులో మేఘ విస్ఫోటం కారణంగా కొండచరియలు విరిగిపడ్డాయి. సోమవారం రాత్రి ఘాటు పంచాయతీ శర్మానీ గ్రామంలో రెండిళ్లను బండ రాళ్లు, మట్టి కప్పేయడంతో వాటికింద నలిగి కుటుంబంలోని ఇద్దరు చిన్నారులు సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురు గాయాలతో బయటపడ్డారు. దీంతో, కులు జిల్లాలో ఇప్పటి వరకు 23 కొండ చరియలు విరిగిపడిన ఘటనల్లో మృతుల సంఖ్య 20కి చేరుకుందని అధికారులు తెలిపారు. జూన్ 20వ తేదీన రుతు పవన సీజన్ మొదలైనప్పటి నుంచి వర్షాలకు సంబంధించిన ఘటనల్లో ఇప్పటి వరకు రాష్ట్రంలో 378 మంది చనిపోయారని, నష్టం రూ.4,156 కోట్లకు చేరుకుందని వివరించారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

వరద బాధితులకు ప్రధాని నరేంద్ర మోదీ భరోసా

- హిమాచల్ ప్రదేశ్, పంజాబ్‌లో పర్యటన
- వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే
- తక్షణ సాయం కింద హిమాచల్‌కు రూ.1,500 కోట్లు, పంజాబ్‌కు రూ.1,600 కోట్లు

ధర్మశాల/చండీగఢ్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం హిమాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. నీట మునిగిన పంట పొలాలు, ధ్వంసమైన ఇళ్లు, రహదారులను స్వయంగా పరిశీలించారు. బాధితులతో మాట్లాడారు. భారీ వర్షాలు, వరదలకు తోడు కొండచరియలు విరిగిపడడంతో తీవ్రంగా నష్టపోయిన హిమాచల్ ప్రదేశ్‌కు తక్షణ సాయం కింద రూ.1,500 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. వరదల్లో మృతిచెందినవారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం ఇస్తామని వెల్లడించారు. హిమాచల్ ప్రదేశ్‌లో ఏరియల్ సర్వే అనంతరం కాంగ్రా పట్టణంలో ప్రధాని మోదీ సమీక్షా సమావేశం నిర్వహించారు. సహాయ పునరావాస చర్యల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి సుఖ్వీందర్‌సింగ్ సుఖూ పాల్గొన్నారు. వరద బాధితులు సైతం హాజరై తమ గోడు వినిపించారు. తమను ఆదుకోవాలని ప్రధాని మోదీని వేడుకున్నారు. కచ్చితంగా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. వరదల్లో దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించాలని అధికారులను ఆదేశించారు. ధ్వంసమైన ఇళ్లను ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద పునర్నిర్మించాలని సూచించారు. రాష్ట్రంలో ఈ ఏడాది జూన్ 20 నుంచి సెప్టెంబర్ 8 దాకా వరదలు, కొండచరియల కారణంగా ఏకంగా 370 మంది మృతిచెందారు.


హిమాచల్‌లో మోదీ విహంగవీక్షణ దృశ్యం

పంజాబ్‌లో సహాయక చర్యలపై ఆరా

ప్రధాని మోదీ హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటన అనంతరం పంజాబ్‌కు చేరుకున్నారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించారు. బాధితులను కలిసి మాట్లాడారు. అన్ని విధాలుగా ఆదుకుంటామని, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోనూ మాట్లాడారు. సహాయక చర్యలపై ఆరా తీశారు. గురుదాస్‌పూర్‌లో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. పంజాబ్‌కు తక్షణ సాయం కింద రూ.1,600 కోట్లు అందజేస్తామని ప్రకటించారు. భారీ వర్షాలతోపాటు సట్లెజ్, బియాస్, రావి నదులు ఉప్పొంగి ప్రవహించడంతో పంజాబ్‌లో భారీ నష్టం వాటిల్లింది. 51 మంది మరణించారు. 1.84 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగాయి. రూ.13,000 కోట్ల నష్టం జరిగినట్లు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. రూ.20,000 కోట్ల సహాయ ప్యాకేజీ ప్రకటించాలని ప్రధాని మోదీని ఆమ్ ఆద్మీ పార్టీ డిమాండ్ చేసింది.



చిన్నారి నీతికతో మోదీ

హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రాలో సమీక్షా సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ 14 నెలల చిన్నారి నీతికను ఎత్తుకొని బుజ్జగించారు. ప్రకృతి విలయం వల్ల అనాథగా మారిన నీతిక దీనగాథ విని ఆయన చలించిపోయారు. హిమాచల్‌ప్రదేశ్‌లో మండీ జిల్లాలోని తల్వార గ్రామంలో జూన్ 30న రాత్రిపూట హఠాత్తుగా భారీ వర్షం కురిసింది. గ్రామంపై కొండ చరియలు విరుచుకుపడ్డాయి. ఓ ఇంట్లో రమేశ్ కుమార్(31), రాధాదేవి(24) దంపతులు తమ కుమార్తె నీతికతోపాటు తల్లి పూనమ్‌దేవితో కలిసి నిద్రిస్తున్నారు. ఇంట్లోకి బురద చొచ్చుకొచ్చింది. నీతికను వంట గదిలో పడుకోబెట్టి బురదను తొలగించేందుకు ముగ్గురూ ప్రయత్నించారు. ఇంతలో భారీ కొండచరియ ఆ ఇంటిపైకి దూసుకొచ్చింది. వంట గది మినహా ఆ ముగ్గురున్న గది నేలమట్టమైంది. రమేశ్ కుమార్, రాధాదేవి, పూనమ్‌దేవి బురదతోపాటు కొట్టుకుపోయి మృత్యువాత పడ్డారు. వంట గదికి నష్టం జరగకపోవడంతో నీతిక ప్రాణాలతో బయటపడింది. ఆ సమయంలో నీతిక వయసు 11 నెలలే. నీతికను హిమాచల్‌ప్రదేశ్ ప్రభుత్వం 'చైల్డ్ ఆఫ్ ద స్టేట్'గా ప్రకటించింది. ఆమె చదువుతోపాటు జీవనానికి అయ్యే ఖర్చులు భరిస్తామని ప్రకటించింది.

రిజర్వ్‌డ్ అభ్యర్థులు జనరల్ కేటగిరీలో చేరలేరు

నిబంధనలు అనుమతిస్తే చేరొచ్చు: సుప్రీం

న్యూఢిల్లీ: రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులను అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీ కింద పరిగణించలేమని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. అలా ఒక కేటగిరీ నుంచి మరో కేటగిరీకి మార్చడాన్ని రిక్రూట్‌మెంట్ నిబంధనలు నిషేధిస్తే అలా సాధ్యం కాదని పేర్కొంది. ఫీజు మినహాయింపు, వయసు పరిమితిలో మినహాయింపు పొందే రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు ఓపెన్ కేటగిరీలో జనరల్ కేటగిరీ అభ్యర్థులతో పోటీ పడడానికి, రిక్రూట్‌మెంట్‌లో అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలోని ఖాళీల్లో చేరడానికి అనుమతి ఇవ్వలేమని వెల్లడించింది. ఒకవేళ మరో కేటగిరీలోకి మారడానికి నిబంధనలు అనుమతిస్తే అలాగే మారొచ్చని స్పష్టంచేసింది. త్రిపురలో కానిస్టేబుల్ పోస్టుల భర్తీ ప్రక్రియలో కొందరు ఓబీసీ కేటగిరీలో వయసు పరిమితి నుంచి మినహాయింపు పొందారు. తర్వాత రిజర్వ్‌డ్ కోటా లో కాకుండా అన్‌రిజర్వ్‌డ్ కేటగిరీలో చేరితే ఉద్యోగం వచ్చే అవకాశం ఉండడంతో ఆ దిశగా ప్రయత్నించారు. త్రిపుర హైకోర్టు సైతం అందుకు అనుమతి ఇస్తూ ఉత్తర్వు జారీ చేసింది. ఈ ఉత్తర్వును సవాలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల బాగ్చీతో కూడిన సుప్రీంకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. అమల్లో ఉన్న నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని స్పష్టంచేసింది.

పింఛనుదారుల క్యూలైన్‌పై రష్యా దాడి

24 మంది వృద్ధులు మృత్యువాత

- ఉక్రెయిన్‌లోని యరోవా గ్రామంలో విషాదం

కీవ్: పింఛనుదారుల క్యూలైన్‌పై రష్యా జరిపిన దాడిలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉక్రెయిన్‌లోని డొనెట్‌స్క్ ప్రాంతంలో ఘటన చోటుచేసుకుంది. స్లొవెయాన్స్క్ నగరానికి సమీపంలోని యరోవా గ్రామంలో మంగళవారం ఉదయం పింఛను తీసుకునేందుకు క్యూలైన్‌లో నిల్చున్న వృద్ధులపై రష్యా యుద్ధ విమానం గ్లైడ్ బాంబును జారవిడిచింది. ఘటనలో 24 మంది వృద్ధులు ప్రాణాలు కోల్పోగా, మరో 19 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా రిటైర్డు ఉద్యోగులని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఈ దారుణాన్ని వర్ణించడానికి మాటలు చాలవన్నారు. ఇది రష్యా పాల్పడిన క్రూరమైన చర్యగా అభివర్ణించారు. ప్రపంచ దేశాలు మౌనంగా ఉండరాదనీ, తమపై దురాక్రమణకు పాల్పడినందుకు ప్రతిగా రష్యాపై మరిన్ని ఆంక్షలు విధించి, ఆ దేశాన్ని ఆర్థికంగా దెబ్బతీయాలని పిలుపునిచ్చారు. ఘటనపై రష్యా రక్షణ శాఖ స్పందించలేదు. ఘటనా ప్రాంతం దృశ్యాలు, దాడిలో తీవ్రంగా దెబ్బతిన్న పోస్టల్ శాఖ వ్యాను ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమయ్యాయి. పోస్టల్ శాఖ ఉద్యోగి సైతం గాయపడ్డారు.

వెంటనే గాజాను వదిలి వెళ్లండి

- నగరంపై కరపత్రాలు కురిపించిన ఇజ్రాయెల్
- సైనిక చర్య తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరికలు

గాజా సిటీ: హమాస్ శ్రేణులకు గట్టి పట్టున్న గాజా నగరంపై పూర్తి స్థాయి నియంత్రణ సాధించేందుకు ప్రకటించిన ఆపరేషన్‌ను ఇజ్రాయెల్ ఆర్మీ ముమ్మరం చేసింది. నగరవాసులు వెంటనే వెళ్లిపోవాలంటూ మంగళవారం పెద్ద సంఖ్యలో కరపత్రాలను విమానాల ద్వారా జారవిడిచింది. తమ బలగాలు నిర్ణయాత్మక శక్తితో రానున్నాయని హెచ్చరించింది. నగరవాసులు తీర ప్రాంతం వెంబడి, దక్షిణం వైపునకు వెళ్లాల్సిన మార్గం మ్యాప్ ఆ కరపత్రాల్లో ఉంది. 'గాజా పాత నగరం, తుఫా మొదలుకొని పశ్చిమాన సముద్రం వరకు నివాసించే వారందరికీ ఇదే హెచ్చరిక. ఇజ్రాయెల్ ఆర్మీ హమాస్‌ను ఓడించాలని నిర్ణయించుకుంది. గాజా స్ట్రిప్ అంతటా చేపట్టిన విధంగానే గాజా నగరంలో ప్రచండ శక్తితో ఆర్మీ పనిచేస్తుంది'అని మిలటరీ ప్రతినిధి అవిచె అడ్రీ చెప్పారు. 'మీ భద్రత కోసం గాజా నగరాన్ని ఖాళీ చేసి రషీద్ యాక్సిస్ మీదుగా అల్ మువాసిలో ఏర్పాటు చేసిన మానవతా జోన్‌లోకి వెంటనే వెళ్లిపోండి'అని ఆయన పాలస్తీనియన్లను కోరారు. 'ఇది ప్రారంభం మాత్రమే. గాజా నగరంలో భూతల యుద్ధం తీవ్రరూపం దాల్చనుంది. వెంటనే నగరాన్ని వీడండి'అని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ సైతం కోరారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోండి. నా మాటలను జాగ్రత్తగా ఆలకించండి... ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని మిమ్మల్ని హెచ్చరిస్తున్నా'అని పేర్కొన్నారు. ఆయుధాలను వదిలేసి, బందీలందరినీ వదిలేసి హమాస్ లొంగిపోని పక్షంలో గాజాలో పెను తుఫాను బీభత్సం మొదలుకానుందని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కట్జ్ ఇటీవల తీవ్ర హెచ్చరికలు చేయడం తెల్సిందే. వచ్చే వారం పూర్తి స్థాయి క్షేత్రస్థాయి పోరాటం మొదలుపెట్టేందుకు ఇజ్రాయెల్ వేలాదిగా బలగాలను రప్పిస్తోంది. గాజా నగరంలో 40 శాతం మేర ఇప్పటికే తమ అధీనంలోకి వచ్చినట్లు ఆర్మీ అంటోంది. హమాస్ నిఘా కోసం వాడుకుంటోందంటూ రెండు రోజుల్లో నగరంలోని కనీసం 50 బహుళ అంతస్తుల భవనాలను ఇజ్రాయెల్ ఆర్మీ కూల్చివేసింది. తాజాగా హెచ్చరికలతో మహిళలు, చిన్నారులతోపాటు చేతికందిన సామగ్రితో కూడిన కార్లు, ట్రక్కులు, వ్యాగన్ల వరుసలు దక్షిణ గాజా దిశగా సాగుతున్నాయని మీడియా పేర్కొంది.

హమాస్ నేతలే లక్ష్యంగా ఖతార్‌పై ఇజ్రాయెల్ దాడి

హమాస్ అగ్ర నేత కుమారుడు సహా ఐదుగురు మృతి

దుబాయ్: ఖతార్‌లో ఉంటున్న హమాస్ నేతలే లక్ష్యంగా మంగళవారం ఇజ్రాయెల్ వైమానిక దాడులకు తెరతీసింది. రాజధాని దోహాలోని హమాస్ రాజకీయ ప్రధాన కార్యాలయంపై దాడి జరిపింది. దాడి అనంతరం ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకున్నాయి. దాడిలో అజ్ఞాతంలో ఉన్న హమాస్ గాజా చీఫ్ ఖలిల్ అల్ హయ్యా కుమారుడు సహా తమ సభ్యులు ఐదుగురు చనిపోయినట్లు ఆ సంస్థ ప్రకటించింది. కాల్పుల విరమణ చర్చల మధ్యవర్తులు త్రుటిలో తప్పించుకున్నారని తెలిపింది. తమ అంతరంగిక భద్రతా దళం అధికారి కూడా మృతుల్లో ఉన్నారని ఖతార్ తెలిపింది. తామే ఈ దాడికి పాల్పడ్డామని, తమదే పూర్తి బాధ్యతని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ స్వయంగా ప్రకటించడం గమనార్హం. జెరూసలేంలో సోమవారం ఆరుగురిని చంపిన ఘటన నేపథ్యంలోనే ఈ దాడికి పథకం వేశామన్నారు. తమకు అందిన అదనపు నిఘా సమాచారంతో హమాస్ నేతలే లక్ష్యంగా దాడి చేపట్టినట్లు ఇజ్రాయెల్ మిలటరీ తెలిపింది. దీనిపై ముందుగా అమెరికాకు సమాచారం ఇచ్చామని ఓ అధికారి వెల్లడించారు. అమెరికా మిత్రదేశమైన ఖతార్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడితో సంక్షోభం మరింత ముదురుతుందన్న అనుమానాలకు బలం చేకూరుస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు నిలిచిపోవడమే కాకుండా, బందీల విడుదల సైతం ప్రశ్నార్థకంగా మారనుంది. ఇజ్రాయెల్ చర్య అన్ని అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను తుంగలో తొక్కడమేనని ఖతార్ పేర్కొంది. ఇజ్రాయెల్‌ది పిరికిపంద అని వ్యాఖ్యానించింది. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ఈ దాడిని ఖండించారు. యూఏఈ, సౌదీ అరేబియా దాడిని తీవ్రంగా తప్పుబట్టాయి.

సాక్షి హైదరాబాద్

బుధవారం ∣ 10 ∣ సెప్టెంబర్ ∣ 2025



రూఫ్ దాటితే అంతే..

సన్‌రూఫ్ కార్లలో పిల్లలను తిప్పడం, తిరగడం పేరెంట్స్‌కు ఓ సరదా, స్టేటస్ సింబల్. అయితే ఈ సరదా విషాదం కాకూడదని రాచకొండ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు. -8లో



ఆ ఒక్క క్షణం

ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు నగరంలోనూ, దేశంలోనూ పలు ఎన్జీఓలు కృషి చేస్తున్నాయి. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/23.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గరిష్టంగా 33, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.





ప్రిజన్ డ్యూటీ మీట్..

జైలు సిబ్బంది కవాతు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాజబహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించిన 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్–2025 మూడురోజులపాటు జరగనుంది. దేశంలోని 21 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1222 మంది పోటీదారులు, 144 మంది సిబ్బంది పాల్గొననున్నారు. ప్రొఫెషనల్, క్రీడలు, సాహిత్యం, కళలు.. మొత్తం 36 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు.

సన్నగా బియ్యం.. తిన్నగా నల్లబజార్‌కు!

తీసుకోవడానికి లబ్ధిదారుల అనాసక్తి

- సొమ్ము చేసుకుంటున్న రేషన్ డీలర్లు
- కిలో రూ.12 చొప్పున కొనుగోలు
- పట్టని పౌరసరఫరాల శాఖ

పాతబస్తీకి చెందిన మహమూద్‌కు కొత్త రేషన్ కార్డు మంజూరైంది. సెప్టెంబర్ నెలవారీ రేషన్ కోటా విడుదలైంది. రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ జరుగుతుండటంతో కోటా డ్రా చేసి తెచ్చుకునేందుకు డీలర్ వద్దకు హుషారుగా వెళ్లాడు. కార్డు నెంబర్ చెప్పి ఈ–పాస్ యంత్రంపై బయోమెట్రిక్ పెట్టాడు. కార్డులో నలుగురు సభ్యులు ఉండటంతో 24 కిలోల బియ్యంపై తీసుకొవచ్చని భావించాడు. కానీ, డీలరు అందరి మాదిరిగానే నగదు కావాలా? బియ్యం కావాలా? అడిగాడు. అలోచిస్తున్న లోపే 'బియ్యం వండుకొని తినలేరు. ముద్దముద్ద అవుతుంది. వృథా ఎందుకు? నగదు తీసుకోండి'అంటూ కిలోకు రూ.12ల చొప్పున లెక్కకట్టి రూ.288 చేతిలో పెట్టాడు. నెలవారీ కోటా డ్రా కోసం వచ్చిన మిగతా కార్డుదారుల్లో మెజార్టీ పరిస్థితి ఇదే. చేసేదేమీ లేక చేతిలో పెట్టిన నగదును జేబులో పెట్టుకొని ఇంటిముఖం పట్టక తప్పడంలేదు. ఇలాంటి ఉదంతాలు ప్రతిరేషన్ షాపులో నిత్యకృత్యం.



సాక్షి, సిటీబ్యూరో: ఇది రేషన్ బియ్యం కథ.. బియ్యం మారినా డీలర్ల తీరు మారలేదు. అదే చేతివాటం.. అదే తప్పుదారి.. సాక్షాత్తు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ప్రభుత్వ చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న 'ఉచిత సన్న బియ్యం'న గదు దందా బాహాటంగా కొనసాగుతోంది. ఆహార భద్రత (రేషన్) కార్డుదారులు సన్న బియ్యంపై కూడా అనాసక్తి కనబర్చడం డీలర్లకు కలిసివస్తోంది. కొందరు కార్డుదారులు ఈ–పాస్ యంత్రంపై బయోమెట్రిక్ (వేలిముద్ర) పెట్టి నెలవారీ బియ్యం కోటాను డీల్లకు అప్పగించి నగదు పుచ్చుకోవడం, డీలర్లు కూడా కిలో ఒక్కంటికి రూ.12ల చొప్పున లెక్క కట్టి నగదు అందించడం సర్వసాధారణమైంది.

సన్నబియ్యంపై కూడా..

పూట గడవని అత్యంత నిరుపేద కుటుంబాలు మినహా మిగతా కుటుంబాలు పీడీఎస్ బియ్యం వండుకొని తినడానికి పెద్దగా ఆసక్తి కనబర్చరు. మొన్నటి వరకు బియ్యం దొడ్డుగా, నాసిరకం, ముక్కి పోయి ఉండటం, వండి తిన్న తర్వాత జీర్ణం కాకపోవడం లాంటి కారణాలతో పెద్దగా ఆసక్తి కనబర్చేవారు కాదు. కొన్ని కుటుంబాలు మాత్రం రేషన్ బియ్యాన్ని కేవలం ఇడ్లీ, దశలు, పిండి వంటలకు వినియోగిస్తున్నారు. ప్రతినెలా ఉచితంగా అందుతుండటం, అవసరానికి మించి వస్తుండటంతో డీలర్లకు అప్పగిస్తూ వచ్చేవారు. తాజాగా సన్నబియ్యం పంపిణీ జరుగుతున్నా లబ్ధిదారులను డీలర్లు తప్పుదోవ పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఒక యూనిట్ బియ్యమే...

కొందరు కార్డుదారులు తమ నెలవారీ కోటాలో ఒక యూనిట్ బియ్యమే తీసుకొని మిగతా యూనిట్ల కోటాను డీలర్ల వద్ద నగదు రూపంలో బదిలీ చేసుకుంటున్నారు. వాస్తవంగా ప్రభుత్వ చౌకధరల దుకాణాల్లో ఈ–పాస్ (బయోమెట్రిక్) అమలు కంటే ముందు రేషన్ డీలర్లు చేతివాటం ప్రదర్శించి డ్రా చేయని లబ్ధిదారుల సబ్సిడీ సరుకులు గుట్టుచప్పుడు కాకుండా బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకునేవారు. సంస్కరణలో భాగంగా ఈ– పాస్ అమలుతో లబ్ధిదారుల బయోమెట్రిక్, ఐరిస్, ఓటీపీ తప్పనిసరి కావడంతో డీలర్లు లబ్ధిదారుల ప్రమేయంతో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు.

పౌరసరఫరాల శాఖ అధికారుల నిర్లక్ష్యం

పీడీఎస్ బియ్యం అక్రమ దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అడపాదడప విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసుల దాడుల్లో పీడీఎస్ బియ్యం క్వింటాళ్ల కొద్దీ పట్టుబడుతోంది. స్పెషల్ డ్రైవ్ సమయంలో బియ్యం వ్యాపారులు ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్‌గా.. మౌనం దాల్చుతున్నారు. అ తర్వాత తిరిగి దందాను కొనసాగించడం సర్వసాధారణంగా మారింది.

మహిళా సాధికారతకు క్యాంటీన్లు ఊతం



లక్డీకాపూల్: మహిళల ఆర్థికాభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'ఇందిరా మహిళా శక్తి' క్యాంటీన్లను స్వయం సహాయక సంఘాలు(ఎస్‌హెచ్‌జీ) విజయవంతంగా నిర్వహిస్తున్నాయి. మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యంతో గత ఏడాది 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా జీహెచ్ఎంసీ సహకారంతో ప్రస్తుతం నగరంలో 33 క్యాంటీన్లను మహిళలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు నామమాత్రపు ధరలో పోషకాహారం అందిస్తున్నారు. ఈ క్యాంటీన్లు మహిళలకు కేవలం ఉపాధి కాకుండా ఆత్మవిశ్వాసం, స్వావలంబన, గౌరవం కలిగించే మార్గంగా మారాయి. రానున్న రోజుల్లో కూడా మహిళా సాధికారతకు జీహెచ్ఎంసీ కృషి చేస్తుందని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ పేర్కొంటున్నారు.

రోబో టెక్నాలజీతో పూడికతీత

సాక్షి, సిటీబ్యూరో: అమీర్‌పేట మెట్రోస్టేషన్ వద్ద కాలువల్లో పూడికతీత పనుల్లో హైడ్రా, బల్దియాలు రోబో టెక్నాలజీ వినియోగిస్తున్నాయి. ఈ పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం పరిశీలించారు. ఇటీవల భారీ వర్షాలకు మెట్రోస్టేషన్ పరిసరాలు నీట మునిగిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ ప్రాంతాలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో ఆయా శాఖలు వరదపై అధ్యయనం చేశాయి. మెట్రోస్టేషన్ కింద ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ లైన్లు కొన్ని పూర్తిగా బ్లాక్ అవ్వడం.. మరికొన్ని పాక్షికంగా మూసుకుపోవడాన్ని గమనించారు. వెంటనే పూడికతీత చేపట్టారు. ప్రధాన రహదారి కింద ఉన్న బాక్సు డ్రైన్లలో పూడికను తొలగించడానికి రోబో టెక్నాలజీని వాడాల్సిన అవసరాన్ని అధికారులు కమిషనర్‌కు వివరించారు. గట్టిగా మారిన పూడికను సొరంగ మార్గాల్లో రోబో టెక్నాలజీతో తొలగించవచ్చన్నారు.

వారసత్వం.. జవసత్వం!

పురాతన కట్టడాలకు పునరుజ్జీవం



గన్‌ఫౌండ్రీ



చెన్నకేశవ స్వామి ఆలయం

- ఆకర్షణీయ ప్రాంతాలుగా అభివృద్ధి
- మ్యూజియాలు, కల్చరల్ సెంటర్లుగా మార్చే యోచన
- వారసత్వ పరిరక్షణతోపాటు పర్యాటకాభివృద్ధి
- తొలిదశలో పన్నెండు ప్రాంతాల్లో..

సాక్షి, సిటీబ్యూరో

నగరంలోని వారసత్వ కట్టడాలను ఆకర్షణీయంగా, ఆహ్లాదంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. నగరంలో చాలా చారిత్రక భవనాలు, ప్రదేశాలు, స్మారక చిహ్నాలు తదితర వారసత్వ కట్టడాలు ఉన్నాయి. పట్టించుకునేవారు లేక అవి మరుగున పడిపోతున్నాయి. వాటిని పరిరక్షించి నేటి ప్రజలకు, సందర్శకులకు నచ్చేవిధంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. తద్వారా వాటికి తగిన గుర్తింపు లభించడమేకాక పర్యాటక ప్రాంతాలుగానూ అభివృద్ధి చెందుతాయని భావిస్తోంది. తొలిదశలో 12 ప్రాంతాల్లోని కట్టడాలను తీర్చిదిద్దాలనుకుంటోంది. అందుకుగాను ఆయా ప్రాంతాల్లోని వనరులు, సదుపాయాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రత్యేక మ్యూజియాలను ఏర్పాటు చేయాలని, లేదంటే కల్చరల్ సెంటర్లుగా మార్చాలని యోచిస్తోంది. ఈ రెండూ కుదరకుంటే ప్రజలకు ఉపయోపడే మరో రూపంలోనైనా అభివృద్ధి చేయాలనుకుంటోంది. తద్వారా ఓ వైపు చారిత్రక, వారసత్వ ప్రదేశాల పరిరక్షణతోపాటు సందర్శకులతో అవి పర్యాటక ప్రాంతాలుగానూ అభివృద్ధి చెందుతాయని భావిస్తోంది. ఈ దిశగా సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ల రూపకల్పనకుగాను టెండర్లు ఆహ్వానించినట్లు సంబంధిత అధికారి తెలిపారు. ఆ యా కట్టడాలు, ప్రదేశాల పరిరక్షణ, పునర్వినియోగం, అభివృద్ధి అంశాల ప్రాతిపదికన ఆయా ఏజెన్సీ డీపీఆర్‌లు రూపొందించాల్సి ఉంటుందన్నారు.

వారసత్వ పరిరక్షణ.. పర్యాటక ఆకర్షణ

పాత కట్టడాలను కొత్తగా తీర్చిదిద్దడం ద్వారా సదరు నిర్మాణాల జీవితకాలాన్ని పెంచడం, నగర సాంస్కృతిక వారసత్వాన్ని, శిల్పకళా వైశిష్ట్యాన్ని కాపాడినట్లు అవుతుందని అధికారులు చెబుతున్నారు.

టెండర్లు పిలిచిన కట్టడాలు

- రోనాల్డ్ రోస్ భవనం, సికింద్రాబాద్
- చెన్నకేశవ స్వామి ఆలయం, చాంద్రాయణగుట్ట
- రేమండ్ సమాధి, మూసారాంబాగ్
- పురానాపూల్ దర్వాజా, హుస్సేనీ ఆలమ్
- ఖజానా భవనం, గోల్కొండ
- షంషీర్ కోట, గోల్కొండ
- గన్‌ఫౌండ్రీ, అబిడ్స్
- మసీద్–ఇ–మియాన్ మిష్క, జుమ్మెరాత్ బజార్
- టోలి మసీద్, కార్వాన్
- హయత్ బక్షి బేగం మసీద్, హయత్‌నగర్
- షేక్‌పేట్ మసీద్, షేక్‌పేట్
- ఖైరతాబాద్ మసీదు, సమాధి, ఖైరతాబాద్

ఎంపికయ్యే ఏజెన్సీ ప్రతి స్థలాన్ని సమగ్రంగా పరిశీలించి, చారిత్రక ప్రాముఖ్యత, ప్రస్తుత పరిస్థితులను డాక్యుమెంట్ చేయాలి. ప్రతి స్థలానికి సంబంధించిన సాంస్కృతిక, చారిత్రక, శిల్పకళ, పర్యావరణ ప్రాముఖ్యతను వివరించాలి. ప్రాజెక్ట్ నిర్వహణ, డిజైన్, పర్యవేక్షణ, చారిత్రక నేపథ్యం, భౌతిక సంరక్షణ, ప్రజల సందర్శన..ఆర్థిక అవకాశాలు వంటి అంశాలను డీపీఆర్‌లో పొందుపరచాలి.



రోనాల్డ్ రోస్ భవనం



హయత్ బక్షి బేగం మసీద్

రూ. 11 కోట్ల స్థలానికి హైడ్రా ఫెన్సింగ్

సెక్రటేరియట్ సొసైటీ పార్కులను కాపాడిన అధికారులు

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 25/పార్ట్‌లో తెలంగాణ సెక్రటేరియట్ మ్యూచువలీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో రూ.11 కోట్ల విలువైన రెండు పార్కులను హైడ్రా కాపాడింది. అప్పట్లో హెచ్ఎండీఏ అనుమతితో లేవుట్‌లో ప్రజా అవసరాలు, పార్క్‌లకు స్థలాన్ని కేటాయించారు. రెండుచోట్ల దాదాపు 600 చదరపు గజాల స్థలం ఉండగా కొందరు సొసైటీ సభ్యులు అమ్ముకున్నట్లు హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో మంగళవారం హైడ్రా అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. రెండు చోట్ల ఫెన్సింగ్ వేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఎవరు ఎలా అమ్మారు, కొన్న వారెవరు అనే విషయాలపై పూర్తిస్థాయిలో హైడ్రా అధికారులు విచారణ చేపట్టనున్నారు. అక్రమ లావాదేవీలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేయనున్నట్లు హైడ్రా ప్రకటించింది.



తెలంగాణ సెక్రటేరియట్ కో–ఆప్‌రేటివ్ సొసైటీ లే అవుట్‌లోని పార్క్‌కు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

పట్టణాభివృద్ధికి ఏకీకృత బిల్డింగ్ కోడ్

హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న యూనిఫైడ్ డెవలప్‌మెంట్ బిల్డింగ్ కోడ్(యూడీబీసీ) దేశవ్యాప్తంగా పట్టణాభివృద్ధి రంగానికి నమూనాగా నిలవనుందని హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నారు. సుస్థిరమైన పట్టణాభివృద్ధికి ఈ బిల్డింగ్ కోడ్ దోహదం చేస్తుందని చెప్పారు.

యూడీబీసీపై హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ, ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) సంస్థలు మంగళవారం సంయుక్తంగా నిర్వహించిన భాగస్వామ్య సంస్థల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పట్టణాభివృద్ధిలో ఏకీకృతమైన నియంత్రణ వ్యవస్థగా యూడీబీసీ పనిచేస్తుందని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో సుస్థిరతను సాధించవచ్చన్నారు. డీటీసీపీ, ఇతర ప్రభుత్వ విభాగాలు, సంస్థలు ఈ కోడ్ రూపకల్పనలో భాగస్వాములు కావాలని కోరారు. బిల్డింగ్ కోడ్‌పై ఈవై సంస్థ జాతీయ, అంతర్జాతీయ నగరాలను సమగ్రంగా అధ్యయనం చేసి తెలంగాణ అభివృద్ధికి అవసరమైన కోడ్‌ను రూపొందిస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో క్రెడాయ్, నరెడ్కో, సీఐఐ తదితర సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. వివిధ సంస్థల నుంచి సేకరించిన సూచనలు, సలహాలు యూడీబీసీ ముసాయిదాను రూపొందించడంలో కీలకపాత్ర పోషించనున్నాయని నిర్వాహకులు తెలిపారు. సదస్సులో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, జలమండలి, మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ, పంచాయతీరాజ్ తదితర విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని సలహాలు, సూచనలు అందజేశారు. ఇప్పటికే వివిధ విభాగాల్లో చేపట్టిన నిర్మాణాత్మక, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు.



మాట్లాడుతున్న హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్

కేబీఆర్ పార్కు చుట్టూ ఆస్తుల సేకరణకు నోటీసులు

ఆరు జంక్షన్లలో స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణ ప్రక్రియ ముమ్మరం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ ట్రాఫిక్ ఇక్కట్లను నియంత్రించేందుకు ఆరు జంక్షన్లలో స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించేందుకు జీహెచ్ఎంసీ కార్యాచరణ ప్రణాళిక అమలును ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పార్కు చుట్టూ ఆస్తుల సేకరణకు నడుం బిగించిన జీహెచ్ఎంసీ ఆస్తులు కోల్పోయే నివాసితులకు సెక్షన్ 146 కింద నోటీసులు జారీ చేసింది. మంగళవారం కేబీఆర్ పార్కు, ముగ్ధ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు ప్రాంతాల్లో ఆస్తులు కోల్పోయే యజమానులకు నోటీసులు ఇచ్చారు. నోటీసులు ఇచ్చే ప్రక్రియ మంగళవారంతో ముగిసింది. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12 విరించి ఆస్పత్రి చౌరస్తా నుంచి ఒమేగా ఆస్పత్రి, జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్–45, హీరో బాలకృష్ణ ఇంటి మీదుగా జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు ఆరున్నర కిలోమీటర్ల పొడవునా రోడ్డును విస్తరించనున్నారు. ఇందుకోసం విరించి చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు 299 ఆస్తులను సేకరిస్తున్న అధికారులు అందరికీ నోటీసులు జారీ చేశారు. హీరోలు బాలకృష్ణ, చిరంజీవి, మాజీమంత్రి జానారెడ్డి ఇళ్లకు సంబంధించి కూడా నోటీసులు జారీ అయ్యాయి. విరించి నుంచి అగ్రసేన్ చౌరస్తా వరకు 100 అడుగుల మేర రోడ్డును విస్తరించనున్నారు. అగ్రసేన్ చౌరస్తా నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు 120 అడుగుల మేర విస్తరిస్తారు. చెక్‌పోస్టు వద్ద మెట్రోరైల్‌కు ఇబ్బంది లేకుండా 150 అడుగుల మేర విస్తరిస్తారు. ఈ విస్తరణలో భాగంగా 303 ఆస్తులకు నోటీసులు జారీ చేశారు.



ఆస్తులు కోల్పోతున్న వారికి నోటీసులు అందజేస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

- ఆరు జంక్షన్లలో ఆరు వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. అగ్రసేన్ చౌరస్తాలో 45 ఆస్తులు, ఫిలింనగర్ జంక్షన్‌లో 43 ఆస్తులు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో 73 ఆస్తులు, జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–45 బాలకృష్ణ ఇంటి చౌరస్తాలో 40 ఆస్తులు, క్యాన్సర్ ఆస్పత్రి చౌరస్తాలో 21 ఆస్తులు, కేబీఆర్ జంక్షన్ నుంచి ముగ్ధ షోరూం వరకు 61 ఆస్తులను సేకరించనున్నారు.
- నోటీసులు తీసుకున్నవారు రెండు వారాల్లోగా తమ అభిప్రాయాలను జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలియజేయనున్నారు.
- టీడీఆర్, నష్టపరిహారంపై అభిప్రాయం తెలియజేయాల్సి ఉంటుంది.

డేటా అనుసంధానంతో ఆదాయం వృద్ధి

సమీక్ష సమావేశంలో అడిషనల్ కమిషనర్ అనురాగ్ జయంతి



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఆస్తిపన్ను నెంబర్ల(పీటీఐఎన్) డేటా, విద్యుత్ విభాగం సేవా కనెక్షన్ల(యూఎస్‌సీ) అనుసంధానంతో ఆస్తిపన్ను ఆదాయం గణనీయంగా పెరుగుతుందని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్(ఐటీ) అనురాగ్‌జయంతి అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఐటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డేటా అనుసంధానంతో జీహెచ్ఎంసీకి రావాల్సిన ఆదాయ లీకేజీలను అరికట్టడంతోపాటు ఆస్తివినియోగం–విద్యుత్ కనెక్షన్ల మధ్య మరింత జవాబుదారీ తనానికి ఉపయోగపడుతుందన్నారు. డేటాలో పాదర్శకత కూడా సాధ్యమవుతుందని పేర్కొన్నారు. టీజీ పీఎస్‌పీడీసీఎల్ సహకారంతో సోల్‌పేజ్ సంస్థ సాంకేతిక విశ్లేషణతో జీహెచ్ఎంసీ పీటీఐఎన్–యూఎస్‌సీల అనుసంధానాన్ని చేపట్టిందని, అందులో భాగంగా ఇప్పటి వరకు 96,938 నివాస భవనాలను వాణిజ్య విద్యుత్ కనెక్షన్లతో అనుసంధానించినట్లు తెలిపారు. అనుసంధానం ద్వారా ఎన్నో వాణిజ్య యూఎస్‌సీలకు నివాస పీటీఐఎన్‌లు ఉండటాన్ని గుర్తించినట్లు తెలిపారు. వాటిని క్రమబద్ధీకరించడం ద్వారా జీహెచ్ఎంసీ ఆదాయం ఎంతో పెరగనుందన్నారు. కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ మార్గదర్శకాల మేరకు పారదర్శకతను పెంపొందించడానికి, ఇకపై ప్రకటనల అనుమతులకు దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించాలని, ఆఫ్‌లైన్ విధానాన్ని నిలిపివేయాలని అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఐటీ విభాగం జాయింట్ కమిషనర్ రాధ, ఇంజినీర్లు భార్గవి, సాయిరామ్, కార్తీక్, అభిలాష్, తిరుమల్, ప్రకటనల విభాగం డిప్యూటీ కమిషనర్ పద్మ, ఇంజినీర్లు నవీన్, మలన్, బెలువా, తదితరులు పాల్గొన్నారు.

జోన్ల వారీగా అనుసంధానించిన భవనాలు	
ఎల్‌బీనగర్	9,761
చార్మినార్	26,056
ఖైరతాబాద్	22,514
సికింద్రాబాద్	22,005
కూకట్‌పల్లి	7,260
శేరిలింగంపల్లి	9,342



సాక్షి బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025

హెచ్‌సీఏ వన్డే లీగ్‌లో మణికుమార్ జట్టు గెలుపు


కుశాంత్ నీల్ వర్మ

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) 'సి' డివిజన్ వన్డే లీగ్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో మణికుమార్ టీమ్ విజయాన్ని సాధించింది. మంగళవారం బృంద గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో మణికుమార్ 20 పరుగుల తేడాతో విజయనగర్‌ను ఓడించింది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మణికుమార్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 281 పరుగులు చేసింది. ఎస్.శరత్‌రాజ్ (26 బంతుల్లో 59 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్), తనిష్క్ అగర్వాల్ (62 బంతుల్లో 57; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు సాధించగా, కెప్టెన్ నగరం తరుణ్ (47), ప్రీత్ పటేల్ (47) రాణించారు. విజయనగర్ బౌలర్లలో మొగిలి అర్జున్ 3 వికెట్లు పడగొట్టగా, వి.సాయిచరణ్ 2 వికెట్లు తీశాడు. అనంతరం విజయనగర్ 49.3 ఓవర్లలో 261 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ ఎం.కుశాంత్ నీల్ వర్మ (141 బంతుల్లో 107; 9 ఫోర్లు) సెంచరీతో చెలరేగగా, ఎ.ఆశ్రిత్ శ్రీచరణ్ (58 బంతుల్లో 80; 11 ఫోర్లు, 1 సిక్స్) దూకుడుగా ఆడాడు. వీరిద్దరు నాలుగో వికెట్‌కు 121 బంతుల్లోనే 119 పరుగులు జోడించినా...జట్టును గెలిపించడంలో విఫలమయ్యారు. కె.శేఖర్ 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీయగా, కుమ్మరి మహేశ్, డేవిడ్ చెరో 2 వికెట్లతో సహకరించారు.

నకిలీ వైద్యుడి అరెస్టు..

బంజారాహిల్స్: మృతి చెందిన రిజిస్టర్ ఆర్‌ఎంపీ పేరుపై నకిలీ ఆర్‌ఎంపీగా చెలామణి అవుతున్న యువకుడిని జూబ్లీహిల్స్ పోలీసు లు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. యూసుఫ్‌గూడ సమీపంలోని శ్రీకృష్ణానగర్ బి- బ్లాక్‌లో మణికంఠ (32) అనే యువకుడు బీఫార్మసీ పూర్తి చేసి శ్రీసాయి క్లినిక్ పేరుతో క్లినిక్ నిర్వహిస్తున్నా డు. అయితే గతంలో ఈ క్లినిక్‌ను రిజిస్టర్ ఆర్‌ఎంపీగా గుర్తింపు పొందిన వెంకటేశ్వరరావు నడిపేవాడు. ఆరు నెలల క్రితం అతను మృతి చెందా డు. దీనిని అదునుగా తీసుకుని మణికంఠ.. వెంకటేశ్వరరావు పేరుతో ఆర్‌ఎంపీ డాక్టర్‌గా చెలామణి అవు తూ ఈ ఆస్పత్రిని నడిపిస్తున్నాడు. ఇటీవల పలు ఫిర్యాదులు అందడంతో పోలీసులు ఈ క్లినిక్‌పై దాడి చేసి మణికంఠ ధృవపత్రాలను తనిఖీ చేశారు. ఆయన కేవలం బీఫార్మసీ చదివాడని, ఆర్‌ఎంపీగా అనుభవం లేదని గుర్తించారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

రూఫ్ దాటితే అంతే..

కార్ సన్‌రూఫ్‌లలో వేలాడుతూ ప్రయాణాలు

- రోడ్లపై ఓవర్ హెడ్ బారికేడ్లతో పొంచి ఉన్న ప్రమాదం
- వేలాడే కరెంట్, కేబుల్ వైర్లు, మాంజాలతో ప్రాణాలకే ముప్పు
- నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తే జరిమానా తప్పదు

సోషల్ మీడియాలో రాచకొండ పోలీసుల అవగాహన

సాక్షి, సిటీబ్యూరో:


"బెంగళూరులో ఓ బాలుడు కుటుంబంతో కలిసి కారులో ప్రయాణిస్తున్నాడు. సన్‌రూఫ్‌లో నుంచి తల బయటికి పెట్టి వెళ్తుండగా.. డ్రైవర్ రోడ్డుపై ఉన్న ఓవర్ హెడ్ బారికేడ్‌ను గమనించకుండా అలాగే వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. అంతే అకస్మాత్తుగా బారికేడ్ బాలుడికి తగిలి తల పగిలిపోయింది."
.. అయితే ఈ ఘటన పొరుగు రాష్ట్రంలో జరిగినప్పటికీ.. మనకిదొక హెచ్చరిక!

ఈ రోజుల్లో ప్రతి మోడ్రన్ కారుకు సన్‌రూఫ్ తప్పనిసరి అయిపోయింది. పిల్లల నుంచి పెద్దల వరకూ ప్రతి ఒక్కరూ సన్‌రూఫ్ అనుభూతిని పొందాలని భావిస్తున్నారు. అయితే ఆనందం మాటున ప్రమాదం కూడా పొంచి ఉందని పోలీసులు హెచ్చరిస్తున్నారు. చాలామంది యువతీ యువకులు సన్‌రూఫ్‌ల నుంచి బయటికి చూస్తూ వికృత చేష్టలకు పాల్పడుతుంటారు. సెల్ఫీలు దిగుతూ, రీల్స్ చేస్తూ వాటిని సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తుంటారు. సన్‌రూఫ్ కార్లలో పిల్లలను తిప్పడం, తిరగడం పేరెంట్స్‌కు ఓ సరదా, స్టేటస్ సింబల్. అయితే ఈ సరదా విషాదం కాకూడదని రాచకొండ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.



సరదా కారాదు విషాదం..

ఇరుకు, బిజీ రోడ్లలో ఎత్తయిన వాహనాలు వెళ్లకుండా పోలీసులు ఓవర్ హెడ్ బారికేడ్లను



ఏర్పాటు చేస్తుంటారు. ఇలాంటి రోడ్లలో సన్‌రూఫ్ నుంచి వేలాడుతూ ప్రయాణించకూడదు. విద్యుత్ వైర్లు, టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు, పతంగుల దారాలు, మాంజా, ఇతరత్రా సన్నని తీగలు రోడ్లపై వేలాడుతుంటాయి. ఇది సాధారణంగా డ్రైవర్లకు కనిపించవు. దీంతో సన్‌రూఫ్‌లో ప్రయాణించే వారికి ఇవి తగిలి మెడ, తల, మొండెం భాగాలకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదం ఉంది. అలాగే నడుం భాగం వరకూ బయట పెట్టి చేతులను ఊపుతూ ప్రయాణిస్తున్న క్రమంలో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే సన్‌రూఫ్‌లో ఉన్నవారికి పట్టు ఉండదు. దీంతో సన్‌రూఫ్ ఫ్రేమ్ తగిలి పక్కటెముకలు, ఊపిరితిత్తులకు గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. పొత్తి కడుపులో బలంగా తగిలితే తీవ్ర రక్తస్రావం అయ్యే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వంకలు, మూల వంపులు అధికంగా ఉన్న రోడ్లలో అయితే ఏకంగా కార్‌లో నుంచి కిందపడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.

సహజ కాంతి కోసమే..

సన్‌రూఫ్ అనేది కేవలం వెంటిలేషన్ కోసమే ఉద్దేశించబడింది. కారు క్యాబిన్ స్పేస్ విశాలంగా అనిపించడంతో అత్యవసర పరిస్థితుల్లో కారు డోర్లు లాక్ అయిపోతే సన్‌రూఫ్ నుంచి బయటికి వెళ్లిపోవచ్చు. అంతేకాకుండా వేసవి కాలంలో ఎండలో కార్ పార్కింగ్ చేసినప్పుడు క్యాబిన్ చాలా వేడెక్కిపోతుంది. ఇలాంటి సమయంలో ఏసీ ఆన్ చేసి, సన్‌రూఫ్‌ను తెరిస్తే కారులోని వేడి గాలి బయటికి వెళ్లి, కార్ క్యాబిన్ త్వరగా చల్లబడుతుంది. ఇరుకైన రహదారులు, బిజీ రోడ్లలో సన్‌రూఫ్‌లను వినియోగించకూడదు. వీటిని హైవేలు, వెడల్పాటి రోడ్లపై మాత్రమే వినియోగించాలి.

ఆలోచింపజేస్తున్న రాచకొండ పోస్టు..

సన్‌రూఫ్ ప్రయాణం చాలా ప్రమాదం అంటూ రాచకొండ పోలీసులు అవగాహన కోసం సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్టు అందరినీ ఆలోచింపజేస్తోంది. పిల్లలు, పెద్దలు ఎవరైనా సరే ఆనందం కోసం ఇలా ప్రమాదకరంగా స్టంట్‌లు చేయొద్దంటూ బెంగళూరులో జరిగిన సన్‌రూఫ్ ప్రమాద ఘటన వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో మిలియన్ల సంఖ్యలో ఫాలోవర్లతో ఈ వీడియో హల్‌చల్ చేస్తుంది.



జైలు, జరిమానా..

ర్యాష్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ ఉల్లంఘనల తరహాలోనే బిజీ రోడ్లపై సన్‌రూఫ్ వినియోగాన్ని కూడా తీవ్రమైన నేరంగా పరిగణించాలని ట్రాఫిక్ నిపుణులు సూచిస్తున్నారు. సన్‌రూఫ్‌లతో వ్యక్తిగతంగా ప్రాణాంతకమే కాకుండా రోడ్లపై ఇతర వాహనదారులకు అంతరాయం కలిగిస్తుంది. సన్‌రూఫ్, కారు కిటికీల నుంచి తలను బయటికి వేలాడుతూ ప్రయాణం చేస్తే భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్–281 కింద కేసులు నమోదు చేస్తారు. ఈ కేసులలో ఆరు నెలల వరకు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా లేదా రెండూ విధించవచ్చు. అలాగే ఇతర వాహనాల నుంచి వెలువడే పొగ, దుమ్ము ధూళి నేరుగా ముక్కులోకి వెళ్లి రోగాలకు కారణమవుతాయి.

7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


బెలూన్స్ ఎగరవేస్తున్న అతిథులు

బండ్లగూడ: రాజ బహదూర్ వెంకటరామారెడ్డి తెలంగాణ పోలీస్ అకాడమీలో 7వ ఆల్ ఇండియా ప్రిజన్ డ్యూటీ మీట్–2025 అట్టహాసంగా ప్రారంభమైంది. కరెక్షనల్ సర్వీస్స్ చరిత్రలో ఇది చారిత్రాత్మక ఘట్టమని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ జైళ్ల శాఖ, కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు చెందిన బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్(బీపీఆర్‌అండ్‌డి) సంయుక్తంగా నిర్వహించారు. దేశంలోని 21 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 1222 మంది పోటీదారులు, 144 మంది సిబ్బంది పాల్గొంటున్నారు. ప్రొఫెషనల్, క్రీడలు, సాహిత్యం, కళల విభాగాల్లో మొత్తం 36 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఇది కేవలం పోటీ వేదిక మాత్రమే కాదని.. జైలు సిబ్బందిలో క్రమ శిక్షణ, ప్రతిభ, ఐక్యతకు ప్రతిబింబంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బీపీఆర్‌డీ అదనపు డైరెక్టర్ జనరల్ రవిజోసెఫ్ లోక్కు, రాష్ట్ర డీజీపీ డాక్టర్ జితేందర్, హోం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావులతో కలిసి ఆయన పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా వివిధ అన్ని కన్‌టిజెంట్‌ల మార్చ్‌పాస్ట్ ప్రత్యేక ఆకర్షనగా నిలిచింది. జైళ్ల డీజీ డాక్టర్ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ తెలంగాణకు ఈ వేదిక లభించడం గర్వకారణమన్నారు. రవిగుప్తా మాట్లాడుతూ డ్యూటీ మీట్ అనేది కేవలం పోటీ కాదని, దేశవ్యాప్తంగా జైలు సిబ్బందిలో స్నేహభావం, జ్ఞాన మార్పిడి, ఆవిష్కరణలకు వేదిక అన్నారు. డీజీపీ జితేందర్ మాట్లాడుతూ జైలు సిబ్బంది కనబడని హీరోలని, జైళ్లు శిక్షా గృహాలు కాకుండా పునరావాస, నైపుణ్యాభివృద్ధి కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జైలు సిబ్బంది నిశ్శబ్ద సేవలను కొనియాడుతూ టెక్నాలజీ ఎగ్జిబిషన్, ప్రిజన్ ప్రొడక్ట్స్ స్టాల్స్‌ను ముందు చూపు చర్యగా అభివర్ణించారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ జైలు సిబ్బందిలోని క్రమ శిక్షణ, అంకితభావం ప్రశంసనీయమని తెలంగాణ జైలు శాఖ ఈ ఈవెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. మొదటి రోజు టెక్నాలజీ ఎగ్జిబిషన్, ప్రిజన్ ప్రొడక్ట్స్ స్టాల్స్ ప్రారంభమయ్యాయి. డ్రోన్లు, రోబోటిక్స్, ఏఐ సిస్టమ్స్, స్కానర్లు, కాంట్రాబాండ్ డిటెక్షన్ టెక్నాలజీలు ప్రదర్శనలో ఉంచారు. ఖైదీలు తయారు చేసిన వస్తువులు, రాష్ట్రాల వారిగా ప్రదర్శించారు. ఈ మీట్‌లో వచ్చే మూడు రోజులు పోటీలు, క్రీడలు కళాప్రదర్శనలు, అనుభవాల మార్పిడి జరుగుతాయన్నారు. సెప్టెంబర్ 11న వాలెడిక్టరీ ఫంక్షన్‌తో ముగియనుందన్నారు. ఈ మహోత్సవం సాంప్రదాయం–సాంకేతికత, క్రమశిక్షణ, కరుణ, పోటీ, స్నేహభావం కలయికగా చరిత్రలో నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

కిడ్నాపర్‌గా భావించి.. చితకబాదారు..

- మహిళపై దాడి
- పోలీసులకు అప్పగింత


పోలీసుల అదుపులో మహిళ

గచ్చిబౌలి: చిన్న పిల్లల వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళను చితకబాది పోలీసులకు అప్పగించిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఉదయం మసీద్‌బండలోని అనసూయహిల్స్ వద్ద గుర్తు తెలియని మహిళ అనుమానాస్పదంగా తిరుగుతోంది. అక్కడే ఆడుకుంటున్న చిన్నపిల్లల వద్దకు రాగా తల్లిదండ్రులు ఆమె వివరాలు ఆరా తీశారు. ఆమె సమాధానం చెప్పకపోవడంతో కిడ్నాపర్‌గా భావించి చితకబాదారు. డయల్ 100 ఫోన్ చేసి గచ్చిబౌలి పోలీసులకు అప్పగించారు. ఇటీవల కూలీల పిల్లలను టార్గెట్ చేసుకుని చిన్నారులను కిడ్నాప్‌చేసి విక్రయించిన ముఠాను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తమ పిల్లలకు వద్దకు వచ్చిన మహిళను ఎక్కడ ఉంటావు, నీ పేరేమిటి అని అడిగిన సరైన సమాధానం ఇవ్వకపోవడంతో స్థానికులు కిడ్నాపర్‌గా భావించి చితక బాది పోలీసులు అప్పగించారు. ఆమెను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా తన పేరు పూనమ్ (35) అని, మధ్యప్రదేశ్ అని చెబుతున్నట్లు తెలిపారు. మహిళ పోలీసులు ఆమెను తీసుకెళ్లి సమీప ప్రాంతాల్లో వాకాబు చేసినా ఎక్కడ ఉండేది చూపించ లేదని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆమెను మతిస్థిమితం లేనట్లు భావించి హోంకు తరలించామన్నారు. సదరు మహిళ వద్ద ఎలాంటి గుర్తింపు కార్డు లేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మహిళతో పాటు ఎవరైనా వచ్చారా అనే కోణంలో పరిసర ప్రాంతాలలో సీసీ కెమెరాల పుటేజీని పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

శభాష్.. శ్రీధర్..

- హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్‌వర్మకు హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్ ప్రశంసలు
- వరదల బారి నుంచి మహిళను కాపాడిన శ్రీధర్‌వర్మ
- అభినందనలు తెలిపి ప్రశంసా పత్రం అందజేసిన ఛైర్మన్


హెడ్‌కానిస్టేబుల్ శ్రీధర్‌వర్మకు ప్రశంసాపత్రం అందజేస్తున్న హెచ్‌ఆర్‌సీ ఛైర్మన్ షమీమ్‌అక్తర్

సిటీ కోర్టులు : గతవారం నగరంలో కురిసిన భారీ వర్షాల కారణంగా వరదలో చిక్కుకున్న యువతిని రక్షించి, సురక్షితంగా ఇంటికి చేర్చిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఎస్కార్ట్ వాహనం(సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్) అధికారి హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్‌వర్మను మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ షమీమ్‌అక్తర్ అభినందించారు. ఈనెల 4న సాయంత్రం నగరంలో కురిసిన భారీ వర్షాల కారణంగా బంజారాహిల్స్ రహదారులు జలమయమయ్యాయి. ఆ సమయంలో ఆస్ట్రేలియాలో ఎంబీఏ చదువుతున్న నైనిక (22) రామంతపూర్‌లో కుటుంబ సభ్యులను కలిసేందుకు వచ్చి బంజారాహిల్స్ రోడ్ నెం.3 బస్టాప్ వద్ద వరదలో చిక్కుకుపోయింది. నీటి భయం (హైడ్రోఫోబియా)తో బాధపడుతున్న ఆమె మొబైల్ ఫోన్ పనిచేయకపోవడంతో తల్లిదండ్రులకు కూడా సమాచారం ఇవ్వలేని పరిస్థితి. అదే సమయంలో ఆ రోడ్డులో ఎస్కార్ట్ వాహనంలో వెళ్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీధర్ వర్మ ఆమెను గుర్తించాడు. అప్పటికే పూర్తిగా తడిచి చలికి వణుకుతున్న నైనిక దగ్గరికి వెళ్లి తన జెర్కిన్ ఇవ్వడంతో పాటు నీటిలో నుంచి బయటికి తీసుకొచ్చి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. అయితే ఆ సమయంలో ఇతర వాహనాలు అందుబాటులో లేకపోవడంతో ఉన్నతాధికారులకు సమాచారం అందించి తన ఎస్కార్ట్ వాహనంలోనే ఆమెను ఇంటికి చేర్చాడు. ఈ విషయం పలు పత్రికల్లో ప్రచురితం కావడంతో గుర్తించిన మానవహక్కుల కమిషన్ ఛైర్మన్ షమీమ్ అక్తర్ హెడ్‌కానిస్టేబుల్ పిలిచి అభినందలు తెలియజేస్తూ ప్రశంసపత్రాన్ని అందజేశారు.

బస్సులో తరలిస్తున్న 21.3 కిలోల గంజాయి స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: ఒడిశా నుంచి హైదరాబాద్‌కు బస్సులో గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ రంగారెడ్డి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్టు చేశారు.వారి నుంచి 21.33 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు హయత్‌నగర్ వద్ద ఒడిశా నుంచి వస్తున్న బస్సులో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్, సీఐ బాలరాజు, చంద్రశేఖర్ తదితరులు తనిఖీలు నిర్వహించారు. బస్సులోని లగేజ్ బాక్స్‌లో అనుమానాస్పదంగా ఉన్న రెండు బ్రీఫ్ కేసులను తనిఖీలు చేయగా 21.33 కిలోల గంజాయి లభించింది. ఈ మేరకు గంజాయి తరలిస్తున్న బిరేన్ నాయక్, రాజేందర్ చిట్టిలను అరెస్టు చేశారు. గంజాయిని, నిందితులను హయత్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. ఒడిశాకు చెందిన కుష్బ్ అనే వ్యక్తి ద్వారా హైదరాబాద్‌లోని ఒక వ్యక్తికి గంజాయిని చేరవేసేందుకు తమకు బాధ్యతలను అప్పగించినట్లు నిందితులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 12 లక్షల వరకు ఉంటుందని అంచనా.

కొలను హనుమంతరెడ్డి ప్యానెల్ ఘన విజయం


కొలను హనుమంతరెడ్డి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్ 10–సీ లోని విజయ కో–ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ మేనేజింగ్ కమిటీ (ఎంపీ, ఎమ్మెల్యే కాలనీ) ఎన్నికలు మంగళవారం కాలనీలో,ని కల్చరల్ సెంటర్ హాల్‌లో జరిగాయి. ఈ ఎన్నికల్లో కొలను హనుమంతరెడ్డి ప్యానెల్ ఘన విజయం సాధించింది. ఆయన ప్యానెల్ తరఫున పోటీ చేసిన 11 మందిలో 10 మంది విజయం సాధించారు. కొలను ప్యానెల్‌లో ఎస్సీ, ఎస్టీ కేటగిరిలో నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి విజయం సాధించారు. మాజీ మంత్రి రెడ్యానాయక్‌పై ఆయన గెలుపొందారు. విమెన్ కేటగిరిలో వి.సీతామాధురి, ఓపెన్ కేటగిరిలో పి.గాయత్రీ లత, కే ముత్యంరెడ్డి, పి.రవీంద్ర, వై.రంగారావు, ఎం.సురేందర్‌రెడ్డి, ఎస్.సూర్యప్రకాశరావు, ఏ.సందీప్‌రెడ్డి, కొలను హనుమంతరెడ్డి గెలుపొందారు. రంజిత్‌రెడ్డి ప్యానెల్‌లో అనుపమరెడ్డి ఒక్కరే విజయం సాధించారు. ఇదిలా ఉండగా మొత్తం 304 ఓట్లకు గాను 227 ఓట్లు పోలయ్యాయి. రంజిత్‌రెడ్డి ప్యానెల్, హనుమంతరెడ్డి ప్యానెల్ ఈ ఎన్నికల్లో పోటీ చేశాయి. మేనేజింగ్ కమిటీలో 11 మంది కార్యవర్గ సభ్యులకు గాను ఈ ఎన్నికలు నిర్వహించారు. గెలుపొందిన వారంతా మరో సమావేశం ఏర్పాటు చేసుకుని అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, జనరల్ సెక్రటరీ, ట్రెజరర్‌లను ఎన్నుకోనున్నారు. ఈ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మామ ఎస్.పద్మారెడ్డితో పాటు పలువురు ప్రముఖులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఆర్‌పీఎఫ్ ఎస్సీ నవీన్‌కుమార్


స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

సికింద్రాబాద్: రైళ్లలో మాదక ద్రవ్యాల రవాణాను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు ఆర్‌పీఎఫ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్యూరిటీ కమిషనర్ ఆలకుంట నవీన్‌కుమార్ తెలిపారు. ఇందుకోసం ఆపరేషన్ నార్కో పేరుతో ఆర్‌పీఎఫ్ మొబైల్ బందాలను ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఆయా బృందాల్లో ఆర్‌పీఎఫ్ మహిళా టీమ్‌లను నియమించడం ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఖమ్మం–వరంగల్ మార్గంలో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి రూ.8 లక్షల విలువ చేసే 16 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బోగీలో తనిఖీలు చేస్తున్న పోలీసులకు గుర్తించిన గంజాయి అక్రమ రవాణాదారులు పారిపోయినట్లు తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ప్రత్యేక బృందాలు నిర్వహించిన తనిఖీల్లో రూ.4.17 కోట్ల మాదక ద్రవ్యాలను స్వాధీనం చేసుకుని, 84 మంది రవాణా దారులను రిమాండ్‌కు తరలించామన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, చిత్రంలో మంత్రి వివేక్

రహమత్‌నగర్ : కాంగ్రెస్ శ్రేణులు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అభ్యర్థి విజయానికి కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆయన రహమత్‌నగర్ డివిజన్‌లో రూ. 2.31 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మంత్రి గడ్డం వివేక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరాంనగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు ఆదర్శం కావాలన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. గత పాలకులు హైదరాబాద్ అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలుపించుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్‌రెడ్డి రామ్‌రెడ్డి, జోనల్ కమిషనర్ హేమంత్ సహదేవరావు, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి, తదితరులు పా ల్గొన్నారు.

బెంగళూర్ టు హైదరాబాద్ !

- 'పాత కరెన్సీ' తీసుకువచ్చిన ఇరువురు
- మరో ఇద్దరితో కలిసి మార్పిడికి యత్నం
- చెక్ చెప్పిన ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ టీమ్



సాక్షి, సిటీబ్యూరో: డీమానిటైజేషన్ సమయంలో రద్దయినా పాత కరెన్సీని నగరానికి తీసుకువచ్చింది బెంగళూరుకు చెందిన ముఠాగా తేలింది. అక్కడి నుంచి రూ.1.92 కోట్లు విలువైన రూ.500, రూ.1000 నోట్లు తీసుకువచ్చిన ఇరువురు నగరానికి చెందిన మరో ఇద్దరితో మార్పిడి ఒప్పందం చేసుకున్నారు. 30 శాతం కమీషన్ ప్రాతిపదికన ఈ దందాకు సిద్ధం కాగా సమాచారం అందుకున్న తూర్పు మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు, నారాయణగూడ పోలీసులతో కలిసి చెక్ చెప్పారని అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు వెల్లడించారు. నిందితులు నలుగురినీ అరెస్టు చేసి రూ.1,92,50,000 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

గతంలో అరెస్టైనా అలానే...

బెంగళూరుకు చెందిన ముల్లా అబ్బాస్ అలీ వృత్తిరీత్యా ఎలక్ట్రీషియన్. ఈ పనిలో భాగంగా ఇతడికి అనేక మందితో పరిచయమైంది. వారి ద్వారానే డీమానిటైజేషన్ తర్వాత పాత కరెన్సీ చాలా మంది వద్ద ఉన్నట్లు తెలుసుకున్నాడు. కమీషన్ ప్రాతిపదికన వారు ఆ నోట్ల మార్పిడికి యత్నిస్తున్నట్లు గ్రహించాడు. 2021లో మరికొందరితో కలిసి పాత నోట్లను మార్చడానికి ప్రయత్నించడంతో బెంగళూరులోని పరప్పన అగ్రహార పోలీసులు అరెస్టు చేశారు. ఈ కేసులో బెయిల్‌పై వచ్చిన అబ్బాస్ కొన్నాళ్లు మిన్నకుండిపోయాడు. జైలుకు వెళ్లినా మార్పురాని అతగాడు ఇటీవల మళ్లీ అదే దందా మొదలుపెట్టారు.

కరీంనగర్‌కు చెందిన వ్యక్తితో కలిసి...

కరీంనగర్‌కు చెందిన టి.కృష్ణ మోహన్‌తో అబ్బాస్‌కు పరిచయం ఉంది. ఈసారి కేరళకు వాసి అజీజ్ ద్వారా రూ.1.92 కోట్ల పాత కరెన్సీ సేకరించిన అబ్బాస్ వాటిని మార్పిడి చేయడానికి హైదరాబాద్‌ను ఎంచుకున్నాడు. కృష్ణతో కలిసి రంగంలోకి దిగిన ఇతడు కొన్ని రోజులుగా నగరంలోనే ఉంటున్నాడు. సిటీకే చెందిన రాజ్‌కుమార్, కవితలను సంప్రదించి మార్పిడి కోసం 30 శాతం కమీషన్ ఇవ్వడానికి సిద్ధమయ్యారు. ఈ నలుగురూ నారాయణగూడలోని శాంతి థియేటర్ వద్ద సమావేశం కాగా... దీనిపై ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ నాగార్జున నేతృత్వంలో ఎస్సై ఎస్.కరుణాకర్‌రెడ్డి తమ బృందంతో దాడి చేసి పట్టుకున్నారు. నిందితులను అరెస్టు చేసిన పోలీసులు పరారీలో ఉన్న అజీజ్ కోసం గాలిస్తున్నారు.

అదుపులో ఎక్సైజ్ కానిస్టేబుల్?

డ్రగ్స్ కేసు పేరుతో దందాలు చేస్తున్న ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గతంలో నమోదైన, తాజాగా సమాచారం ఉన్న డ్రగ్స్ కేసుల్లో ప్రమేయం ఉందంటూ ఇతడు దందాలు చేస్తున్నట్లు తెలిసింది. సినీ రంగానికి చెందిన వారితో పాటు వ్యాపారులకు ఫోన్లు చేసి, బెదిరించి, భారీ మొత్తాలు డిమాండ్ చేసినట్లు సమాచారం. దీనిపై సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ మంగళవారం రాత్రి కానిస్టేబుల్‌ను అదుపులోకి తీసుకుంది. ఇతను గతంలోనూ ఇలాంటి నేరాలు చేశాడా? బాధితులు ఎవరు? తదితర అంశాలపై ఆరా తీస్తోంది.

12న సీజ్డ్ గృహోపకరణాల వేలం

హిమాయత్‌నగర్: సీసీఎస్ పోలీసులు ఓ కేసులో సీజ్ చేసిన గృహోపకరణాలను వేలం వేయనున్నట్లు సీసీఎస్ డీసీపీ శ్వేత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఈనెల 12న మధ్యాహ్నం 12గంటలకు హిమాయత్‌నగర్ విజయ డయాగ్నోస్టిక్స్ సెంటర్ పక్కన ఉన్న సీసీఎస్ మాల్ఖానాలో వేలం ఉంటుందని తెలిపారు. ఇతర పూర్తి వివరాల కోసం బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో ఎకనామిక్ అఫెన్స్‌వింగ్ ఏసీపీని సంప్రదించాలని చెప్పారు.

13 నుంచి ఆర్ట్ ఎగ్జిబిషన్

శ్రీనగర్‌కాలనీ: సిమ్‌సమ్ ఆర్ట్స్, ఆర్ట్ క్రాఫ్ట్ గలేరియా, ఎస్‌సీఎఫ్‌ఏబీ ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దేశ, విదేశాలకు చెందిన ఆర్టిస్ట్స్ చార్‌కోల్, పెన్సిల్, పాస్టల్స్, వాటర్‌కలర్స్, కాన్వాస్, ఆయిల్ పెయింటింగ్‌తో పాటు పలు రకాల పెయింటింగ్స్‌ను ప్రదర్శిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రముఖ ఆర్టిస్ట్స్, బహుముఖ ప్రజ్ఞాశాలులు డాక్టర్ బాబురావు నాడోని, డాక్టర్ ఆశారాణి బాడోని ప్రారంభిస్తారని తెలిపారు.

సెక్రటేరియట్‌లో అర్హులకే జూ.అసిస్టెంట్ పోస్టులివ్వాలి

హిమాయత్‌నగర్: సెక్రటేరియట్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టులను అర్హులైన అభ్యర్థులకే ఇవ్వాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శివ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... 2022లో అప్పటి ప్రభుత్వంలో సోమేశ్ కుమార్ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు విడుదల చేసిన నోటిఫికేషన్ కింద 42 బ్యాక్‌లాగ్ జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఉన్నాయని అన్నారు. అయితే ఈ పోస్టులను అర్హత లేని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొంత మందికి ఇచ్చేందుకు ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని తెలిపారు. ఈ నియామక ప్రక్రియలో ఏవైనా అవకతవకలు జరిగితే విద్యార్థి సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

'నా సస్పెన్షన్‌పై కోర్టు స్టే ఇచ్చింది'

హిమాయత్‌నగర్: తాను నకిలీ సర్టిఫికెట్లు సమర్పించానని, నకిలీ న్యాయవాదినని, బార్ కౌన్సిల్ నుంచి సస్పెండ్ చేశారంటూ హైడ్రా ఇచ్చిన ప్రకటన వాస్తవం కాదని హైకోర్టు న్యాయవాది సుంకర నరేష్ అన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఆ సస్పెన్షన్‌పై హైకోర్టు స్టే ఇచ్చిందని వివరణ ఇచ్చారు. తాను తుక్కుగూడలో ఓ నిర్మాణ సంస్థపై పోరాటం చేస్తున్నానని తెలిపారు. తన క్లయింట్ చైతన్యరెడ్డి ప్రమేయం లేకుండానే ఆమె ఆరోపించినట్లుగా తనతో పాటు మరో ఇద్దరిపై హైడ్రా తప్పుడు ఫిర్యాదు చేసిందని తెలిపారు. అజ్ఞాతంలో ఉన్న చైతన్యరెడ్డి బయటికి వస్తే నిజానిజాలు బయట పడతాయన్నారు.

రోడ్ల పనులు షురూ..!

- వర్షాలు ఆగడంతో రహదారుల పనులను మొదలెట్టిన అధికారులు
- పలుచోట్ల నాలా ప్రహరీల నిర్మాణం
- ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్న ఇంజినీర్లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నం–1లోని మహేశ్వరి చాంబర్ వద్ద ఇటీవల కురిసిన కుండపోత వర్షాలకు నాలా పైకప్పు కూలి భారీ గుంత ఏర్పడింది. నాలా పైకప్పు నిర్మాణం కోసం రూ.65 లక్షలు మంజూరయ్యాయి. కొంతకాలంగా వర్షాలు కురుస్తుండడంతో ఈ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. గత 5 రోజుల నుంచి వర్షాలు ఆగిపోవడంతో జీహెచ్‌ఎంసీ సర్కిల్–18 ఇంజినీర్లు ఇక్కడ నిర్మాణ పనులు ప్రారంభించారు.

◆ జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ బసవతారకనగర్ బస్తీలో ఇటీవలి వరదలకు నాలా ప్రహరీ దెబ్బతినడమే కాకుండా నాలాలో నుంచి పూడికతీత పనుల్లో భాగంగా గోడ కూలిపోయింది. దీంతో ఇక్కడ రూ.40 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

◆ బంజారాహిల్స్ రోడ్ నం–11లోని ఉదయ్‌నగర్ బస్తీలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నాలా ప్రహరీ దెబ్బతినడంతో పాటు రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో ఇక్కడ రూ.10 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మొదలయ్యాయి.

◆ రోడ్‌నం–12లోని వెంగళరావు బస్టాపు ఎదురుగా మాజీ మంత్రి కేఈ కృష్ణమూర్తి ఇంటిని ఆనుకుని ఎన్‌బీటీనగర్‌కు వెళ్లే సీసీరోడ్డు పనులు కూడా వర్షాలు నిలిచిపోవడంతో ప్రారంభించారు.

◆ ఇటీవల ఆగకుండా కురిసిన భారీ వర్షాలకు ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని దాదాపు అన్ని డివిజన్లలో నాలాలతో పాటు రోడ్లు కూడా దెబ్బతిన్నాయి. అయితే ఈ పనులు చేయడంలో వరద, కుండపోత వర్షాలు అడ్డంకిగా మారి ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి.

◆ చాలాచోట్ల నాలా ప్రహరీలు కూలిపోవడంతో పాటు స్లాబ్‌లు కూడా దెబ్బతిన్నాయి. దీంతో నిధులు మంజూరు చేసిన అధికారులు ఈ పనులు ప్రారంభిద్దామని అనుకునేంతలోనే వరుసగా 10 రోజుల పాటు వర్షాలు పనులకు ఆటంకంగా మారాయి.



ఫిలింనగర్‌లోని బసవతారకనగర్‌లో మొదలైన నాలా ప్రహరీ నిర్మాణ పనులు

◆ ఇటీవలనే వర్షాలు ఆగిపోవడంతో గత రెండు రోజుల నుంచి ఇంజినీర్లు పనులు ప్రారంభించారు. పలుచోట్ల ప్రారంభించిన సీసీ రోడ్లు కూడా వర్షాల వల్ల అర్ధాంతరంగా ఆగిపోయాయి.

◆ తాజాగా వర్షాలు తెరిపినివ్వడంతో ఆగిపోయిన పనులు కూడా మొదలయ్యాయి. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్ల పరిధిలో 28చోట్ల సీసీరోడ్లు పనులు ప్రారంభం కాగా, మరో ఆరు చోట్ల నాలా పనులు కూడా ప్రారంభించారు.



బంజారాహిల్స్ రోడ్ నం-11 ఉదయ్‌నగర్‌లో మొదలైన సీసీ రోడ్డు పనులు

సుమారు రూ.15 కోట్ల వ్యయంతో నియోజకవర్గంలో ఈ పనులు జరుగుతున్నాయి. వర్షాలు మళ్లీ పడకపోతే నిధులు మంజూరై ఎదురుచూస్తున్న పనులకు కూడా మోక్షం లభించనుంది.

◆ నియోజకవర్గంలో 33 చోట్ల రోడ్లు, వరదనీటి కాలువ నిర్మాణ పనులకు నిధులు మంజూరై ఇటీవలి వర్షాలతో పనులు ఇంకా మొదలుకాలేదు.

◆ ఆ పనులకు కూడా రూ.13కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుత పనులు పూర్తికాగానే కొత్తగా విడుదలైన నిధులతో పనులు ప్రారంభించేలా ఇంజినీర్లు కార్యాచరణ రూపొందించుకున్నారు.

◆ నియోజకవర్గ పరిధిలో చాలాచోట్ల రోడ్లు దెబ్బతిని స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతల రోడ్లపై నరకం చవిచూస్తున్నారు.

◆ ప్రస్తుతం ప్రారంభమైన పనులతో కొంతమేర స్థానికులకు ఉపశమనం కలగనుంది.

లంచాలపై ఉక్కుపాదం మోపాలి



సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి బి.వి.గోపీనాథ్

పంజగుట్ట: సామాన్యుడు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న చిన్నచిన్న విషయాల్లో లంచాలు తీసుకోవడంపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి బి.వి.గోపీనాథ్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సిటిజన్ ఫోరం తెలంగాణ, జన్ సేవా సంఘ్ హైదరాబాద్, అభిప్రాయ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. కాళేశ్వరం లాంటి పెద్దపెద్ద ప్రాజెక్టుల్లో జరిగిన అవినీతిని వేరని, కాని ప్రతీ రోజు ఒక సామాన్య మానవుడు లంచాల వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. మండల్ కార్యాలయం, ఆర్‌డీవో కార్యాలయంలో ఒక కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, రేషన్ కార్డు పొందాలన్నా లంచాలు ఇవ్వాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా, రాష్ట్రస్థాయి ప్రధానకార్యాలయాల్లో ఏ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఓడీ ఉంటాడో అతన్ని అక్కడ జరిగే అవినీతికి పూర్తి బాధ్యుడిని చేయాలని ప్రతీ 15 రోజులకు ఒకసారి రివ్యూ చేసి అవినీతి అధికారులపై చర్యలు తీసుకునేలా అతనికి అధికారం ఇవ్వాలని సూచించారు.

◆ ఏసీబీ రైడ్స్ చేస్తారు చిన్నచిన్న వారిని పట్టుకుంటారని, పెద్దపెద్ద తిమింగళాలను పట్టుకోరని, పట్టుకున్న వారిని కూడా కొన్ని రోజులు సస్పెండ్ చేసి తిరిగి అదే పోస్టింగ్ ఇస్తారని ఇది సరికాదన్నారు. ప్రభుత్వ డిపార్ట్‌మెంట్‌ల గూర్చి ప్రజలు ఏమనుకుంటున్నారో ప్రతీ 15 రోజులకు ఒకసారి రివ్యూ చేయాలని జనాల అభిప్రాయాలు తీసుకుని దాని ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యాలయాల్లో ఏ ఫైల్ ఎక్కడ ఆగిందో దానికి కారణం ఏమిటో కనుక్కోవాలని, ఎందుకు ఫైల్ ఆగిందో సరైన జవాబు లేకపోతే సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

◆ ప్రజాదర్బార్‌కు ఎంతో మంది ఎంతో ఆశతో వస్తారని.. ఫిర్యాదులు ఇస్తారని.. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి.. ఎన్నింటిని పరిష్కరించాం.. ఎంత సమయంలో తీసుకుంటున్నామో. అనే విషయాలపై ఆడిట్ చేయాలన్నారు. ఇదే విషయంపై ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రికి లేఖలు రాశామని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆయా సంఘాల ప్రతినిధులు రాజీవ్‌దూబే, మదన్‌లాల్, సీతారామ ఠాకూర్, వీడీ చౌదరి, విజయలక్ష్మి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా చూడాలి



బాలల హక్కుల కమిషన్ సభ్యులతో సుశేన ఫౌండేషన్ ప్రతినిధులు

వెంగళరావునగర్: రాష్ట్రంలోని ప్రతి శిశువుకు తప్పనిసరిగా తల్లిపాలు అందేలా ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థలు బాలల హక్కుల కమిషన్ సభ్యులు తెలియజేశారు. వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్‌లోని బాలల హక్కుల కమిషన్ కార్యాలయంలో మంగళవారం సుశేన హెల్త్ ఫౌండేషన్ ప్రతినిధులు కమిషన్ సభ్యులను కలిసి వివిధ అంశాలపై చర్చించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో 2016–17లో ధాత్రి మదర్స్ మిల్క్ పేరుతో మధ్యప్రదేశ్‌లో మదర్స్ మిల్క్ బ్యాంకును స్థాపించామన్నారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేశామని, ఖమ్మం, సిద్ధిపేట జిల్లాల్లో మిల్క్‌బ్యాంక్ పర్యవేక్షణ జరుగుతుందని తెలియజేశారు. ప్రస్తుతం నీలోఫర్ ఆసుపత్రిలో మదర్స్ మిల్క్ బ్యాంకు ప్రారంభించామన్నారు. ప్రతిరోజు100 కంటే ఎక్కువ శిశువులకు తల్లిపాలను ఈ సంస్థ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి స్పందించిన కమిషన్ సభ్యులు వారిని అభినందించారు. శిశువిహార్‌లోని చిన్నారులకు కూడా ధాత్రి మదర్స్ మిల్క్ బ్యాంకు ద్వారా అమ్మపాలను సరఫరా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు వచన్‌కుమార్, వందనగౌడ్, అపర్ణ, ప్రేమలత అగర్వాల్, సుశేన హెల్త్ ఫౌండేషన్ డైరెక్టర్ కాశీనాథ్, కార్యదర్శి సంతోష్, సీపీడీఓలు రమణచారి, షబనా, చంద్రనేశ్వరి తదితరులు ఉన్నారు.

సామాన్యులు వినియోగించే లిఫ్ట్‌లపై జీఎస్టీ తగ్గించాలి

పంజగుట్ట: సామాన్య, మధ్యతరగతి వారు వినియోగించే లిఫ్ట్‌లపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని తెలంగాణ ఎలివేటర్ అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా అవినాష్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లగ్జరీ అపార్ట్‌మెంట్స్, విల్లాస్‌లకు తగ్గించకున్నా, సామాన్య ప్రజలు వినియోగించే వాటికి మాత్రం తగ్గించాలని ఆయన కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ జనార్దన్, సెబీ మాట్లాడుతూ.. లిఫ్టులు ఇప్పుడు లగ్జరీ వస్తువులు కాదని, ఇంట్లో వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు ఉంటే అత్యవసర యంత్రంగా మారిందన్నారు. ఒక్కోదానికి రూ.8 లక్షల వరకు ఖర్చవుతోందని, 18 శాతం జీఎస్టీతో మరో రూ.లక్షన్నర ట్యాక్స్ పడుతోందని తెలిపారు. దీంతో చిన్న, మధ్య తరగతి గృహనిర్మాణ దారులు వెనకడుగు వేస్తున్నారని చెప్పారు.

జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గులాబీ జెండా మరోసారి ఎగురవేయాలని.. ఆ దిశగా నేతలు, కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ఇన్‌చార్జ్‌గా ఉన్న ఆయన ఎర్రగడ్డలోని షంషీర్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం బీఆర్‌ఎస్ బూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు అందించిన పథకాలను మరోసారి తెలియజేయాలన్నారు. మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి ఈ ఉప ఎన్నికలో ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న విధ్వంసకర పనులను ప్రజలకు వివరించాలన్నారు. మాగంటి గోపీనాథ్‌కు నివాళిగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నేతలు డి.సంజీవ, షరీఫ్ ఖురేషి, కూకట్‌పల్లి నియోజకవర్గ కార్పొరేటర్లు, సీనియర్ నేతలు పాల్గొన్నారు.

నిమ్స్‌కు రికార్డు స్థాయిలో రోగులు

లక్డీకాపూల్: నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో మంగళవారం అత్యధిక అవుట్ పేషెంట్ (ఓపీ) హాజరు నమోదైందని నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఇందులో ప్రత్యేక వైద్య విభాగాలు, ఇన్ పేషెంట్ (ఐపీ), ఎమర్జెన్సీ మెడికల్ డిపార్ట్‌మెంట్ (ఈఎండీ) సేవలు కూడా ఉన్నాయి. ఈ మేరకు మంగళవారం ఒక్కరోజే 4,055 మంది రోగులు నిమ్స్‌లో వైద్య సేవలు పొందారు. కేవలం ఔట్‌పేషెంట్ విభాగంలోనే రికార్డుస్థాయిలో 3888 మంది నమోదు కావడం విశేషం. వివిధ విభాగాల వారీగా కార్డియాలజీ (278), క్లినికల్ ఇమ్యునాలజీ, రుమటాలజీ (397), జనరల్ మెడిసిన్ (345), నెఫ్రాలజీ (418), న్యూరాలజీ (363), ఆర్థోపెడిక్స్ (347), ఇన్‌పేషంట్ (265) విభాగాల్లో రికార్డు స్థాయి హాజరు నమోదైంది. అదనంగా 60మంది రోగులు అత్యవసర విభాగంలో చికిత్స పొందారని ప్రొఫెసర్ బీరప్ప పేర్కొన్నారు.

ఖాళీ చేయాలంటూ ఫర్నిచర్ ఎత్తుకెళ్లి..

వెంగళరావునగర్: ఆఫీసు ఖాళీ చేయాలంటూ ప్రైవేట్ సంస్థలో కొందరు అక్రమంగా ప్రవేశించి ఫర్నిచర్ ఎత్తుకెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎన్.రమేష్‌బాబు కొంతకాలంగా వెస్ట్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలోని మూర్తి మ్యాన్షన్‌లో సిరి టిక్నాలజీ పేరుతో సంస్థ నిర్వహిస్తున్నాడు. వాచ్‌మెన్ శ్రీను, అతని కుమారుడు నరేంద్ర ఇరువురూ రమేష్‌బాబుపై కక్ష పెంచుకుని ఇల్లు ఖాళీ చేయాలని వేధిస్తూ గూండాలతో బెదిరిస్తున్నారు. కాగా జీపీఏ హోల్డర్‌ను అంటూ మల్లికార్జునరెడ్డి కూడా ఖాళీ చేయమని బెదిరించేవాడు.

◆ ఈ క్రమంలో ఈనెల 7వ తేదీ గుర్తు తెలియని వ్యక్తులు సీసీటీవీని నిలిపివేసి తన సంస్థలోకి చొరబడి విలువైన ఫర్నిచర్‌ను తీసుకెళ్లారు. విషయంపై రమేష్‌బాబు మధురానగర్ పీఎస్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. మూర్తి కుమార్తె స్వర్ణలత అనుమతితో మూర్తి మరణించే వరకు ఆయన బాగోగులు చూసుకున్నట్టు తెలిపాయజేశాడు. చోరీ జరిగిన సమయంలో మల్లికార్జునరెడ్డి అక్కడే ఉన్నాడని అతడితో కలిసి మూర్తి కుమార్తె స్వర్ణలత తన వస్తువుల దొంగతనం, అతిక్రమణకు పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం

వెంగళరావునగర్: విధులకు వెళ్లిన యువతి అదృశ్యమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జవహర్‌నగర్‌లో నివసించే దినసరి కూలీ రామారావుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె దివ్యకు 2021లో ఒరిస్సాకు చెందిన వ్యక్తితో పెళ్లి చేశాడు. 2025లో ఆమె అతని నుంచి విడిపోయి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. నాటి నుంచి బంజారాహిల్స్‌లోని ప్రైవేటు సంస్థలో పని చేస్తోంది. ఈనెల 3న దివ్య విధులకు వెళ్లి తిరిగి రాలేదు. రామయ్య మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



వెంగళరావునగర్: శ్రీనగర్‌కాలనీ ప్రధాన రహదారిలో ఓ వ్యక్తి పడి ఉన్నాడని స్థానికులు మధురానగర్ పోలీసులకు సమాచారం అందించారు. వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అతడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని పేర్కొన్నారు. భిక్షాటన చేస్తూ ఉంటాడని తెలిపారు. అనంతరం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. వనపర్తి ప్రాంతానికి చెందిన పల్లె భాస్కర్ కొంతకాలంగా ప్రైవేట్ జాబ్ చేస్తూ మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ క్రమంలో ఈనెల 7న రాత్రి తన ద్విచక్ర వాహనాన్ని హాస్టల్ ఎదుట పార్కింగ్ చేశాడు. ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

తెలంగాణ విమోచనోద్యమం.. కాళోజీ కవిత్వం

ఘనంగా కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు



కాళోజీకి నివాళులు అర్పిస్తున్న అంబేద్కర్ వర్సిటీ ఉద్యోగులు

బంజారాహిల్స్: తెలంగాణ విమోచనోద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొని, జైలు శిక్షను అనుభవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు అని కేంద్ర సాహిత్య అకాడమీ (న్యూఢిల్లీ) జనరల్ కౌన్సిల్ సభ్యులు, సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్వీ.సత్యనారాయణ పేర్కొన్నారు. పద్మవిభూషణ్, తెలంగాణ వైతాళికులు కాళోజీ నారాయణరావు 111వ జయంతిని పురస్కరించుకుని అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో మంగళవారం స్మారకోపన్యాసం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆచార్యులు సత్యనారాయణ 'తెలంగాణ విమోచనోద్యమం–కాళోజీ కవిత్వం'అనే అంశంపై ప్రసంగించారు. కాళోజీ తన జీవితం మొత్తం సమాజాభివృద్ధికే పాటుపడ్డారని, తాను నమ్ముకున్న సిద్ధాంతం కోసమే చివరి వరకు పరితపించారన్నారు. తన ముక్కుసూటి రచనలతో సమాజాన్ని చైతన్య పర్చారన్నారు.

◆ తెలంగాణ భాష, యాసతో పాటు ప్రజలు వాడే మాండలికాలనే ఉపయోగించేవారని పేర్కొన్నారు. కాళోజీ నిరాడంబర జీవితం భవిష్యత్తు తరాలకు ఆదర్శనీయమన్నారు. సామాన్య ప్రజలను చైతన్యవంతులుగా చేయడం, ప్రజల భాషలోనే సాహిత్య రచనలు చేయడం ఒక్క కాళోజీకే చెల్లిందన్నారు. తెలంగాణలో వచ్చిన ఎన్నో సామాజిక ఉద్యమాల్లో పాల్గొన్న ఘనత కూడా ఒక్క కాళోజీకే సాధ్యమైందన్నారు. తెలంగాణ ఉద్యమంలో కాళోజీ రచనలకు, భాషకు ప్రాముఖ్యత ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రజా సమస్యలే తన సమస్యలుగా కవిత్వం రాసేవారని పేర్కొన్నారు.

◆ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ పుష్పాచక్రపాణి మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో తెలంగాణ వైతాళికుల జయంతి సందర్భంగా స్మారకోపన్యాసాలు ఏర్పాటు చేస్తూ వారి జీవిత విశేషాలు భవిష్యత్ తరాలకు పరిచయం అయ్యేలా పరిశోధకులకు, చరిత్రకారులకు ఉపయోగపడేలా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ వైతాళికుల్లో కాళోజీ ముందు వరుసలో నిలుస్తాయని, తన జీవితకాలం తెలంగాణ భాష, తెలంగాణ యాస, ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం అనే ధ్యాసనే ఉండేదని ఆమె గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.రజని, రిజిస్ట్రార్ ఎల్వీకేరెడ్డి, ఆనంద్‌పవార్, వడ్డాణం శ్రీనివాస్, పల్లవీ కాబ్దే తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవన్‌లో...

ఫిలింనగర్: తెలంగాణ అస్తిత్వం, సంస్కృతి, భాష కోసం పోరాడిన ప్రజాకవి, మహాకవి కాళోజీ నారాయణరావును స్మరించుకుంటూ మంగళవారం ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన కాళోజీ జయంతి కార్యక్రమంలో జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో పాటు బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో విచ్చేసి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. తెలంగాణ జాతికి ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.



కాళోజీకి నివాళులర్పిస్తున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ మురళీకృష్ణ, అధికారులు

కాళోజీ ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయులు

వెంగళరావునగర్: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణా ఉద్యమకారుడు కాళోజీ నారాయణరావు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయుడని కమాండెంట్ మురళీకృష్ణ తెలియజేశారు. యూసుఫ్‌గూడ ఫస్ట్ బెటాలియన్‌లో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఉద్యమ ప్రతిధ్వనిగా కాళోజీని పిలుస్తారని చెప్పారు. 1992లోనే ఆయన పద్మ విభూషణ్ పురస్కారం పొందారని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ టి.నరేందర్‌సింగ్, అసిస్టెంట్ కమాండెంట్స్ రాంబాబు, అప్పారావ్, భాస్కర్, కేవీవీ ప్రసాద్, నర్సింహా, ఆర్ఐలు, ఆర్‌ఎస్ఐలు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్మనీకి 18 మంది ఎలక్ట్రీషియన్లు

బంజారాహిల్స్: తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్‌పవర్ పథకం కింద శిక్షణ పొందిన 18 మంది ఎలక్ట్రీషియన్లు జర్మనీలో ఉద్యోగానికి ఎంపికయ్యారని కార్మిక, ఉపాధి కల్పన శాఖమంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం సచివాలయంలో జర్మనీలో ఉద్యోగం చేయడానికి ఎంపికైన 18 మంది ఎలక్ట్రీషియన్లకు ఆయన ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇండో యూరో సింక్రోనైజేషన్(ఐఈఎస్) సంస్థ వీరికి ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చిందన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసుకొని అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణులవడంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు నెలకు రూ.2.6లక్షల వేతన ప్యాకేజీని పొందనున్నారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇతర దేశాల్లో సైతం మన యువత పనిచేసేలా వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తోందని పేర్కొన్నారు. త్వరలోనే ఇండో యూరో సింక్రోనైజ్ సంస్థ కార్యకలాపాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇండో యూరో సింక్రోనైజేషన్ సీఈవో డా. బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రశంస పత్రాలు అందజేస్తున్న మంత్రి వివేక్

తెలుగు భాషా దినోత్సవం



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రంగురంగుల సంప్రదాయ దుస్తులతో అలంకరించుకున్న విద్యార్థులు తెలుగు సంస్కృతి సారాంశాన్ని ప్రతిబింబించే పాటలు, నృత్యాలు, స్కిట్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు మురళీముకుంద్, డైరెక్టర్ ఎం.వరలక్ష్మిలు కార్యక్రమాన్ని వీక్షించి ఆనందించారు. ప్రిన్సిపాల్ కాంచనవల్లి మాట్లాడుతూ.. తెలుగు భాషా దినోత్సవం ద్వారా మన భాషా మూలాలను గౌరవించడమే కాకుండా మన సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందిస్తూ, మన సంప్రదాయాలను కాపాడుకునే బాధ్యతను మనకు గుర్తుచేస్తుందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన తెలుగు భాషకు చేసిన సేవలను కొనియాడారు.

లైసెన్స్‌డ్ సర్వేయర్స్ అభ్యర్థులకు న్యాయం చేయాలి

పంజగుట్ట: తెలంగాణ లైసెన్స్‌డ్ సర్వేయర్స్ సిస్టమ్ (ఎల్ఎస్ఎస్) శిక్షణ, పరీక్షల్లో గందరగోళం జరిగిందని దీనిపై వెంటనే కమిటీ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఎల్ఎస్ఎస్, లైసెన్స్‌డ్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు నరేష్ చాగంటి కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ .. ప్రభుత్వం భూభారతి పథకంలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లైసెన్స్‌డ్ సర్వేయర్స్ సిస్టమ్ శిక్షణ, పరీక్షలు అప్రెంటిషిప్ చుట్టూ అన్యాయం కనిపిస్తోందని అన్నారు. నోటిఫికేషన్ ప్రకారం రూ.2,500 నుంచి రూ.10వేల వరకు ఫీజులు చెల్లించి సుమారు 10వేల మందికి పైగా శిక్షణకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వారికి శిక్షణ పేరుతో అరకొర వసతులు, ట్రైనర్లు లేకుండానే పరీక్షలు నిర్వహించిందన్నారు. దీంతో పాస్ పర్సంటేజ్ కేవలం 30 శాతం కన్నా తక్కువ వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షణలోని లోపాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేస్ మార్కులు లేదా రీ ఎగ్జామ్ పెట్టాలని డిమాండ్ చేశారు.

పోషకాహార వారోత్సవాలు

లక్డీకాపూల్: జాతీయ పోషకాహార వారోత్సవాల సందర్భంగా ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఏఐఎన్‌యూ) బంజారాహిల్స్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు ప్రత్యేక డైట్ కన్సల్టేషన్లు, కిడ్నీలు ఆరోగ్యంగా ఉండడానికి ఏమేమి తినాలో వాటి రెసిపీలపై అగాహన కల్పించారు. ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహాలను ఆరోగ్యకరమైన ఆహారంతో ఎలా అధిగమించాలో కూడా రోగులకు వివరించారు. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే సమతుల పోషకాహారం ముఖ్యమని సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంట్ ఫిజిషియన్ డా. శ్రీకాంత్ గుండ్లపల్లి పేర్కొన్నారు. తినే ఆహారం నేరుగా కిడ్నీల పనితీరుపై ప్రభావం చూపుతుందన్నారు. ముఖ్యంగా దీర్ఘకాల కిడ్నీ వ్యాధి(సీకేడీ), అధిక రక్తపోటు, మధుమేహం లాంటివి ఉన్నవాళ్లు ఆహారం విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

సాక్షి సిటీ ప్లస్
10
హైదరాబాద్, బుధవారం, 10, సెప్టెంబర్, 2025



ఆ ఒక్క క్షణం..!

క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు

- చిన్న చిన్న కారణాలతో తీవ్రమైన నిర్ణయాలు
- ఆర్థిక ఇబ్బందులు, బ్రేకప్‌లు, కుటుంబ కలహాలే అధికం
- ఒత్తిడి, ఒంటరితనం కూడా ఆత్మహత్యలకు ఓ కారణం
- ఆత్మహత్యల నివారణకు పలు ఎన్‌జీఓల కృషి
- చీకట్లో చిరుదీపాల్లా వెలుగులు పంచుతున్న కాల్‌సెంటర్లు
- పరిష్కార మార్గాలను చూపుతూ, మేమున్నామంటూ భరోసా
- ఆవేశంలో నిర్ణయాలు వద్దంటున్న సైకాలజిస్టులు, కౌన్సెలర్లు

ఎప్పుడు ఒకలా ఉండదు.. ఎక్కడ ఆగిపోనివ్వదు.. యెద రేముందో చెప్పదు కదిలే సమయం.. నీడలా జ్ఞాపకం వదలదు.. తోడుగా ఏ నిజం నడవదు.. ఒంటిగా సాగటం తప్పదు జరిగే పయనం.. నీతోనె మొదలైందా.. నీతోనె ముగిసిందా.. ఇదే కదా కోరిందని.. వేరే ఇంకేం కావాలని.. అన్నామంటే ఈనాటికి రేపంటూ ఉంటుందా.. ఇవ్వాళ ఎంతో బాగుందని అయినా ఏదో లోటుందని.. ఇంకా ఏదో కావాలని అనుకోని రోజుందా.. కలకే మన ఈ గమనం.. అని 'ఊపిరి' చిత్రంలో సీతారామశాస్త్రి చెప్పినట్లు.. ఆ ఒక్క క్షణం దాటితే అందమైన లోకం మనకళ్లముందుంటుంది. రోజులోనే కొంత సమయం చీకటి.. కొంత సమయం వెలుతురు ఉంటుంది.. అంతమాత్రానికే భయపడిపోతామా..? అక్కడే ఆగిపోతామా? అలాంటిది జీవితంలోనూ చీకటి వెలుగులు సహజమే.. అలాంటి అందకారాన్ని అధిగమిస్తేనే కదా వెలుతురు లాంటి భవిష్యత్తును చూడగలం.. జీవితంలో ఓడిపోయామనో.. బ్రేకప్ అయ్యిందనో.. లేదా కుటుంబంలో ఏదో సమస్య తలెత్తిందనో.. తొందరపాటు నిర్ణయం తీసుకుంటే ఎలా? అంటున్నారు పలువురు కౌన్సెలర్లు.. వయసుతో పనిలేకుండా ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు నగరంలోనూ, దేశంలోనూ పలు ఎన్జీఓలు కృషిచేస్తున్నాయి.. ఆత్మహత్యల నివారణకు తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి.. సెప్టెంబర్ 10 ప్రపంచ ఆత్మహత్యల నివారణా దినం సందర్భంగా ఈ కథనం..

- సాక్షి, సిటీబ్యూరో/ రాంగోపాల్‌పేట్



చీకట్లో.. చిరుదీపం..

- కొండంత అండగా నిలబడుతున్న రోష్నీ
- 28 ఏళ్లుగా వేలాది మందికి కౌన్సెలింగ్

వివిధ సామాజిక మాధ్యమాలు, ప్రసార సాధనాల ద్వారా రోష్నీ అనేకమంది బాధితులకు చేరువయ్యింది. 1997లో నలుగురితో ప్రారంభమైన సంస్థ ప్రస్తుతం 70 మంది సుశిక్షితులైన వాలంటీర్లతో నిత్యం కౌన్సెలింగ్ ఇస్తూ అనేక మందికి అండగా నిలుస్తోంది. వీధినాటకాలు, కరపత్రాలు, ప్లకార్డుల ప్రదర్శనలతో 28 ఏళ్లుగా వేలాది మందికి అండగా.. ప్రజల్లో అవగాహన కల్పిస్తోంది. పూర్తిగా డిప్రెషన్‌లోకి వెళ్లిన వారి కోసం సైకాలజిస్టులు, సైక్రియాట్రిస్టులతో మానసిక చికిత్స, ఉచితంగా మందులు అందిస్తోంది. ప్రతి శుక్రవారం రామకృష్ణ మఠంలో సెషన్స్ నిర్వహిస్తోంది. 040-6620 2000, 040-6620 2001 రోష్నీ కౌన్సెలింగ్ సెంటర్ టోల్‌ఫ్రీ.



'22 ఏళ్ల మహిళ.. రైల్వే పట్టాలపై ఆత్మహత్యకు సిద్ధమైంది. ఫోన్‌లో స్నేహితురాలు వద్దని వారించి.. రోష్నీకి ఫోన్ చేయమని బతిమాలింది. దీంతో ఫోన్ చేయగా 'అమ్మా నీ ప్రాణం నీ ఇష్టం.. కానీ నీ ఆత్మహత్యను రెండు నిమిషాలు వాయిదా వేసుకో.. నా మాటలు విన్న తర్వాత నీ ఇష్టం..' అంటూ కన్విన్స్ చేసింది. లివింగ్ రిలేషన్‌షిప్‌లో బాబు పుట్టిన తర్వాత ఆ వ్యక్తి వదలి పెట్టాడని.. ప్రస్తుతం అనారోగ్య సమస్యలు వచ్చాయని.. ఎంతో ఇష్టమైన తన ఐదు నెలల బాబుని ఇంట్లో అమ్మ దగ్గర వదిలేశానని చెప్పింది. ఆ తర్వాత కౌన్సెలర్ మాటలతో ఆత్మహత్య ఆలోచన విరమించుకుంది.'

'చున్నీతో ఉరేసుకుంటున్నా.. మీరెలా కాపాడతారో కాపాడండి.. అంటూ 17 ఏళ్ల ఇంటర్ విద్యార్థి రోష్నీకి కాల్ చేసి చాలెంజ్ విసిరాడు. గర్ల్‌ఫ్రెండ్ ఇంకొకరితో తిరుగుతోందని, తనను పట్టించుకోవడం లేదని మనసులో బాధను బయటపెట్టాడు.' కనీ పెంచిన తల్లిదండ్రులు ముఖ్యమో.. రెండేళ్ల క్రితం పరిచయమైన అమ్మాయి ముఖ్యమో.. ఆలోచించుకో? ప్రేమించడానికి ఇంకొకరు దొరకొచ్చు.. నీ ప్రాణం పోతే మళ్లీ వస్తుందా?.. అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చేయడంతో పునరాలోచనలో పడ్డాడు..

ఇలా.. ఆర్థిక ఇబ్బందులతో ఒకరు.. కుటుంబ కలహాలతో మరొకరు చెప్పుకుంటూ.. కొన్ని వేల మందికి అండగా నిలిచింది రోష్నీ..

పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని విద్యార్థులు, ఉద్యోగం రాలేదని నిరుద్యోగులు, వివాహం కాలేదని యువత, పని ఒత్తిడి తట్టుకోలేకపోతున్నామని ఉద్యోగులు, రిలేషన్‌షిప్‌లో అనుమానాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు.. ఇలా చిన్నపాటి సమస్యలకు మనసు చిన్నబుచ్చుకుంటున్నారు. గోరంత సమస్యను కొండంతగా భావించి తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. చిన్నిపాటి కారణాలకే ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బంగారు భవిష్యత్తును అర్థాంతరంగా ముగించేస్తున్నారు. ప్రపంచంలో సమస్యలు మనకు మాత్రమే కాదు.. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక రూపంలో ఉంటూనే ఉంటాయని భావించి ఆ ఒక్క క్షణం తొందరపడకుండా ఉంటే.. మన భవిష్యత్తును మనమే తీర్చిదిద్దుకోవచ్చు.. మనలోని బాధను కావాల్సిన వారితోనో.. ఇతరులతో పంచుకుంటే 90 శాతం పరిష్కారాలు లభిస్తాయని చెబుతున్నారు మానసిక నిపుణులు. ఏదో ఒకదాంట్లో ఓటమి చెందామనో..పరీక్షల్లో ఫెయిల్ అయ్యామనో.. తల్లిదండ్రులు మందలించారనో కుమిలిపోకుండా.. వాటిని అధిగమించేందుకు ప్రయత్నించాలని సూచిస్తున్నారు..

ఎన్జీఓల కృషి..

నగరానికి చెందని పలు ఎన్‌జీఓ సంస్థలు ఆత్మహత్యల నివారణకు కృషి చేస్తున్నాయి. ఇందులో ఏటా సుమారు 18 వేల నుంచి 23 వేల మంది కాల్ సెంటర్ ద్వారా సమస్యలు చెప్పుకుంటున్నారని కొన్ని అధ్యయనాల నివేదికల చెబుతున్నాయి. ఆ నివేదిక ప్రకారం..

- ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్న వారిలో కుటుంబ తగాదాలు, రిలేషన్‌షిప్, బ్రేకప్ వంటివి 30 శాతం ఉన్నాయి.
- నిరుద్యోగం, అప్పులు, ఆర్థిక పరమైన సమస్యలతో 25 శాతం మంది.
- ఒంటరితనం, కుంగుబాటు, ఇతర మానసిక సమస్యలతో మరో 10 శాతం.
- విద్య, వృత్తిపరమైన ఒత్తిడిని తట్టుకోలేక మరో 22 శాతం.
- వివాహం కాలేదని, ఇతర సామాజిక సమస్యలతో 12 శాతం. ఇలా పలు కారణాలతో తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటున్నారు.

పురుషులే ఎక్కువ..

నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో 2023 ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా ఆత్మహత్యకు పాల్పడుతున్నవారిలో పురుషులే అధికంగా ఉన్నారు. ప్రతి 40 సెకన్లకు ఒకరు చొప్పున ఏటా 8 లక్షల మంది, ఒక్క భారత్‌లోనే మూడు నిమిషాలకు ఒకరు చొప్పున యేడాదికి 1.71 లక్షల మంది, రోజుకు 512 మంది ఆత్మహత్యలు చేసికుంటున్నారు. ఏపీ, తెలంగాణలో ప్రతి రోజు 6 నుంచి 8 ఆత్మహత్యలు రికార్డవుతున్నాయి.





ఆ మూడు నెలలే కీలకం..

విద్యార్థుల ఆత్మహత్యల్లో ఆ మూడు నెలలే కీలకంగా మారుతున్నాయి. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఇతర అకడమిక్ కోర్సుల్లో పాస్ కాలేదని కొందరు, తక్కువ మార్కులు వచ్చాయని మరికొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చదువుల విషయంలోనూ కొందరు తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారని మానసిక నిపుణులు చెబుతున్నారు. లక్షలు పోసి చదివిస్తున్నామని తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి పెంచుతున్నారని, ఇది వారి సున్నిత మనసును మరింత కుంగదీస్తున్నాయి. తల్లిదండ్రుల ఆలోచనా విధానంలోనూ మార్పు రావాలి. పిల్లలతో స్నేహపూర్వక వాతావరణం ఉండాలి.

- డాక్టర్ బీ.సూర్యారావు, సైకాలజిస్టు



ఆవేశంలో నిర్ణయాలు వద్దు..

ఆత్మహత్యల నివారణకు 22 రాష్ట్రాల్లో తెలుగు, ఇంగ్లీష్, హిందీతో సహా 16 ప్రాంతీయ భాషాల్లో హెల్ప్ లైన్ సెంటర్లు నిర్వహిస్తున్నాం. ఎక్కువ మంది మహిళలు ప్రేమ, వివాహం, కుటుంబ ఇబ్బందులని చెబుతున్నారు. మగవారిలో ఆర్థిక సమస్యలు, విద్య, ఉద్యోగం, పని ఒత్తిడితో.. పూర్తిగా నెగిటివ్ ఆలోచనల్లోకి వెళ్లిపోతున్నారు. ఒక్కోసారి ఎవరికీ చెప్పుకోలేక ఒంటరితనాన్ని ఫీలవుతున్నారు. ఇటువంటి వారికి వారం లేదా 15 రోజులకు ఒక సెషన్ చొప్పున హైదరాబాద్‌లోనూ కౌన్సిలింగ్ ఇస్తున్నాం. 78930 78930 హెల్ప్‌లైన్ ద్వారా సాయం పొందవచ్చు.

- రెబికా, వన్ లైఫ్ హెల్ప్‌లైన్ సెంటర్ కౌన్సెలర్



గుర్తించాలి.. ఆలోచన తుంచాలి..

ఎవరితో కలవకుండా దూరంగా ఉండటం, ఆహారం సరిగ్గా తీసుకోకపోవడం, బతకాలని లేదని అంటుండటం వంటి లక్షణాలను గుర్తించాలి. వారితో మనసువిప్పి మాట్లాడి.. కారణాలు గుర్తించాలి. అవసరమైతే మానసిక నిపుణులను సంప్రదించాలి.

- ఆనంద దివాకర్ (సీనియర్ కౌన్సెలర్)



చావు పరిష్కారం కాదు..

చిన్న సమస్యలకు క్షణికావేశంలో ఆత్మహత్యలు చేసికుని విలువైన జీవితాన్ని కోల్పోతున్నారు. చావు శాశ్వత పరిష్కారం కాదు. మనలో బాధను ఇతరులతో పంచుకుంటే పరిష్కారం దొరుకుతుంది. కుటుంబంలో ఒకరు ఆత్మహత్య చేసుకుంటే ఆ ప్రభావం కుటుంబం మొత్తం మీద ఉంటుందని గుర్తించాలి.

- విద్యారెడ్డి (కౌన్సెలర్)

శిల్పారామం వేదికగా ఛాప్..

హస్తకళ, చేనేత కళాకారుల ప్రదర్శనలు | ఈ నెల 12 నుంచి 17 వరకు నిర్వహణ

చేనేత, హస్తకళలు.. వీటి కొనసాగింపులో ఆధునిక ఫ్యాషన్, టెక్నాలజీ వంటి అంశాలతో దేశంలోనే అతిపెద్ద కార్యక్రమ నిర్వహణకు కేంద్ర టెక్స్‌టైల్ మినిస్ట్రీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ (నిఫ్ట్), తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ శాఖ భాగస్వామ్యంతో 'ఛాప్' నిర్వహించనున్నారు. నగరంలోని శిల్పారామం వేదికగా ఈ నెల 12 నుంచి 17 వరకూ జరుగుతోంది. దీనికి సంబంధించిన వివరాలను ప్రతినిధులు నిఫ్ట్ వేదికగా మంగళవారం వెల్లడించారు.

- సాక్షి, సిటీబ్యూరో



ఛాప్ 2025లో భాగంగా భారతదేశపు చేనేత, హస్తకళల వారసత్వాన్ని ప్రదర్శించడంతో పాటు సమకాలీన డిజైన్ల ఆవిష్కరణ, వ్యవస్థాపకత ప్రాధాన్యతను తెలియజేసేలా భిన్న కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. శిల్పారామం వేదికగా నిర్వహించే స్టాల్స్‌లో హస్తకళాకారులు, నిఫ్ట్ పూర్వ విద్యార్థులు, వ్యవస్థాపకులు, డిజైనర్లు, పరిశ్రమల ప్రముఖులు భాగస్వామ్యం కానున్నారు. రాష్ట్రంలోని టూరిజం డెస్టినేషన్ ప్రాధాన్యతను ప్రదర్శించి, సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని క్లస్టర్ హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ పూర్వ ఖురానా పేర్కొన్నారు.

ఫ్యాషన్ షోలు, మాస్టర్ క్లాసులు..

దేశవ్యాప్తంగా 19 నిఫ్ట్ క్యాంపస్‌లు ఉన్నాయని, హైదరాబాద్ క్యాంపస్ భాగస్వామ్యంతో ఈ ప్రదర్శనలో 60 క్రాఫ్ట్స్, 40 అలుమ్ని బృందాలు పాల్గొంటాయి. ఆరు రోజుల కార్యక్రమంలో దేశవ్యాప్తంగా చేనేత, హస్త కళాకారుల ప్రదర్శనలతో పాటు ఫ్యాషన్ షోలు, మాస్టర్ క్లాసులు, 6 ప్రధాన క్రాఫ్ట్ ప్రదర్శనలు చేపట్టామని, విద్యార్థుల పరిశోధనాత్మక డాక్యుమెంటేషన్స్ కూడా ప్రదర్శిస్తాం. తెలంగాణలోని తోలుబొమ్మలాట లాంటి అరుదైన కళల ప్రాధాన్యత తెలియజేసి, పలు అరుదైన కళలకు పేటెంట్స్, జీయో ట్యాగ్ ప్రాధాన్యత వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నాం.

- డా.మాలిని, నిఫ్ట్ డైరెక్టర్

తైక్వాండోలో అవనీష్ ప్రతిభ



తిరుమలగిరి బాలునికి జాతీయ స్థాయిలో కాంస్యం

బొల్లారం: తైక్వాండో జాతీయ స్థాయి పోటీల్లో కంటోన్మెంట్ నియోజకవర్గం తిరుమలగిరికి చెందిన మాస్టర్ అవనీష్ కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 7న ఉత్తర ప్రదేశ్‌లోని అమినీర్ విషన్ స్కూల్లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో విజయం సాధించి, నగరానికి తిరిగొచ్చిన అవనీష్, అతని కోచ్ నరసింహను స్థానికులు ఘనంగా సత్కరించారు. తిరుమలగిరిలోని కంబాట్ తైక్వాండో అండ్ స్పోర్ట్స్ అకాడమీలో నిర్వహించిన విజయోత్సవ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో పాల్గొన్నాడు. బోయిన్‌పల్లి సెయింట్ పీటర్స్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న తనను తల్లిదండ్రులు మమతా జైన్, బిందు కిరణ్ ఎంతగానో ప్రోత్సహించారని తెలిపాడు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సీఎం కప్‌లో గోల్డ్ మెడల్‌తో పాటు రాష్ట్రస్థాయిలో 15 బంగారు పతకాలు, ఇలా మొత్తం 25 పతకాలు సాధించినట్లు కోచ్ తెలిపారు. సీబీఎస్ఈ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో మొదటిసారి జాతీయ స్థాయిలో కాంస్య పతకం సాధించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అవనీష్ గ్రాండ్ పేరెంట్స్ లింగమ్మ, వెంకటేశ్వర రావు, అకాడమీ విద్యార్థులు పాల్గొన్నారు.



నగరంలో 'ఆకృతి ఎలైట్'

నగరంలోని తాజ్ కృష్ణ వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించే ఆకృతి ఎలైట్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. దీనిని ఎగ్జిబిషన్ డైరెక్టర్ శశినాథ ప్రారంభించారు.

- సాక్షి, సిటీబ్యూరో

జాతీయస్థాయి యోగా పోటీలకు వైష్ణవిగీత

రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ విద్యార్థిని చందనశ్రీ యోగాసనలో సత్తా చాటింది. తెలంగాణ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా పోటీల్లో వైష్ణవిగీత, చందనశ్రీ సత్తా చాటారు. సంప్రదాయ యోగాలో వైష్ణవిగీత గోల్డ్ మెడల్ సాధించి ముంబయి వేదికగా అక్టోబరులో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక కావడం విశేషం. అదేవిధంగా చందనశ్రీ 7వ తరగతి చదువుతోంది. యోగాసనలో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ ఇంటర్ స్కూల్ యోగా పోటీల్లో హన్సిని రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. విజేతలను హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపల్ మురళి, ఫిజికల్ డైరెక్టర్, యోగా కోచ్ మట్టపల్లి సతీష్ అభినందించారు.

కశ్మీర్ యువతలో ప్రతిభకు కొదవలేదు

భారత మాజీ క్రికెట్ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్



బంజారాహిల్స్ : జమ్మూ, కశ్మీర్ ప్రాంతంలో ప్రతిభ కలిగిన క్రికెటర్లు ఎంతో మంది ఉన్నారని, వారికి సరైన అవకాశాలు లభిస్తే దేశం తరపున ఆడే స్తతా ఉందని భారత మాజీ క్రికెట్ కెప్టెన్ మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. జమ్మూ, కశ్మీర్ పర్యటనలో ఉన్న మహ్మద్ అజారుద్దీన్ జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నేపథ్యంలో బంజారాహిల్స్‌లోని ఆయన కార్యాలయం విడుదల చేసిన ఓ ప్రకటనలో మూడు రోజులుగా జమ్మూ కశ్మీర్‌లో యువ క్రికెటర్లను తాను కలిశానని ఆటలోని మెళకువలను నేర్పించానని తెలిపినట్లు పేర్కొన్నారు. సుదీర్ఘ కాలంగా అవకాశాల కోసం వేచి చూస్తున్న యువతకు ప్రభుత్వం ఇటీవల ప్రోత్సాహం కల్పిస్తుండటం అభినందనీయమని తెలిపారు.

అంకుర సంస్థలు.. అప్పుడే మూసేస్తున్నారు



ఏఐ ప్రభావంతో మూతపడుతున్నవి కొన్ని | నిధుల లేమితో షట్‌డౌన్ అయినవి మరికొన్ని | రెండేళ్లలో 28 వేలకుపైగా కంపెనీల మూసివేత

ఎన్నో ఆశలతో పెడుతున్న అంకుర కంపెనీలు.. ఇటీవలి కాలంలో మూతపడుతున్నాయి. కృత్రిమ మేధ సృష్టించిన అలజడి.. పోటీ.. నిధుల రాక తగ్గిపోవడం.. ఖర్చులు పెరిగిపోవడం.. ఇలా అనేక కారణాలు. ప్రధానంగా కంటెంట్‌పైనే ఆధారపడ్డ స్టార్టప్స్‌పై ఏఐ తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఈ నేపథ్యంలో ఎడ్‌టెక్, స్టోరీటెల్లింగ్ ప్లాట్‌ఫామ్స్, మార్కెటింగ్ వంటి రంగాలలో ప్రస్తుతం ఉన్న స్టార్టప్‌లను నడిపించేందుకు, విస్తరించేందుకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపడం లేదు. ఇంకేముంది 2023, 2024లో ఏకంగా 28,000 పైచిలుకు స్టార్టప్స్ మూతపడ్డాయి.

– సాక్షి, స్పెషల్ డెస్క్

వెర్సే ఇన్నోవేషన్.. జోష్, డెయిలీహంట్ సంస్థల మాతృ సంస్థ.. ఈ ఏడాది మేలో 350 మంది ఉద్యోగులను తొలగించింది. ప్రధానంగా ఏఐలో పెట్టుబడులు పెడుతున్నట్టు, ఆటోమేషన్ వైపు అడుగులు వేస్తున్నట్టు కంపెనీ ప్రకటించింది. కోడ్ ప్యారట్, సటల్.ఏఐ, వూరి, లొకేల్.ఏఐ, అస్త్ర.. ఇలాంటి ఏఐ స్టార్టప్‌లు ఇటీవలికాలంలో చాలా మూతపడ్డాయి. ఇందుకు.. ఏఐలో వేగంగా వస్తున్న మార్పులు, మారిపోతున్న సాంకేతికత, అధికమవుతున్న పోటీ, నిధుల సమస్య పెరుగుతున్న వ్యయాలు.. ఇలాంటి అనేక కారణాలు.

రూ. 21,000 కోట్ల నష్టం


చాట్‌జీపీటీ ఎంట్రీ ఇచ్చిన తర్వాతి సంవత్సరం అంటే 2023లో భారత్‌లో ఏకంగా 15,921 టెక్ స్టార్టప్‌లు మూతపడ్డాయి. అంతకు ముందు ఏడాదిలో ఈ సంఖ్య 2,101 మాత్రమే. 2024లో 12,717 స్టార్టప్స్ కనుమరుగైపోయాయి. షట్టర్లు దించేసిన కంపెనీల సంఖ్య 2022 వరకు నాలుగు అంకెలకే పరిమితం అయింది. గత రెండేళ్లలో అనూహ్యంగా అయిదు అంకెల స్థాయికి చేరడం ఆందోళన కలిగించే అంశం. కరోనా తదనంతర పరిస్థితులు కూడా కొంత వరకు కారణమయ్యాయి. ముఖ్యంగా ఏఐ వల్ల.. అగ్రిటెక్, ఫిన్‌టెక్, ఎడ్‌టెక్, హెల్త్‌టెక్ రంగాల్లోని స్టార్టప్‌లు అధికంగా ప్రభావితమయ్యాయి. 'ఐఎన్‌సీ42' వెబ్‌సైట్ 'ఇండియన్ స్టార్టప్ లేఆఫ్ ట్రాకర్ 2025' ప్రకారం.. 2025 సెప్టెంబర్ వరకు స్టార్టప్స్ 5,600లకుపైగా ఉద్యోగులను తొలగించాయి. 2023–24లో 67 స్టార్టప్స్ రూ.21,472 కోట్ల నష్టాన్ని ప్రకటించాయి.

ఏఐ కంపెనీల దూకుడు

ఏఐ రాకతో కంటెంట్ రూపకల్పనలో వ్యయం తగ్గుతోంది. ఈ రంగంలో ప్రవేశానికి అడ్డంకులను తొలగించింది. ఏఐ ఎంట్రీతో టెక్ స్టూడియోల అవసరం తీరిపోయింది. అంతేకాదు ఖరీదైన స్టార్టప్స్ ఏర్పాటు చేయాల్సిన పనికూడా లేదు. కంటెంట్ సులువుగా, చవకగా దొరుకుతోంది. జనానికీ అందుబాటులో ఉంటోంది. ఆదాయం విషయంలో నిర్దిష్ట టర్నోవర్‌కు చేరుకోవడానికి కంపెనీలకు సంవత్సరాలు పట్టేది. ఇప్పుడు నెలల్లోనే ఏఐ స్టార్టప్స్ అది సాధ్యం చేస్తున్నాయి. ఏర్పాటైన 12–18 నెలల్లోనే 10 మిలియన్ డాలర్ల వార్షికాదాయం స్థాయికి చేరుతున్నాయంటే ఏఐ కంపెనీల ప్రభావం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

సగానికి తగ్గాయి

ఏఐ దూకుడు.. ఒకప్పుడు ఆశాజనకంగా కనిపించిన స్టార్టప్‌లను సైతం తుడిచిపెట్టేస్తోంది. పెట్టుబడిదారులు ఇప్పుడు ఏఐ మార్పులను తట్టుకొని దీర్ఘకాలంలో లాభాలను అందించే వ్యాపార విధానాలపై దృష్టిపెడుతున్నారు. ఈ నేపథ్యంలో.. స్టార్టప్స్‌లోకి రావాల్సిన నిధులూ తగ్గుముఖం పట్టాయి. భారతీయ స్టార్టప్స్ 2021, 2022లో ఏటా 7 బిలియన్ డాలర్ల స్థాయిలో ఫండింగ్ అందుకోగా.. గత రెండేళ్లలో ఈ మొత్తం దాదాపు సగానికి పడిపోవడం గమనార్హం. 2024లో భారత్‌కు చెందిన అంకుర సంస్థలు 3.7 బిలియన్ డాలర్ల నిధులను దక్కించుకున్నాయి. 2025 ఆగస్ట్ నాటికి ఈ మొత్తం కేవలం 2 బిలియన్ డాలర్లు మాత్రమే.





(ఆధారం: ప్రైవేట్ మార్కెట్ డేటా ప్లాట్‌ఫామ్ ట్రాక్సన్)



వరంగల్‌లోని కాళోజీ యూనివర్సిటీలో కాళోజీ జయంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్న వర్సిటీ వీసీ నందకుమార్ రెడ్డి, ఇతర అధికారులు

16న 'మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ'పై వర్క్‌షాప్

సాక్షి, హైదరాబాద్: ఈనెల 16న 'మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ'పై తెలంగాణ మీడియా అకాడమీ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ (ఐజేఎం) ఆధ్వర్యంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నామని మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. మీడియా ప్రతినిధులకు అవగాహన పెంపొందించేలా, నేరాల తీవ్రత, బాధితులపై ప్రదర్శించే వైఖరిపై ఈ వర్క్‌షాప్ నిర్వహించనున్నామని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్క్‌షాపులో పాల్గొనే మీడియా ప్రతినిధులు ఈనెల 15 లోగా తమ పేరు, హోదాతో 7093600977కు వాట్సాప్‌ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఫార్ములా ఈ– కారు రేసుపై ఏసీబీ నివేదిక

కేటీఆర్, అర్వింద్‌కుమార్‌లపై అభియోగం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ–కారు రేసు కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. నిధుల బదలాయింపులో తీవ్ర ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయని, హెచ్‌ఎండీఏ నిధులు దుర్వినియోగం అయ్యాయని అవినీతి నిరోధక శాఖ తేల్చినట్టు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత ఎలాంటి అనుమతులు లేకుండా, సంబంధం లేని విభాగం నుంచి నిధులను ఫార్ములా ఈ– కారు రేసుకు బదిలీ చేయడం వెనుక క్విడ్ ప్రో కో జరిగినట్టు అవినీతి నిరోధక శాఖ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలో స్పష్టం చేసినట్టు విశ్వసనీయ సమాచారం.



రూ.55 కోట్ల హెచ్‌ఎండీఏ నిధుల దుర్వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏసీబీ తుది నివేదిక అందించింది. ఈ కేసులో విధానపరమైన లోపాలు ఉన్నాయని వెల్లడించింది. హైదరాబాద్‌లో తొలిసారి 2023 ఫిబ్రవరిలో ఫార్ములా ఈ–కారు రేసు సంస్థ రేసును నిర్వహించిన విషయం తెలిసిందే. అప్పట్లో స్పాన్సర్లతో తొలి రేసు నిర్వహించినా, అందుకు మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పించింది. తొలిసారి స్పాన్సర్లుగా వ్యవహరించిన సంస్థలకు ఆశించిన మేరకు ఆదాయం రాకపోవడంతో... 2024లో నిర్వహించాల్సిన రెండో రేసు నుంచి స్పాన్సర్లు తప్పుకున్నారు. రేసు నిర్వహణకు సమయం దగ్గరపడుతున్న తరుణంలో ఫార్ములా ఈ–కారు రేసు నిర్వాహకులు వెంటనే నిధులు ఇస్తే తప్ప.. 2024 ఫిబ్రవరిలో రేసు కేటాయించడం సాధ్యం కాదంటూ ఒత్తిడి తేవడం, స్పాన్సర్లు ముందుకు రాకపోవడంతో అప్పట్లో హెచ్‌ఎండీఏ నుంచి ఫార్ములా ఈ–కారు రేసు సంస్థకు విదేశీ కరెన్సీలోనే నిధులు చెల్లించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అనుమతి కూడా తీసుకోలేదని, ఆర్థికశాఖ నుంచి కూడా అనుమతి తీసుకోలేదని తన నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం. 2023 డిసెంబర్‌లో రాష్ట్రంలో అధికారం మారడంతో...ఫార్ములా ఈ– కారు రేసును రద్దు చేస్తున్నట్టు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఎన్నికల సమయంలో హెచ్‌ఎండీఏ నుంచి నిధులు విదేశాలకు తరలివెళ్లాయని తెలియడంతో.. అప్పటి పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్ ఈ నిధులు మళ్లింపుపై విచారణ చేయాలని అవినీతి నిరోధక శాఖకు లేఖ రాసిన సంగతి విదితమే. ఆ తర్వాత ఏసీబీ అధికారులు అప్పట్లో పురపాలకశాఖ మంత్రిగా పనిచేసిన కేటీఆర్‌ను రెండుసార్లు, అప్పటి పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌ను మూడుసార్లు, హెచ్‌ఎండీఏ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్‌రెడ్డిలను మూడుసార్లు ప్రశ్నించింది. ఎస్ నెక్స్ట్‌జెన్‌తోపాటు ఫార్ములా ఈ–కారు రేసు ప్రతినిధులను కూడా ప్రశ్నించింది. ఈ మేరకు పూర్తి స్థాయిలో నివేదికను తయారు చేసిన ఏసీబీ అందులో ప్రధానంగా మాజీమంత్రి కేటీఆర్, అప్పటి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్‌లను ముద్దాయిలుగా పేర్కొన్నట్టు ప్రభుత్వ వర్గాల సమాచారం. వారిపై ప్రాసిక్యూషన్ అనుమతి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరినట్టు సమాచారం.

17న ప్రజాపాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలి

సీఎస్ రామకృష్ణారావు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ఈ నెల 17న నిర్వహించే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా 17న ఉదయం గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో జరిగే ప్రజాపాలన దినోత్సవంలో పాల్గొంటారని తెలిపారు. గన్‌పార్క్ వద్ద జరిగే కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ కమిషనర్ నోడల్ అధికారిగా ఉంటారని, అక్కడ ఫ్లోరల్ డెకరేషన్‌తో పాటు, షామియానా తదితర ఏర్పాట్లు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, విగ్రహాలు, పర్యాటక ప్రదేశాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించే సమావేశానికి తగిన ఏర్పాట్లు చేయాలని రోడ్లు, భవనాల శాఖ అధికారులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు తాగునీరు, శానిటేషన్ ఇతర మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలన్నారు. వీవీఐపీలతో పాటు ప్రజాప్రతినిధులందరికీ ఆహ్వాన పత్రికలను అందచేయాలని సీఎస్ ఆదేశించారు.

కాళోజీని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలి

- మంత్రి జూపల్లి కృష్ణారావు
- రచయిత్రి నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారం ప్రదానం



నెల్లుట్ల రమాదేవికి పురస్కారాన్ని అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ ఉద్యమకారులకు గొప్ప స్ఫూర్తినిచ్చిన ప్రజాకవి కాళోజీ నారాయణరావును నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కాళోజీ 111వ జయంతి వేడుకలు, తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత్రి నెల్లుట్ల రమాదేవికి కాళోజీ సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. అనంతరం జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. కాళోజీ తన జీవితకాలంలో జరిగిన ప్రతి ఉద్యమాన్ని ఊపిరిగా మార్చుకొని వాటిలో తనవంతు పాత్ర పోషించారని గుర్తుచేశారు. సమకాలీన సమాజంపై ఆయన ప్రభావం అపారమైనదని, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు లాంటి వారు కాళోజీ అంటే అమితమైన గౌరవాభిమానాలు చూపించేవారని తెలిపారు. కాళోజీ జీవిత చరిత్ర గ్రంథాలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రంథాలయాలలో, గ్రామాలలో ఉండే విధంగా కృషి చేస్తానని హామీనిచ్చారు. రచయిత్రి నెల్లుట్ల రమాదేవి మాట్లాడుతూ, కాళోజీ పురస్కారాన్ని అందుకోవడం సంతోషంగా ఉందని, ఈ పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. అంతకుముందు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, కాళోజీ ఫౌండేషన్ సభ్యులు పి.శ్రీనివాసరావు, సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలచారి తదితరులు పాల్గొన్నారు.

నగర వార్తలు

తెలంగాణ సమాజాన్ని జాగృతం చేసిన కవి కాళోజీ

– జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



లక్డీకాపూల్: తెలంగాణ సమాజాన్ని తన కవితలతో జాగృతం చేసిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. మంగళవారం ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకుని జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కమిషనర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ భాషా సాహిత్యానికి కాళోజీ చేసిన సేవలను కమిషనర్ ఈ సందర్భంగా స్మరించుకున్నారు. తెలంగాణ యాస, భాష కోసం వారు చేసిన కృషికి గుర్తింపుగా కాళోజీ జయంతిని తెలంగాణ భాషా దినోత్సవ జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ భాషకు అస్తిత్వ స్పృహను పెంచడంలో కాళోజీది కీలకపాత్ర అని కొనియాడారు. కాళోజీ స్ఫూర్తి, తెలంగాణ సాధనలో, ప్రగతిలో ఇమిడి ఉందని కమిషనర్ పేర్కొన్నారు.

నిమ్స్‌లో ఘనంగా కాళోజీ జయంతి

నిమ్స్‌లో ప్రజాకవి కాళోజీ నారాయణరావు 111వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. లెర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, ఎంఎస్ ప్రొఫెసర్. నిమ్మ సత్యనారాయణలు కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

22న మాదిగల కృతజ్ఞత సభ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న బ్రహ్మయ్య మాదిగ

హిమాయత్‌నగర్: మాదిగల ఆకాంక్షను నెరవేరుస్తూ ఎస్సీ వర్గీకరణ చట్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ నెల 22న రవీంద్రభారతిలో 'మాదిగల కృతజ్ఞత సభ' నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ తెలిపారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కరపత్రాన్ని నాయకులు బుగ్గ మైసయ్య, ఈరెంటి విజయ్, కాంబ్లే శంకర్, నంద్రు నరసింహారావుతో కలిసి ఆవిష్కరించారు. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తూ చిత్తశుద్ధి చాటుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

విద్యార్థుల ఆకలికి.. పోషకాల రాగి..

- సర్కారు బడుల్లో మళ్లీ రాగి జావ పంపిణీ
- విద్యార్థులకు పోషకాహారం అందించడమే లక్ష్యంగా..
- స్కూళ్లలో 2023లో ప్రారంభమైన పంపిణీ
- ఈ విద్యా సంవత్సరం నుంచి తాత్కాలికంగా బ్రేక్
- ప్రభుత్వ ఆదేశాలతో మళ్లీ ఏర్పాట్లు చేస్తున్న విద్యాశాఖ



సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారం అందించడమే లక్ష్యంగా సర్కారు బడుల్లో మళ్లీ రాగి జావ పంపిణీకి విద్యాశాఖ కసరత్తు మొదలు పెట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలోనే పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పీఎం పోషణ్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని 2023లో అప్పటి బీఆర్‌ఎస్ సర్కారు ప్రారంభించగా, గత విద్యా సంవత్సరం వరకు అందించారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రభుత్వం నుంచి అందాల్సిన రాగి పిండి, బెల్లం సరఫరా నిలిచిపోయింది. తాజాగా కాంగ్రెస్ సర్కారు రాగి జావ పంపిణీ పునఃప్రారంభానికి శ్రీకారం చుట్టనుంది. పీఎం పోషణ్ ద్వారా శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ భాగస్వామ్యంతో హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో అమలు చేయనున్నారు.

మధ్యాహ్నం వరకు ఖాళీ కడుపుతోనే..

నగరం, బస్తీలు, పట్టణ ప్రాంతాల నుంచి కాలినడక, ఇతర మార్గాల ద్వారా విద్యార్థులు స్కూళ్లకు సమయానికి చేరుకోవాలంటే ఉదయాన్నే బయలుదేరాల్సి ఉంటోంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఉదయాన్నే తమ పనులకు వెళ్తుండటం, స్కూల్ సమయానికి ఇంటి వద్ద వంట పూర్తికాకపోవడంతో విద్యార్థులు ఏమీ తినకుండానే తరగతులకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్న భోజన సమయం వరకు విద్యార్థులు ఖాళీ కడుపుతోనే ఉంటున్నారు. దీంతో తాజాగా ప్రభుత్వం మళ్లీ విద్యార్థులకు రాగి జావ అందజేయాలని తీసుకున్న నిర్ణయంతో వారికి ఎంతగానో ప్రయోజనం చేకూరనుంది. మధ్యాహ్న భోజనంలో భాగంగా ప్రతిసోమ, బుధ, శుక్రవారాల్లో విద్యార్థులకు కోడిగుడ్లు అందిస్తారు. మంగళ, గురు, శనివారాల్లో మధ్యాహ్న భోజన సమయానికి ముందే విరామ సమయంలో రాగి జావ అందించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి డీఈఓలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. రాగి జావ తయారు చేసేందుకు మధ్యాహ్న భోజన కార్మికులకు పారితోషికం కూడా విద్యాశాఖ అందించనుంది.

మార్గదర్శకాలు ఇవే..

ప్రతి విద్యార్థికి రోజుకు 10గ్రాముల రాగి పిండికి అదే మోతాదులో బెల్లం కలిపి జావ అందించాల్సి ఉంటుంది. దీని తయారీకి శుద్ధమైన నీటిని వినియోగించాల్సి ఉంటుంది. పంపిణీ చేసిన నీటి ప్యాకెట్లపై గడువు తేదీని పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. పంపిణీకి సంబంధించిన స్టాక్ వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలి. వంట గది పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి. వంట నిర్వాహకులు, సహాయకులు జావ అందించే సమయంలో వ్యక్తిగత శుభ్రత పాటించేలా మధ్యాహ్న భోజన ఇన్‌చార్జిలు పర్యవేక్షించాల్సి ఉంటోంది.

- హైదరాబాద్‌తో సహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఈ విధంగా ఉంది.

జిల్లా పేరు	ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థుల సంఖ్య
హైదరాబాద్	631	1,08,635
మేడ్చల్–మల్కాజిగిరి	505	90,301
రంగారెడ్డి	1301	1,65,203
మొత్తం	2,497	3,64,139

సక్రమంగా అమలయ్యేలా..



రాగిజావ అమలుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ట్రస్టు నుంచి జావకు సంబంధించిన పదార్థాలు రాగానే బడులకు సరఫరా చేస్తాం. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– ఐ.విజయకుమారి, డీఈఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా.

ఇంజినీరింగ్ విద్యార్థుల్లో స్కిల్స్ పెంచాలి

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

బాలానగర్: దేశ నిర్మాణంలో యువతీ, యువకులు భాగస్వాములు కావాలని తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. జేఎన్టీయూలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలు, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, ఉద్యోగులు, ప్రొఫెసర్స్ నుంచి నేటి విద్యావ్యవస్థపై అభిప్రాయాలను సేకరించడం కోసం మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించే విద్యావిధానాలు, నాణ్యమైన విద్య, పరిశోధనలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. వర్సిటీలో పరిశోధన విద్యార్థులు చాలా తక్కువగా ఉన్నారని, వారి సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇంజినీరింగ్ విద్యార్థుల్లో స్కిల్స్ పెంచాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో రెగ్యులర్ ఫ్యాకల్టీని వెంటనే నియమించాలని కమిషన్‌కు సూచించారు. కార్యక్రమంలో విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, జేఎన్టీయూ వీసీ టి.కిషన్‌కుమార్‌రెడ్డి, రెక్టార్ కె.విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆకునూరు మురళికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

సీఎం ప్రజావాణిలో 311 దరఖాస్తులు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 311 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 76, రెవెన్యూ శాఖకు 50, విద్యుత్ శాఖకు 10, ఇందిరమ్మ ఇళ్ల కోసం 85 దరఖాస్తులు వచ్చాయి. ప్రవాసి ప్రజావాణికి 3 అర్జీలు, ఇతర శాఖలకు సంబంధించి 97 దరఖాస్తులు అందినట్లు సీఎం ప్రజావాణి కో ఆర్డినేటర్ రాకేష్‌రెడ్డి తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

వర్గీకరణతో దళితులను విడదీసే కుట్ర



మాట్లాడుతున్న ఆర్ఎస్ రత్నాకర్

పంజగుట్ట: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులను విడదీసేందుకు దేశవ్యాప్తంగా చరిత్రలోనే అతిపెద్ద కుట్రకు బీజేపీ, మోదీ ప్రభుత్వం తెరలేపిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, కుట్రపూరిత ఎస్సీ వర్గీకరణ గర్జన జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఎస్.రత్నాకర్ అన్నారు. ఎస్సీ వర్గీకరణ పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో మొదట చేసింది కాంగ్రెస్ పార్టీ అయితే మోదీ దేశవ్యాప్తంగా చేసుకునే అవకాశం కల్పించి మాల, మాదిగల మధ్య వైరం పెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో 1108 కులాలు ఉండగా వర్గీకరణతో అన్ని కులాలకు ఎలా న్యాయం చేయగలుగుతారని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణతో వందలో నలుగురు దళితులకు మాత్రమే ఉపయోగం ఉంటుందని, వందలో నలుగురికి ఉండే ఫలాల్లో 1108 కులాలకు ఎలా పంచుతారని, తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలు ఉన్నాయని, వర్గీకరణ ఫలాలను సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డిలు సరైన జనాభా లెక్కలు తీసుకోకుండా ఎలా పంచుతారని ప్రశ్నించారు. ఇది దళితుల ఐక్యతపై కుట్ర అని ఆయన అభిప్రాయపడ్డారు. వర్గీకరణ చట్టాలు అయిపోయాయి కదా ఇంకా ఏం చేయలేమని దళిత సోదరులు భావించరాదని, ప్రజల ఆకాంక్షకు విరుద్ధంగా ఉన్న ఏ చట్టం అయినా వెనక్కి తీసుకోక తప్పదన్నారు. తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు వర్గీకరణకు మద్దతు ఇచ్చి మాల సామాజిక వర్గాన్ని తొక్కేస్తుంటే మాల ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గద్దం సత్యనారాయణ, తెలంగాణ కన్వీనర్ బల్లెం లక్ష్మణ్, నెల్లి సూరిబాబు, కామా ప్రభాకర్, కనికెళ్ల నాని తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ వైర్ల కట్టింగ్‌తో ప్రజలకు ఇబ్బందులు



పంజగుట్ట: కేబుల్ వైర్ల కట్టింగ్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ కేబుల్ టీవీ, టెలికం సర్వీస్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో 50 శాతం కేబుల్ వైర్లు కట్ చేశారని, ఇకముందు అది 100 శాతం అయ్యే అవకాశం ఉందని, దీంతో ఫోన్లు, టీవీలు, ఇంటర్‌నెట్ పనిచేయకుండా పూర్తిగా స్తంభించే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి బ్యూటిఫికేషన్ చేయాలంటున్నారని, దాన్ని స్వాగతిస్తున్నామని, అందుకు సంపూర్ణ మద్దతు తెలుపుతామని చెప్పారు. తాము ఇప్పటికే ప్రభుత్వానికి, విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులకు సింగిల్ వైర్ సిస్టమ్ తీసుకువచ్చేందుకు నివేదిక ఇచ్చామని, మొదటిదశలో 15 కిలోమీటర్లు వేసి చూపిస్తామని కూడా చెప్పామని ప్రభుత్వ అనుమతి కోసం వేచిచూస్తున్నామని తెలిపారు. అది వచ్చేవరకు అయినా వైర్లు కట్ చేయకుండా సేవలకు అంతరాయం కలగకుండా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు. కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలికాం సేవలకు అంతరాయం కలిగి ఇప్పటికే ఎంతో మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇంకా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. అనధికారికంగా కేబుల్, ఇంటర్‌నెట్ వ్యాపారం చేస్తున్న వారిని, అన్ని ట్యాక్సులు చెల్లించి, విద్యుత్ స్తంభాలకు కూడా పోల్స్ వినియోగ రుసుము చెల్లిస్తూ 30 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్న వారిని ఒకేలా చూడవద్దని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు శివరామకృష్ణ, ఏకే మహేష్, మనోజ్ కుమార్ దూబే, సతీష్ కుమార్, జైపాల్, కేశవరావు, ప్రభు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆటోరిక్షా ప్రొసీడింగ్స్ గడువు పెంచాలి

ఆటో సంఘాల డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: ఆటో రిక్షా పర్మిట్లకు ప్రభుత్వం ఇచ్చిన గడువును పొడిగించాలని ఆటో కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రొసీడింగ్‌ల కోసం కేవలం 60 రోజుల గడువు విధించారని, కానీ సకాలంలో కొత్త ఆటోలు సరఫరా కాలేదని ఏఐటీసీయూ ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం, బీఆర్‌టీయూ ఆటో సంఘం అధ్యక్షుడు మారయ్య, ప్రవీణ్, యాదగిరి తదితరులు మంగళవారం రవాణా కమిషనర్‌కు అందజేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు. మరోవైపు నిరుపేద ఆటోడ్రైవర్లకు ఫైనాన్షియర్‌ల వద్ద సకాలంలో రుణాలు లభించకపోవడం వల్ల కూడా జాప్యం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీని 28 శాతం నుంచి 18 శాతానికి తగ్గించడం వల్ల ఆటోరిక్షా ధరలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉందని, ఈ సదుపాయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రొసీడింగ్స్ గడువు పొడిగించడం వల్ల ఎంతోమంది ఆటోడ్రైవర్‌లకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

గ్రూప్-1 అర్హుల గుండె చెదిరింది!

నియామక పత్రాలు అందుకోవాల్సిన దశలో హైకోర్టు షాక్ • రీవాల్యుయేషన్‌లో ఏమవుతుందోనని ఎంపికైన అభ్యర్థుల్లో ఆందోళన

సాక్షి, హైదరాబాద్/చిక్కడపల్లి: రాష్ట్ర ప్రభుత్వశాఖల్లో గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల ఆనందం ఆవిరైంది. తుది జాబితాలో అర్హత సాధించి ధ్రువపత్రాల పరిశీలన సైతం పూర్తి చేసుకుని నియామక పత్రాలు తీసుకోవల్సిన సమయంలో.. అర్హుల జాబితాను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు వారికి శరాఘాతంలా తగిలింది. మెయిన్స్ పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం తిరిగి నిర్వహించాలని టీజీపీఎస్సీని ఆదేశించడంతో అభ్యర్థులు తీవ్ర గందరగోళంలో పడ్డారు. రీవాల్యుయేషన్ తర్వాత తమ పరిస్థితి ఏమవుతుందోనన్న ఆందోళన వారిలో వ్యక్తమవుతోంది. రీవాల్యుయేషన్‌కు హైకోర్టు 8 నెలల గడువు ఇవ్వడంతో కింకర్తవ్యం ఏమిటనే దానిపై టీజీపీఎస్సీ ఆలోచనలో పడింది. ఇలావుండగా..పరీక్షలు బాగా రాసినప్పటికీ ఆశించినవిధంగా ఫలితాలు రాలేదని భావిస్తున్న కొంతమంది అభ్యర్థులు మాత్రం హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నారు.

ఇప్పటివరకు టీజీపీఎస్సీ చేసిన ప్రక్రియ కూడా వృథా ప్రయాసే

- రీవాల్యుయేషన్ జరిగితే మళ్లీ ధ్రువపత్రాల పరిశీలన,తుది జాబితా
- మెయిన్స్ పరీక్షలు మళ్లీ నిర్వహిస్తారా? అనే దానిపైనా చర్చలు
- కోర్టు తీర్పుపై అప్పీల్‌కు వెళ్లే యోచనలో టీజీపీఎస్సీ?

ఎన్నెన్నో అడ్డంకులు..

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత తొలిసారిగా 2022 ఏప్రిల్ 26న 503 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. భర్తీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం గ్రూప్-1 నియామకాల ప్రక్రియలో ఉన్న ఇంటర్వ్యూలను రద్దు చేసింది. 3,80,081 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కొందరు ఆశావహులు అప్పటివరకు తాము చేస్తున్న చిన్నపాటి ఉద్యోగాలకు రాజీనామా చేసి పరీక్షలకు సిద్ధమయ్యారు. మరికొందరు దీర్ఘకాలిక సెలవులు పెట్టారు. 2022 అక్టోబర్ 16న ప్రిలిమినరీ పరీక్షలు జరిగాయి. అదే ఏడాది చివర్లో 1:50 నిష్పత్తిలో మెయిన్స్ పరీక్షలకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేసింది.

→ 2023 ఆగస్టులో మెయిన్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. అభ్యర్థులు కఠోర దీక్షతో సన్నద్ధతకు ఉపక్రమించారు. ఇంతలో టీజీపీఎస్సీలో పలు అర్హత పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారం వెలుగు చూసింది. ఇందులో భాగంగా గ్రూప్-1 ప్రశ్నపత్రాలు సైతం బయటకు వెళ్లాయని విచారణలో తేలడంతో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను కమిషన్ రద్దు చేసింది.

→ 2023 జూన్ 11న టీజీపీఎస్సీ మరోమారు ప్రిలిమినరీ పరీక్షను నిర్వహించింది. అయితే ఈ పరీక్షల నిర్వహణ తీరుపై క్షేత్రస్థాయిలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసును విచారించిన హైకోర్టు.. పరీక్ష నిర్వహణలో లోపాలు జరిగాయని నిర్ధారిస్తూ పరీక్షను రద్దు చేయాలని తీర్పు ఇచ్చింది.

→ టీజీపీఎస్సీ సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ.. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడం, కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, టీజీపీఎస్సీ ప్రక్షాళన, కొత్త కమిషన్ ఏర్పాటు, కొత్తగా మరో 60 గ్రూప్-1 ఉద్యోగ ఖాళీలను గుర్తింపు చకచకా జరిగిపోయాయి. 2022 ఏప్రిల్‌లో ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేసిన టీజీపీఎస్సీ.. 2024 ఫిబ్రవరిలో 563 ఉద్యోగాల భర్తీకి కొత్త నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 4,03,645 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.

→ 2024 జూన్ 9వ తేదీన ప్రిలిమినరీ పరీక్షను ఓఎంఆర్ ఆధారిత పద్ధతిలో నిర్వహించారు. ఈ పరీక్ష ఫలితాలను జూలై 7న టీజీపీఎస్సీ విడుదల చేసింది. 31,383 మంది మెయిన్స్ పరీక్షలకు అర్హత సాధించారు. వీరితో పాటు మరో 20 మందిని కోర్టు ఉత్తర్వుల ద్వారా అనుమతించారు.

→ అక్టోబర్ 21 నుంచి 27 వరకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 31,403 మంది అభ్యర్థుల్లో 21093 మంది మాత్రమే అన్ని పరీక్షలూ రాశారు. 2025 మార్చి 10వ తేదీన అభ్యర్థుల ప్రొవిజినల్ మార్కుల జాబితాను టీజీపీఎస్సీ విడుదల చేసింది. మార్చి 30వ తేదీన జనరల్ ర్యాంకింగ్ లిస్టును విడుదల చేసింది.

→ ఏప్రిల్ 10వ తేదీన 563 గ్రూప్-1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను విడుదల చేసింది. ఏప్రిల్ 16 నుంచి 22 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కూడా చేపట్టింది. అయితే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల ఫలితాల్లో అవకతవకలు జరిగాయంటూ వివిధ కేటగిరీలకు చెందిన పలువురు అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో నియామకాలకు బ్రేక్ పడింది.



హైకోర్టు తీర్పు నేపథ్యంలో నిరుద్యోగులు, అభ్యర్థులు ఆందోళనకు దిగకుండా అశోక్‌నగర్ చౌరస్తాలో పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లు

రీవాల్యుయేషనా? మళ్లీ పరీక్షలా?

తాజాగా హైకోర్టు ఇచ్చిన తీర్పు ఎంపికైన అభ్యర్థులతో పాటు నిరుద్యోగ వర్గాల్లో చర్చోపచర్చలకు తెర లేపింది. మెయిన్స్ జవాబు పత్రాల మూల్యాంకనం మళ్లీ జరుపుతారా? లేక తిరిగి పరీక్షలు నిర్వహిస్తారా? అనే చర్చ జరుగుతోంది. అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రం తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నియామక పత్రాలు అందుకోవాల్సి ఉండగా.. రీవాల్యుయేషన్ లేదా మళ్లీ పరీక్షలంటూ తీర్పు రావడంతో మూడున్నరేళ్ల పడిన శ్రమను తలచుకుంటూ ఉక్కిరిబిక్కిరవుతున్నారు. కాగా హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అప్పీల్‌కు వెళ్లాలని టీజీపీఎస్సీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. నెలల తరబడి రాత్రింబవళ్లు కష్టపడి చదివిన అభ్యర్థులు హైకోర్టు తీర్పుతో ఆందోళనకు గురవుతుంటే.. మెయిన్స్‌లో విఫలమైన కొంతమంది న్యాయస్థానం తీర్పును స్వాగతిస్తున్నారు. మంగళవారం అశోక్‌నగర్, చిక్కడపల్లి నగర కేంద్ర గ్రంథాలయం, పలు శిక్షణా కేంద్రాల్లో హైకోర్టు తీర్పు చర్చనీయాంశం అయ్యింది.

ఆర్థికంగా పెను భారం



కోచింగ్‌లు, మెటీరియల్, తదితర ఖర్చులు ఇప్పటికే తడిసి మోపెడయ్యాయి.మరోసారి పరీక్షలు రాయవలసి వస్తే మాత్రం ప్రతి పేద అభ్యర్థిపై పెను భారం పడుతుంది.

– వై.క్రాంతికుమార్, గ్రూప్-1 అభ్యర్థి

మళ్లీ పరీక్షలు నిర్వహించాల్సిందే



హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం. ప్రభుత్వం మళ్లీ ఎగ్జామ్స్ నిర్వహించాలి. తెలుగు మీడియం అభ్యర్థులకు గతంలో ఎంతో నష్టం జరిగింది. మరోసారి పరీక్షలు నిర్వహించడం వల్ల వీరికి న్యాయం జరిగే అవకాశం ఉంది.

– సలీమ్, గ్రూప్-1 అభ్యర్థి

కోచింగ్ కేంద్రాల దోపిడీకి మళ్లీ అవకాశం



కోచింగ్ సెంటర్లు మరోసారి దోపిడీకి పాల్పడే అవకాశం ఉంది. ఇప్పటికే అశోక్‌నగర్ కోచింగ్ కేంద్రాల మాఫియాకు అడ్డాగా మారింది. హాస్టళ్లు, మెస్‌లు, స్టడీ హాళ్లు, కోచింగ్ కేంద్రాలు అభ్యర్థులను పెద్ద ఎత్తున దోచుకుంటున్నాయి. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలి.

– బి.చంద్రకాంత్, రాష్ట్ర సహ కన్వీనర్, లా స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా

క్లుప్తంగా...

గ్రూప్-1పై కోర్టు తీర్పును గౌరవిస్తాం

దానిపై ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుంది: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 పరీక్షల విషయంలో హైకోర్టు తీర్పును ప్రభుత్వం గౌరవిస్తుందని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కోర్టు తీర్పును పరిశీలించిన అనంతరం ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించారు. మంత్రితో ముఖాముఖి కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన గాంధీభవన్‌లో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజలిచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించి పరిష్కారానికి తగిన ఆదేశాలిచ్చామని తెలిపారు. ఎక్కువగా ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ధరణి సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాల గురించి దరఖాస్తులొచ్చాయని జూపల్లి చెప్పారు.

బీజేపీ పోరాట ఫలితమే 'గ్రూప్-1' తీర్పు


బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1 పరీక్ష పత్రాల రీవాల్యుయేషన్ చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు విమర్శించారు. గ్రూప్-1 అభ్యర్థుల విషయంలో కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామన్నారు. ఏటా నిరుద్యోగులకు జాబ్ కేలండర్ విడుదల చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి కనీసం ఒక్క పరీక్షను కూడా సరిగ్గా నిర్వహించలేకపోయారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని నిరుద్యోగ జీవితాలతో ఆడుకోవద్దని సూచించారు. గ్రూప్-1 అభ్యర్థులకు మద్దతుగా బీజేపీ చేసిన పోరాట ఫలితమే ఈ తీర్పు అని రాంచందర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ విడుదల నుంచి ఆన్సర్ షీట్స్ మూల్యాంకనం వరకు అన్నీ తప్పుడు విధానాలనే టీజీపీఎస్సీ అవలంబించిందన్నారు. పరీక్ష నిర్వహణలో గందరగోళం, మూల్యాంకనంలో అవకతవకలపై అభ్యర్థులకు మద్దతుగా కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌కుమార్‌తో సహా పార్టీ ప్రజాప్రతినిధులు ప్రత్యక్ష పోరాటం చేశారని రాంచందర్‌రావు గుర్తుచేశారు.

హైకోర్టు తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గ్రూప్-1పై హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. సీఎం, సీఓఓ ఆఫీసు నుంచి డబ్బులు తీసుకుని గ్రూప్-1 పోస్టులు అమ్ముకున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డిపై సీబీఐ విచారణ చేయాలని కేంద్రమంత్రి బండి సంజయ్ కోరాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో గ్రూప్-1 పేపర్ లీక్ అయితే బండి సంజయ్ గగ్గోలు పెట్టారని, మరి ఇప్పుడు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో గ్రూప్-1 మెయిన్స్ పేపర్‌లో అవకతవకలు జరిగితే ఎందుకు మాట్లాడటం లేదని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. అసెంబ్లీలో తూతూమంత్రంగా జాబ్ కేలండర్ పెట్టారని ధ్వజమెత్తారు.

మళ్లీ దిద్దాల్సిందే!

▶ మొదటి పేజీ తరువాయి

ఎలా ఇచ్చారు. రాండమైజేషన్ విధానమే అయితే ఎక్కువ మంది మహిళా అభ్యర్థులను రెండు కేంద్రాలకే ఎలా కేటాయించారు? మహిళా అభ్యర్థులనే కేటాయించాలని కళాశాల అధికారులు చెప్పినట్లు కమిషన్ పేర్కొన్నా ఆధారాలను సమర్పించలేదు. అసలు అలా కేటాయింపులో ప్రాధాన్యత ఎందుకో కమిషన్ చెప్పలేదు. నోటిఫికేషన్‌లో పేర్కొనలేదు. మరోవైపు శారీరకంగా వికలాంగులైన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వలేదు. నగరానికి దూరంగా 2వ, 3వ అంతస్తుల భవనాలను కేటాయించింది. ఇది కేంద్రాలను కేటాయించడంలో వివక్షను ప్రతిబింబిస్తోంది.

హాజరులో అసమానత:
మెయిన్స్‌కు హాజరైన అభ్యర్థుల సంఖ్యను.. 21,093, 21,085, 21,110, 20,161గా ఇలా ఒక్కోసారి ఒక్కోలా పేర్కొంది. అభ్యర్థుల హాజరు నమోదులో కమిషన్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రాజ్యాంగ సంస్థ ఇలా చేయడం ప్రశంసించలేం. తుది మార్కుల జాబితా విడుదల సమయంలో 21,085 మందిగా పేర్కొంది. సంఖ్యలో మార్పునకు ఎటువంటి వివరణ లేదు.

బహుళ మూల్యాంకనం:
జవాబు పత్రాల తొలి రెండు మూల్యాంకనాల్లో మార్చి 13 నాటి వెబ్ నోట్ ప్రకారం బార్‌కోడ్, బబ్లింగ్‌లున్నాయి. మూడో మూల్యాంకనంలో ఇవి లేవు. ఏపీలో నిర్వహించినట్లు ఇక్కడా చేశామని కమిషన్ చెప్పినా మూడో మూల్యాంకనం భిన్నంగా ఉండటంతో మార్కులను మార్చే అవకాశం ఉంది. నోటిఫికేషన్‌లో మూడో మూల్యాంకనంపై వివరాలు లేవు. కమిషన్ చర్యలు గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పవిత్రతను దెబ్బతీశాయి. మూల్యాంకన ప్రక్రియ పిటిషనర్ల వాదనలకు బలాన్ని చేకూర్చింది. వారి వాదన తోసిపుచ్చలేం.

మార్కుల జాబితా ప్రచురణ:
నిబంధనల ప్రకారం అభ్యర్థుల మార్కులను సబ్జెక్టుల వారీగా ప్రచురించాలి. అలా చేయకుండా కమిషన్ వ్యక్తిగత లాగిన్‌లకు సబ్జెక్టుల వారీగా పంపింది. అంటే ఎవరి మార్కులు వారికే కనిపిస్తాయి తప్ప.. ఇతరుల మార్కులు తెలియవు. ఇది సరికాదు. అందరి అభ్యర్థుల మార్కులతో జాబితాను ప్రచురించకపోవడం పారదర్శకతను దెబ్బతీస్తోంది. దీనిపై కమిషన్‌ను ప్రశ్నించే హక్కు అభ్యర్థులకు ఉంది.

అర్హత సాధించని అభ్యర్థుల పేపర్లు మూల్యాంకనం:
ఇంగ్లిష్ పరీక్షలో అర్హత సాధించిన తర్వాతే ఇతర పేపర్లు మూల్యాంకనం చేశామని కమిషన్ చెప్పింది. అయితే జనరల్ ఇంగ్లిష్‌లో అర్హత సాధించని వారి పేపర్లూ మూల్యాంకనం చేసినట్లు 12 మంది పేర్లు పరిశీలిస్తే తెలుస్తోంది. పరీక్ష నిర్వహణలో అసమగ్రతను ఇది స్పష్టం చేస్తోంది. దశాబ్దంగా ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇది అశనిపాతం లాంటిది.

ఖాళీలు పెంచడం:
రెండో నోటిఫికేషన్ ద్వారా ఖాళీల సంఖ్య పెంచారు. మళ్లీ దరఖాస్తులు తీసుకున్నారు. అంతకుముందు దరఖాస్తు చేసుకోని వాళ్లు కూడా కొత్తగా రావడంతో అభ్యర్థుల సంఖ్య పెరిగింది. అయితే దీనిపై ఇప్పటికే ఇదే హైకోర్టు తీర్పునిచ్చింది. అందుకే ఈ అంశంపై విచారణకు నిరాకరించాం.

2) మూల్యాంకన విధానం..

మూల్యాంకనదారుల ఎంపిక:
రెగ్యులర్ అధ్యాపకులు, ఇద్దరు రిటైర్డ్ అధ్యాపక సభ్యులను మెయిన్స్ మూల్యాంకనానికి నియమించినట్లు కమిషన్ పేర్కొంది. వీరి పేర్లను రహస్యంగా ఉంచామని, పిటిషనర్లు బహిర్గతం చేసినందుకు చట్టప్రకారం చర్యలు తీసుకునే హక్కు ఉందని వాదించింది. అలాంటప్పుడు ఆ వివరాలిచ్చిన కమిషన్ ఉద్యోగులపై కూడా చర్యలు తీసుకోవాలి. నోటిఫికేషన్ ప్రకారం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే తీసుకోవాలన్నది పిటిషర్ల వాదన. ప్రైవేట్ ట్యూటర్‌గా పనిచేసిన డాక్టర్ ఎం.ఎ.మాలిక్‌ను కూడా తీసుకున్నారని వారు తెలిపారు. ఇతను 22 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి సహా ఇతర పత్రికలకు పోటీ పరీక్షల కథనాలను అందిస్తున్నానని పేర్కొన్నారు. దీనిని అంగీకరించని కమిషన్ పిటిషనర్లపై కేసులు నమోదు చేస్తామని బెదిరించింది. అలాగే కమిషన్ రెగ్యులర్ ఫ్యాకల్టీ అనే దానికి అర్థాన్ని మార్చింది.

పత్రాలు దిద్దిన విధానం:
సమాధాన పత్రాల మూల్యాంకనానికి ఏదైనా విధానం ఉందా? కీ ఉందా? అని కమిషన్‌ను ప్రశ్నించాం. ఎటువంటి కీ లేదని, మూల్యాంకనదారులు సబ్జెక్ట్ నిపుణులని పేర్కొంది. తర్వాత కీ ఉందని సీల్డ్ కవర్‌లో సమర్పించింది. కీ విషయంలో కమిషన్ తన వాదనను ఎప్పటికప్పుడు మార్చింది. పరీక్షల నిర్వహణ, మూల్యాంకనాలపై ఏదైనా కొత్త వ్యవస్థను ప్రవేశపెట్టాలనుకుంటే సర్కార్‌ను సంప్రదించాలి. కానీ అలా జరగలేదని తెలుస్తోంది. కోర్టుకు సమర్పించిన కీలోనూ లోపాలున్నాయి.

'తెలుగు' అభ్యర్థుల విషయంలో నిర్లక్ష్యం:
తెలుగు మాధ్యమంలో మెయిన్స్ రాసిన వారి పత్రాలను సరైన పద్ధతిలో మూల్యాంకనం చేయలేదనేది ప్రధాన ఆరోపణ. కాగా భాషల వారీగా ఎంతమంది మూల్యాంకనదారులను నియమించారన్నది స్పష్టత లేదు. టీచర్లంతా ఇంగ్లిష్, తెలుగులో ప్రావీణ్యం కలిగినవారే అని చెప్పడం హాస్యాస్పదం. ఇంగ్లిష్ మీడియంలో 506 మంది (మొత్తం రాసిన వారిలో 89.88 శాతం), తెలుగు మీడియంలో 56 (9.95 శాతం), ఉర్దూలో ఒకరు అర్హత సాధించారు. ఈ గణాంకాలను పరిశీలిస్తే తెలుగు అభ్యర్థులకు అన్యాయం జరిగిందని స్పష్టమవుతోంది.

నిర్దిష్ట కేంద్రాల్లో అత్యధికులు అర్హత సాధించడం:
18, 19 కేంద్రాల నుంచి 35.5 శాతం మహిళలు అర్హత సాధించగా, ఇతర కేంద్రాల నుంచి 5.35 మాత్రమే అర్హత పొందారు. ఇది చాలా వ్యత్యాసాన్ని చూపిస్తోంది. ఆమోద యోగ్యంగా లేదు.

కొందరు అభ్యర్థులకు ఒకే మార్కులు ఇవ్వడం:
మెయిన్స్ రాసిన చాలామంది అభ్యర్థులకు ఒకే విధంగా మార్కులొచ్చాయి. 719 మందికి ఈ విధంగా మార్కులొచ్చాయని కమిషన్ అంగీకరించింది. అయితే పోటీ పరీక్షలో సమాన మార్కులు వచ్చే అవకాశమున్నా.. పక్కపక్క హాల్ టికెట్ల వ్యక్తులకు అలా రావడం అనుమానాలకు తావిస్తోంది. సమాన మార్కులు వచ్చిన వారి విషయంలోనూ కమిషన్ అనుసరించిన ర్యాంక్‌ల విధానం చట్టవిరుద్ధం.. లోపభూయిష్టం.

సచివాలయం కూడా కట్టాననంటాడేమో!

- అబద్ధాలు, అసత్యాల ప్రవాహంలో ముఖ్యమంత్రి రేవంత్
- ఎల్లంపల్లి, మల్లన్నసాగర్ పనులు బీఆర్ఎస్ హయాంలోనే పూర్తి
- హైదరాబాద్‌కు గోదావరి జలాలను తెచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే: హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: అబద్ధాలు, అసత్యాల ప్రవాహంలో మునిగిపోయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నోరు విప్పితే అబద్ధాలు తప్ప మరేమీ మాట్లాడలేని స్థితికి చేరుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. సచివాలయానికి పునాదిరాళ్లు మోసింది, అమరవీరుల స్తూపాన్ని నిర్మించింది కూడా తానే అంటాడేమో అని ఎద్దేవా చేశారు. కలెక్టరేట్లను కాంగ్రెస్ కట్టిందని, చార్మినార్‌ను ఆయన తాత కట్టిందని చెప్పినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదని అన్నారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. అధికార, ధన బలంతో తిమ్మిని బమ్మి చేయాలనుకునే రేవంత్‌రెడ్డి ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టడం ఖాయమని స్పష్టంచేశారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుతోపాటు కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మల్లన్నసాగర్‌ను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిందని చెప్తున్న రేవంత్ మాటలతో ముఖ్యమంత్రి కుర్చీకి ఉన్న గౌరవం పోయిందని అన్నారు.

ఎన్ని కుట్రలు చేసినా.. మల్లన్నసాగరే ఆధారమైంది

'ఎల్లంపల్లి ప్రాజెక్టు హై లెవల్ బ్రిడ్జి, పునరావాసం, భూసేకరణ తదితరాలన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2,052 కోట్లతో పూర్తి చేసి 2016లో 20 టీఎంసీల నీటిని నింపింది. ఇప్పటికే ఎల్లంపల్లి ప్రాజెక్టు సామర్థ్యానికి మించి నీటి వినియోగం జరుగుతుండగా మరో 20 టీఎంసీలు హైదరాబాద్‌కు రేవంత్‌రెడ్డి ఎలా తీసుకువస్తారు? ఎల్లంపల్లి నుంచి మిడ్ మానేరు వరకు కాలువలు, రిజర్వాయర్లు, సబ్‌స్టేషన్లు, పంప్ హౌజ్ పనులన్నీ బీఆర్ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసింది. ఎల్లంపల్లి నుంచి మల్లన్నసాగర్ వరకు నీళ్లు గాలిలో వస్తున్నాయా? రెండు రోజుల క్రితం గండిపేట వద్ద సీఎం శంకుస్థాపన చేసిన హిమాయత్‌సాగర్‌కు గోదావరి జలాలు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచే వస్తాయి. మల్లన్నసాగర్ విషయంలో రేవంత్ గావుకేకలు పెట్టినంత మాత్రాన అబద్ధాలు నిజం కాలేవు. ఎల్లంపల్లి నుంచి హైదరాబాద్ వాటర్ సప్లై స్కీమ్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేసింది. కృష్ణా నాలుగో దశ పనులను కూడా పూర్తి చేసింది మా ప్రభుత్వమే. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రూ.1,600 కోట్లతో 56 రిజర్వాయర్లు, 2,600 కిలోమీటర్ల పైప్ లైన్లు వేశాం. నాగార్జునసాగర్ డెడ్ స్టోరేజ్ నుంచి కూడా 60 టీఎంసీల నీళ్లు తీసుకునేలా సుంకిశాల ప్రాజెక్టు పనులు ప్రారంభించాం. పాలమూరు రంగారెడ్డి ద్వారా 6.50 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించాం. కృష్ణా నదిలో నీటి వాటా కోసం అనేక ప్రాజెక్టులను చేపట్టాం' అని వెల్లడించారు. ముఖ్యమంత్రిగా వికారాబాద్ జిల్లాకు రేవంత్‌రెడ్డి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు.

పీసీసీ అధ్యక్షుడే అప్రూవర్‌గా మారారు

- ఆ 10 మంది ఎమ్మెల్యేలు మా పార్టీలో చేరారని చెప్పారు
- స్పీకర్ నిర్ణయం తీసుకోకపోతే సుప్రీంకోర్టుకు వెళ్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సాక్షి, హైదరాబాద్/సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'ఆ పది మంది ఎమ్మెల్యేలు మా పార్టీలో చేరారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మొన్న టీవీల్లో చెప్పారు. ఆయనే అప్రూవర్‌గా మారి.. నేరాంగీకారం తెలిపిన తర్వాత విచారణ ఎందుకు? చర్చ ఎందుకు? వారిపై వేటు వేసేందుకు స్పీకర్‌కు మొహమాటం ఎందుకు?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు (కేటీఆర్) ప్రశ్నించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి భార్య శ్వేతారెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజీపేట మండలంలోని ఆవంచ గ్రామానికి వచ్చారు. శ్వేతారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. హరీశ్‌రావు తిరిగి హైదరాబాద్‌కు పయనమైన అనంతరం కేటీఆర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారిన వారు ఏ పార్టీలో ఉన్నారో చెప్పుకోలేని దురవస్థలో ఉన్నారన్నారు. స్పీకర్ నిర్ణయంలో తేడా ఉంటే.. టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడింది సుప్రీంకోర్టు ముందు పెడతామని స్పష్టం చేశారు.



లక్ష్మారెడ్డితో కలిసి శ్వేతారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు

రాజకీయ లబ్ధికోసమే 'మేడిగడ్డ'..

కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందంటూ కాంగ్రెస్ నాయకులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని.. రాజకీయ కక్షతో కేసీఆర్‌పై కేసు పెట్టేందుకు యత్నిస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రాజెక్ట్‌కు ఖర్చు చేసిందే రూ.94 వేల కోట్లు అని.. ఈ విషయాన్ని సీఎం రేవంత్ మామ పద్మారెడ్డి క్లియర్‌గా చెప్పారని.. అలాంటప్పుడు లక్ష కోట్ల అవినీతి ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. మేడిగడ్డలో 85 పిల్లర్లలో రెండు కుంగిపోతే అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరించి.. రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

'ఫార్ములా– ఈ' ఓ లొట్టపీసు కేసు..

'నేను మళ్లీ చెప్తున్నా.. ఫార్ములా–ఈ ఒక లొట్టపీసు కేసు. ఈ అంశంలో ఎవరైనా వచ్చి నన్ను లై డిటెక్టర్ పరీక్ష చేసుకోవచ్చు' అని కేటీఆర్ సవాలు చేశారు. హైదరాబాద్‌కి ఫార్ములా– ఈ రేసును తీసుకురావడానికి తాను ప్రయత్నాలు చేశానని చెప్పారు. రేసు నిర్వహణ కోసం ప్రభుత్వం నుంచి రూ.46 కోట్లు ఇవ్వాలని తానే ఆదేశాలు ఇచ్చానని, డబ్బులు కూడా నిర్దేశిత ఖాతాలోకే చేరాయన్నారు. మంగళవారం నందినగర్ నివాసంలో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'ఫార్ములా ఈ రేస్ కేసులో ప్రతి రూపాయికి లెక్క ఉంది. ప్రాసిక్యూషన్ చేసినా, చార్జిషీట్లు వేసినా ఏమీ చేయలేరు' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల కోసం శాండ్ బజార్లు

ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి: ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇసుక కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వమే తక్కువ ధరకు సరఫరా చేస్తోందని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు మంత్రి మంగళవారం శంకుస్థాపన చేశారు. పాలేరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా షూస్ పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తొలుత కూసుమంచి మండలంలోని 62 పాఠశాలల్లో 1,700 మంది పిల్లలకు షూస్ పంపిణీ చేసి అనంతరం కూసుమంచి తహసీల్‌లో ఇందిరమ్మ లబ్ధిదారుల కోసం ఏర్పాటు చేసిన ఇసుక (శాండ్) బజార్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇసుక ట్రాక్టర్‌ను పొంగులేటి స్వయంగా నడిపారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పేదల పక్కా ఇంటి కలను నిజం చేసేలా తమ ప్రభుత్వం లక్షలాది ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు.



ఇసుక ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి పొంగులేటి

జీతాలు ఇవ్వాల్సి వస్తుందనే

బీఆర్ఎస్ ఉద్యోగాలివ్వలేదు

- సీఎంను విమర్శించే స్థాయి హరీశ్, కేటీఆర్‌లకు లేదు
- ఎంపీలు మల్లు రవి, చామల, బలరాం నాయక్



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీలు చామల, మల్లు రవి, బలరాం నాయక్

సాక్షి, న్యూఢిల్లీ: కొత్తగా విధుల్లోకి చేరే ఉద్యోగులకు జీతాలు ఇవ్వాల్సి వస్తుందనే దుర్మార్గమైన ఆలోచనతో బీఆర్ఎస్ పదేళ్లలో కొత్త ఉద్యోగాలు ఇవ్వలేదని కాంగ్రెస్ ఎంపీలు ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వచ్చిన ఏడాదిన్నరలో ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తుంటే.. ఓర్వలేక అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, బలరాం నాయక్ మండిపడ్డారు. సీఎం రేవంత్‌ను విమర్శించే నైతిక హక్కు కేటీఆర్, హరీశ్‌లకు లేదన్నారు. మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 60 వేల ఉద్యోగాలిచ్చామని మల్లు రవి గుర్తుచేశారు. తాజాగా గ్రూప్-1 పేపర్ల వాల్యుయేషన్‌లో పొరపాట్లపై హైకోర్టు తీర్పు ఇస్తే కేటీఆర్, హరీశ్‌రావు పూర్తిగా ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. స్వయం ప్రతిపత్తి కలిగిన టీజీపీఎస్సీ ఈ ఉద్యోగాల ప్రక్రియను చూసుకుంటుందని, ఇందులో ప్రభుత్వ జోక్యం ఉండదన్నారు. హైకోర్టు తీర్పుపై ఎలా స్పందించాలనేది టీజీపీఎస్సీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మనుగడ ప్రమాదంలో ఉందని ఎంపీ చామల అన్నారు. కాళేశ్వరం అవినీతి కేసును సీబీఐకి అప్పగించినప్పటికీ దోపిడీపై కేసీఆర్ కుమార్తె కవిత ఇచ్చిన బహిరంగ వాగ్మూలం చాలన్నారు. వీటిపై స్పందించకుండా హరీశ్‌రావు గ్రూప్-1పై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 'ప్రాణహిత-చేవెళ్ల ప్రాణాన్ని తీసేసి కాళేశ్వరం కట్టారు. ఇక పేపర్ లీకేజీతో టీజీపీఎస్సీని దేశంలో నడిరోడ్డుపై నిలబెట్టిన ఘనత బీఆర్ఎస్‌ది' అంటూ విమర్శలు సంధించారు. నీళ్లు, నిధులు, విద్యా, ఉద్యోగ నియామకాల్లో తెలంగాణను ముంచేసిన కేసీఆర్ కుటుంబానికి రాష్ట్రంలో ఉండే అర్హత లేదని ఎంపీ బలరాం నాయక్ ఆరోపించారు.

'గ్రూప్-1' అవకతవకలపై

జ్యుడీషియల్ కమిషన్ వేయాలి

- రీ వాల్యుయేషన్‌తో సరిపెట్టుకోకుండా తిరిగి పరీక్షలు నిర్వహించాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్

సాక్షి, హైదరాబాద్: గ్రూప్ వన్ పరీక్ష'ల్లో కాంగ్రెస్ ప్రభుత్వం, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పాల్పడిన అవకతవకలపై సిట్టింగ్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు డిమాండ్ చేశారు. పరీక్షల వ్యవహారంలో అన్యాయం చేసిన బ్రోకర్లు, దోషులు బయటకు రావాలని, ఎన్ని ఉద్యోగాలు అమ్ముకున్నారో తేలాలని అన్నారు. ఈ పరీక్షల విషయంలో హైకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పుపై రాజకీయాలు చేయకుండా విద్యార్థులకు న్యాయం చేయాలని, ప్రభుత్వం కేవలం రీ వాల్యుయేషన్‌తో సరిపెట్టుకోకుండా తిరిగి పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు నేపథ్యంలో గ్రూప్ వన్ అభ్యర్థులు పలువురు మంగళవారం సాయంత్రం నందినగర్ నివాసంలో కేటీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రశ్నపత్రం లీక్ కావడంతో తప్పును సరిదిద్దుకునేందుకు పరీక్షను రద్దు చేశాం. కేవలం 63 పోస్టులను అదనంగా జోడించిన రేవంత్ ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ అంటూ అవకతవకలకు పాల్పడింది. జీవో నంబర్ 29 ద్వారా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులతో పాటు పరీక్ష ఫలితాల్లో తెలుగు మీడియం విద్యార్థులకు అన్యాయం జరిగింది. పరీక్షల నిర్వహణలో జరిగిన తప్పులకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర యువతకు క్షమాపణ చెప్పాలి. బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భర్తీ చేసిన ఉద్యోగాలకు సంబంధించిన నిజాలు ప్రజలకు తెలిపేందుకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 10-9-2025



అందమే ఆనందం...
ఆనందమే ఆత్మవిశ్వాసం!
ఆత్మవిశ్వాసం శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రతిబింబం!
అందుకే నార్మల్ గర్ల్ నుంచి సారా టెండూల్కర్ దాకా
ఎవరికైనా ఫిట్‌నెస్ జీవనసాఫల్య మంత్రం!
దీనికి సెలబ్రిటీల అనుభవాలే ఉదాహరణలు!

పీసీఓఎస్ ఫిట్‌నెస్

ముఖం మీద ఓ మొటిమ రాగానే అమ్మాయి ఇబ్బంది పడుతుంది. దాన్ని దాచడానికి ఎన్నోరకాలుగా ప్రయత్నిస్తుంది. చివరకు బయటకు వెళ్లడానికి.. కనీసం ఫ్రెండ్స్‌ని కలవడానికూడా ఇష్టపడదు. ఈ క్రీమ్ వాడండి.. తెల్లారికల్లా మొటిమ మాయమంటూ స్క్రీన్ మీద ఓ క్రీమ్‌ను చూపిస్తూ ఓ వాయిస్ ఓవర్ వినిపిస్తుంది. ఇలాంటి ప్రకటనలతో క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కూతురు, రిజిస్టర్డ్ న్యూట్రిషనిస్ట్ సారా టెండూల్కర్ కూడా ప్రభావితమైంది. ఒక్క కాస్మెటిక్ క్రీమ్స్‌కే కాదు హెయిర్ ఆయిల్ యాడ్స్‌కూ ఇన్‌ఫ్లుయెన్స్ అయింది.. ఆమె స్కూల్ రోజుల్లో. ఆ టీనేజ్‌లో ఆమెకు ముఖం నిండా మొటిమలు, జుట్టు సమస్యలుండేవి. అవి ఆమె ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయి. దాంతో ఫ్రెండ్స్‌ని కలవాలన్నా మేకప్ వేసుకునే వెళ్లేదట. టీవీ కమర్షియల్స్‌లో కనిపించిన క్రీములు, ఆయిల్స్ అన్నిటినీ వాడిందట. అసలామె సమస్యలకు కారణం .. పీసీఓఎస్. దేశంలో రీప్రొడక్టివ్ ఏజ్‌లోని ప్రతి అయిదుగురు అమ్మాయిల్లో ఒకరు దీనితో బాధపడుతున్నారు.

సారా ఏం చేసింది?

మొటిమలు, జుట్టు సమస్యల్లాంటి సైడ్ ఎఫెక్ట్స్ మీద శ్రద్ధ పెట్టి సత్వర ఫలితాల కోసం ఆరాటపడిన సారా.. అసలు సమస్య అయిన పీసీఓఎస్‌ను పట్టించుకోలేదు. దాన్ని కంట్రోల్ చేసే శాశ్వత పరిష్కారం గురించి ఆలోచించలేదు. కాస్మెటిక్స్‌తో రిజల్ట్స్ రాకపోయేసరికి ఒత్తిడికి లోనై డాక్టర్ కూడా అయిన అమ్మ అంజలి టెండూల్కర్ దగ్గర వాపోయింది. అప్పుడు అంజలి తన కూతురిని వైద్యనిపుణుల దగ్గరకు తీసుకెళ్లింది. 'వాళ్లు నా దినచర్య, డైట్ హేబిట్స్ గురించి అడిగారు. పౌష్టికాహారం తీసుకొమ్మన్నారు. ఫిజికల్ ఎక్సర్‌సైజ్ తప్పనిసరని చెప్పారు. ఆ సలహాలు, సూచనలు పాటించసాగాను. మైండ్‌ఫుల్‌నెస్ మీదా కాన్‌సన్‌ట్రేట్ చేశాను. వెంటనే రిజల్ట్స్ రాలేదు. కొంచెం టైమ్ పట్టింది.. ఆలస్యమైనా ఆరోగ్యం చేకూరింది. పీరియడ్స్ రెగ్యులర్ అయ్యాయి. ముఖం మీది మొటిమలు పోయాయి. జుట్టూ పెరగసాగింది. అప్పటి నుంచి అదే జీవనశైలిని అనుసరిస్తున్నాను. పీసీఓఎస్‌తో లైఫ్ సవాలే. అది శారీరకంగానే కాదు మానసికంగానూ కుంగదీస్తుంది. ఆత్మవిశ్వాసాన్ని దెబ్బ తీస్తుంది. దాని వల్ల నేను స్ట్రెస్ ఫీలయ్యి, ఫ్రస్ట్రేట్ అయిన సందర్భాలు కోకొల్లలు. అయితే సరిచేసుకోలేనంత మొండి సమస్య కాదు. ఇన్‌స్టంట్ రిజల్ట్స్ పర్మినెంట్ సొల్యూషన్స్ కావు. కాబట్టి షార్ట్ టర్మ్ రిజల్ట్స్ మీద టైమ్ వేస్ట్ చేసే బదులు మన జీవనశైలిని మెరుగుపరచుకునే ప్రయత్నం చేయాలి. పర్‌ఫెక్షన్ మీద కన్నా స్థిరత్వం మీద శ్రద్ధ పెట్టాలి. బ్యాలెన్స్‌డ్ డైట్, ఎక్సర్‌సైజ్‌లను జీవితంలో భాగం చేసుకుని కొనసాగించాలి! శారీరక, మానసిక ఆరోగ్యానికవే దివ్యౌషధాలు. అయితే నిపుణుల సలహా, హెల్ప్ కంపల్సరీ. ఈ విషయంలో అమ్మకు థాంక్స్ చెప్పుకోవాలి. సరైన సమయంలో నన్ను నిపుణుల దగ్గరకు తీసుకెళ్లింది. నిజానికి మా ఇంట్లో నాన్న గానీ, అమ్మ గానీ ఫిజికల్ యాక్టివిటీ, మిత ఆహారం, మైండ్‌ఫుల్‌నెస్‌కి చాలా విలువిస్తారు. ఫిట్‌నెస్ అండ్ వెల్‌నెస్ మా డిన్నర్ టేబుల్ కన్వర్జేషన్స్‌లో భాగం. అలాంటి వాతావరణంలో పెరిగిన నేను.. స్కూల్ డేస్‌లో కాస్త నిర్లక్ష్యం చేశాను. కానీ అమ్మ గైడెన్స్ వల్ల త్వరగానే మళ్లీ సరైన దారిలో పడ్డాను. ఇప్పుడు బ్లాక్ కాఫీతో నా డే స్టార్ట్ అవుతుంది. ఎక్సర్‌సైజ్, నట్స్, మాచా టీ, బ్యాలెన్స్‌డ్ డైట్.. ఎట్‌సెట్రాతో కంటిన్యూ అవుతుంది' అని చెబుతుంది సారా టెండూల్కర్.

పీసీఓఎస్ అండ్ పీసీఓడీ అంటే...

పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్) అనేది హార్మోన్ల సమస్య. అండాశయాలు అధిక స్థాయిలో మేల్ హార్మోన్లను ఉత్పత్తి చేస్తాయి. దీనివల్ల నెలసరి క్రమం తప్పడం, అధిక రక్తస్రావం లేదంటే రక్తస్రావం సరిగాకాకపోవడం, అండాశయాల్లో సిస్ట్‌లు, అవాంఛిత రోమాలు, జుట్టు పలచబడటం, మొటిమలు, అలసట, మూడ్ స్వింగ్స్, ఇన్సులిన్ రెసిస్టెన్స్, స్థూలకాయం, టైప్ 2 డయాబెటీస్, గుండె జబ్బుల రిస్క్ పెరగడం, కొలెస్ట్రాల్ అధికమవడం, సంతానోత్పత్తి సమస్యలు వంటివి తలెత్తుతాయి. పీసీఓడీ (పాలీసిస్టిక్ ఒవేరియన్ డిసీజ్)లో అండాశయాలు అపరిపక్వ లేదా పాక్షికంగా పరిపక్వత చెందిన అండాలను ఉత్పత్తి చేస్తాయి. తర్వాత ఇవి సిస్ట్స్‌గా మారే చాన్స్ ఉంటుంది. పీసీఓఎస్, పీసీఓడీ రెండిటికీ జీవనశైలి, హార్మోన్ల అసమతౌల్యం, జన్యుపరమైన అంశాలు కారణాలు. పీసీఓఎస్, పీసీఓడీ రెండూ కూడా 15-30 ఏళ్ల మధ్య వయసున్న అమ్మాయిల్లో కనపడతాయి. జీవనశైలి మార్పులతోపాటు డాక్టర్ సూచించిన చికిత్సతో ఈ రెండు సమస్యలను తగ్గించుకోవచ్చు.



- డాక్టర్ పూజిత సూరనేని, సీనియర్ అబ్‌స్టట్రీషన్, గైనకాలజీ అండ్ లాపరోస్కోపిక్ సర్జన్

ఇంకెంతో మంది సెలబ్రిటీలు..









ఒక్క సారా టెండూల్కరే కాదు పీసీఓఎస్, పీసీఓడీలతో సోనమ్ కపూర్, శ్రుతి హాసన్, మసాబా గుప్త, సారా అలీ ఖాన్ లాంటి సెలబ్రిటీలూ బాధపడ్డారు. పీసీఓఎస్ వల్ల సోనమ్ కపూర్ స్థూలకాయంతో ఇబ్బంది పడింది. 'పీసీఓఎస్‌ని డీల్ చేసే ఏకైక విధానం.. జీవనశైలిని మార్చుకోవడమే. లైఫ్‌స్టయిల్ అండ్ యోగాతోనే నేను పీసీఓఎస్‌ను మేనేజ్ చేశాను' అని చెబుతుంది సోనమ్ కపూర్. శ్రుతి హాసన్, మసాబా గుప్తాలూ అంతే! లైఫ్‌స్టయిల్‌లో మార్పులు, వ్యాయామం, పౌష్టికాహారంతోనే పీసీఓఎస్‌కి చెక్ పెట్టారు. సారా అలీఖాన్ పీసీఓడీ బాధితురాలు. దానివల్ల ఆమె 96 కిలోల బరువుండేది. దానికి ఆమె కూడా జీవనశైలిని మార్చుకోవడమే పరిష్కారమని గ్రహించి కసరత్తు మొదలుపెట్టింది. బరువు తగ్గడం మొదలయ్యాక పీసీఓడీ తగ్గింది. ఆమె ఆ ఎక్సర్‌సైజ్ ఆపలేదు. క్రమశిక్షణ గల జీవనశైలిని తప్పలేదు. ఈ ఆరోగ్య సూత్రం సమస్యలున్న వారికే కాదు.. భవిష్యత్‌లో ఎలాంటి శారీరక, మానసిక సమస్యలు రావద్దని కోరుకుంటున్న అందరికీ అనుసరణీయమే!

● ఆర్ట్ అండ్ కల్చర్

నది పాడే ఏకాంత గీతం



నది పాడే గీతాన్ని ఎప్పుడైనా విన్నారా?

నది మౌనాన్ని ఎప్పుడైనా అర్థం చేసుకున్నారా? సముద్రంలో కలిసే నది చెప్పే జీవిత సత్యం ఏమిటి?..నది అనేది తత్వశాల. ఎన్నో ప్రశ్నలు ఉంటాయి. ప్రవాహంలోనే జవాబులు ఉంటాయి.

ఆరుగురు మహిళా ఆర్టిస్ట్‌లు... అలము కుమరెసన్, అపరాజిత జైన్ మహాజన్, డా. సవిత, హన్సిక శర్మ, లక్ష్మీ మాధవన్, మీనాక్షి నిహలాని 'వేర్ ది రివర్ మీట్స్ ది సీ' పేరుతో ముంబైలోని ఆర్ట్ గ్యాలరీ 'అనూప్ మెహతా కాన్‌టెంపరరీ ఆర్ట్'లో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఫైబర్, క్లాత్, ఎంబ్రాయిడరీలకు ఆధునిక కళారీతులను జోడించి కన్నుల పండగ చేశారు. 'జీవన ప్రయాణానికి నది ప్రతీకలాంటిది' అంటారు ఆ ఆరుగురు ఆర్టిస్ట్‌లు. ఈ చిత్రాలలో మన వారసత్వ సంపద, సంస్కృతి కనిపిస్తాయి. స్త్రీవాద గొంతుక వినిపిస్తుంది.

టెక్స్‌టైల్ ఆర్ట్‌కు కాలం చెల్లుతుందా? అనుకునే రోజుల్లో అది ప్రపంచ వ్యాప్తంగా పునరుజ్జీవించింది. సమకాలీన అంశాలతో మమేకం అవుతూ కొత్త కాంతులు విరజిమ్ముతోంది. ఈ ఆరుగురు ఆర్టిస్ట్‌ల 'వేర్ ది రివర్ మీట్స్ ది సీ' వస్త్రకళను మరింత కొత్తగా చూపే ప్రయత్నం.

● కాస్త సరదాగా

ఏమ్మా ఎలా ఉన్నావు?



'ఏమ్మా...ఇంతకీ నువ్వు ఎక్కడుంటావు?

ఎంత మంది పిల్లలు, చిన్నవాళ్లేనా?

నాకు ఒక మంచి ఫోన్ కొనిపెట్టవచ్చు కదా!... ఈ మాటలు విని పెద్దగా నవ్వుకోవడానికి ఏముంది!

అయితే ఇంటర్‌నెట్‌వాసులు మాత్రం తెగ నవ్వుతున్నారు. అసలు విషయంలోకి వద్దాం... ఒక బామ్మ చాట్‌జీపీటీతో ముచ్చటించడం మొదలుపెట్టింది. అందులో భాగంగానే 'ఎక్కడుంటావు? ఎంత మంది పిల్లలు?' అని అడిగింది.

బామ్మ అమాయకత్వానికి నవ్వులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. కామెంట్ సెక్షన్ ఫన్నీ రియాక్షన్స్‌తో నిండిపోయింది.

బామ్మలు ఏఐ చాట్‌బాట్స్‌తో సరదాగా సంభాషించడం అనేది సోషల్ మీడియాలో ట్రెండ్‌గా మారింది.

● సమ్‌థింగ్ స్పెషల్

ఇది ఫ్యామిలీ ఫ్లైట్!





'మా అమ్మాయి పైలట్' 'నా మనవరాలు పైలట్' అని చెప్పుకోవడంలో సంతోషం ఉంది. అంతకంటే ఎక్కువ సంతోషం ఆమె నడుపుతున్న విమానంలో ప్రయాణించడంలో ఉంది. ఇండిగో పైలట్ తనిష్క ముగ్దల్ తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మలకు విమానం ఎక్కడం అదే మొదటి సారి. అది తమ ఇంటి ఆడబిడ్డ నడిపే విమానం. యూనిఫామ్‌లో ఉన్న తనిష్క, ఆనందబాష్పాలతో అమ్మా,నాన్నలు, తాత,అమ్మమ్మలకు ఇండిగో విమానంలో స్వాగతం పలుకుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియో క్లిప్‌లో భారీ సంభాషణలు, గ్రాఫిక్స్ హంగామా లేకపోవచ్చు. భావోద్వేగాలే బలం అయ్యాయి.

ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తూ...'అమ్మానాన్నల ప్రోత్సాహం, చేసిన ప్రార్థనలు, చేసిన త్యాగాలు నేను పైలట్ కావడానికి తోడ్పడ్డాయి' అని రాసింది తనిష్క.

'ఆ తల్లిదండ్రుల కళ్లలో ఎంత సంతోషం కనిపిస్తుందో చూడండి'

'పిల్లలు మంచి స్థాయికి వెళ్లినప్పుడు, ఆ స్థాయిని కళ్లారా చూసినప్పుడు, వారికి అంతకు మించిన శక్తి ఏముంటుంది!' 'మనం ఎంత పెద్ద స్థాయికి వెళ్లినా తల్లిదండ్రులను ఎప్పుడూ గుండెలో పెట్టుకోవాలి'... ఇలాంటి కామెంట్స్ ఎన్నో నెటిజనుల నుంచి వచ్చాయి.

● ఇన్నోవేషన్

విలేజ్ సైంటిస్ట్ బనిత

'అలా సరే, ఇలా అయితే ఎలా ఉంటుంది?' అని ఆలోచించడమే ఆవిష్కరణ. వచ్చిన ఆలోచనను ఇష్టపడి, కష్టపడి నిజం చేసుకోవడమే ఆవిష్కరణ.

'మేక్ ఇన్ ఇండియా' నినాదం ఆమెకు తెలుసో లేదో తెలియదు. ఆమె సైన్స్ పుస్తకాలు చదివింది కూడా లేదు. అయితే కొత్త కొత్త ఆవిష్కరణలు అంటే ఆమె ఇష్టం. అదే సమయంలో మనం మరిచిపోయిన సంప్రదాయ వస్తువులు అంటే ఇష్టం. వాటిని ఈ తరానికి పరిచయం చేసి తిరిగి వినియోగంలోకి తీసుకురావడం అంటే ఇష్టం.



పశ్చిమబెంగాల్‌లోని గ్రామీణ ప్రాంతానికి చెందిన బనితకు ఇన్‌స్టాగ్రామ్‌లో లక్ష మందికి పైగా ఫాలోవర్స్ ఉన్నారు. ఎప్పుడూ ఏదో కొత్త ఆవిష్కరణ చేస్తూ ఆ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేస్తుంటుంది. ఇందులో ఎన్నో వీడియోలు వైరల్ అయ్యాయి. తాజాగా...ఫ్యాన్ స్ట్రక్చర్, ప్లాస్టిక్ బాక్స్, నీళ్లు, ఐస్, వైర్‌లను ఉపయోగించి 'మినీ ఏసీ' తయారుచేసింది. 'ఇది ఎలా పనిచేస్తుందో తెలుసా? ఎలా తయారుచేయాలో తెలుసా?' అంటూ డెమో కూడా ఇచ్చింది.

'విలేజ్‌లైఫ్ విత్ బనిత' ట్యాగ్‌లైన్‌తో బనిత ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో పోస్ట్ చేసే వీడియోలు సంభ్రమాశ్చర్యాలకు గురి చేయడమే కాదు పట్టణ, గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

● లీగల్

ఉద్యోగం మాని మూడేళ్లయినా ఫైనల్ సెటిల్మెంట్ రాలేదు?

ఒక పెద్ద కార్పొరేట్ కంపెనీలో ఏడాదిపాటు పని చేశాను. మరొక మంచి ఉద్యోగం రావడంతో కంపెనీ మారాను. మొదటి కంపెనీ వారు రిలీవింగ్ లెటర్ ఇస్తూ నా పని విధానం బాగుంది అంటూ – భవిష్యత్తుకు అభినందనలు కూడా తెలియజేశారు. రెండవ కంపెనీ వారు బ్యాక్ గ్రౌండ్ పరిశీలనలో కూడా నామీద సానుకూలంగానే చెప్పారు. 3,4 ఏళ్ల తర్వాత ఇప్పుడు మూడవ కంపెనీకి ఇటీవలే మారాను. నా బ్యాక్ గ్రౌండ్ పరిశీలనలో మొదట పని చేసిన కంపెనీ వారు నా మీద కొన్ని అభియోగాలు మోపారు. నేను వారి కంపెనీ గోప్యతను దెబ్బతీశాను అని, ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ కూడా ఇంకా చేయలేదు అని చెప్పగా ప్రస్తుతం పని చేస్తున్న కంపెనీ వారు నాకు నోటీసు జారీ చేశారు. మూడేళ్ల తర్వాత ఇదే మిటి అని మొదటి కంపెనీ వారిని ప్రశ్నించగా, నా బ్యాక్‌గ్రౌండ్ లో ఎటువంటి లోపం లేదు అంటూ మరలా ఒక రిపోర్ట్ ఇవ్వడంతో ప్రస్తుత కంపెనీ వారు నోటీసును ఉపసంహరించుకున్నారు. కానీ మొదటి కంపెనీ వారు ఇప్పటికీ కూడా ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ చేయలేదు – అడిగితే వారి గోప్యతకు నేను భంగం కలిగించాను అని అభియోగం ఉన్నది కాబట్టి మేము చేయము అని అంటున్నారు. రెండేళ్ల క్రితం ఒక మెయిల్ రాసి వదిలేసాను కానీ ఇప్పుడు ఈ సమస్య వస్తుంది అని అనుకోలేదు. మరొక కంపెనీకి మారినప్పుడు కూడా ఇదే సమస్య రావచ్చు అని అనిపిస్తుంది. ఈ పరిస్థితులలో నేను ఏం చేయాలి?

- జాన్ వెస్లీ, విశాఖపట్నం

ఒక కంపెనీలో ఉద్యోగం చేసిన తర్వాత రిలీవింగ్ లెటర్ తీసుకుని వెళ్లి మరొక కంపెనీలో కూడా చేరిన తర్వాత, మూడు సంవత్సరాల పాటు నిశ్శబ్దంగా ఉండి, ఇప్పుడు మీ బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్‌లో మీకు వ్యతిరేకంగా సమాచారాన్ని ఇవ్వడం చట్టరీత్యా తప్పు. రిలీవింగ్ లెటర్‌లో మీ కాండక్ట్ కూడా బాగుంది అని రాశారు కాబట్టి, ఒకసారి ఒక స్టేట్మెంట్ చేసిన తర్వాత ఆ స్టేట్‌మెంట్‌ను వ్యతిరేకిస్తూ మరొక స్టేట్మెంట్ చేయడం కుదరదు. మీ కేసులో అది పరువు నష్టానికి కూడా దారితీస్తుంది. ఒకవేళ కంపెనీ వారికి మీపై ఏదైనా ఫిర్యాదు వంటివి ఉండి ఉంటే వారు సరైన సమయంలోగా మీకు నోటీసులు లేదా సమాచారాన్ని అందించి తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. అయితే మీరు కూడా ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ రాకపోయినప్పటికీ చాలా సమయాన్ని వృథా చేశారు. ఏది ఏమైనా, సదరు కంపెనీ వారు మీకు భవిష్యత్తులో ఇబ్బంది కలిగే విధంగా బ్యాక్‌గ్రౌండ్ వెరిఫికేషన్‌లో సమాధానాలు ఇచ్చే ఆస్కారం లేకపోలేదు. ఉద్యోగం మీద ఆధారపడి ఉన్నారు కాబట్టి కంపెనీ వారితో సామరస్యంగా మాట్లాడి పరిష్కరించుకునే ఏర్పాట్లు చేసుకోవడం మంచిది. అప్పటికీ కూడా వారు వినకపోతే, అన్ని విషయాలను పొందుపరిచి ఒక లీగల్ నోటీస్ పంపండి. తదుపరి మీకు రావలసిన ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్‌తో పాటు మీకు జరిగిన అన్యాయానికి తగిన పరిహారం కోరుతూ సివిల్ కోర్టులో దావా కూడా వేయవచ్చు. మీకు లేబర్ హక్కుల చట్టాలు వర్తించినట్లయితే లేబర్ కమిషనర్‌ను, తద్వారా లేబర్ కోర్టును కూడా ఆశ్రయించవచ్చు.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● బ్యూటిప్స్

కురులు... వివరాల విరులు



- అరచేతులు, అరికాళ్లు, పెదవులు, మ్యూకస్ పొరలు తప్ప శరీరంలోని మిగిలిన అన్ని భాగాల్లోనూ వెంట్రుకలు పెరుగుతాయి. ఎముకల్లోని మూలగ తర్వాత అత్యంత వేగంగా పెరిగే కణజాలం జుట్టు మాత్రమే.
- మనిషి తలపై సగటున లక్ష వరకు వెంట్రుకలు ఉంటాయి. తలవెంట్రుకల్లో 90 శాతం పెరుగుతూ ఉంటే, 10 శాతం విశ్రాంతి తీసుకుంటూ ఉంటాయి.
- తలపై లక్ష వరకు ఉండే వెంట్రుకల్లో రోజూ వంద వరకు వెంట్రుకలు రాలిపోతూ ఉంటాయి. పురుషుల్లో సగం మందికి యాభయ్యేళ్ల లోపు వయసులోనే బట్టతల వస్తుంది. థైరాయిడ్ సమస్యల వల్ల, ఐరన్ లోపంవల్ల తాత్కాలికంగా తలపై వెంట్రుకలు పలచబడతాయి. అలాగే, కొన్ని రకాల ఔషధాల ప్రభావం వల్ల కూడా తలవెంట్రుకలు గణనీయంగా రాలిపోతాయి.
- వెంట్రుకల ఆయుర్దాయం మూడు నుంచి ఏడేళ్లు. పోషకాలతో నిండిన ఆహారం తీసుకుంటే వెంట్రుకలు ఆరోగ్యంగా పెరుగుతాయి. గుడ్లు, చేపలు, లివర్, కిడ్నీలు, ఆకు కూరలు, ఆకుపచ్చని కూరగాయలు వంటివి జుట్టు ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదపడతాయి.
- జుట్టులోని పిగ్మెంట్స్ కారణంగానే జుట్టుకు రంగు ఏర్పడుతుంది. వయసు మళ్లే దశలో పిగ్మెంట్స్ తగ్గడం కారణంగా జుట్టు నెరుస్తుంది.
- వెంట్రుకలు గరిష్ఠంగా 90 సెం.మీ. వరకు పెరుగుతాయి. ఏడాది వ్యవధిలో వెంట్రుకల పెరుగుదల 12 సెం.మీ. వరకు ఉంటుంది.

● ఇంటీరియర్స్ ట్రెండ్

సౌకర్యం + సంతోషం = కవాయి

'కవాయి' అనేది ఇప్పుడు సరికొత్త ఇంటీరియర్స్ ట్రెండ్‌గా మారింది. మృదువైన రంగులు, కంటికి సంతోషాన్ని ఇచ్చే వస్తువులతో జపనీస్ ఇంటీరియర్ డిజైన్ కవాయి విజువల్ థెరపీలా పనిచేస్తుందని చెబుతున్నారు నిపుణులు. 'నా గది నా కంఫర్ట్ ప్లేస్' అనుకునేవాళ్లకు తమ గదిని మానసిక ప్రశాంతత ఇచ్చేలా తీర్చిదిద్దుకోవడానికి కవాయి డిజైన్ ఉపయోగపడుతుంది. 'ఎంతో మంది, ముఖ్యంగా మహిళలు కవాయి ఇంటీరియర్స్ గదులను బాగా ఇష్టపడుతున్నారు. కవాయి డిజైనింగ్ వ్యక్తులపై సానుకూల ప్రభావం కలిగిస్తుంది' అంటుంది బెంగళూరు చెందిన ఆర్కిటెక్ట్ సిరి శేఖర్.





'కవాయి' అనే జపనీస్ పదానికి అందమైన, ఆకర్షణీయమైన అని అర్థం. క్లౌడ్-షేప్‌డ్ ల్యాంప్స్, ఫ్లోరల్ ల్యాంప్స్, మష్రూమ్ మోటిఫ్స్, వాల్ స్టికర్స్, క్యూట్ బౌల్స్, మినియేచర్‌లు... మొదలైనవి కవాయిలో భాగం.

ఫ్యాషన్, కళ, సంగీతం, జీవనశైలి (లైఫ్‌స్టైల్), ఇంటీయర్స్‌లో కవాయి ప్రభావం కనిపిస్తోంది. మన దేశంలో కవాయి ఇంటీరియర్స్‌కు సంబంధించి డిజైనర్‌ల సంఖ్య పెరిగింది.

'గది అలంకరణ అనేది కేవలం ఆకర్షణ కోసం మాత్రమే కాదు. ఆ అలంకరణ మనల్ని ఎప్పుడూ ఉల్లాసంగా ఉంచుతుంది. ఒత్తిడిని దూరం చేస్తుంది. కవాయి ఇంటీరియర్స్‌తో నా గదిని తీర్చిదిద్దుకున్నాను. గదిలోకి అడుగు పెడితే ఉత్సాహంగా ఉంటుంది' అంటుంది గోవాకు చెందిన కంటెంట్ క్రియేటర్ రిచా దేశాయ్.

బులియన్
బంగారం 10 గ్రా.; వెండి కిలో
సెప్టెంబర్ 9న ముగింపు రూ.లలో


నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,13,500	1,06,270	1,29,500
విజయవాడ	1,12,650	1,01,100	1,26,600
విశాఖపట్నం	1,10,290	1,01,100	1,40,000
రాజమండ్రి	1,12,650	1,04,130	1,28,600
ప్రొద్దుటూరు	1,13,600	1,04,510	1,28,800
చెన్నై	1,10,720	1,01,500	1,40,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



పతకానికి విజయం దూరంలో నిఖత్ జరీన్

లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్, రెండుసార్లు విశ్వవిజేత నిఖత్ జరీన్ మూడో పతకానికి విజయం దూరంలో నిలిచింది. ఇంగ్లండ్‌లో జరుగుతున్న ఈ మెగా టోర్నీలో తెలంగాణకు చెందిన నిఖత్ జరీన్ 51 కేజీల విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో నిఖత్ 5:0తో జపాన్‌కు చెందిన యునా నిషినాకాపై విజయం సాధించింది. 29 ఏళ్ల నిఖత్ 2022, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో స్వర్ణ పతకాలు గెలిచింది. మరోవైపు 48 కేజీల విభాగంలో మీనాక్షి హుడా కూడా క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించి పతకానికి గెలుపు దూరంలో నిలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో మీనాక్షి 5:0తో వాంగ్ కియుపింగ్ (చైనా)పై గెలుపొందింది. పురుషుల విభాగంలో భారత బాక్సర్లు సుమిత్ కుండు (75 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), నరేందర్ (ప్లస్ 90 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు. సుమిత్ 0:5తో రామి కివాన్ (బల్గేరియా) చేతిలో, సచిన్ 1:4తో జిబార్స్ జెక్సన్ (కజకిస్తాన్) చేతిలో, నరేందర్ 1:4తో డీగో లెంజి (ఇటలీ) చేతిలో, లక్ష్య చహర్ 0:3తో సీజర్ యోజెర్లిన్ (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయారు. పురుషుల విభాగంలో భారత్ నుంచి ప్రస్తుతం ఇద్దరు బాక్సర్లు మాత్రమే బరిలో మిగిలారు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ జోడీ

హాంకాంగ్: భారత డబుల్స్ స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి హాంకాంగ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన తొలి రౌండ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–13, 18–21, 21–10తో చియు సియాంగ్ చియె–వాంగ్ చి లిన్ (చైనీస్ తైపీ) జంటపై విజయం సాధించి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకుంది. పురుషుల సింగిల్స్ విభాగంలో కిరణ్ జార్జి (భారత్) మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు. క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో కిరణ్ జార్జి 21–14, 21–13తో చియెమ్ జూన్ వె (మలేసియా)పై, 21–18, 21–14తో శంకర్ ముత్తుస్వామి (భారత్)లపై గెలుపొందాడు. మరోవైపు హైదరాబాద్ ప్లేయర్ తరుణ్ మన్నేపల్లి మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయాడు. క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో తరుణ్ 28–26, 21–13తో ప్రపంచ మాజీ నంబర్‌వన్, భారత్‌కే చెందిన కిడాంబి శ్రీకాంత్‌ను ఓడించి... రెండో రౌండ్‌లో 23–21, 13–21, 18–21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో ఓడిపోయాడు.

విజేత దీక్షిత



సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్–13 బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ ప్లేయర్ మోదిపల్లి దీక్షిత విజేతగా అవతరించింది. గోవాలో మంగళవారం ముగిసిన ఈ టోర్నీలో దీక్షిత నిర్ణీత 11 రౌండ్ల తర్వాత 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఎనిమిది గేముల్లో నెగ్గిన దీక్షిత, మరో మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది.

శుభారంభంపై గురి

నేడు భారత్ తొలి మ్యాచ్
- ఆసియా కప్‌లో యూఏఈతో పోరు
- జోరు మీదున్న సూర్య బృందం
- రాత్రి 8 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



సూర్యకుమార్ యాదవ్



వసీమ్

దుబాయ్: ఆసియా కప్ టోర్నీలో తమ ఆధిపత్యాన్ని మరోసారి ప్రదర్శించేందుకు భారత జట్టు సిద్ధమైంది. టోర్నీలో భాగంగా గ్రూప్ 'ఎ'లో నేడు జరిగే తమ తొలి మ్యాచ్‌లో టీమిండియా... ఆతిథ్య జట్టు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో తలపడనుంది. డిఫెండింగ్ వరల్డ్‌కప్ చాంపియన్ కావడంతో పాటు అపార ఐపీఎల్ అనుభవంతో నిండిన సూర్యకుమార్ బృందానికి ఈ పోరులో విజయం లాంఛనమే. అయితే మన తుది జట్టు కూర్పు ఎలా ఉంటుందనేదే ఇప్పుడు ప్రధాన చర్చ కానుంది. మరోవైపు అంతర్జాతీయ క్రికెట్‌లో ఇంకా ఎదిగే దశలోనే ఉన్న యూఏఈ బలమైన ప్రత్యర్థికి ఏమాత్రం పోటీనిస్తుందనేది చూడాలి. 2024లో విజేతగా నిలిచిన టి20 వరల్డ్ కప్ ఆరంభం నుంచి చూస్తే భారత్ 24 మ్యాచ్‌లు గెలిచి, 3 మాత్రమే ఓడింది.

సామ్సన్ అవుట్!

టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్ పునరాగమనంతో టి20 టీమ్‌లో భారత్ తప్పనిసరి మార్పులు చేసుకోవాల్సి వస్తోంది. ఈ ఫార్మాట్‌లో అసాధారణ ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మతో కలిసి అతను ఓపెనింగ్ చేస్తాడు. మూడో స్థానంలో ఇప్పటికే తనను తాను నిరూపించుకున్న తిలక్ వర్మకు అదే స్థానంలో అవకాశం ఖాయం కాగా నాలుగో స్థానంలో కెప్టెన్ సూర్యకుమార్ ఉన్నాడు. దాంతో వికెట్ కీపర్‌గా సంజు సామ్సన్‌కు చాన్స్ దొరికే అవకాశం కనిపించడం లేదు. సామ్సన్ సాధారణంగా టాపార్డర్ బ్యాటర్. టాప్–3లో ఆడకపోతే అతనికి చోటు అనవసరమని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. మంగళవారం జట్టు ప్రాక్టీస్ సెషన్‌ను బట్టి చూసినా అదే కనిపించింది. సామ్సన్‌కంటే ఫినిషర్‌గా జితేశ్ శర్మ మెరుగైన ఆటగాడు కాబట్టి కీపర్‌గా అతను బరిలోకి దిగవచ్చు. పేస్ బౌలింగ్, విధ్వంసక బ్యాటింగ్ కలగలిపిన ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలతో జట్టు దుర్భేద్యంగా ఉంది. ప్రధాన పేసర్లు బుమ్రా, అర్‌‌‌ష్‌దీప్‌ల స్థానాలకు ఢోకా లేదు. మరో ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ కూడా ఆడటంపై ఎలాంటి సందేహం లేదు. మిగిలిన ఏకైక స్థానం కోసం కుల్దీప్, వరుణ్ చక్రవర్తి మధ్య పోటీ ఉంది. అయితే టీమిండియాకు సంబంధించి తుది జట్టులో ఎవరు ఉన్నా అంతా విడివిడిగా మ్యాచ్ విన్నర్లు కాబట్టి సమస్య లేదు.

1 భారత్, యూఏఈ మధ్య ఇప్పటి వరకు ఒకే ఒక టి20 మ్యాచ్ జరిగింది. 2016 ఆసియా కప్‌లో భాగంగా జరిగిన ఈ పోరులో భారత్ 9 వికెట్ల తేడాతో గెలిచింది.

పిచ్, వాతావరణం

చాంపియన్స్ ట్రోఫీ సమయంలో పిచ్‌లు పూర్తిగా పొడిబారి స్పిన్‌కు బాగా అనుకూలించాయి. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదు. ఈ సీజన్‌లో కొత్తగా, జీవం ఉన్న పిచ్‌లు సిద్ధంగా ఉన్నాయి. కాబట్టి అటు బ్యాటింగ్‌తో పాటు పేసర్లకు కూడా మంచి అవకాశం ఉంది. తీవ్రమైన ఎండల మధ్య ఆటగాళ్లు శ్రమించాల్సి ఉంటుంది.

అనుభవలేమితో సమస్య...

సొంత మైదానంలో బరిలోకి దిగుతుండటం, ఇటీవలే ముక్కోణపు టోర్నీలో కూడా ఆడిన అనుభవం యూఏఈ జట్టుకు మానసికంగా కాస్త ఆత్మవిశ్వాసం పెంచే విషయం. అయితే భారత్‌లాంటి అత్యంత బలమైన జట్టును ఈ టీమ్ నిలువరించడం చాలా కష్టమైన విషయం. బుమ్రాలాంటి స్టార్‌ను ఎదుర్కొని పరుగులు సాధించడం వారి శక్తికి మించిన పని కావచ్చు. ఓపెనర్, కెప్టెన్ మొహమ్మద్ వసీమ్‌తో పాటు మరో ఓపెనర్ అలీ షాన్‌పై జట్టు బ్యాటింగ్ ప్రధానంగా ఆధారపడి ఉంది. ఆసిఫ్ ఖాన్, రాహుల్ చోప్రా కూడా కొన్ని కీలక పరుగులు సాధించగల సమర్థులు. జునైద్ సిద్దిఖ్, రోహిద్, హైదర్ అలీ ప్రధాన బౌలర్లు కాగా... లెఫ్టార్మ్ స్పిన్నర్ సిమ్రన్‌జీత్ సింగ్ మరో కీలక బౌలర్. భారత మాజీ ఆటగాడు, 2007లో టీమిండియా టి20 వరల్డ్ కప్ గెలిచిన జట్టుకు కోచ్‌గా వ్యవహరించిన లాల్‌చంద్ రాజ్‌పుత్ ఇప్పుడు యూఏఈ టీమ్‌కు హెడ్ కోచ్‌గా ఉన్నాడు. ఆయన మార్గదర్శకత్వంలోనే టీమ్ ఇటీవల కాస్త మెరుగైంది.

అఫ్గానిస్తాన్ అలవోకగా...

94 పరుగులతో హాంకాంగ్ చిత్తు ● ఆసియా కప్ టి20 టోర్నీ



సాదిఖుల్లా

అబుదాబి: అఫ్గానిస్తాన్ జట్టు అంచనాలకు తగిన ప్రదర్శనతో ఆసియా కప్‌లో శుభారంభం చేసింది. మంగళవారం మొదలైన ఈ టి20 టోర్నీ గ్రూప్ 'బి' తొలి మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 94 పరుగుల తేడాతో హాంకాంగ్‌ను చిత్తు చేసింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 188 పరుగులు చేయగా... ఆ తర్వాత హాంకాంగ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 94 పరుగులే చేయగలిగింది. అఫ్గాన్ భారీ స్కోరులో ఓపెనర్ సాదిఖుల్లా అటల్ (52 బంతుల్లో 73 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), అజ్మతుల్లా ఒమర్జాయ్ (21 బంతుల్లో 53; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) అర్ధ సెంచరీలతో ప్రధాన పాత్ర పోషించారు. ముఖ్యంగా అజ్మతుల్లా 20 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకొని అఫ్గాన్ తరఫున 'ఫాస్టెస్ట్ హాఫ్ సెంచరీ'ని నమోదు చేశాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు 35 బంతుల్లోనే 82 పరుగులు జోడించడం విశేషం. సీనియర్ ఆటగాడు మొహమ్మద్ నబీ (26 బంతుల్లో 33; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా కీలక పరుగులతో రాణించగా... రహ్మనుల్లా గుర్బాజ్ (8), ఇబ్రహీం జద్రాన్ (1), గుల్బదిన్ నైబ్ (5) విఫలమయ్యారు. హాంకాంగ్ బౌలర్లలో కించిత్ షా, ఆయుశ్ శుక్లా చెరో 2 వికెట్లు పడగొట్టారు. హాంకాంగ్ ఫీల్డింగ్ వైఫల్యం కూడా అఫ్గాన్ టీమ్‌కు కలిసొచ్చింది. ఆ జట్టు ఆటగాళ్లు ఏకంగా నాలుగు సునాయాస క్యాచ్‌లు వదిలేశారు. సాదిఖుల్లాకు 4, 45, 51 పరుగుల వద్ద లైఫ్ లభించగా...అజ్మతుల్లా 22 పరుగుల వద్ద బతికిపోయి ఆ తర్వాత మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చాడు. కఠినమైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో హాంకాంగ్ పూర్తిగా తడబడింది. మొత్తం జట్టులో బాబర్ హయత్ (43 బంతుల్లో 39; 3 సిక్స్‌లు), ముర్తజా (16) మినహా మిగతా బ్యాటర్లు ఎవరూ కనీసం రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు. 9.5 ఓవర్ల వద్దే 43/5 వద్ద నిలిచిన జట్టు ఆ తర్వాత కోలుకోలేకపోయింది. హాంకాంగ్ తమ తర్వాతి మ్యాచ్‌లో 11న బంగ్లాదేశ్‌తో... అఫ్గానిస్తాన్ తమ తర్వాతి మ్యాచ్‌లో 16న బంగ్లాదేశ్‌తో తలపడతాయి.

అర్జున్‌కు మూడో 'డ్రా'



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): గ్రాండ్ స్విస్ చెస్ టోర్నీలో భారత స్టార్, తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ ఖాతాలో మూడో 'డ్రా' చేరింది. పర్హామ్ (ఇరాన్)తో మంగళవారం జరిగిన ఆరో రౌండ్ గేమ్‌ను అర్జున్ 38 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. ఆరో రౌండ్ తర్వాత అర్జున్ 4.5 పాయింట్లతో మరో నలుగురితో కలిసి ఉమ్మడిగా రెండో స్థానంలో ఉన్నాడు. మరోవైపు ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్‌కు వరుసగా రెండో ఓటమి ఎదురైంది. నికోలస్ థియోడొరో (గ్రీస్)తో జరిగిన గేమ్‌లో గుకేశ్ 47 ఎత్తుల్లో ఓడిపోయాడు. మహిళల విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ ద్రోణవల్లి హారిక ఈ టోర్నీలో తొలి విజయం అందుకుంది. గుల్‌రుఖ్ బేగం (ఉజ్బెకిస్తాన్)తో జరిగిన ఆరో రౌండ్ గేమ్‌లో హారిక 74 ఎత్తుల్లో గెలిచింది. భారత్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి ఖాతాలో నాలుగో విజయం చేరింది. వైశాలి 41 ఎత్తుల్లో ఫతాలియెవా (అజర్‌బైజాన్)పై నెగ్గింది. ప్రస్తుతం వైశాలి ఐదు పాయింట్లతో కాటరీనా లాగ్నో (రష్యా)తో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

దక్ష ఏం చెప్పింది?



● మంచు లక్ష్మి, మోహన్‌బాబు

మంచు లక్ష్మి ప్రసన్న ప్రధాన పాత్రధారిగా, మంచు మోహన్‌బాబు కీలక పాత్రలో నటించిన చిత్రం 'దక్ష: ది డెడ్లీ కాన్స్పిరసీ'. ఇందులో లక్ష్మి పోలీసాఫీసర్‌గా నటించారు. వంశీ కృష్ణ మల్లా దర్శకత్వంలో మోహన్‌బాబు, లక్ష్మి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హీరో అల్లు అర్జున్ 'ఎక్స్'లో షేర్ చేసి, ''మీరు (మంచు లక్ష్మి), మోహన్‌బాబుగారు కలిసి తెరపై కనిపించడం చాలా అద్భుతంగా ఉంది. ఈ సినిమా గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను'' అని పేర్కొన్నారు. ''సైమా–2025' వేడుకల్లో ట్రైలర్‌ను ప్రదర్శించగా, మంచి స్పందన లభించింది. మోహన్‌బాబు, మంచు లక్ష్మిగార్లను ఏకకాలంలో డైరెక్ట్ చేసే అవకాశం వచ్చినందుకు హ్యాపీగా ఉంది'' అని వంశీ కృష్ణ అన్నారు. ''దక్ష ఏం చెప్పిందో మీకు తెలియాలంటే.. మీరు నాకు కొన్ని డీటైల్స్ చెప్పాలి' అనే డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

స్పై మ్యూజియంలో...




సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్ హీరో, హీరోయిన్లుగా నటించిన స్పై యాక్షన్ డ్రామా 'ఏక్ థా టైగర్'. ఈ చిత్రానికి అరుదైన గౌరవం దక్కింది. వాషింగ్టన్ డీసీలోని ఇంటర్‌నేషనల్ స్పై మ్యూజియంలో ఈ సినిమా పోస్టర్‌ను ప్రదర్శించారు. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ చిత్రం 'ఏక్ థా టైగర్' కావడం విశేషం. ఈ విషయంపై 'ఏక్ థా టైగర్' దర్శకుడు కబీర్ ఖాన్ మాట్లాడుతూ– ''అప్పట్లో అత్యధిక కలెక్షన్స్ సాధించిన ఈ చిత్రానికి ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం సంతోషంగా ఉంది. ఓ సినిమా సక్సెస్‌ను బాక్సాఫీస్ వసూళ్లు మాత్రమే నిర్ణయించలేవు. ఆ సినిమా ప్రేక్షకులకు ఎంతకాలం గుర్తుంటుందన్నది కూడా ముఖ్యమే'' అని పేర్కొన్నారు. ఇక వాషింగ్టన్ డీసీలోని ఇంటర్‌నేషనల్ స్పై మ్యూజియంలో 'జేమ్స్‌బాండ్, మిషన్ ఇంపాజిబుల్' తదితర స్పై చిత్రాల పోస్టర్స్‌ను ప్రదర్శించారు. ఈ హాలీవుడ్ చిత్రాల చెంత హిందీ మూవీ చేరడం ఓ విశేషం. రూ. 75 కోట్ల బడ్జెట్‌తో ఆదిత్య చోప్రా నిర్మించిన 'ఏక్ థా టైగర్' (2012) దాదాపు రూ. 300 కోట్లకుపైగా వసూళ్లు సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్స్‌గా వచ్చిన 'టైగర్ జిందా హై, టైగర్ 3' చిత్రాలు కూడా సక్సెస్ అయ్యాయి. ఇక ప్రస్తుతం 'బ్యాటిల్ ఆఫ్ గాల్వాన్' చిత్రం షూట్‌తో హీరోగా బిజీగా ఉన్నారు సల్మాన్.



● కాజల్ అగర్వాల్

కొత్త ప్రయాణం



● శర్వానంద్

''ఓమీ' ఓ సాధారణ సినీ నిర్మాణ సంస్థ మాత్రమే కాదు... మల్టీ డైమెన్షన్ ప్లాట్‌ఫామ్. సినిమా, వెల్‌నెస్ ప్రొడక్ట్స్, హాస్పిటాలిటీ రంగాలలో విస్తరిస్తూ... క్రియేటివిటీ, ఆరోగ్యం, నిలకడైన జీవన విధానాన్ని ముందుకు తెచ్చే లక్ష్యంతో పని చేస్తుంది'' అని శర్వానంద్ పేర్కొన్నారు. హీరో శర్వానంద్ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించారు. 'ఓమీ' అనే సంస్థను ప్రారంభించారు. భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎమ్. వెంకయ్యనాయుడు ఈ 'ఓమీ'ని లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ – ''ప్రపంచవ్యాప్తంగా ఉన్న కళాకారులు, క్రియేటివ్ మైండ్స్‌ని ఒకే వేదికపైకి తేవాలనుకుంటోంది 'ఓమీ'. సత్యం, సమన్వయం, మానవ అనుబంధాలను ప్రతిబింబించే కథలు చెప్పాలనుకుంటోంది. రాబోయే తరాలకు ఓ విజన్'' అని కూడా శర్వానంద్ తెలిపారు. ''ఇంగ్లిష్‌లో 'ఓమీ' పేరులోని 'ఓం' సృష్టి మొత్తాన్ని ప్రతిబింబించే ఆది నాదం, 'ఐ' అంటే వ్యక్తిగత స్వరూపం అని శర్వా స్పష్టం చేశారు.

టికెట్ ధరలు పెంచడం లేదు

– టీజీ విశ్వప్రసాద్



''మిరాయ్'ని చూస్తే రూ. 300 కోట్లు ఖర్చు చేసిన సినిమాలా అనిపిస్తుంది. మా మూవీ స్కేల్, స్థాయిని బట్టి టికెట్స్ ధరలు పెంచుకోవచ్చు. కానీ, పిల్లలు, కుటుంబ సభ్యులందరూ కలిసి ఈ సినిమా చూడాలనే ఆలోచనతోనే సాధారణ టికెట్ ధరలే ఉంచాం. మా సినిమా ఎంత వసూళ్లు సాధించిందనే కంటే ఎంతమంది చూశారు? అనే దాని మీదే మా దృష్టి ఉంది'' అని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ తెలిపారు. తేజ సజ్జా, రితికా నాయక్ జంటగా నటించిన చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహించిన ఈ సినిమాలో మనోజ్ మంచు విలన్ పాత్ర పోషించారు. టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా టీజీ విశ్వప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ– ''మిరాయ్' అద్భుతమైన ఫ్యాంటసీ అడ్వెంచరస్ మూవీ. చరిత్రతో పాటు ఫిక్షన్ కూడా ఉంటుంది. డైరెక్టర్ కార్తీక్ అద్భుతంగా తీశాడు. అశోకుడు తన మొత్తం జ్ఞానాన్ని 9 పుస్తకాల్లో నిక్షిప్తం చేశాడు. వాటి రక్షణ ఎనిమిది మంది యోధులకు ఇస్తాడు. ఒక పుస్తకం మాత్రం ఒక ఆశ్రమానికి ఇస్తాడు. ఆ పుస్తకాల ప్రాధాన్యత ఏంటి? వాటి గురించి హీరో, విలన్ ఎలాంటి పోరాటం చేశారు? అన్నది కథలో అద్భుతంగా ఉంటుంది. 'మిరాయ్' స్టార్ట్ చేసినప్పటికి తేజ సజ్జా 'హనుమాన్' విడుదల కాలేదు. కానీ, మేము కథని నమ్మి భారీగా నిర్మించాం. తేజ చాలా కష్టపడ్డాడు. మనోజ్ పవర్‌ఫుల్ పాత్రలో కనిపిస్తారు. 'మిరాయ్' కథ కరణ్ జోహార్‌గారికి నచ్చడంతో నార్త్‌లో రిలీజ్ చేస్తున్నారు. నేను 2017లో ఇండస్ట్రీకి వచ్చాను. 2018 నుంచి సినిమాలు రిలీజ్ అయ్యాయి. 2024 అసంతృప్తిని మిగిల్చింది. 'మిరాయ్'తో పునరాగమనం ఇస్తామనే నమ్మకం ఉంది. 'ది రాజాసాబ్' జనవరి 9న రిలీజ్ అవుతుంది. ప్రభాస్‌గారి బర్త్ డే (అక్టోబరు 23) సందర్భంగా ఫస్ట్ సింగిల్ ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నాం. నేను నిర్మిస్తున్న 'తెలుసు కదా' అక్టోబరులో విడుదలవుతుంది. ఆ తర్వాత 'మోగ్లీ' సినిమా ఉంటుంది. లావణ్య త్రిపాఠిగారితో ఓ మూవీ, సునీల్‌గారితో మరో సినిమా చేస్తున్నాం. ఆ సినిమాల్ని కూడా ఈ ఏడాదిలోనే రిలీజ్ చేస్తాం. 'జీ 2, గరివిడి లక్ష్మి', అలాగే కన్నడలో కొన్ని సినిమాలు చేస్తున్నాం. మా బ్యానర్ నుంచి 2026–2027 మధ్య దాదాపు 12 సినిమాలు విడుదలవుతాయి'' అన్నారు.

నేను సేఫ్‌గా ఉన్నాను

ప్రముఖ హీరోయిన్ కాజల్ అగర్వాల్ ప్రమాదానికి గురయ్యారని, ప్రస్తుతం కాజల్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందనే వార్తలు తెరపైకి వచ్చాయి. దీంతో కాజల్ అభిమానులు కొందరు సోషల్ మీడియాలోని ఆమె హ్యాండిల్‌ను ట్యాగ్ చేసి, కొన్ని పోస్టులు చేశారు. ఈ విషయంపై కాజల్ అగర్వాల్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. ''నాకు యాక్సిడెంట్ జరిగిందనీ, ఇక లేనని కూడా వస్తోన్న వార్తలు నా దృష్టికి వచ్చాయి... నవ్వుకున్నాను. ఎందుకంటే ఇవి పూర్తిగా అవాస్తవం. దేవుడి దయ వల్ల నేను సేఫ్‌గా, బాగానే ఉన్నాను. దయచేసి ఇలాంటి తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దని అభ్యర్థిస్తున్నాను. ఫేక్ వార్తలను షేర్ చేసే బదులు నిజాలను మాట్లాడుకోండి. పాజిటివ్‌గా ఆలోచించండి'' అని 'ఎక్స్'లో పేర్కొన్నారు కాజల్ అగర్వాల్. ఇక ప్రస్తుతం రణ్‌బీర్ కపూర్ 'రామాయణ', 'ది ఇండియా స్టోరీ' చిత్రాల్లో నటిస్తున్నారు కాజల్.


కథలే మొదలే...



● కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా

'కలలే కలలే కనులకు నువ్వు కనబడి కలలే కలలే, కథలే మొదలే ...' అంటూ మొదలవుతుంది 'కె–ర్యాంప్' చిత్రంలోని 'కలలే కలలే...' పాట. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా నటిస్తున్న చిత్రం 'కె–ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్న ఈ చిత్రం అక్టోబరు 18న విడుదల కానుంది. ఈ సినిమాలోని 'కలలే కలలే..' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు. ఈ సాంగ్‌కు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, కపిల్ కపిలన్ పాడారు. ఈ సినిమాకు సంగీతం: చేతన్ భరద్వాజ్.

ఏటిగట్టుపై యాక్షన్



● సాయి దుర్గా తేజ్

సాయి దుర్గా తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సంబరాల ఏటిగట్టు (ఎస్‌వైజీ). రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మి హీరోయిన్. 'హనుమాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత కె. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమా తాజా షెడ్యూల్‌లో యాక్షన్ కొరియోగ్రాఫర్ పీటర్ హెయిన్స్ ఆధ్వర్యంలో యాక్షన్ సీన్స్ చిత్రీకరిస్తున్నారు. ''రూ. 125 కోట్ల బడ్జెట్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. పవర్‌ఫుల్ విలన్ పాత్ర పోషిస్తున్న ఓ బాలీవుడ్ సూపర్ స్టార్‌తో ఈ షెడ్యూల్‌లో తేజ్ తలపడతారు. మా చిత్రాన్ని దసరాకి విడుదల చేయాలనుకున్నాం... సమ్మె కారణంగా వాయిదా పడింది. త్వరలో కొత్త తేదీ ప్రకటిస్తాం. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో మా సినిమా విడుదల కానుంది'' అని యూనిట్ తెలిపింది.

సస్పెన్స్... థ్రిల్




● ఆశ, సన్నీ కునాల్

సన్నీ కునాల్ హీరోగా, దేవిక సాహూ, ఆశ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'రోహిణి'. సంగ కుమార్ దర్శకత్వంలో కేవీ నరసింహ రాజు సమర్పణలో కుశాల్ రాజు నిర్మించారు. ఆనంద్ సంగీతం అందించిన ఈ మూవీ ఆడియో లాంచ్, ట్రైలర్ విడుదల వేడుకని హైదరాబాద్‌లో నిర్వహించారు. సంగ కుమార్ మాట్లాడుతూ–''యూనిట్‌లోని ప్రతి ఒక్కరి కృషి వల్లే మా సినిమా త్వరగా పూర్తయింది. రాజేంద్ర రాజు కాంచనపల్లి అందించిన సహకారం మా సినిమాకు బలం'' అని తెలిపారు. ''త్వరలోనే విడుదల కానున్న మా సినిమాని ఆదరించాలి'' అన్నారు కుశాల్ రాజు. ''ప్రేక్షకులకు నచ్చే సస్పెన్స్, థ్రిల్, రొమాన్స్ వంటి అంశాలు మా చిత్రంలో చాలా ఉన్నాయి'' అన్నారు సన్నీ కునాల్. ''దాసరి వెంకటరమణగారి పాటలు వినసొంపుగా, కనువిందుగా ఉంటాయి'' అని సమర్పకుడు కేవీ నరసింహ రాజు తెలిపారు.

నిర్మాతగా డబుల్ సెంచరీ నా జీవితాశయం

– తుమ్మలపల్లి రామసత్యనారాయణ



''నేను ప్రారంభించిన 15 చిత్రాల్లో 'యండమూరి కథలు, కేపీహెచ్‌బీ కాలనీలో, మా నాన్న హీరో, మహానాగ'చిత్రాల రెగ్యులర్ షూటింగ్స్ మొదలయ్యాయి. మిగతా చిత్రాలు ప్రీ–ప్రొడక్షన్ జరుపుకుంటున్నాయి. ఈ ఏడాదిలో ఒక ప్రముఖ దర్శకుడితో భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నా'' అని తుమ్మలపల్లి రామసత్యనారాయణ తెలిపారు. భీమవరం టాకీస్ పతాకంపై వంద చిత్రాలకు పైగా నిర్మించి, ఆగస్టు 15న ఒకేసారి 15 చిత్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టి, రామసత్యనారాయణ సరికొత్త రికార్డు సృష్టించిన సంగతి తెలిసిందే. నేడు (సెప్టెంబర్ 10) ఆయన పుట్టినరోజు సందర్భంగా మంగళవారం రామసత్యనారాయణ మాట్లాడుతూ– ''ఇండస్ట్రీకి వచ్చి ఇరవై ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుపుకుంటున్న ఈ పుట్టినరోజు నాకు ప్రత్యేకం. చిత్ర పరిశ్రమకి వచ్చిన తొలి రోజుల్లో చేదు అనుభవాలు ఎదుర్కొన్నాను. అలాంటి నాకు ఇండస్ట్రీ ఇంత మంచి స్థానాన్ని, స్థాయిని ఇస్తుందని ఊహించలేదు. నిర్మాతగా 200 చిత్రాలు పూర్తి చేయాలన్నదే నా జీవితాశయం'' అని పేర్కొన్నారు.

సాక్షి బిజినెస్
బుధవారం
10-9-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
314	95
81,101	24,869

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	21,835	▲	35
డోజోన్స్	45,721	▲	206
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,244	▲	22
డాక్స్	23,734	▽	73
షాంఘై	3,807	▽	19
నికాయ్	43,459	▲	185

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.60	88.62
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	118.00	120.98
€	యూరో	ఎస్‌బీఐ	102.30	105.07
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	9.04	64.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.00	59.26
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.41	70.13
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.61	24.11
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.10	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.50	13.32

వెండి.. భవిష్యత్తు బంగారం!

తదుపరి గమ్యం రూ. లక్షన్నర

- ఏడాది కాలంలో చేరుకోవచ్చు...
- మోతీలాల్ ఓస్వాల్ నివేదిక అంచనా
- పారిశ్రామిక, పెట్టుబడులపరంగా డిమాండ్



న్యూఢిల్లీ: బంగారం మాదిరే వెండికి సైతం డిమాండ్ బలపడుతోంది. ఫలితంగా వెండి ధర కిలోకి రూ.1.5 లక్షలకు చేరుకోవచ్చని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అంచనా వేసింది. బలమైన పారిశ్రామిక డిమాండ్, డాలర్ బలహీనత, సురక్షిత సాధనంగా పెట్టుబడుల డిమాండ్ ధరలకు మద్దతునిస్తున్నట్టు పేర్కొంది. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎంసీఎక్స్ మార్కెట్లో వెండి ధర 37 శాతం పెరిగినట్టు గుర్తు చేసింది. ''వెండి ధరలు క్రమంగా పెరుగుతూ వచ్చే ఆరు నెలల్లో కిలోకి రూ.1,35,000కు చేరుకోవచ్చు. 12 నెలల్లో రూ.1,50,000కు చేరొచ్చు. డాలర్‌తో రూపాయి మారకం 88.5 శాతం స్థాయిలో ఉంటుందని భావిస్తూ వేసిన అంచనా ఇది'' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ తన నివేదికలో తెలిపింది. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్ మార్కెట్లో వెండి ఫ్యూచర్స్ తొలుత ఔన్స్‌కు 45 డాలర్లు, తర్వాత 50 డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేసింది.

బలమైన డిమాండ్

2025లో వెండి మొత్తం ఉత్పత్తిలో 60 శాతం డిమాండ్ పారిశ్రామిక రంగం నుంచి వచ్చినట్టు యూఎస్‌కు చెందిన సిల్వర్ ఇన్‌స్టిట్యూట్ తెలిపింది. సోలార్ విద్యుత్, ఎలక్ట్రికల్ వాహనాలు, 5జీ ఇన్‌ఫ్రా రంగాల నుంచి వచ్చే కొన్ని త్రైమాసికాల పాటు వెండికి డిమాండ్ కొనసాగుతుందని మోతీలాల్ ఓస్వాల్ తెలిపింది. సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి పెట్టుబడులు పెరుగుతుండడం కూడా ధరలు ఎగిసేందుకు దారి తీస్తున్నట్టు పేర్కొంది. బంగారానికి తోడు వెండిని సైతం తమ రిజర్వుల్లోకి చేర్చుకోవడానికి కొన్ని సెంట్రల్ బ్యాంక్‌లు ఆసక్తి చూపిస్తుండడం, వెండి మెరుపులకు తోడవుతోంది. వచ్చే మూడేళ్లలో 535 మిలియన్ డాలర్ల విలువైన వెండిని తమ దేశ రిజర్వుల్లోకి చేర్చుకోనున్నట్టు రష్యా ఇటీవలే ప్రకటించింది. సౌదీ అరేబియా సెంట్రల్ బ్యాంక్ ఈ ఏడాది 40 మిలియన్ డాలర్ల మేర సిల్వర్ ఈటీఎఫ్‌లను కొనుగోలు చేయనుంది.

3,000 టన్నుల దిగుమతి

దేశీయంగానూ వెండికి డిమాండ్ బలంగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 3,000 టన్నుల వెండి దిగుమతి అయింది. పారిశ్రామిక రంగం నుంచే కాకుండా, పెట్టుబడులకు సైతం డిమాండ్ నెలకొంది. ''జాక్సన్ హోల్ సింపోజియం తర్వాత ఫెడ్ సెప్టెంబర్ సమావేశంలో పావు శాతం మేర రేట్లను తగ్గించడం తప్పనిసరి అని తెలుస్తోంది. తక్కువ రేట్లు, యూఎస్ ఈల్డ్స్ క్షీణిస్తుండడం విలువైన లోహాల ధరలకు మద్దతునిస్తోంది'' అని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ నివేదిక వెల్లడించింది. అయితే ఇటీవల వెండి ధరలు గణనీయంగా పెరిగిన దృష్ట్యా స్వల్పకాలంలో లాభాల స్వీకరణను కొట్టి పారేయలేమని పేర్కొంది. ప్రస్తుత స్థాయి నుంచి, రేట్లు తగ్గిస్తే రూ.1,18,000–1,15,000 స్థాయి వరకు వెండిని కొనుగోలు చేసుకోవచ్చని సూచించింది.

ఎన్‌ఎస్‌ఈ చైర్‌పర్సన్‌గా శ్రీనివాస్ ఇంజేటి



ముంబై: నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్‌ఎస్‌ఈ) గవర్నింగ్ బోర్డు చైర్‌పర్సన్‌గా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, తెలుగు వ్యక్తి శ్రీనివాస్ ఇంజేటి నియమితులయ్యారు. 1960 మే 26న జన్మించిన శ్రీనివాస్.. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో బీఏ ఎకనామిక్స్ (ఆనర్స్), ఆ తర్వాత బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ స్ట్రాత్‌క్లైడ్‌లో ఎంబీయే చేశారు. 1983 బ్యాచ్ ఐఏఎస్ అధికారి (ఒరిస్సా కేడర్) అయిన శ్రీనివాస్‌కి కార్పొరేట్ రెగ్యులేషన్, ఆర్థిక సేవలు, గవర్నెన్స్, ప్రభుత్వ పాలసీలు తదితర అంశాల్లో నాలుగు దశాబ్దాల సుదీర్ఘానుభవం ఉంది. 2017 నుంచి 2020 వరకు కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శిగా దివాలా చట్టం, కాంపిటీషన్ చట్టం, కంపెనీల చట్టం తదితర సంస్కరణలకు సారథ్యం వహించారు. 2020 నుంచి 2023 వరకు ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్స్ అథారిటీ (ఐఎఫ్‌ఎస్‌సీఏ) వ్యవస్థాపక చైర్మన్‌గా వ్యవహరించారు. అంతకు ముందు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్‌గా ఖేలో ఇండియా ప్రోగ్రాంనకు శ్రీకారం చుట్టారు. అటు నేషనల్ ఫార్మా ప్రైసింగ్ అథారిటీకి కూడా సారథ్యం వహించడంతో పాటు సెబీ, ఎల్ఐసీ తదితర బోర్డుల్లో కూడా సభ్యుడిగా బాధ్యతలు నిర్వర్తించారు.

ఫెడ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఆశలతో...

ముంబై: ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు ఆశలతో ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా సెన్సెక్స్ 314 పాయింట్లు పెరిగి 81,101 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 95 పాయింట్లు లాభపడి 24,869 వద్ద నిలిచింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా స్థిరమైన లాభాలతో ట్రేడయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 394 పాయింట్లు పెరిగి 81,181 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 119 పాయింట్లు 24,892 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. ఐటీ, ఎఫ్ఎంసీజీతో పాటు ఫార్మా, టెక్ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.22%, 0.20 శాతం చొప్పున పెరిగాయి. ఆయిల్అండ్‌గ్యాస్, రియల్టీ, ఇంధన, కన్జూమర్ డిస్క్రెషనరీ, ఆటో, విద్యుత్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి.



లాభాల్లో అంతర్జాతీయ మార్కెట్లు: ఆసియాలో చైనా, జపాన్, సింగపూర్, ఇండోనేసియా స్టాక్ సూచీలు 0.50%–2% నష్టపోయాయి. జపాన్ నికాయ్ తొలిసారి 44,000 స్థాయిని అధిగమించి 44,186 వద్ద సరికొత్త రికార్డును నమోదు చేసింది. తదుపరి లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో 0.42% నష్టపోయి 43,459 వద్ద స్థిరపడింది. హాంకాంగ్, కొరియా, థాయ్‌లాండ్ స్టాక్ సూచీలు 1.50% వరకు పెరిగాయి. యూరప్‌లో జర్మనీ డాక్స్ ఇండెక్స్ 0.50% నష్టపోయింది. ఫ్రాన్స్, బ్రిటన్ సూచీలు 0.25% పెరిగాయి. అమెరికా సూచీలు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు 5% పెరిగి రూ.1,505 వద్ద స్థిరపడింది. డైరెక్టర్ల బోర్డు ఈ నెల 11న సమావేశమై ఈక్విటీ షేర్ల బైబ్యాక్ అంశాన్ని పరిశీలిస్తుందని తెలపడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఇంట్రాడేలో 5.18% లాభపడి రూ.1,507 వద్ద గరిష్టాన్ని తాకింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.29,967 కోట్లు పెరిగి రూ.6.25 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..	
మళ్లీ చక్కెర షేర్లు మధురం	పీఎస్‌యూ డీలిస్టింగ్ ఇక ఈజీ

ఐఫోన్ 17 వచ్చేసింది..





- ధర 799 డాలర్ల నుంచి ప్రారంభం
- అత్యంత పల్చని ఐఫోన్ 17 ఎయిర్ కూడా విడుదల



క్యుపర్టినో, అమెరికా: టెక్ దిగ్గజం యాపిల్ తాజాగా ఐఫోన్ 17, ఐఫోన్ 17 ప్రో, 17 ప్రో మ్యాక్స్ ఫోన్లను ఆవిష్కరించింది. ఐఫోన్ 17లో 6.3 అంగుళాల స్క్రీన్, ఏ19 ప్రో ప్రాసెసర్, 48 ఎంపీ డ్యుయల్ ఫ్యూజన్ కెమెరా, 24 ఎంపీ ఫ్రంట్ కెమెరా, 256 జీబీ మెమొరీ తదితర ఫీచర్లు ఉన్నాయి. అయిదు రంగుల్లో లభిస్తుంది. అత్యంత పల్చని ఐఫోన్ 17 ఎయిర్‌ని కూడా యాపిల్ విడుదల చేసింది. దీని మందం 5.6 మిల్లీమీటర్లుగా ఉంటుంది. ఐఫోన్ 17 ధర రూ. 799 డాలర్ల నుంచి, ప్రో ధర రూ. 1,099 డాలర్ల నుంచి, ప్రో మ్యాక్స్ రేటు 1,199 డాలర్ల నుంచి ప్రారంభమవుతుంది. ఎయిర్ ధర 999 డాలర్ల నుంచి ఉంటుంది. మంగళవారం క్యుపర్టినోలో జరిగిన కార్యక్రమంలో యాపిల్ సీఈవో టిమ్ కుక్.. కొత్త ఐఫోన్‌తో పాటు పలు ఉత్పత్తులను ఆవిష్కరించారు. వీటిలో వాచీలు, ఎయిర్‌పాడ్స్ ఉన్నాయి. వాచ్ ఎస్‌ఈ, వాచ్ సిరీస్ 11, వాచ్ అల్ట్రా 3ని కంపెనీ ఆవిష్కరించింది. వీటి ధరలు వరుసగా 249 డాలర్లు, 399 డాలర్లు, 799 డాలర్లుగా ఉంటాయి. సెప్టెంబర్ 19 నుంచి అందుబాటులోకి వస్తాయి. అటు కొత్త ఎయిర్‌పాడ్స్ ప్రో3 ధర 249 డాలర్లుగా ఉంటుంది. ఒక్కసారి చార్జ్ చేస్తే 10 గంటలు బ్యాటరీ లైఫ్ ఉంటుంది.

జేఎల్ఆర్ వాహన ధరలు తగ్గింపు



న్యూఢిల్లీ: జాగ్వార్ లాండ్ రోవర్(జేఎల్ఆర్) తన రేంజ్ రోవర్, డిఫెండర్, డిస్కవరీ కార్ల ధరలు రూ.4.5 లక్షల నుంచి గరిష్టంగా రూ.30.4 లక్షల వరకు తగ్గిస్తామని తెలిపింది. జీఎస్టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని పూర్తిగా వినియోగదార్లకు బదిలీ చేస్తామని వివరించింది. తగ్గింపు ధరలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొంది.

- వోల్వో కార్ ఇండియా సైతం తన పెట్రోలు/డీజిల్ వాహన శ్రేణి ధరలను గరిష్టంగా రూ.6.9 లక్షల వరకు తగ్గిస్తున్నట్టు ప్రకటించింది. సెప్టెంబర్ 22 నుంచి తగ్గింపు ధరలు అమల్లోకి వస్తాయని పేర్కొంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

అవుతారా.. పబ్లిక్ ప్రాసిక్యూటర్

న్యాయ విద్యను అభ్యసించిన వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి(టీఎస్ఎల్‌పీఆర్‌బీ).. 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్(ఏపీపీ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎంపికైన అభ్యర్థులు టీజీ ప్రాసిక్యూషన్ సర్వీస్ (కేటగిరి-6) విభాగంలో పనిచేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో.. తెలంగాణలో ఏపీపీ పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..



» టీజీఎల్‌పీఆర్‌బీలో 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ పోస్టులు
» ఏదైనా డిగ్రీతోపాటు లా డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి

- మొత్తం పోస్టుల సంఖ్య: 118.
- పోస్టుల వివరాలు: మల్టీజోన్–1: 50, మల్టీజోన్–2: 68.

అర్హత

ఏదైనా బ్యాచిలర్ డిగ్రీతో పాటు లా(ఎల్ఎల్‌బీ/బీఎల్) డిగ్రీ కలిగి ఉండాలి. ఇంటర్మీడియెట్ తర్వాత ఐదేళ్ల లా కోర్సు ఉత్తీర్ణులు కూడా దరఖాస్తుకు అర్హులే. దీంతోపాటు రాష్ట్రంలోని క్రిమినల్ కోర్టుల్లో కనీసం మూడేళ్ల అనుభవం కలిగిన ప్రాక్టీసింగ్ అడ్వకేట్ అయి ఉండాలి. నోటిఫికేషన్ తేదీ నాటికి అభ్యర్థి ప్రాక్టీసింగ్ అడ్వకేట్‌గా కొనసాగుతూ ఉండాలి.

వయసు

01.07.2025 నాటికి 34 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఐదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది. దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది. ఎక్స్ సర్వీస్‌మెన్, ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్లకు మూడేళ్ల సడలింపు కల్పిస్తారు.

వేతనం

నెలకు రూ.54,220 నుంచి రూ.1,33,630 వేతన శ్రేణి లభిస్తుంది.

ఎంపిక విధానం

రాతపరీక్ష ద్వారా ఎంపికచేస్తారు. ఇందులో రెండు పేపర్లు పేపర్1, పేపర్ 2 ఉంటాయి.

పేపర్1 ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల విధానంలో 200 ప్రశ్నలు–200 మార్కులకు పరీక్షజరుగుతుంది. ఆన్‌లైన్/ఆఫ్‌లైన్(ఓఎంఆర్) విధానంలో పరీక్షనిర్వహిస్తారు. పరీక్ష వ్యవధి 3గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. నెగిటివ్‌మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 1/4వంతు మార్కు తగ్గిస్తారు.

పేపర్ 2 డిస్క్రిప్టివ్

పేపర్ 2 డిస్క్రిప్టివ్ విధానంలో 200 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్షవ్యవధి మూడు గంటలు. ఈ పేపర్‌ప్లీడింగ్, డ్రాఫ్టింగ్‌పై ఉంటుంది. కొశ్చన్ కమ్ ఆన్సర్ బుక్‌లెట్‌పై పెన్ పేపర్ విధానంలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది.

కనీస అర్హత మార్కులు

పేపర్ 1, పేపర్ 2లో అభ్యర్థులు కనీస అర్హత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఓసీ/ఈడబ్ల్యూస్ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు, బీసీలు కనీసం 35 శాతం మార్కులు, ఎస్సీ/ఎస్టీలు కనీసం 30 శాతం మార్కులు పొందాలి.

పేపర్1, పేపర్2లో ప్రతిభతో

తొలుత పేపర్ 1ను మూల్యాంకనం చేస్తారు. పేపర్1లో కనీస అర్హత మార్కులు పొందిన అభ్యర్థుల పేపర్ 2ను మాత్రమే మూల్యాంకనం చేస్తారు.

పేపర్1, పేపర్2లో మొత్తం 400 మార్కులకు అభ్యర్థులు చూపినప్రతిభ ఆధారంగాతుది ఎంపిక చేపడతారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 12.09.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:05.10.2025
- వెబ్‌సైట్: https://www.tgprb.in

జాబ్ పాయింట్



ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీలో కన్సల్టెంట్ పోస్టులు

ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ(డీడీఏ)లో వివిధ విభాగాల్లో కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 06.
» **ఖాళీల వివరాలు:** కన్సల్టెంట్(జీఐఎస్)–05, కన్సల్టెంట్(జీఐఎస్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీ(జియో ఇన్ఫర్మేటిక్స్, జియోమాటిక్స్, జాగ్రఫీ)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు కన్సల్టెంట్‌గా ఐదేళ్ల ఉద్యోగానుభవం ఉన్నవారికి రూ.52,500. పదేళ్ల ఉద్యోగానుభవం ఉన్నవారికి రూ.95,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** consultant.rc@dda.org.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 23.09.2025.
» **వెబ్‌సైట్:** https://dda.gov.in

ఎస్ఈటీఎస్, చెన్నైలో సైంటిస్ట్–సి పోస్టులు

చెన్నైలోని సొసైటీ ఫర్ ఎలక్ట్రానిక్ ట్రాన్సాక్షన్స్ అండ్ సెక్యూరిటీ(ఎస్ఈటీఎస్).. వివిధ విభాగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన సైంటిస్ట్–సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్(ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ /ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. వయసు: 10.11.2025 నాటికి 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.67,700 నుంచి 2,08,700.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:** 10.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.11.2025.
» **వెబ్‌సైట్:** https://setsindia.in

ఫ్యాక్ట్‌లో 84 అప్రెంటిస్‌లు

కేరళ రాష్ట్రం ఉద్యోగమండల్‌లోని ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ ట్రావెన్‌కోర్ లిమిటెడ్(ఎఫ్ఏసీటీ).. వివిధ విభాగాల్లో గ్రాడ్యుయేట్, టెక్నీషియన్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–27, టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు –57.
» **విభాగాలు: గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు:** కంప్యూటర్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్,ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్/అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, సేఫ్టీ అండ్ ఫైర్ ఇంజనీరింగ్.
» **టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్‌లు:** కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ /ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్/ఇన్‌స్ట్రుమెంట్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ కమర్షియల్ ప్రాక్టీస్(డీసీపీ).
» **వయసు:** 01.09.2025 నాటికి గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు 25 ఏళ్లు, టెక్నీషియన్ అప్రెంటిస్‌కు 23 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.12,000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.9000.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కులు, మెడికల్ టెస్ట్, సర్టిఫికేట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.09.2025.
» **వెబ్‌సైట్:** https://fact.co.in

ఎన్ఐఏబీ, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యానిమల్ బయోటెక్నాలజీ(ఎన్ఐఏబీ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **పోస్టుల వివరాలు:** సీనియర్ రీసెర్చ్ ఫెలో–01, టెక్నికల్ అసిస్టెంట్–01,ప్రాజెక్ట్ సైంటిస్ట్2–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, ఎంవీఎస్సీ/ఎంటెక్/ఎంఎస్సీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** సీనియర్ రీసెర్చ్ ఫెలోకు 35 ఏళ్లు, టెక్నికల్ అసిస్టెంట్‌కు 50 ఏళ్లు, ప్రాజెక్ట్ సైంటిస్ట్‌కు 40 ఏళ్లు.
» **ఫెలోషిప్:** నెలకు ఎస్ఆర్ఎఫ్‌కు రూ.42,000, టెక్నికల్ అసిస్టెంట్‌కు రూ.20,000, ప్రాజెక్ట్ సైంటిస్ట్‌కు రూ.67,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 21.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.niab.org.in

ఐఎంఎస్‌సీ, చెన్నైలో వివిధ ఉద్యోగాలు

చెన్నైలోని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథ్‌మేటికల్ సైన్సెస్ (ఐఎంఎస్‌సీ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ అసోసియేట్1–01, లైబ్రరీ ట్రైనీ–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, ఎంఎల్ఐఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్, గేట్, జామ్ లేదా జెస్ట్‌లో కాలిఫై అవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 14.09.2025 నాటికి లైబ్రరీ ట్రైనీకి 27 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.48,000, లైబ్రరీ ట్రైనీకి రూ.20,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 14.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.imsc.res.in

ఐఐటీ హైదరాబాద్‌లో అకౌంటెంట్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ), హైదరాబాద్‌లో ఒప్పంద ప్రాతిపదికన అకౌంటెంట్, జూనియర్ అకౌంటెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
» **పోస్టుల వివరాలు:** అకౌంటెంట్–01, జూనియర్ అకౌంటెంట్–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60శాతం మార్కులతో సీఏ ఇంటర్, బీకాం ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు అకౌంటెంట్‌కు రూ.48,000 నుంచి రూ.53,000, జూనియర్ అకౌంటెంట్‌కు రూ.40,000 నుంచి రూ.45,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష/స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 03.09.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.09.2025.
» **వెబ్‌సైట్:** https://www.iith.ac.in

టీఐఎస్ఎస్, ముంబైలో కన్సల్టెంట్ పోస్టులు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టీఐఎస్ఎస్).. ఒప్పంద ప్రాతిపదికన కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06.
» **విభాగాలు:** ఎస్టాబ్లిష్‌మెంట్ మ్యాటర్స్, అడ్మినిస్ట్రేషన్, ఫెసిలిటీ సర్వీసెస్, రిక్రూట్‌మెంట్ సెల్, ప్రాజెక్ట్ సెల్, సెక్యూరిటీ.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(సోషల్ సైన్సెస్)లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 27.09.2025.
» **వెబ్‌సైట్:** https://tiss.ac.in

ఐజీఆర్‌యూఏలో జూనియర్ మెకానిక్ పోస్టులు

ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమి (ఐజీఆర్‌యూఏ) ఒప్పంద ప్రాతిపదికన జూనియర్ మెకానిక్ (మెకానికల్,రేడియో) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 55 ఏళ్లు ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 24.09.2025.
» **వెబ్‌సైట్:** https://igrua.gov.in

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–మెంటల్ ఎబిలిటీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–తెలంగాణ చరిత్ర » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం– జనరల్ ఇంగ్లిష్

హైదరాబాద్‌కు చెందిన ఒకరు వాట్సాప్ ద్వారా 'బజాజ్ ఫైనాన్షియల్ సెక్యూరిటీస్ లిమిటెడ్'అనే పేరుతో ఉన్న నకిలీ గ్రూప్‌లో చేరాడు. ఈ గ్రూప్ మార్కెట్ ట్రెండ్స్, బ్లాక్ ట్రేడ్స్, ఐపీఓలపై అప్‌డేట్స్ ఇచ్చేది. గ్రూప్ అడ్మిన్ పురవ్ ఝవేరి, అతని సహాయకురాలు ప్రిషాసింగ్ బాధితుడిని ఒక నకిలీ యాప్‌లో ఇన్వెస్ట్ చేయమని ప్రోత్సహించారు. దీంతో బాధితుడు మే 30 నుంచి జూలై 9, 2025 మధ్య రూ.3.24 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బులు విత్‌డ్రాకు వీలుకాకపోవడంతో టీజీసీఎస్‌బీ ఫిర్యాదు చేశాడు. ఈ కేసులో టీజీసీఎస్‌బీకి అధికారులు మహ్మద్ రజియుద్దీన్, మహ్మద్ వలియుల్లా, మహ్మద్ జుబైర్‌ఖాన్‌లను అరెస్టు చేశారు.




హైదరాబాద్‌కు చెందిన 49 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌టెలిగ్రామ్ గ్రూప్‌లో చేరగా, ఒక మహిళ స్టాక్ ఇన్వెస్ట్‌మెంట్స్ గురించి సలహాలు ఇవ్వగా, ఒక నకిలీ వెబ్‌సైట్‌లో ఇన్వెస్ట్ చేశాడు. ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి 20వ తేదీ వరకు రూ.3.30 కోట్లు అందులో పెట్టాడు. విత్‌డ్రా చేయడానికి ప్రయత్నించగా, 10 శాతం కమీషన్, ట్యాక్స్ చెల్లించమని కోరడంతో ఇది స్కామ్ అని గుర్తించి టీజీసీఎస్‌బీకి ఫిర్యాదు చేశాడు.

తాజాగా ఆదివారం (సెప్టెంబర్ 7) నమోదైన కేసులో యూసుఫ్‌గూడకు చెందిన వ్యక్తి రూ.28.76 లక్షలు ఈ తరహా మోసంలో పోగొట్టుకున్నాడు. ఫేస్‌బుక్‌లో పరిచయమైన గుర్తు తెలియని వ్యక్తి ఇచ్చిన సలహాలతో ఓ వాట్సాప్ గ్రూప్‌లో చేరాడు. ట్రేడింగ్ ఐపీఓల పేరిట పెట్టుబడి పెట్టేలా చేశారు. మొదట లాభాలు వచ్చినట్టు చూపి తర్వాత డబ్బులు విత్‌డ్రాకు అవకాశం ఇవ్వలేదు.

లాభాలుండవ్.. లాసే

సాక్షి, హైదరాబాద్: అధిక లాభాల ఆశే కొందరి కొంప ముంచుతోంది. ఈ బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు సైబర్ కేటుగాళ్లు. పెట్టిన పెట్టుబడికి పదుల రెట్లలో లాభాలు వస్తాయని ఆశపెట్టి అందినకాడికి దండుకుంటున్నారు. సాధారణానికి భిన్నంగా తక్కువ సమయంలోనే అనూహ్య లాభాలు వస్తాయని ఎవరైనా చెబితే అవి పక్కా మోసమే అన్న చిన్న లాజిక్ మిస్సవుతున్న ఎంతోమంది సైబర్ నేరగాళ్లకు రూ.కోట్లు సమర్పించుకుంటున్నారు. ఇటీవల తెలంగాణలో ఈ తరహా ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులు పెరిగినట్టు టీజీ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు తెలిపారు. ఈ ఏడాది లో ఆగస్టు 31 వరకు చూస్తే ఈ తరహా కేసులు 17,169 నమోదైనట్టు టీజీసీఎస్‌బీ అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

- ఇటీవల బాగా పెరిగిన ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసులు
- అత్యాశకు పోయి కేటుగాళ్లకు రూ. కోట్లు సమర్పయామి
- ఏడాదిలో ఇప్పటికే 17,169 కేసులు.. రూ.639.94 కోట్లు పోగొట్టుకున్న బాధితులు



ఇలా మోసం చేస్తున్నారు...

సైబర్ కేటుగాళ్లు అధునాతన వ్యూహాలను ఉపయోగిస్తున్నారు. ఫిషింగ్, సోషల్ ఇంజనీరింగ్ టెక్నిక్‌లు వాడుతున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వేదికల్లో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు, తద్వారా భారీ లాభాలు పొందే అవకాశాల గురించి మెసేజ్‌లు పంపుతారు. అందులో లింక్‌లపై ఎవరైనా క్లిక్ చేస్తే వారికి ఆన్‌లైన్ పెట్టుబడుల అంశాలపై సలహాలు ఇస్తూ...నమ్మకం పెంచుతారు. ఆ తర్వాత పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని ఆశ కల్పిస్తారు. అవతలి వ్యక్తి తమను నమ్ముతున్నట్టు గుర్తిస్తే వెంటనే వాట్సాప్ గ్రూప్‌లలో యాడ్ చేయడం..తాము సూచించిన యాప్‌లలో పెట్టుబడి పెట్టాలని క్రమంగా ఒత్తిడి చేస్తారు. తొలుత లాభాలు వచ్చినట్టుగా నకిలీ మెసేజ్‌లు చూపుతారు. ఇలా రూ.లక్షల నుంచి మొదలై రూ.కోట్ల వరకు డబ్బులు గుంజే ప్రయత్నం చేస్తారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- తక్కువ సమయంలో అధిక లాభాలు అంటూ ఊదరగొడుతున్నారంటే అది మోసమని గ్రహించాలి.
- వాట్సాప్, ఫేస్‌బుక్‌లో వచ్చే ఎస్ఎంఎస్‌లలో ఉండే లింక్‌లపై క్లిక్ చేసి వారిచ్చిన యాప్‌లలో పెట్టుబడి పెట్టొద్దు.
- మీరు పెట్టుబడి పెట్టే ముందు చట్టబద్ధత ఉందా లేదా నిర్ధారించుకోవాలి. షేర్లలో పెట్టుబడి డీమాట్ అకౌంట్స్ ద్వారానే జరుగుతుందని మరవొద్దు.

అధిక లాభాల ప్రకటనలతో జాగ్రత్తగా ఉండండి



సోషల్ మీడియా ద్వారా వచ్చే పెట్టుబడి టిప్స్, లింక్‌లను నమ్మి తెలియని యాప్‌లు లేదా వెబ్‌సైట్‌లలో పెట్టుబడి పెట్టి మోసపోవొద్దు. అధిక లాభాల ప్రకటనలతో జాగ్రత్తగా ఉండండి. మీ డబ్బులు సురక్షితంగా ఉంచుకోండి

- శిఖాగోయల్, డైరెక్టర్, టీజీ సీఎస్‌బీ

2024 నుంచి ఈ ఏడాది ఆగస్టు 31 వరకు టీజీసీఎస్‌బీ నమోదు చేసిన బిజినెస్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్ కేసుల వివరాలు ఇలా..:

2024	ఏడాది	2025
25,529	నమోదైన కేసులు	17,169
12,37,08,59,802	పోగొట్టుకున్న సొమ్ము (రూ.ల్లో)	6,34,93,31,526
1,35,65,61,158	టీజీసీఎస్‌బీ ఫ్రీజ్ చేసింది (రూ.ల్లో)	65,78,26,060

ఆర్టీసీ 'యాత్రాదానం'

- పర్యాటక ప్రాంతాలకు పేద, దివ్యాంగ, అనాథ, వృద్ధులు
- దాతల విరాళాలతో కార్యక్రమ నిర్వహణ



యాత్రాదానం పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: సామాజిక బాధ్యతలో భాగంగా టీఎస్‌ఆర్టీసీ 'యాత్రాదానం'అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, పండుగలు, ఇతర శుభకార్యాలు వంటి ప్రత్యేకమైన రోజుల్లో అనాథలు, నిరాశ్రయులైన వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహారయాత్రలకు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. దాతలు అందజేసే విరాళాల ఆధారంగా ఆర్టీసీ ఈ యాత్రా సదుపాయాన్ని కల్పించనుంది. ఈ మేరకు మంగళవారం మినిస్టర్స్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 'యాత్రాదానం'పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యాత్రాదానం కార్యక్రమ నిర్వహణ పేరుతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేశారు. సాధారణ ప్రజలు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేట్ సంస్థలు, ఎన్నారైలు, అసోసియేషన్‌లు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీవోలు విరాళాలను అందజేయవచ్చు. రాష్ట్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక స్థలాలను కవర్ చేసేవిధంగా ప్రత్యేక టూర్ ప్యాకేజీలను ఆర్టీసీ రూపొందించింది. దాతలు చెల్లించే విరాళం మేరకు కిలోమీటర్ల ఆధారంగా ఏసీ, సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సులను విహారయాత్రలకు ఏర్పాటు చేస్తారు. యాత్ర ప్రారంభానికి వారం రోజుల ముందు బస్సులను బుక్ చేసుకోవలసి ఉంటుంది. యాత్రాదానం పోస్టర్ ఆవిష్కరణ అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఆర్టీసీ యాజమాన్యం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం అభినందనీయమన్నారు. సామాజిక బాధ్యత గల సంస్థగా యాత్రాదానం కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చెప్పారు. ఈ సందర్భంగా యాత్రాదానం నిధికి మంత్రి పొన్నం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఈడీలు మునిశేఖర్, రాజశేఖర్, ఖుష్రోషా ఖాన్, వెంకన్న పాల్గొన్నారు.

బస్సుల బుకింగ్ ఇలా..

- ➤ స్థానిక ఆర్టీసీ డిపో అధికారులను సంప్రదించి యాత్రాదానం కింద బస్సులను బుక్ చేసుకోవచ్చు.
- ➤ ఆర్టీసీ హెల్ప్ లైన్ నంబర్లు 040-69440000 / 040-23450033 ఫోన్ చేసి సమాచారం ఇస్తే సంబంధిత అధికారులు యాత్రాదాన టూర్ ప్యాకేజీల వివరాలను తెలియజేస్తారు.

నేడు వైఎస్ జగన్ మీడియా సమావేశం




సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ బుధవారం ఉదయం 11 గంటలకు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించనున్నారు. ఏపీలోని పరిస్థితులు, జరుగుతున్న పరిణామాలపై ఆయన మీడియాతో మాట్లాడతారు.

వాట్సాప్ గ్రూపులే టార్గెట్!

సాక్షి, హైదరాబాద్: కంటికి కనిపించకుండా ఆన్‌లైన్‌లో ఎర వేసి అందినకాడికి దోచుకునే సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు తమ పంథా మార్చుకుంటున్నారు. ఈ–కేటుగాళ్లు తాజాగా వేస్తున్న ఎత్తు వాట్సాప్ బల్క్ హ్యాకింగ్. తొలుత ఓ ఫోన్‌ను హ్యాక్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు.. ఆ నంబర్ ఉన్న వాట్సాప్ గ్రూపుల్ని టార్గెట్ చేస్తున్నారు. ఆ నంబర్ నుంచి ఆండ్రాయిడ్ ప్యాకేజ్ కిట్ (ఏపీకే) ఫైల్స్‌ను వాట్సాప్ గ్రూపుల్లోకి పంపి పెద్ద ఎత్తున నంబర్లను హ్యాక్ చేస్తున్నారు. ఈ నేరాల బాధితుల్లో పోలీసులు సైతం ఉండటం గమనార్హం. గడిచిన పక్షం రోజుల్లో కర్నూలు జిల్లాకు చెందిన ఓ సబ్–ఇన్‌స్పెక్టర్ (ఎస్సై), హైదరాబాద్ కమిషనరేట్‌లో పని చేసే అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు (ఏసీపీ) కూడా బాధితులుగా మారారు.

బల్క్ హ్యాకింగ్ చేస్తున్న సైబర్ నేరగాళ్లు

- ఓటీపీలు సంగ్రహించి, ఏపీకే ఫైల్స్ పంపుతూ హ్యాక్
- బాధితుల జాబితాలో పోలీసు అధికారులు



ఓ ఏసీపీ ఇటీవల పెట్టుకున్న స్టేటస్

అధికారిక వెబ్‌సైట్ల నుంచి వివరాలు

ఈ రకమైన నేరాల కోసం సైబర్ నేరగాళ్లు ప్రధానంగా వాట్సాప్ గ్రూపులను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. పోలీసు సహా వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఇటీవల ఇలాంటి గ్రూపులు నిర్వహించడం అనివార్యంగా మారింది. దీంతో అధికారుల నంబర్లను అధికారిక వెబ్‌సైట్ల నుంచే సంగ్రహించి ముందుగా వారి ఫోన్లను హ్యాక్ చేస్తున్నారు. తొలుత తమ వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్‌లో వాట్సాప్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దాన్ని యాక్టివేట్ చేసేందుకు వెబ్‌సైట్ నుంచి సేకరించిన అధికారి నంబర్‌ను వాడుతున్నారు. ఆ నంబర్‌కు వచ్చే ఓటీపీ కోసం కట్టుకథలు అల్లుతున్నారు. తాము ఓ సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుంటూ పొరపాటున మీ నంబర్ ఎంటర్ చేశామని, ఫలితంగా ఓటీపీ మీకు వచ్చిందని, దయచేసి చెప్తే తన పని పూర్తవుతుందని నమ్మబలుకుతున్నారు. ఇందులో ఎలాంటి ఆర్థిక లావాదేవీలు లేకపోవడంతో తేలిగ్గా నమ్ముతున్న బాధితులు.. ఆ ఓటీపీ చెప్తున్నారు. ఆ నంబర్‌తో సైబర్ నేరగాళ్లు అప్పటికే సిద్ధం చేసుకున్న వాట్సాప్ యాప్‌ను యాక్టివేట్ చేయగానే.. బాధితుడి నంబర్‌తో పనిచేసే వాట్సాప్ వారి ఫోన్ నుంచి సైబర్ నేరగాడి ఫోన్‌లో యాక్టివేట్ అయిపోతోంది. ఆ వెంటనే వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి 'టూ స్టెప్ వెరిఫికేషన్'కు మార్చేస్తున్నారు. ఆపై బ్యాకప్ నుంచి కాంటాక్ట్స్, గ్రూపులు, ఇతర వివరాలు డౌన్‌లోడ్ చేసుకుని, ఆ గ్రూపుల్లో సదరు అధికారి మాదిరిగా సందేశం పెడుతూ.. ఏపీకే ఫైల్స్‌తో కూడిన లింకులు పంపిస్తున్నారు. ఈ సందేశం సదరు అధికారి నుంచే వచ్చినట్లు భావిస్తున్న గ్రూపు సభ్యులు క్లిక్ చేయడంతో ఏపీకే ఫైల్స్ వారి ఫోన్లలోకి చొరబడి, అవీ హ్యాక్ అయిపోతున్నాయి. ఈలోపే తమ ఫోన్‌లో వాట్సాప్ పని చేయట్లేదని గుర్తించిన సదరు అధికారి.. ఆ యాప్‌ను డిలీట్ చేసి మరోసారి ఇన్‌స్టాల్ చేసి యాక్టివేట్ చేయడానికి ప్రయత్నించినా ఫలితం దక్కట్లేదు.

ఈ జాగ్రత్తలు అవసరం

వాట్సాప్ హ్యాకింగ్ బారిన పడకుండా ఉండాలంటే వినియోగదారులు మూడు జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వాట్సాప్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి అకౌంట్ ఆప్షన్ ఎంచుకోవాలి. అందులో టూ స్టెప్ వెరిఫికేషన్‌ను యాక్టివేట్ చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా ఆ నంబర్‌తో కూడిన వాట్సాప్‌ను మరోసారి, మరో ఫోన్‌లో యాక్టివేట్ చేయాలంటే... ఓటీపీతో పాటు యాక్టివేషన్ కోడ్ కూడా అవసరం అవుతుంది. అపరిచితుల, సుపరిచితుల నంబర్ల నుంచి వచ్చే లింకుల్లో ఏపీకే అనే ఫైల్ ఉంటే దాన్ని వెంటనే డిలీట్ చేయాలి.

ఫీజులపై రాజీ కుదిరిందా?

- అధికారులను కలిసిన కొన్ని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు
- ఫీజులు పెంచకపోతే నాణ్యత పాటించటం కష్టమని వాదన
- అధికారులను కలిసిన వాటిలో పెద్ద కాలేజీల యాజమాన్యాలే అధికం
- త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకొనే అవకాశం



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ ఫీజులపై వచ్చేవారం కొంత స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, సాంకేతిక విద్య కమిషనర్ దేవసేనను కొన్ని ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు కలిసి ఫీజుల పెంపుపై తమ వాదన వినిపించాయి. తాము నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగానే కాలేజీలను నిర్వహిస్తున్నామని తెలిపాయి. అధికారులను కలిసిన కాలేజీల్లో ఎక్కువ ఫీజులున్న పెద్ద కాలేజీలే ఉన్నాయి. దీంతో తమ పట్ల కొంత ఉదారంగా ఉండాలని ఆయా యాజమాన్యాలు కోరినట్లు తెలిసింది. ఫీజులు పెంచకపోతే నాణ్యత పాటించలేమని యాజమాన్యాలు స్పష్టం చేశాయి. మంచి ఫ్యాకల్టీని తమ కాలేజీల్లో నియమిస్తున్నామని, వారికి వేతనాలు పెంచుతున్నామని వివరించాయి. ఫీజులు పెంచకపోతే ఆర్థిక సమస్యలు వస్తాయని, ఫ్యాకల్టీ కూడా ఇతర రాష్ట్రాలకు వెళ్లే ప్రమాదం ఉందని పేర్కొన్నట్టు సమాచారం. తమ వాదనపై అధికారులు కొంత సానుకూలంగా ఉన్నట్టు కనిపించిందని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు తెలిపాయి. ప్రభుత్వం దృష్టికి కాలేజీల వాదన తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి. ఇంజనీరింగ్ ఫీజుల పునఃపరిశీలనపై ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం కమిటీ వేసిన విషయం తెలిసిందే. కమిటీ నివేదిక ఆధారంగా కొన్ని మార్గదర్శకాలను ప్రభుత్వం రూపొందించింది. నాణ్యతే కొలమానంగా ఫీజుల పెంపును పరిశీలించాలని రాష్ట్ర ప్రవేశాలు, ఫీజుల నియంత్రణ కమిటీకి ప్రభుత్వం సూచించింది. ఈ నేపథ్యంలో అన్ని కాలేజీలతోనూ ఎఫ్ఆర్‌సీ ఇటీవల సంప్రదింపులు జరిపింది. ఇందుకు సంబంధించిన నివేదికను త్వరలో ప్రభుత్వానికి అందివ్వనుంది. ఈ నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు అధికారులను వ్యక్తిగతంగా కలవడం చర్చనీయాంశమైంది. పెద్ద కాలేజీల పట్ల ప్రభుత్వం కొంత సానుకూలంగా ఉందనే సంకేతాలు వెలువడుతున్నాయి.

వారం రోజుల్లో గురుకుల టైంటేబుల్ మార్పు

- మంత్రి లక్ష్మణ్ హామీ



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలల టైంటేబుల్ మార్పుకు వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేయనున్నట్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డికి.. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ హామీ ఇచ్చారు. గురుకుల పాఠశాల ప్రతినిధులు దిలీప్‌రెడ్డి, నర్సయ్య, ప్రభాకర్, భాస్కర్, శ్రీనివాసరెడ్డి బృందం శ్రీపాల్‌రెడ్డి నేతృత్వంలో మంగళవారం మంత్రిని కలిసింది. సమయ పాలనపై కొన్నేళ్లుగా చేస్తున్న పోరాటాన్ని వివరించారు. మంత్రి తక్షణమే స్పందించి సీఎస్ రామకృష్ణారావుకు ఫోన్‌లో ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈ మేరకు వారం రోజుల్లో ఉత్తర్వులు వెలువడతాయని మంత్రి తెలిపినట్టు శ్రీపాల్ పేర్కొన్నారు.

12, 13 తేదీల్లో ఏఐపై జాతీయ సదస్సు

షాద్‌నగర్ గిరిజన గురుకుల డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో కృత్రిమ మేధ (ఏఐ)పై ఈనెల 12, 13 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ సచివాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ సీతాలక్ష్మి, అడిషనల్ సెక్రటరీ మాధవీదేవి, ట్రైబల్ వెల్ఫేర్ డిగ్రీ కాలేజీల డిప్యూటీ సెక్రటరీ కె.వేణుగోపాల్, గిరిజన గురుకుల ఓఎస్డీ నటరాజ్, షాద్‌నగర్ గిరిజన గురుకుల, డిగ్రీ, పీజీ మహిళా కళాశాల ప్రిన్సిపల్ నీతా తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో ఉద్యోగాలు సాధించేలా స్కిల్స్ నేర్పిస్తాం

టామ్‌కామ్ సంస్థతో కీలక ఒప్పందం: మంత్రి వివేక్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ విద్యార్థులు విదేశాల్లో మంచి ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని, ఈమేరకు విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు టామ్‌కామ్ సంస్థతో కీలక ఒప్పందం కుదుర్చుకున్నామని ఉపాధి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. పలువురు విద్యార్థులకు జర్మనీ వెళ్లే సర్టిఫికెట్లను మంగళవారం అందజేశారు. అనంతరం తెలంగాణ సచివాలయంలో కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిశోర్‌తో కలిసి వివేక్ విలేకరులతో మాట్లాడారు. విద్యార్థులకు సాఫ్ట్ స్కిల్స్ పెంచేలా ట్రైనింగ్ ఇప్పిస్తామని, విద్యార్థులు, నిరుద్యోగులకు స్కిల్స్ పెంచి ఉద్యోగాలు వచ్చేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. వచ్చే పదేళ్లలో 12 వేల మందిని విదేశాలకు పంపిస్తామని చెప్పారు. కార్మిక శాఖలో ఏటీసీలను ఏర్పాటు చేశామని, ఇందులో 98 శాతం అడ్మిషన్లు కావడం రికార్డు అన్నారు. 550 మంది ఫ్యాకల్టీకి అనుమతి కావాలని అడిగారని, దీనిపై సీఎంతో మాట్లాడితే సానుకూలంగా స్పందించారని మంత్రి తెలిపారు. కాళేశ్వరం ఫెయిల్ ప్రాజెక్టు అని మొదట్నుంచీ చెబుతున్నానని పేర్కొన్నారు. సోమవారం సీఎం రేవంత్ భూమి పూజ చేసింది హైదరాబాద్‌కు నీళ్లు ఇవ్వడానికి అనే విషయం తెలియక మాజీ మంత్రి కేటీఆర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాళేశ్వరం మీద సీబీఐ విచారణ చేయడానికి బీజేపీకి మంచి అవకాశం వచ్చిందన్నారు. జూబ్లీహిల్స్‌లో తామే గెలుస్తామని వివేక్ ధీమా వ్యక్తం చేశారు. యూరియా కోసం బీఆర్ఎస్ ఢిల్లీలో ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో దోస్తాన చేస్తూ ఇక్కడ ధర్నాలు చేయడం విడ్డూరమన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

తిరుపూరు పారిశ్రామికవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు భేటీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో దుస్తుల (అప్పారల్) పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులతో ముందుకు రావాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో వస్త్ర పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రపంచస్థాయి మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయన్నారు. మంగళవారం తమిళనాడులోని కోయంబత్తూరు, తిరుపూరులను సందర్శించిన మంత్రి శ్రీధర్‌బాబు అక్కడి పారిశ్రామిక వర్గాలు, ఎగుమతిదారులతో భేటీ అయ్యారు. అతిపెద్ద అప్పారల్ తయారీ కేంద్రంగా తిరుపూరు గ్లోబల్ లీడర్‌గా ఎదిగింది. 10 వేల దుస్తుల పరిశ్రమలతో 'నిట్ వేర్ క్యాపిటల్ ఆఫ్ ఇండియా'గా తిరుపూరు లక్షల మందికి ఉపాధి కల్పిస్తోంది. 'దేశంలోని 90 శాతం దుస్తులు, క్యాజువల్ వేర్, స్పోర్ట్స్ వేర్, సాక్సులు, టోపీల లాంటి కాటన్ ఉత్పత్తులు తిరుపూరు నుంచే ఎగుమతి అవుతున్నాయి. 1990 నుంచి తిరుపూరు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన దుస్తులను ఎగుమతి చేస్తోంది. నాణ్యతతో కూడిన రెడీమేడ్స్ తయారీకి అవసరమయ్యే లాంగ్ స్టేపుల్ (పొడవు పోగుల) కాటన్ తెలంగాణలో సమృద్ధిగా అందుబాటులో ఉంది'అని శ్రీధర్‌బాబు వెల్లడించారు. తెలంగాణ వ్యవసాయ, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన ఏర్పాటు చేసే రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరు కావాల్సిందిగా తిరుపూరు పారిశ్రామిక వేత్తలను శ్రీధర్‌బాబు ఆహ్వానించారు.



పారిశ్రామిక వేత్తలతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పారిశ్రామికవేత్తలతో భేటీ

పర్యటనలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు హీరో ఫ్యాషన్ గ్రూప్ (రామ్ రాజ్ కాటన్స్) చైర్మన్ కేఆర్ నాగరాజన్, ఎండీ సుందరమూర్తితో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సౌత్ ఇండియా మిల్స్ అసోసియేషన్ (సిమా) సెక్రటరీ జనరల్ కె.సెల్వరాజ్, సంస్థ సభ్యులను తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోరారు. సులభతర పారిశ్రామిక విధానాల అమలుతో తమ ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు తిరుపూరులోని నేతాజీ అప్పారల్ పార్కును సందర్శించి ఇండస్ట్రీ ప్రతినిధులతో మాట్లాడారు.

ఏసీబీ వలలో నార్సింగి టీపీవో

- రూ.4 లక్షలు తీసుకుంటూ చిక్కిన అధికారి
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు



డబ్బుతో ఏసీబీకి చిక్కిన టీపీఓ మణిహారిక

మణికొండ (హైదరాబాద్): ఓపెన్ ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్ ధ్రువ పత్రం ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేసిన ఓ అధికారిణి ఏసీబీ వలకు చిక్కారు. రూ.5 లక్షలు డిమాండ్ చేసి రూ. 4 లక్షలు తీసుకుంటూ మంగళవారం రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయంలో టీపీవోగా పని చేస్తున్న మణిహారిక మంచిరేవులలోని వినోద్‌కు చెందిన ఓపెన్ ప్లాట్‌కు ఎల్ఆర్ఎస్ ఇచ్చేందుకు రూ.5 లక్షలు డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేనని చెప్పడంతో 4 లక్షలకు బేరం కుదిరింది. ప్రభుత్వానికి ఫీజు చెల్లిస్తే ఉచితంగా చేయాల్సిన పనికి లంచం డిమాండ్ చేయటంతో వినోద్ తమను వారం రోజుల క్రితం సంప్రదించాడని శ్రీధర్ తెలిపారు. తమ సూచన మేరకు తను ఇస్తానన్న డబ్బును మంగళవారం నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చి ఆమెకు ఇచ్చాడు. వెంటనే రంగంలోకి దిగి డబ్బును స్వాధీనం చేసుకుని మణిహారికను అరెస్టు చేశామన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధి అలకాపూర్ టౌన్‌షిప్‌లోని ఆమె నివాసంలోనూ తనిఖీలు చేశామని చెప్పారు. ప్రభుత్వ అధికారులు ఎవరు లంచం డిమాండ్ చేసినా తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గురుకులాలపై సీఎం, మంత్రి సమీక్ష చేశారా?

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సాక్షి, హైదరాబాద్: గురుకులాలపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఏనాడైనా సమీక్ష చేశారా? అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రశ్నించారు. గురుకులాలకు పక్కా భవనాలు కేసీఆర్ హయాంలో నిర్మించలేదనడం విడ్డూరమని, కట్టిన పక్కా భవనాలు తాను మంత్రికి చూపిస్తానని, చూడటానికి మీరు సిద్ధమేనా అని సవాల్ విసిరారు. మంగళవారం బీఆర్ఎస్ నేత గెల్లు శ్రీనివాస్‌తో కలిసి కొప్పుల మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు అసహనంతో మాట్లాడుతున్నారని, సీఎం నియోజకవర్గంలో ఉన్న గురుకుల పాఠశాలను సందర్శించి అక్కడే తేలుద్దామన్నారు. 22 నెలల కాంగ్రెస్ పాలనలో గురుకులాల్లో వంద మందికిపైగా విద్యార్థులు చనిపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల దీనావస్థల గురించి సీఎం, మంత్రికి పట్టింపు ఉందా? అని కొప్పుల ప్రశ్నించారు. గురుకులాల్లో విద్యార్థుల మరణాలు సీఎం, మంత్రి చేసిన హత్యలేనని ఆరోపించారు.

తుది మెరుగులతో మేడారం మాస్టర్‌ప్లాన్

- మంత్రి ధనసరి సీతక్క ఆదేశం



ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం జాతర అభివృద్ధి పనుల మాస్టర్ ప్లాన్‌కు తుదిమెరుగులు దిద్దాలని మంత్రి ధనసరి సీతక్క అధికారులను ఆదేశించారు. సీతక్క మంగళవారం ములుగు జిల్లా ఎస్ఎస్ తాడ్వాయి మండలం మేడారంలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు పూజారుల అభిప్రాయాలు, ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌లో కొన్ని మార్పులు చేర్పులు చేయాలని ఆర్కిటెక్ట్ డిజైనర్ల బృందానికి సూచించారు. రెండు, మూడు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి మేడారానికి వచ్చే అవకాశం ఉందన్నారు. సీఎం రానున్న దృష్ట్యా మేడారంలో ఏర్పాట్లపై మంత్రి సీతక్క అధికారులతో సమీక్షించారు. మంత్రి వెంట కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎస్పీ శబరీశ్ తదితరులు ఉన్నారు.

వరదతో చిందరవందర



ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం తర్నం వాగు వద్ద భారీ వాహనాలకు వరద కష్టాలు తప్పడం లేదు. హైలెవల్ వంతెనను కూల్చివేసిన అధికారులు నిర్మాణ పనులను ఇంకా ప్రారంభించలేదు. తాత్కాలికంగా లోలెవల్ వంతెనను ఏర్పాటు చేశారు. కాగా సాత్నాల ప్రాజెక్ట్‌కు వరద ఉప్పొంగి గేట్లు ఎత్తివేయడంతో.. వాగులో వరద ప్రవాహం పెరిగి వాహనాలు వరదలో చిక్కుకుంటున్నాయి. ఇటీవల రెండు లారీలు కొట్టుకుపోయాయి. తాజాగా మంగళవారం ఓ లారీ అకస్మాత్తుగా బ్రేక్ డౌన్ కావడంతో.. దాని వెనుక వెళ్తున్న మరో రెండు లారీలు వరద ప్రవాహంలో చిక్కుకుపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. వరద వచ్చిన ప్రతిసారీ కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం కలిగి వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.



ట్రాఫిక్ అంతరాయంతో లారీ కింద వంట చేసుకుంటున్న డ్రైవర్లు

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

మదమెక్కిన భీకరి!

కౌండిన్య అభయారణ్యంలో ఏనుగుల సమస్య ఇప్పట్లో తీరేలా లేదు. మదపుటేనుగుల మేటింగ్ సీజన్ మొదలు కావడంతో జనానికి ముప్పు తప్పేలా లేదు. అక్టోబర్ నుంచి జనవరి వరకు మదమెక్కిన గజరాజులకు పట్టపగ్గాలే ఉండవు. అలవి కాని ఆగ్రహంతో రెచ్చిపోయే భీ'కరి' నుంచి తోటి జంతువులతోపాటు మనుషులకు కూడా ముప్పు పొంచి ఉంటుంది. మేటింగ్ సీజన్ ముగిసే వరకు అటవీ సమీప ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది. ఎలిఫెంట్ శాంచురీని దాటి బయటకొచ్చే మదపుటేనుగుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.


కౌండిన్య అడవిలో సంచరించే మదపుటేనుగులు (ఫైల్)



- అక్టోబర్ నుంచి జనవరి వరకు ఏనుగులకు మేటింగ్ సీజన్
- ఉద్రేకంతో రెచ్చిపోతున్న గజరాజులు
- ఇప్పటికే జనంపై పలు ప్రాంతాల్లో దాడులు

పలమనేరు : రాష్ట్రంలోని కుప్పం, చిత్తూరు, పలమనేరు ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలోని కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులతోపాటు అటు తమిళనాడులోని మోర్థన ప్రాంతం, కృష్ణగిరి, కావేరిపట్నం, కర్ణాటకలోని హోసూర్, బన్నేర్‌గట్టల నుంచి తరచుగా కౌండిన్యలోకి ప్రవేశించే ఏనుగులున్నాయి. స్థానికంగా ఉన్న గుంపుల్లో మొత్తం 12 మగ ఏనుగులుండేవి. వీటిలో ఆరు మృతిచెందగా ఇప్పుడు ఆరు మగ ఏనుగులు (మదపుటేనుగులు) మాత్రం ఉన్నాయి. గుంపు నుంచి విడిపోయి ఒంటరిగా సంచరిస్తున్నాయి. ఒక్కో మదపుటేనుగు ఎంపిక చేసుకున్న ప్రాంతంలోనే ఎక్కువగా ఉంటుంది. ఇవి చాలా క్రూరంగా ప్రవర్తిస్తుంటాయి. జనం కనిపిస్తే దాడులు చేస్తుంటాయి. వీటి చేష్టలు, గుర్తులను బట్టి స్థానికంగా వాటికి పేర్లు పెట్టి పిలుస్తుంటారు. ఈ ప్రాంతంలో రౌడీ ఏనుగు, రాముడు, భీముడు, ఒంటి దంతం ఏనుగు, ఒంటికన్ను ఏనుగు ఇలా వీటికి పేర్లు పెట్టారు. ఇవి తమ ఉనికి కోసం రౌడీల్లా ప్రవర్తిస్తుంటాయి. మిగిలిన ఆడ ఏనుగులు, గున్నలకు భయమెక్కువ, దీంతో ఇవి గుంపులోనే ఉంటూ జనాన్ని చూసి వెనక్కు వెళుతుంటాయి. కానీమదపుటేనుగులు ఏమాత్రం భయపడవు, ఎదురు దాడులకు దిగుతుంటాయి.


ఏనుగుల ఉనికిని పసిగట్టి రక్షణకోసం చెట్లపై ఏర్పాటు చేసుకున్న అటక(ఫైల్)


మదపుటేనుగుల జాడకోసం నిత్యం శ్రమించే ఎలిఫెంట్ ట్రాకర్లు

ప్రస్తుతం ఆరు మాత్రమే..

కౌండిన్యలోని 12 మదపుటేనుగుల్లో ప్రస్తుతం ఆరు మాత్రమే ఉన్నాయి. బంగారుపాళెం మండలం మొగిలివారిపల్లెలో రౌడీ ఏనుగుగా చెప్పుకునే మదపుటేనుగు కరెంటు తీగలకు బలైంది. గంగవరం మండలం మన్నారునాయనిపల్లె సమీపంలో పొలానికి రక్షణగా ఏర్పాటు చేసిన కరెంటుకు మరో మదపుటేనుగు బలైంది. అంతకుముందు కాలువపల్లె, మొసలి మడుగు వద్ద రాముడు, భీముడు అనే రెండు మదపుటేనుగులు చనిపోయాయి. మూడేళ్ల క్రితం పలమనేరు మండలంలోని బేరుపల్లె, గాంధీనగర్‌ల వద్ద రెండు మదపుటేనుగులు కరెంట్ షాక్‌తో కన్నుమూశాయి. ఇవి బతికున్నప్పుడు మనుషులు, పశువులు, కుక్కలను తరమి తరమి చంపేవి. ఇప్పుడున్న ఆరు మదపుటేనుగుల్లో గుడ్డికన్ను ఏనుగు గత మేటింగ్ సీజన్‌లో యాదమరి మండలం దిగువకనతల చెరవువద్ద అటవీశాఖ డ్రైవర్ సతీష్‌ను చంపిన విషయం తెలిసిందే. మొసలిమడుగు రౌడీగా పిలవబడే మరో ఏనుగు కౌండిన్యలోని వీరమానికుంటవద్ద ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేసి ఆపై ముగ్గురు ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను తొండంతో విసిరేసింది. ఊసరపెంట మదపుటేనుగు తరచూ ఆ గ్రామంలోకి వచ్చి రాత్రంతా ఉండి వెళ్లడం దీని ప్రత్యేకత. మిగిలిన రెండు మదపుటేనుగులు వేర్వేరుగా కౌండిన్యలో సంబంధిత ప్రాంతాల్లో సంచరిస్తుంటాయి.

ఈ నాలుగు నెలలు ప్రమాదమే..

ముఖ్యంగా మదపుటేనుగులు అక్టోబరు నుంచి జనవరి వరకు ఆడ ఏనుగుల సాంగత్యం కోసం మత్తులో ఉంటాయి (మేటింగ్ సీజన్). దీంతో తిక్కతిక్కగా ప్రవర్తించడం, మనుషులను చూస్తే ఆగ్రహంతో ఊగిపోతుంటాయి. తన పరిధితోపాటు అడవిలో ఆడ ఏనుగుల కోసం చాలా దూరం అన్వేషిస్తుంటాయని అటవీశాఖ అధికారులు తెలిపారు. ఈ సమయంలో మనషులు, జంతువులపై దాడులు ఎక్కువగా ఉంటాయి. ఆడ ఏనుగులు వీటి మాట వినకపోవడం లేదా అక్కడ జరిగే రభసతో ఇప్పటిదాకా ఆరు ఆడ ఏనుగులు మృతిచెందాయి. ఏదేమైనా ఈ నాలుగునెలలు మదపుటేనుగుల కారణంగా ప్రమాదాలు పొంచిఉన్నాయి. కాబట్టి అడవుల్లోకి ఎవరూ వెళ్లకూడదని ఫారెస్ట్ అధికారులు సూచిస్తున్నారు.

ఆగ్రహంతో ఊగిపోతూ...

మదపుటేనుగులపై జనం రాళ్లు విసరడం, టపాకాయలను పేల్చడం, టైర్లు కాల్చి వాటి పైకి విసరడం లాంటి చర్యలతో మగ ఏనుగులు జనంపై కసి పెంచుకున్నాయి. ఆడ ఏనుగులుకున్నంత సహనం వీటికి ఉండదు. ఇప్పటిదాకా పరిశీలిస్తే యాదమరి మండలం దిగువకనతల చెరువువద్ద అటవీశాఖ డ్రైవర్ సతీష్‌ను, వీరమానికుంటవద్ద ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేసి ఆపై ముగ్గురు ఎలిఫెంట్ ట్రాకర్స్‌ను తొండంతో విసరడం, పందేరుపల్లి వద్ద రైతును, కాలువపల్లి వద్ద యువకుడిని తొండంతో కొట్టి చంపడం చేసింది మదపుటేనుగులే. పెద్దపంజాణిమండలం పెనుగొలకలకు చెందిన బంగారప్పను, కాలువపల్లి వద్ద రైతు సుబ్రమణ్యను చంపింది మదపుటేనుగులే. కుప్పంలోనూ దాడులు చేసింది ఇవే. పదిరోజుల క్రితం పెద్దపంజాణి మండలంలో రైతును తొక్కి చంపిందే మదపుటేనుగే. గుడిపాల మండలంలో దంపతులను చంపిందే మదపుటేనుగే.

మదపుటేనుగులకు కోపం ఎక్కువ



గుంపులనుంచి వేరుగా ఉంటూ ఒంటరిగా సంచరించే మదపుటేనుగులు చాలా కోపంగా ఉంటాయి. వీటి బారినుంచి తప్పించుకోవాలంటే ఏనుగు తరిమినప్పుడు మనిషి నేరుగా కా కుండా ఎస్ ఆకారంలో వెళ్లాలి. ఒంటిపై ఉన్న బ ట్టలను తీసి ఏనుగు ముందు వేస్తే అది కాసేపు దాన్ని వాసన చూస్తు తొక్కుతుండగా ఆ గ్యాప్‌లో తప్పించునే అవకాశముంటుంది. మేటింగ్ సీజన్‌లో మరింత ఆగ్రహంగా ఉంటాయి. కాబట్టి అ టవీ సమీప గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.
– భరణి, డీఎఫ్ఆర్ఓ, చిత్తూరు

కౌండిన్య పరిధిలోని మొత్తం ఏనుగులు : సుమారు 100
ఇప్పటి వరకు గజ దాడుల్లో మృతుల సంఖ్య : 15
గాయపడినవారు : 36
ఇప్పటిదాకా మృతి చెందిన ఏనుగుల సంఖ్య : 19

అమ్మకానికి ఎర్రబంగారం

ఎర్రచందనం స్మగ్లర్లు శేషాచలం అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన దుంగలను కేంద్రీయ ఎర్రచందనం డిపోలో భద్రపరుస్తారు. వాటికి వేలం పాట నిర్వహించనున్నారు.

- సీఆర్ఎస్ డిపోలో నిల్వలపై దృష్టి
- ప్రస్తుతానికి 135 టన్నులకు వేలం
- ఈనెల 22 నుంచి అక్టోబర్ 6 వరకు వ్యాపారుల సందర్శన


నిల్వ ఉంచిన ఎర్రచందనం దుంగలు (ఫైల్)



రాజంపేట: రాష్ట్ర ప్రభుత్వం నిల్వ ఉన్న ఎర్రచందనం విక్రయించాలని నిర్ణయం తీసుకుంది. దీంతో అటవీశాఖ ఎర్రచందనం నిల్వలపై దృష్టి సారించింది. కేంద్రీయ డిపో(తిరుపతి)లో ఉన్న ఎర్రచందనం అమ్మేందుకు అన్ని చర్యలను తీసుకుంది. శేషాచలం అటవీ పరిధిలో ఎక్కడ ఎర్రచందనం లభ్యమైనా సెంట్రల్‌డిపోకు తరలిస్తున్నారు. రాజంపేట, కపిలతీర్థంలో కూడా ఎర్రచందనం డిపోలు ఉన్నాయి. వీటి నిల్వల విషయంలో సీఆర్ఎస్ ప్రధానంగా వ్యవహరిస్తోంది. ప్రస్తుతానికి 135 టన్నులు వేలానికి సిద్ధం చేశారు. ఈ విషయాన్ని సీఆర్ఎస్ సంబంధిత అధికారి ఒకరు ధ్రువీకరించారు. ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనం రాయలసీమ ప్రాంతంలో ఉన్న కొండల్లో మాత్రమే దొరుకుతుంది. ఈ కొండలు దాదాపు 5.5లక్షల హెక్టార్లలో విస్తరించి ఉన్నాయి. చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు జిల్లాల్లో విస్తరించిన శేషాచలం, వెలుగొండ, పాలకొండ, నల్లమల అడవులు తూర్పు కనుమల్లో ఉన్నాయి. వీటిలో శేషాచలం, వెలుగొండలో మాత్రమే అధికంగా ఎర్రచందనం పెరుగుతోంది. ఈ కొండల్లో యురేనియం, ఐరన్, గ్రాఫైట్, కాల్షియం లాంటివి వివిధ నిష్పత్తుల్లో ఉన్నాయి.



రాజంపేట ఎర్రబంగారానికే డిమాండ్

జీవవైవిధ్యఅటవీ ప్రాంతం(బయోస్పెయిర్)గా గుర్తింపు పొందిన శేషాచలం ఎర్రచందనం చెట్లతో ప్రత్యేక గుర్తింపు సంతరించుకుంది. ప్రధానంగా శేషాచలం కొండల్లో పెరిగే ఎర్రచందనం ఎక్కువ చేవ ఉండటంతో దానికి అంతర్జాతీయమార్కెట్‌లో డిమాండ్ ఉంది. ఇందులో రాజంపేట ఎర్రచందనానికి ఎక్కువ డిమాండ్ ఉంది. వైఎస్సార్‌జిల్లాలో 3.2 మిలియన్ల హెక్టార్లలో, అన్నమయ్య జిల్లాలో 2.8 మిలియన్ల హెక్టార్లలో ఎర్రచందనం చెట్లు ఉన్నాయి.

ఎర్రచందనం అనే పేరు ఎలా..

ఎర్రచందనాన్ని అనేక పేర్లతో పిలుస్తారు. టెరోకార్ప స్‌సాంటలైనస్ అనేది దీని శాస్త్రీయనామం. టెరో అనే గ్రీకు మాటకు ఉడ్(కర్ర) అని అర్థం. కార్పస్ అంటే పండు. దాని కాయ చాలాగట్టిగా ఉంటుంది. సాధారణంగా అది మొలకెత్తదు. అది మొక్క రావాలంటే ఏడాది పడుతుంది. దీనినే ఎర్రచందనం, రక్తచందనం, శాంటాలం. ఎర్రబంగారం అని కూడా అంటారు.

రాజంపేట, రైల్వేకోడూరు పరిధిలో..

రాజంపేట, రైల్వేకోడూరు రేంజ్ పరిధిలో 50 వేల హెక్టారలో శేషాచల అడవులు విస్తరించి ఉన్నాయి. ఈ అడవుల్లో అధికంగా ఎర్రచందనం ఉంది. ఈ అడువులను జీవావరణ రిజర్వ్‌గా కేంద్రం ప్రకటించింది. ఐదువేల వృక్ష జాతులు మొక్కలు కలిగిన శేషాచల అడవులకు బయోస్పియర్ రిజర్వ్‌గా ప్రకటించారు. ఈ అడవుల్లో 1700పైగా పుష్పించే జాతి మొక్కలు ఉన్నాయి.

దుంగలన్నీ ఒకచోటికి..

స్మగ్లర్ల అక్రమరవాణా నేపథ్యంలో ఎల్లలు దాటిన ఎర్రచందనాన్ని, దేశంలోని వివిధ రాష్ట్రాల్లో స్మగ్లర్లు అక్రమంగా నిల్వ చేసిన ఎర్ర దుంగలను , అటవీ, పోలీసు,కస్టమ్స్‌శాఖల వద్ద వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎర్రచందనాన్ని ఒకేచోటికి రప్పించి భద్రపరిచే పనులకు నాలుగేళ్ల క్రితం అటవీశాఖ శ్రీకారం చుట్టింది. టెండర్ల ద్వారా విక్రయించి రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చేందుకు ఏర్పాట్లు చేసింది. తిరుపతి కేంద్రీయ ఎర్రచందనం డిపోకు జిల్లాలోని డిపోలో నిల్వ ఉంచిన వాటిని తరలిస్తారు. అక్కడే వేలంపాట నిర్వహించనున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

అటవీప్రాంతం: శేషాచలం(బయోస్పెయిర్)
అన్నమయ్య జిల్లా: 2.8 మిలియన్ల హెక్టార్లు
వైఎస్సార్ జిల్లా: 3.2 మిలియన్ల హెక్టార్లు

డిమాండ్ ఎందుకు..

చైనా, జపాన్‌లలో వంటింట్లో వాడే పాత్రలు, గిన్నెలుకూడా ఎర్రచందనంతో తయారు చేసినవి వాడుతుంటారు. సంగీతవాయిద్యాలు తయారు చేసి పెళ్లిళ్లలో బహుమతిగా ఇస్తుంటారు. రష్యా వాళ్లు కూడా ఎర్రచందనం కొనుగోలు చేస్తుంటారు. అందులో ఔషధగుణాలు ఉన్నాయి. వయగ్రా, కాస్మెటిక్, ఫేస్ క్రీమ్ లాంటి వాటిలో వీటిని వాడతారు. అల్సర్‌ను తగ్గించే గుణం, కిడ్నీ సమస్యలు, రక్తాన్ని శుద్ధి చేయడం వంటి లక్షణాలు ఎర్రచందనంలో ఉంటాయని నిపుణులు అంటున్నారు.

- విదేశాలకు తరలిపోకుండా ఎర్రచందనం అక్రమ రవాణాకు అడ్డుకట్టవేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం యాంటీ స్మగ్లర్స్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. శేషాచలం అడవుల్లో నిత్యం కూంబింగ్ చేస్తూ చెట్లను నరకకుండా అడ్డుకుంటోంది. 2015లో ఏర్పాటైన ఈ టాస్క్‌ఫోర్స్‌లో పోలీసు, ఫారెస్టు, ఏపీఎస్‌పీ, సివిల్ పోలీసు డిపార్టుమెంట్ల సిబ్బంది ఉంటారు. తిరుపతి హెడ్‌క్వార్టర్‌గా పనిచేస్తోంది. గత 15 సంవత్సరాల్లో 15 లక్షల టన్నుల ఎర్రచందనం విదేశాలకు తరలిపోయింది.
- సీఆర్ఎస్ డిపోలోని నిల్వ ఉన్న మూడు రకాల ఎర్రబంగారం వేలంపాటకు సిద్ధమైంది. ఈ–సేల్ ద్వారా అమ్మకాలు సాగించనున్నారు. ఈనెల 22 నుంచి వచ్చేనెల 6 వరకు ఎర్రబంగారు కొనుగోలు దారులు డిపో సందర్శించే అవకాశం కల్పించారు. చిప్స్, బటన్స్, రూట్స్ రకాలను వేలంపాటలో అమ్మకానికి సిద్ధం చేశారు. రేట్ విషయంపై నిర్ణయం తీసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కమిటీ వేయనుంది.

ఇసుకాసురుల పాపం..
ఇదే సాక్ష్యం



కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుకాసురులకు హద్దే లేకుండా పోయింది. కాసుల కక్కుర్తితో యథేచ్ఛగా ఇసుకను కొల్లగొడుతున్నారు. వారు చేస్తున్న పాపాలు సామాన్యులకు శాపాలుగా మారాయి.అందుకు ప్రత్యక్ష సాక్ష్యమే ఈచిత్రం. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం కల్లుదేవనహళ్లి వద్ద హగరి నదిలో గతంలో చేతి పంపు ఏర్పాటు చేశారు. చంద్రబాబు ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి హగరి నదిలో ఇసుక కొల్లగొట్టడం ప్రారంభించిన 'పచ్చ' నేతలు.. నదిలోని చేతి పంపు చుట్టూ ఇసుక తోడేసి గుంతలు మిగిల్చారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వేదావతి హగరి పొంగి ప్రవహించడంతో చేతి పంపు చుట్టూ ఉన్న కొద్దిపాటి ఇసుక కూడా కొట్టుకుపోయింది. దీంతో ప్రస్తుతం అందనంత ఎత్తుకు చేతి పంపు చేరింది. ఒకప్పుడు సులువుగా నీటిని పట్టుకున్న స్థానికులు నేడు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. కల్లుదేవనహళ్లిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ శీనానాయక్ దృష్టికి తీసుకెళ్లగా,పరిశీలించి చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.
– బొమ్మనహాళ్

'నూజివీడు వీణ' పుస్తకం ఆవిష్కరణ

సాక్షి, అమరావతి: హైదరాబాద్‌లోని ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ (ఎఫ్‌డీడీఐ)లో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాంబాబు ముప్పిడి రచించిన 'నూజివీడు వీణ–అందమైన మెలోడీల మూలం' పుస్తకాన్ని మంగళవారం ఆవిష్కరించారు. మొదటి కాపీని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్స్ ఎండీ విశ్వ, లేపాక్షి మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీనాథ్‌కు నూజివీడులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అందజేశారు. భారతదేశపు ప్రత్యేక సంగీత వాయిద్యాలలో ఒకటైన నూజివీడు వీణ ప్రత్యేకతను చాటిచెబుతూ సంప్రదాయ చేతిపనుల సమగ్ర డాక్యుమెంటేషన్‌గా ఈ పుస్తకాన్ని రూపొందించారు. నూజివీడు వీణ తయారీ ప్రక్రియ, చేతి వృత్తులవారి కోసం రూపొందించిన శిక్షణా కార్యక్రమాలను వివరించారు. కొన్ని తరాలుగా వీణ తయారీని కాపాడుతున్న మాబు సుభాని కుటుంబ వివరాలు ఇందులో పొందుపరిచారు.



యూరియా కోసం 'క్యూ'యోమొర్రో

అన్నదాతల పడిగాపులు

లైన్‌లో పట్టాదారు పుస్తకాలు పెట్టి బారులు

స్లిప్పుల కోసమూ బాహాబాహీ


బాపట్ల జిల్లా కొల్లూరులో ద్విచక్రవాహనం పైకి ఎక్కి యూరియా స్లిప్పుల కోసం పోరాడుతున్న రైతులు

ఐరాల /ఖాజీపేట/పెద్దతిప్పసముద్రం/కొల్లూరు: యూరియా కోసం అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. రైతు సేవా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. లైన్లలో పట్టాదారుపాసుపుస్తకాలు పెట్టి మండుటెండలో పడిగాపులు పడుతున్నారు. అయినా కూటమి సర్కారు కరుణించడం లేదు. సరిపడా యూరియా సరఫరా చేయడం లేదు. రైతుల ఆక్రందనలకు కారణమవుతోంది. మంగళవారమూ రాష్ట్ర వ్యాప్తంగా ఇవే దృశ్యాలు దర్శనమిచ్చాయి.

- చిత్తూరు జిల్లా ఐరాల మండలంలోని 35 యర్లంపల్లె ఆర్‌ఎస్‌కే కేంద్రంలో నాగంవాండ్లపల్లె, 35 యర్లంపల్లె రైతులకు మంగళవారం యూరియా అందిస్తామని వ్యవసాయశాఖ సమాచారం అందించడంతో రెండు పంచాయతీల రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నాలుగు గంటల నుంచే రైతులు క్యూలో పాస్‌పుస్తకాలు పెట్టి 10 గంటల వరకు నిరీక్షించారు. కర్షకులు భారీగా తరలిరావడంతో తోపులాట జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో రావడం గమనార్హం. మధ్యాహ్నం సమయంలో ముందుగా 35 యర్లంపల్లె పంచాయతీ రైతులకు యూరియా అందజేయాలని రైతులు ఆర్‌ఎస్‌కే వద్ద ఆందోళన చేశారు. రెండు పంచాయతీలకు కలిపి 250 బస్తాలు మాత్రమే వచ్చినట్లు ఏఓ చెప్పడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గంటల తరబడి క్యూలో వేచి ఉన్నా.. చివరికి యూరియా దొరక్కపోవడంతో రైతులు ఉసూరుమంటూ వెనుదిరిగారు.
- వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం రావులపల్లె సచివాలయ పరిధిలో యూరియా వచ్చిందని తెలియడంతో రైతులు భారీగా తరలివచ్చారు. గంటల తరబడి ఎండలో నిల్చోలేక క్యూలో పట్టాదారుపాసుపుస్తకాలు పెట్టారు. ఒక పాసుపుస్తకానికి రెండు బస్తాల యూరియా మాత్రమే అందించడంతో అధికారులపై రైతులు మండిపడ్డారు. అవసరమైన మేర పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.
- అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలోని రాపూరివాండ్లపల్లి, సంపతికోట ఆర్‌ఎస్‌కేల ఎదుట రైతులు మంగళవారం యూరియా కోసం బారులు తీరారు. కూటమి సర్కారు తీరుపై నిరసన వ్యక్తం చేశారు.
- బాపట్ల జిల్లా కొల్లూరు గ్రోమోర్ ఎరువుల దుకాణానికి మంగళవారం 440 యూరియా బస్తాలు రావడంతో ఉదయం ఆరు గంటల నుంచే రైతులు పడిగాపులు పడ్డారు. వ్యవసాయశాఖ అధికారులు తాపీగా 11 గంటలకు వచ్చి టెంట్‌లు వేశారు. అనంతరం యూరియా వినియోగంపై అవగాహనా సదస్సు అంటూ కాలయాపన చేశారు. దీంతో సహనం నశించిన రైతులు కూర్చునేందుకు చాలినన్ని కుర్చీలు సైతం లేకపోవడంతో ఒక్కసారిగా అధికారులపై తిరగబడ్డారు. గ్రోమోరు కేంద్రంలోకి దూసుకువెళ్లారు. దుకాణం షట్టర్లు మూసివేసి రైతులను అదుపు చేసేందుకు అధికారులు యత్నించినా ఫలితం లేకపోయింది. పోలీసులు, వీఏఏల వద్ద యూరియా పంపిణీ స్లిప్పులు ఉండటంతో వారిని రైతులు ముట్టడించారు. ఈ సమయంలో తీవ్ర తోపులాట జరిగింది. స్లిప్పులు దక్కించుకునేందుకు రైతులు పోటీ పడ్డారు. పోలీసులు, వ్యవసాయ శాఖ సిబ్బంది చేతుల్లో ఉన్న స్లిప్పులను లాక్కొన్నారు. పోలీసులు పరిస్థితిని అదుపుచేసి అత్యంత గందరగోళం నడుమ రైతులకు యూరియాను పంపిణీ చేశారు.


అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలం రాపూరివాండ్లపల్లిలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఇన్‌డోర్ Vs అవుట్‌డోర్ ఫార్మింగ్!



పంటలు అనగానే మనకు ఆరుబయట పొలంలో పండించే పంటలే (అవుట్‌డోర్ ఫార్మింగ్) గుర్తుకొస్తాయి. కానీ, ఆధునిక కాలంలో ఇండోర్ పంటలా (ఇంటి పంటలా), అవుట్‌డోర్ పంటలా అని వివరణ అడగాల్సిన పరిస్థితి. మేడపైన ఇంటి పంటలు, పెరటి తోటలు, వర్టికల్ గార్డెన్స్, పాలీహౌస్ పంటలు.. ఇలా అనేక రకాలుగా ఇవ్వాళ పంటలు పండించుకుంటున్నాం. వాతావరణ పరిస్థితులు ఆరుబయట అనుకూలంగా లేనప్పుడు పాలీహౌస్‌లు, భవంతుల్లో ప్రత్యేక వాతావరణ పరిస్థితులు కల్పించి మరీ సాగు చేస్తున్నాం. రూరల్ అగ్రికల్చర్, అర్బన్ అగ్రికల్చర్‌గా కూడా విడమర్చి మాట్లాడుకుంటున్నాం. అయితే, ఇండోర్ ఫార్మింగ్‌లో చాలా విషయాలను మనం నియంత్రించగలం కాబట్టి ఆరుబయట సాగుతో పోల్చితే అన్నీ మెరుగ్గానే ఉంటాయన్న గ్యారంటీ ఏమీలేదు. అక్కడ ఉండే ఇబ్బందులు అక్కడా ఉంటాయి. అయితే, ఇండోర్ ఫార్మింగ్ పద్ధతుల్లో ఏయే ఆహార భద్రతా చిక్కులొస్తాయి? సాధారణ వ్యవసాయానికి దీనికీ ఏమి తేడాలుంటాయి? అనే అంశంపై చర్చ చాలాకాలంగానే ఉన్నప్పటికీ అధ్యయనాల, ప్రమాణాల లోపం వెంటాడుతూ ఉంది. ఈ కొరత తీర్చడానికి ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (యూఎన్ ఎఫ్ఏవో) ఇటీవల ఒక నివేదికను వెలువరించింది. ఆరుబయట పంటలు పండించటంతో పోల్చితే ఇంట్లో పండించే పంటలతో ప్రయోజనాలేమి ఉన్నాయి? ఏమి జాగ్రత్తలు తీసుకోవాలి?.. ఇటువంటి ఆసక్తికరమైన వివరాలను ఆ నివేదికలో చర్చించారు. వాటిని రేఖామాత్రంగా పరిశీలిద్దాం..

ఆధునిక ఇండోర్ వ్యవసాయంతో ముడిపడి ఉన్న ఆహార భద్రత ప్రమాదాలు, నియంత్రణలపై మొట్టమొదటి సమగ్ర సమీక్షా నివేదికను ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏవో) నివేదికలో సాకల్యంగా చర్చించింది. ఇండోర్ వ్యవసాయం లేదా నియంత్రిత పర్యావరణ వ్యవసాయం (కంట్రోల్డ్ ఎన్విరాన్‌మెంట్ అగ్రికల్చర్ – సీఈఏ) వల్ల ఒనగూడే ప్రయోజనాలు అనేకం. స్థిరత్వంతో కూడిన ఉత్పత్తి, ఉత్పాదకత, వాతావరణ మార్పులకు అనుకూలత, ఆహార భద్రతను మెరుగుపరచడం వంటివాటిని ఎఫ్ఏవో ఈ జాబితాలో చేర్చింది.

ప్రస్తుత రోజుల్లో, సాంప్రదాయకంగా ఆరుబయట పండించే ఆకుకూరలతో పాటు మైక్రోగ్రీన్స్, బేబీ లీఫ్ వంటి స్వల్పకాలిక పంటల ఇండోర్ వ్యవసాయమే వాణిజ్యపరంగా లాభదాయకంగా మారిందని నివేదిక చెబుతోంది. ప్రపంచవ్యాప్త పరిస్థితులు ముఖ్యంగా సంపన్న చలి ప్రాంత పాశ్చాత్య, ఐరోపా దేశాలను దృష్టిలో పెట్టుకొని చెప్పిన మాటగా దీన్ని మనం పరిగణించాలి. ఎందుకంటే.. మన దేశంలో ఇండోర్ వ్యవసాయం ఇంకా శైశవ దశలోనే ఉంది. ఈ పరిమితిలోనే ఈ నివేదికలోని అంశాలను పరిశీలిద్దాం.

ఏ వ్యవసాయమైనా ఆరోగ్యదాయకమైన, రోగకారకం కాని భద్రమైన ఆహారోత్పత్తే లక్ష్యంగా సాగుతుంది. అయితే, సాంప్రదాయ వ్యవసాయం కంటే ఇండోర్ వ్యవసాయమే సులభంగా నిర్వహించదగిన ఆహార భద్రత ప్రమాదాలతో కూడి ఉంటుందని తరచుగా భావిస్తుంటారు. అయితే, ఇండోర్ పంటలకు సంబంధించిన ఆహార భద్రత సమస్యలు సాధారణంగా సాంప్రదాయ బహిరంగ వ్యవసాయంలో కనిపించే సమస్యల అంతటి తీవ్రంగానే ఉంటాయని ఎఫ్ఏవో నివేదిక నొక్కి చెబుతోంది. విత్తనాలు, మట్టికి బదులుగా వాడే పదార్థాలు, నీటికి సంబంధించి సూక్ష్మక్రిములతో కూడిన కాలుష్య ప్రమాదాలు పొంచి ఉంటాయి. అలాగే మొలకల ఉత్పత్తిలోనూ సమస్య రావచ్చు.

బహిరంగ వ్యవసాయంతో పోల్చినప్పుడు ఇండోర్ వ్యవసాయంలో అంతర్లీనంగా ఉన్న కొన్ని అనియంత్రిత కాలుష్య సమస్యలు ఉండవు. బహిరంగ వాతావరణంలో సూక్ష్మక్రిముల పోటీ, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు, ఎండ సోకటం వల్ల కొన్ని సహజ వ్యాధికారకాలు నశిస్తాయి. ఇండోర్ వ్యవసాయంలో వ్యాధికారకాలు ఎక్కువ కాలం సమస్యను సృష్టించే వీలుంటుంది. ఇందులో విత్తనాలు, నీరు, మట్టికి బదులుగా వాడే పదార్థాలు, ఎరువులు వంటి ఉత్పాదకాల జీవ భద్రతపై నియంత్రణకు ఎక్కువ అవకాశాలు ఉంటాయి.

ఇండోర్ వ్యవసాయంలో అధిక తేమ, నీటి ఆధారిత వ్యవస్థలు వాడతాం కాబట్టి సూక్ష్మక్రిములతో ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఇండోర్ వ్యవసాయంలో సూక్ష్మక్రిముల వల్ల వచ్చే ప్రమాదాలు రసాయనాలతో వచ్చే ప్రమాదాల కంటే చాలా విస్తృతంగా ప్రాచుర్యంలోకి వచ్చాయి. అయినప్పటికీ, పర్యావరణ కాలుష్యం, ప్లాస్టిక్ పరికరాల సంబంధిత పదార్థాల నుంచి వెలువడే కాలుష్యం వంటి రసాయన సమస్యలను కూడా నివేదిక పేర్కొంది.

ఆర్థిక పోటీకి నిలబడితేనే భవిష్యత్తు

'ఇండోర్ వ్యవసాయం వాతావరణ మార్పుల్ని తట్టుకొని స్థిరమైన దిగుబడినిచ్చే విషయంలో గణనీయమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. కానీ ఈ సామర్థ్యాన్ని ఆచరణలో నిజం చేయడానికి బలమైన ఆహార భద్రతా పద్ధతులు, పర్యవేక్షణ చాలా అవసరం' అని ఎఫ్ఏవో నివేదిక రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన ఆహార భద్రతా అధికారి మసామి టకేచి అన్నారు.

'సాంప్రదాయ పంటల సాగుతో తక్కువ ఖర్చుతో ఉత్పత్తిని వెలువరించగలిగే విషయంలో ఆర్థికంగా పోటీకి నిలవగలగడమే ఇండోర్ వ్యవసాయం విజయానికి కీలకం' అని డాక్టర్ కీత్ వారినర్ అన్నారు. ఈ నివేదికను రూపొందించిన బృందంలోని గ్వెల్ఫ్ విశ్వవిద్యాలయ నిపుణుల్లో కీత్ ఒకరు. 'అదే సమయంలో, ఇండోర్ పొలాల లోపల నియంత్రిత వాతావరణ పరిస్థితులు వ్యాధికారక సూక్ష్మజీవుల మనుగడకు అనుకూలంగా ఉంటాయి. కాబట్టి అవి లోపలికి ప్రవేశించకుండా నిరోధించడమే తొలి ప్రాధాన్యతగా ఉండాలి. అప్రమత్తతకు నవీన ఆవిష్కరణలు తోడైతే ఇండోర్ వ్యవసాయం సురక్షితంగా, స్థిరంగా పెరుగుతుంది. భవిష్యత్తు బాగుంటుంది..' అని డా. కీత్ వివరించారు.

పొలం పంటల కన్నా ఇంటి పంటలతో ప్రయోజనాలున్నాయా?

ప్రయోజనం	ఇంటి పంటలు (ఇండోర్ ఫార్మింగ్)	ఆరుబయట పంటలు (అవుట్‌డోర్ ఫార్మింగ్)
ఆర్థికం	• అధిక దిగుబడి, ఉత్పాదకత • సీజన్‌తో సంబంధం లేకు పంట వస్తుంది • ఎరువులు, నీటిని మరింత సమర్థవంతంగా వాడుకోవచ్చు • ఏడాది పొడవునా స్థిరంగా సరఫరా ఉంటుంది • కరువులు, చీడపీడల బెడదల ఫలితంగా పంట నష్టం జరిగే అవకాశాలు తక్కువ • రవాణా చార్జీలు ఆదా అవుతాయి	• ఆరుబయట పొలాల్లో పంటలు సీజన్లలోనే పండుతాయి • ఎండలు, వానలు, కరువు వంటి వాతావరణ ఒడిదొడుకులను ఎదుర్కోవాల్సి ఉంటుంది • ఎరువులు, సాగు నీరు అందించడానికి ఖర్చు ఎక్కువ • పంపిణీ గొలుసు చాలా పెద్దది. ఎక్కడో దూరాన పొలాల్లో పండించి రవాణా చేసి వినియోగదారులకు చేర్చాల్సి ఉంటుంది • సాంకేతిక పరిజ్ఞానం మరీ ఎక్కువగా అవసరం ఉండదు
సుస్థిరత	• చాలా తక్కువ ఉద్గారాలు, కర్బన పాదముద్ర • నీటి వినియోగ పరిమాణం ఎక్కువ. నీటి యాజమాన్య వ్యవస్థ అవసరం • ఎరువులు, నీటి వినియోగ సామర్థ్యం ఎక్కువ • ఎరువుల వృథా లేదు. నీటిలో పోషకాలు తిరిగి వినియోగమవుతాయి • ఆహారాన్ని తరలించేందుకు ఇంధన ఖర్చు ఎక్కువ ఉండదు • కలుపు మందుల అవసరం ఉండదు లేదా అతి తక్కువ • పురుగుమందుల వినియోగం పరిమితం • వ్యవసాయేతర భూముల్లో సాగు చేయొచ్చు. భూమి నిస్సారం కావటం ఉండదు	• ఎరువులు, నీటి వినియోగం చాలా ఎక్కువ • పొలాల్లో నుంచి బయటకు పారే వ్యర్థనీటి ద్వారా జలవనరులు కలుషితమవుతాయి • వ్యవసాయ పొలాల విస్తీర్ణం పెంచడానికి అడవులను నరికివేయాల్సి వస్తుంటుంది • క్లైమెట్ ఛేంజ్ దుష్ఫలితాల ప్రభావంతో పంట నష్టం కలిగే అవకాశాలు ఎక్కువ • క్లైమెట్ ఛేంజ్ వల్ల చీడపీడలు విజృంభిస్తాయి. పురుగు, తెగుళ్ల మందులు చల్లాల్సి ఉంటుంది
ఆహార భద్రత	• స్థానిక, ప్రాంతీయ ఇన్‌డోర్ ఫామ్స్‌లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి • కొన్ని రకాల పంటలను మాత్రమే పండించగలం • శాశ్వత, నైపుణ్యం గల ఉద్యోగుల అవసరం ఉంటుంది • ఏ పంటకు ఆ పంటను విడిగానే సాగు చేస్తారు. కాబట్టి, కొన్ని రకాల పంట దిగుబడులు కలిసిపోయే సమస్య ఉండదు. ఏయే పంటలు ఎక్కడ, ఎవరు పండించిందీ తెలిపే ట్రేసబిలిటీని అమలు చేయటం సులభం. • దేశీయంగా పొలాల్లో పండించగలిగే పంటలకే కాకుండా మరిన్ని ఎక్కువ రకాల పంటల వైవిధ్యాన్ని పాటించటానికి అవకాశం ఎక్కువ	• కొన్ని ప్రదేశాల్లో ఉన్న సాగుయోగ్యమైన భూముల్లో మాత్రమే పంటల సాగు చేయగలం • వాతావరణంలో పెనుమార్పుల వల్ల పంటలు నాశనం అయ్యే అవకాశాలు ఎక్కువ • అనేక రకాల పంటలను కలిపి పండించవచ్చు. కాబట్టి, ఉపాధి అవకాశాలు చాలా ఎక్కువగా ఉండి స్థానిక ఆర్థిక వ్యవస్థ బాగుంటుంది. అనేక పంటలు కలిపి పండించటం వల్ల ట్రేసబిలిటీ సమస్యాత్మకంగా మారుతుంది. పంట దిగుబడులు కలిసిపోయే అవకాశాలు ఎక్కువ.

'ఇండోర్ ఫార్మింగ్'కు పేర్లెన్నో!?

ఇండోర్ వ్యవసాయాన్ని వివిధ రకాలుగా వ్యవహరిస్తున్నారు. 'రక్షిత వ్యవసాయం' అనే పదంతో 'ఇండోర్ ఫార్మింగ్'ను 13వ శతాబ్దంలో మొదటి సారి వాడారు. బయటి వాతావరణానికి దూరంగా ఉంచే సౌకర్యాల మధ్య పెరిగే మొక్కలనే అర్థంలో వాడారు. ఆ తర్వాత కాలంలో 'ఇండోర్ వ్యవసాయం' అనే పదానికి 'పట్టణ వ్యవసాయం', 'మొక్కల కర్మాగారం', 'గ్రీన్‌హౌస్', 'హాట్‌హౌస్', 'గ్లాస్‌హౌస్' వంటి అదనపు పదాలు తోడయ్యాయి. ఇవన్నీ పర్యాయపదాలుగా ఉపయోగించబడుతున్నాయి. ఇందులోని వివిధ పద్ధతులను, వాటి భాగాలను వివరించడానికి ఉపయోగించే పదాలను నిర్వచించాల్సిన అవసరం ఏర్పడింది.

పట్టణ వ్యవసాయం: నగరాలు, పట్టణ ప్రాంతాలు, వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆహారాన్ని పండించడం, ప్రాసెస్ చేయడం, పంపిణీ చేయడం.

ఇండోర్ వ్యవసాయం: ఆరుబయట కాకుండా మూసి వున్న వాతావరణంలో పంటలను పెంచే ఏవైనా పద్ధతులు. ఒక గదిలో మొక్కలను పెంచే వ్యవసాయ వ్యవస్థను వివరించేందుకు వాడే పదం

గ్రీన్‌హౌస్: గ్రీన్‌హౌస్ అనేది నియంత్రిత పర్యావరణ నిర్మాణం. ఇది ఉష్ణోగ్రత, సూర్యకాంతి వంటి పరిస్థితులను మారుస్తుంది. మొక్కల పెరుగుదలను సులభతరం చేస్తుంది, ముఖ్యంగా సహజ వాతావరణ పరిస్థితులు తక్కువ అనుకూలంగా ఉన్న వాతావరణాలలో దీన్ని వాడతారు. గ్లాస్‌హౌస్, పాలీ వినైల్ క్లోరైడ్ గ్రీన్‌హౌస్, పాలిథిలిన్ గ్రీన్‌హౌస్ ఇవన్నీ దీనికి పర్యాయపదాలే.

నియంత్రిత పర్యావరణ వ్యవసాయం: పట్టణ, పట్టణాల చుట్టూ గల ప్రాంతాల్లో ఆరుబయట, మట్టిలో గాని, మట్టిలేకుండా గాని చేసే వ్యవసాయం.

మొక్కల కర్మాగారం: కృత్రిమ/సహజ/సౌర కాంతిని ఉపయోగించి అధిక నాణ్యత గల పంటలను నిరంతరం ఉత్పత్తి చేసే భవనం.

– నిర్వహణ: **పంతంగి రాంబాబు** సాక్షి సాగుబడి డెస్క్




హైడ్రోపోనిక్స్‌లో మట్టికి బదులు వాడే పదార్థాలు

ఇండోర్ ఫార్మింగ్ పద్ధతుల్లో మట్టి లేకుండా పోషకాలు కలిపిన నీటితో పంటలు పండించే పద్ధతి హైడ్రోపోనిక్స్. అయితే, మొక్కల పెంచే క్రమంలో వాటి వేర్లను పట్టి ఉంచడానికి మట్టికి బదులుగా అనేక రకాల పదార్థాలను వాడుతున్నారు. దీన్నే సబ్‌స్ట్రేట్ అంటారు.

ఇండోర్ ఫార్మింగ్ పద్ధతుల్లో మట్టిలో సేంద్రియ ఎరువులు కలిపి సాగు చేసే పంటలతో పోల్చితే, హైడ్రోపోనిక్స్ పంటల సాగు వ్యవస్థ నిర్వహణలో ఎక్కువ సౌలభ్యం ఉంది. పోషక ద్రావణాన్ని అందిస్తూ పంటలు సాగు చేయవచ్చు. రాక్‌వూల్, మట్టి గుళికలు (లెక), కోకో కాయిర్, పెర్‌లైట్, వరి ఊక, ఫ్లోరల్ ఫోమ్, వర్మిక్యులైట్, ఒయాసిస్ క్యూబ్స్, గ్రోస్టోన్స్‌ను హైడ్రోపోనిక్స్‌లో మొక్కలు పెంచడానికి మట్టికి బదులు వాడుతున్నారు.

ఆక్వాపోనిక్స్ వ్యవస్థకు చేపల పెంపకాన్ని జోడిస్తే ఆక్వాపోనిక్స్ అవుతుంది. ట్యాంకులో చేపలు పెంచుతూ, వాటి వ్యర్థాలతో కూడిన నీటిని మొక్కల వేర్లకు అందిస్తూ పంటలు సాగు చేయటం ఇందులో ప్రత్యేకత. ఇక్కడ, చేపల వ్యర్థాలు (పాక్షికంగా) మొక్కకు పోషక వనరుగా పనిచేస్తాయి. ముఖ్యంగా నత్రజని అవసరాలను తీర్చడంలో చేప వ్యర్థాలు ఉపయోగపడతాయి.



పంటలకు ఏ నీరు మేలు?

నేలపై ఆరుబయట పంటలు పండించినా లేదా మట్టి లేని వ్యవస్థలతో పంటలు పండించినా స్థిరమైన నీటి వనరు అవసరం. ఒక సాధారణ ఇంటి పంటలు లేదా ఇండోర్ వ్యవసాయంలో మునిసిపల్ నీరు, బోరు నీరు, కాలువ నీరు, వర్షపు నీటిని లేదా వీటిని కలిపి ఉపయోగిస్తుంటాం. ఈ నీటి వనరుల్లో ప్రతి దానికీ దాని ప్రత్యేక ప్రయోజనాలు, సమస్యలు దాగి ఉన్నాయి.

ఉదాహరణకు, మునిసిపాలిటీ వారి నీరు వ్యాధికారకాలు లేకుండా ఉండొచ్చు. అయితే, ఈ నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఖరీదైనది కావచ్చు. ఇందులో క్లోరిన్ ఉంటుంది. ఈ నీటిని పంటలకు వాడుతూ ఉంటే కొన్ని సందర్భాల్లో తాగునీటి లభ్యత సమస్య రావచ్చు. బావులు, బోర్లు, చెరువుల నుంచి తీసుకునే నీటికి ఖర్చు తక్కువ. ఖనిజాలు కూడా ఉంటాయి. అయితే, విద్యుత్తుతో పాటు పంపులు అవసరమవుతాయి.

వాన నీటిని నేరుగా పట్టుకొని ఇంటిపంటలకు వాడుకోవచ్చు. ఈ నీరు శుద్ధమైనదే అయినా నిల్వచేసి వాడుకునే క్రమంలో అవి కలుషితమై సమస్యగా మారవచ్చు. ఇక నదులు, కాలువలు, చెరువుల్లోని నీరు. వీటిలో పరిశ్రమలు, పొలాలు, నివాసాల నుంచి వచ్చే మురుగునీరు కలిసే ప్రమాదం ఉంది. రసాయనాలు, సేంద్రియ వ్యర్థాలు కలిసి ఉండే ఈ నీటితో పంటలు పండిస్తే ఎక్కువ సమస్య వచ్చే అవకాశం ఉంది.

బిజినెస్ రీల్

భావి ఎన్నారైలకు బీఓబీ.. 'యాస్పైర్ ఎన్ఆర్ఐ సేవింగ్స్ అకౌంట్'



ముంబై: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఆఫ్ బరోడా కొత్తగా 'బీఓబీ యాస్పైర్ ఎన్ఆర్ఐ సేవింగ్స్ అకౌంట్' ప్రవేశపెట్టింది. విదేశాలకు వెళ్లే ముందు, భారత్‌లోనే ఉన్నప్పుడే కస్టమర్లు బీఓబీ యాస్పైర్ ఎన్ఆర్ఈ సేవింగ్స్ అకౌంటు తెరవాలి. ఇలా తెరిచిన ఖాతా, తొలుత 'ఇనాక్టివ్ మోడ్'లో ఉంటుంది. ఖాతాదారులు తమ ఎన్నారై హోదాను ధృవీకరిస్తూ ఇమ్మిగ్రేషన్ స్టాంపుతో పాస్‌పోర్ట్ కాపీ, విదేశాల్లోని చిరునామా ధృవీకరణ పత్రాన్ని సమర్పించిన తర్వాత ఖాతా పూర్తి స్థాయిలో యాక్టివ్‌గా మారుతుంది. ఈ అకౌంటుపై తొలి రెండు త్రైమాసికాల్లో ఎలాంటి కనీస బ్యాలెన్స్ చార్జీలు ఉండవు. తదుపరి ప్రతి క్వార్టర్‌కు సగటున రూ.1,000 బ్యాలెన్స్ నిబంధన వర్తిస్తుంది. అకౌంటు బ్యాలెన్స్‌లో గరిష్ట పరిమితేమీ ఉండదు. ఖాతాపై వచ్చిన ఆదాయానికి, ఇన్‌కంటాక్స్ నుంచి, బ్యాలెన్స్‌లకు వెల్త్ ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంటుంది. ఎయిర్‌పోర్ట్ లాంజ్ ఫెసిలిటీతో పాటు మరెన్నో ప్రయోజనాలు అందించేలా కస్టమైజ్ చేసిన డెబిట్ కార్డు ఉంటుంది. భావి ప్రవాస భారతీయుల(ఎన్నారై) అవసరాలకు అనుగుణంగా 'బీఓబీ యాస్పైర్ అకౌంట్'ను ప్రవేశపెట్టామని బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీనా వహీద్ తెలిపారు.

13 నుంచి బీఎన్ఐ గోనేట్ ఎక్స్‌పో



హైదరాబాద్: ఎంఎస్ఎంఈలకు సంబంధించి సెప్టెంబర్ 13–14 తేదీల్లో బీఎన్ఐ వాంటేజ్ గోనేట్ 2025 ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు బీఎన్ఐ హైదరాబాద్ వెల్లడించింది. ఇందులో 200 పైగా చిన్న, మధ్య తరహా సంస్థలు వివిధ ఉత్పత్తులు, సర్వీసులను ప్రదర్శించనున్నట్లు వివరించింది. ఔత్సాహిక వ్యాపారవేత్తలు కనికా టేక్రివాల్, అంకుర్ వారికూ, రాజీవ్ తల్రేజా తదితరులతో సెషన్స్ ఉంటాయని బీఎన్ఐ హైదరాబాద్ ఈడీ సంజనా షా తెలిపారు. మధ్యప్రాచ్యం, పొరుగు దేశాల నుంచి కూడా దాదాపు 20,000 మంది సందర్శకులు ఇందులో పాల్గొంటారనే అంచనాలు ఉన్నట్లు వివరించారు. స్థానిక వ్యాపార సంస్థలు అంతర్జాతీయంగా అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఇదొక వేదిక కాగలదని పేర్కొన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-9-2025

విశాఖ	555-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	6.10

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
INFY	1,502.40	4.85
DRREDDY	1,294.40	3.5
WIPRO	249.34	2.81
ADANIPORTS	1,382.50	2.54
TECHM	1,496.50	2.45

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,223.00	-1.74
ETERNAL	325.7	-1.2
ULTRACEMCO	12,562.00	-0.81
JIOFIN	308.6	-0.8
INDUSINDBK	746	-0.63

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,069
ఎన్ఎస్ఈ	79,909
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,21,057
ఎఫ్ఐఐ	+ 2,050
డీఐఐ	+ 83

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	63.16	$ 62.26
బ్రెంట్	65.76	$ 66.02

మళ్లీ చక్కెర షేర్లు మధురం

- ఏడాది కనిష్టాల నుంచి అప్
- షుగర్‌కు పెరుగుతున్న డిమాండ్
- ఇథనాల్ బ్లెండింగ్‌కు ప్రభుత్వ పుష్
- ఇథనాల్ తయారీపై ఆంక్షల ఎత్తివేత

ఏడాది కాలంగా నేలచూపులకే పరిమితమైన షుగర్ షేర్లు ఇటీవల బలపడుతున్నాయి. ఇందుకు పలు సానుకూల పరిణామాలు తోడ్పాటునిస్తున్నాయి. లక్ష్యానికంటే ముందుగానే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిక్స్‌కు ప్రభుత్వ దన్ను, ఇథనాల్ తయారీలో చెరకురసం వినియోగంపై ఆంక్షల ఎత్తివేత, దేశీ మార్కెట్లో చక్కెరకు పెరుగుతున్న డిమాండ్ తదితరాలు షుగర్ కంపెనీలకు జోష్‌నిస్తున్నాయి. దీంతో ఇన్వెస్టర్లు షుగర్ షేర్ల కొనుగోలుకి ఆసక్తి చూపుతున్నట్లు పరిశ్రమవర్గాలు పేర్కొంటున్నాయి. వివరాలు చూద్దాం..

-సాక్షి, బిజినెస్ డెస్క్



భారీగా పెరిగిన సరఫరాలు, మందగించిన మార్కెట్ పరిస్థితులు, ఇథనాల్ తయారీపై ఆంక్షలు తదితర ప్రతికూలతల కారణంగా గత ఏడాది కాలంలో షుగర్ కౌంటర్లు డీలా పడ్డాయి. దీంతో చక్కెర తయారీ కంపెనీల షేర్లు 2025 మార్చికల్లా ఏడాది కనిష్టాలకు చేరాయి. అయితే కొద్ది రోజులుగా షుగర్ పరిశ్రమ టర్న్ అరౌండ్ బాట పట్టింది. ఇందుకు పలు అంశాలు దోహదపడుతున్నాయి. చక్కెరతోపాటు ఇథనాల్ తయారీకి ప్రాధాన్యత ఇవ్వడం, ఇతర బిజినెస్‌లవైపు దృష్టిపెట్టడం, డిస్టిల్లరీల ఏర్పాటు కంపెనీలకు బలాన్నిస్తున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రధానంగా నవంబర్ నుంచి ప్రారంభంకానున్న తాజా సీజన్(2025-26)లో షుగర్‌కేన్ జ్యూస్, మొలాసిస్ తదితరాల ద్వారా ఇథనాల్ తయారీ చేపట్టడంలో ఆంక్షలను ప్రభుత్వం ఎత్తివేసింది. గత సీజన్(2024–25)లో ఇథనాల్ తయారీకి 4 మిలియన్ టన్నులను వినియోగించుకునేందుకు మాత్రమే అనుమతించిన సంగతి తెలిసిందే. వెరసి సవాళ్ల నుంచి సానుకూల పరిస్థితులకు పరిశ్రమ ప్రయాణిస్తున్నట్లు పరిశ్రమవర్గాలు తెలియజేశాయి.

పండుగల సీజన్

దేశీయంగా పండుగల సీజన్ ప్రారంభంకావడంతో చక్కెరకు డిమాండ్ పెరుగుతోంది. దీనికితోడు దేశీయంగా 2025–26 మార్కెటింగ్ సీజన్‌లో 3.5 కోట్ల మెట్రిక్ టన్నుల చక్కెర ఉత్పత్తిని అంచనా వేస్తున్నారు. ఇది 18 శాతం అధికమని దేశీ చక్కెర మిల్లుల అసోసియేషన్ గత నెలలో వెల్లడించింది. దీంతో 2 మిలియన్ టన్నుల చక్కెర ఎగుమతులకు వీలు చిక్కనున్నట్లు భావిస్తోంది. అంతేకాకుండా ఇథనాల్ ఉత్పత్తికి 5 మిలియన్ టన్నులకు పైగా మళ్లించవచ్చునని తెలియజేసింది. కర్బనాల కట్టడికి వీలుగా 2025–26కల్లా పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ మిక్స్(ఈ20)ను ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే దేశీయంగా ఆటో దిగ్గజాలు ఇందుకు అనుగుణమైన వాహనాల ఉత్పత్తిని చేపట్టి మార్కెట్లో విడుదల చేస్తున్నాయి. దీంతో దేశీ పరిశ్రమ చక్కెరసహా.. ఇథనాల్ తయారీ విక్రయాల ద్వారా లబ్ధి పొందనుంది. ఈ ఏడాది చెరకు దిగుబడి ఊపందుకోనున్న అంచనాల కారణంగా అక్టోబర్ నుంచి మొదలుకానున్న చక్కెర సీజన్‌లో ఎగుమతులకు ప్రభుత్వం అనుమతించే వీలున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. సగటుకంటే అధికంగా నమోదవుతున్న వర్షపాతం మహారాష్ట్ర, కర్ణాటక, ఉత్తరప్రదేశ్ తదితర కీలక రాష్ట్రాలలో చెరకు సాగుకు ప్రోత్సాహాన్నివ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఇతరత్రా డిమాండ్

ఇథనాల్‌కు ఇంధన రంగంతోపాటు ఇతర పరిశ్రమల నుంచి సైతం డిమాండ్ కనిపించనున్నట్లు పరిశ్రమవర్గాలు తెలియజేశాయి. ఔషధాలు, ప్లాస్టిక్స్, పాలిష్‌లు, కాస్మెటిక్స్ తదితర పరిశ్రమలలోనూ వినియోగం పెరగనున్నట్లు పేర్కొన్నాయి. దీంతో షుగర్ కంపెనీలకు ఇథనాల్ మనీ స్పిన్నర్‌గా అవతరించనున్నట్లు విశ్లేషించాయి. వెరసి భవిష్యత్‌లో షుగర్ కంపెనీలకు ఇథనాల్ అనూహ్య లాభాలను తెచ్చిపెట్టే వీలున్నట్లు అభిప్రాయపడ్డాయి. నిజానికి 2023 ఏప్రిల్ నుంచే ఆటో రంగ దిగ్గజాలు ఈ20 సంబంధిత ఇంజిన్ల తయారీకి శ్రీకారం చుట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ20 పూర్తిస్థాయి అమలుకు వీలుంది. ఇక తాజాగా కేంద్ర ఆర్థిక శాఖ పలు రంగాలకు ఊతమిస్తూ వస్తు, సేవల పన్ను(జీఎస్‌టీ) సంస్కరణలకు తెరతీసింది. ప్రధానంగా 12 శాతం, 5 శాతం శ్లాబులలోకి పలు ప్రొడక్టులను చేర్చడంతోపాటు ఈ నెల 22 నుంచి అమలుకు నిర్ణయించింది. దీంతో ఆటోసహా ఎఫ్ఎంసీజీ, సిమెంట్, ఫుట్‌వేర్, హోటళ్లు తదితర రంగాలు జోరందుకోనున్నాయి. ఇది వ్యవస్థలో వినియోగాన్ని పెంచడం ద్వారా విభిన్న రంగాలలో డిమాండ్‌కు దారి చూపనున్నట్లు ఆర్థికవేత్తలు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత కొద్ది రోజులుగా షుగర్ రంగ షేర్లు లాభాల బాటలో సాగుతున్నట్లు మార్కెట్ విశ్లేషకులు వివరించారు.

చక్కెర షేర్లు తీయతీయగా..

కంపెనీ పేరు	ప్రస్తుత ధర	ఏడాది కనిష్టం	ఏడాది గరిష్టం
ఈఐడీ ప్యారీ	1,070	639	1,246
బన్నారీ అమ్మన్	3,642	3,100	4,675
బలరామ్‌పూర్ చినీ	519	420	693
పొన్ని షుగర్స్‌ఈరోడ్	298	261	514
ధంపూర్ షుగర్	134	109	234
అవధ్ షుగర్	437	354	831
ఉత్తమ్ షుగర్	265	170	396
త్రివేణి ఇంజినీరింగ్	346	305	536
దాల్మియా భారత్	378	291	582
మవానా షుగర్	94	79	129

(షేరు ధర రూ.లలో)

ఏటికి ఎదురీత

గతేడాది కాలంలో షుగర్ షేర్లు క్షీణిస్తూ దాదాపు 52 వారాల కనిష్టానికి చేరినప్పటికీ ఈఐడీ ప్యారీ ఇండియా, బన్నారీ అమ్మన్ షుగర్స్, బలరామ్‌పూర్ చినీ లాభాలతో నిలదొక్కుకోవడం విశేషం! ఇందుకు ఆయా కంపెనీలు షుగర్‌తోపాటు.. ఇతర విభాగాలలోకి ప్రవేశించడం, అవసరానికి అనుగుణంగా ఉత్పత్తిని చేపట్టగల డిస్టిల్లరీలను ఏర్పాటు చేసుకోవడం సహకరించినట్లు తెలియజేశారు. పటిష్ట ఫైనాన్షియల్స్‌కుతోడు నామమాత్ర రుణభారం వంటి సానుకూలతలు సైతం వీటికి జత కలిసినట్లు విశ్లేషించారు.

స్థిరమైన డిమాండ్ ప్రైవేటు మూలధన వ్యయాలకు పుష్

ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి



న్యూఢిల్లీ: స్థిరమైన డిమాండ్ ప్రైవేటు మూలధన వ్యయాలకు ప్రేరణనిస్తుందని ఎస్‌బీఐ చైర్మన్ సీఎస్ శెట్టి పేర్కొన్నారు. ప్రభుత్వ మూలధన వ్యయాలు బలంగా ఉన్నట్టు చెప్పారు. ప్రభుత్వ రంగ రిఫైనరీలు సామర్థ్య విస్తరణపై పెట్టుబడులు పెడుతున్నట్టు తెలిపారు. ఎస్‌బీఐ రుణ పుస్తకంలో రూ.3-4 లక్షల కోట్లు కార్పొరేట్లవి ఉన్నట్టు చెప్పారు. రిఫైనరీలు, డేటా సెంటర్లు, పునరుత్పాదక ఇంధన కంపెనీల నుంచి రుణాలకు డిమాండ్ ఎక్కువగా ఉన్నట్టు తెలిపారు. స్టీల్, సిమెంట్ కంపెనీలు ఇంకా పెట్టుబడులు పెట్టాల్సి ఉందన్నారు. ''స్థిరమైన డిమాండ్ రాక కోసం ప్రతి ఒక్కరూ వేచి చూస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలు డిమాండ్‌కు ఊతమిస్తాయి. లిక్విడిటీ తగినంత ఉండేలా ఆర్‌బీఐ చర్యలు తీసుకుంది. వడ్డీ రేట్లు తగ్గించింది. ఇవన్నీ కార్పొరేట్లలో (కంపెనీల్లో) విశ్వాసాన్ని పెంచుతాయి''అని శెట్టి వివరించారు. కంపెనీలు ఇప్పటికే తమ సామర్థ్యంలో 75 శాతం వినియోగ స్థాయికి చేరుకున్నాయంటూ, సామర్థ్య విస్తరణ చేపట్టేందుకు ఇది సరైన సమయంగా పేర్కొన్నారు. అంతర్జాతీయ రుణదాతల మాదిరే విలీనాలు, కొనుగోళ్లకు నిధులు సమకూర్చే దిశగా బ్యాంక్‌లను సైతం అనుమతించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. కొనుగోళ్లు అన్నవి పారదర్శకతతో కూడిన లావాదేవీలుగా పేర్కొన్నారు. కనుక వీటికి రుణాల రూపంలో మద్దతుగా నిలిచేందుకు బ్యాంకులు మెరుగైన స్థానంలో ఉన్నట్టు చెప్పారు. సమీప కాలంలో యోనో యాప్ లిస్టింగ్ ఆలోచనేదీ లేదని ఓ ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేశారు.

పీఎస్‌యూ డీలిస్టింగ్ ఇక ఈజీ

- స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి స్వచ్ఛందంగా వైదొలగేందుకు చాన్స్
- ఫ్లోర్ ధర నిర్ణయంలోనూ నిబంధనలను సరళీకరించిన సెబీ



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ(పీఎస్‌యూ)లు స్టాక్ ఎక్స్ఛేంజీల నుంచి స్వచ్ఛందంగా వైదొలగేందుకు(డీలిస్టింగ్) వెసులుబాటు కల్పిస్తూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. దీంతో ప్రభుత్వానికి 90 శాతం లేదా అంతకుమించి వాటా ఉన్న పీఎస్‌యూలను ఎక్స్ఛేంజీల నుంచి డీలిస్ట్ చేసేందుకు వీలు చిక్కనుంది. డీలిస్టింగ్‌కి మెజారిటీ సాధారణ వాటాదారులు అనుమతి పొందాల్సిన నిబంధనలను కూడా సెబీ సడలించింది. అలాగే, ఫ్లోర్ ధర మదింపులోనూ మార్పులకు తెరతీసింది. వెరసి ఫ్లోర్ ధర కంటే కనీసం 15 శాతం ప్రీమియంతో, ఫిక్స్‌డ్ ధర ద్వారా డీలిస్టింగ్‌కు అవకాశం ఏర్పడనుంది. ఇందుకు లావాదేవీల పరిమాణం తదితరాలను పరిగణనలోకి తీసుకోరు. ప్రభుత్వానికి 90 శాతం పైగా వాటా గల పీఎస్‌యూలకు ఈ వెసులుబాటును వర్తింపచేసేలా సెప్టెంబర్ 1న సెబీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, బీమా కంపెనీలను దీన్నుంచి మినహాయించింది.

ఇన్విట్స్‌లో కనీస లాట్ తగ్గింపు

ప్రయివేట్ ప్లేస్‌మెంట్ ద్వారా ఐపీవోలో కేటాయించే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్స్ (ఇన్విట్స్) కనీస లాట్ పరిమాణాన్ని సెబీ తాజాగా కుదించింది. సెకండరీ మార్కెట్లో ట్రేడింగ్ లాట్‌తో సమానం చేస్తూ రూ. 25 లక్షలకు తగ్గించింది. ఇందుకు నిబంధనలు సవరిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇప్పటివరకూ ప్రయివేట్ ప్లేస్‌మెంట్ చేసే ఇన్విట్‌లకు అసెట్ మిక్స్ ఆధారంగా కనీస లాట్ రూ. కోటి లేదా రూ. 25 కోట్లుగా అమలవుతోంది. అయితే ఇప్పటికే అసెట్ మిక్స్‌తో సంబంధంలేకుండా సెబీ సెకండరీ మార్కెట్లో లాట్ పరిమాణాన్ని రూ. 25 లక్షలకు కుదించింది. దీంతో ఐపీవో ప్లేస్‌మెంట్ లాట్‌ను అలైన్ చేసింది.

జౌళి ఎగుమతులకు 40 మార్కెట్లపై దృష్టి

కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ వెల్లడి



న్యూఢిల్లీ: భారత ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో జౌళి ఎగుమతుల కోసం 40 దేశాలపై దృష్టి పెట్టినట్లు కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రి గిరిరాజ్ సింగ్ తెలిపారు. ఈ మార్కెట్లు దాదాపు 600 బిలియన్ డాలర్ల విలువ చేసే జౌళి, దుస్తులను దిగుమతి చేసుకుంటున్నాయని ఆయన చెప్పారు. 15 దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కూడా టెక్స్‌టైల్స్ ఎగుమతులకి ఊతమిచ్చేందుకు ఉపయోగించుకోవడంపై కసరత్తు చేస్తున్నట్లు సింగ్ వివరించారు. పరిశ్రమలో ఉద్యోగాల కోత ఉండబోదన్నారు.

ఈయూతో చర్చల్లో పురోగతి: గోయల్

యూరోపియన్ యూనియన్‌తో (ఈయూ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంపై (ఎఫ్‌టీఏ) చర్చలు చురుగ్గా సాగుతున్నాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. ఈ వారంలో ఈయూ ట్రేడ్, అగ్రికల్చర్ కమిషనర్లు భారత పర్యటనకు వచ్చే సమయానికి ఒప్పందం దాదాపు ఓ కొలిక్కి రావొచ్చని ఆయన చెప్పారు. ఇరు పక్షాల మధ్య 13వ విడత చర్చలు సోమవారం నాడు ప్రారంభమయ్యాయి. మరోవైపు, చౌక ఉత్పత్తులను దిగుమతి చేసుకోరాదని, దేశీయ సంస్థలకు అండగా నిలవాలని ఉక్కు పరిశ్రమకు ఆయన సూచించారు. దేశీయంగా ఉత్పత్తి చేయడం లేదా కొనుగోలు చేయడం ద్వారా దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు.

ఫండ్స్‌ఇండియా ఏయూఎం @ రూ. 20 వేల కోట్లు



చెన్నై: డిజిటల్ వెల్త్ మేనేజ్‌మెంట్ సేవల సంస్థ ఫండ్స్ఇండియా కీలక మైలురాయిని అధిగమించింది. సంస్థ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రూ. 20,000 కోట్లు దాటింది. ఇన్వెస్టర్లకు ప్రయోజనం చేకూర్చే సొల్యూషన్స్‌ను అందించే ఫిన్‌టెక్ సంస్థగా తమకున్న విశ్వసనీయతకు ఇది నిదర్శనమని ఫండ్స్‌ఇండియా గ్రూప్ సీఈవో అక్షయ్ సప్రూ తెలిపారు. రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా కార్యకలాపాలను విస్తరించడంతో పాటు అంతర్జాతీయంగా ప్రవాస భారతీయులకు (ఎన్నారై) కూడా సేవలందించడంపై దృష్టి పెడుతున్నట్లు వివరించారు. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను సరళతరం చేయడంతో పాటు అధునాతన వెల్త్ సొల్యూషన్స్‌ను అందుబాటులోకి తేవడం లక్ష్యంగా పని చేస్తున్నట్లు అక్షయ్ చెప్పారు.

ముంబైలో టాటా మెగా ఈవీ చార్జింగ్ హబ్


ఏకకాలంలో 16 వాహనాల చార్జింగ్



ముంబై: ప్రపంచ ఈవీ దినోత్సవం సందర్భంగా టాటా పవర్,, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ సంస్థలు మంగళవారం భారతదేశపు అతిపెద్ద టాటా.ఈవీ మెగాచార్జర్ హబ్‌ను ఆవిష్కరించాయి. ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం టెర్మినల్ 2 సమీపంలోని ది లీలా ముంబై హోటల్ ఆవరణలో దీన్ని ఏర్పాటు చేశాయి. ఇందులో ఎనిమిది ఫాస్ట్ డీసీ చార్జర్లు, 16 'చార్జింగ్ బే'లు ఉంటాయి. ఒకేసారి 16 ఈవీలను చార్జింగ్ చేయొచ్చు. ప్రైవేట్ కార్ ఓనర్ల నుంచి ట్యాక్సీలు, రైడ్ సేవల సంస్థలు, లాజిస్టిక్స్ ఆపరేటర్లు మొదలైన వారికి ఇది ఉపయోగకరంగా ఉండనుంది. మరోవైపు, ఈవీ చార్జింగ్ నెట్‌వర్క్ సంస్థ బోల్ట్‌డాట్‌ఎర్త్ తాజాగా త్రీవీలర్ ఆటోల సంస్థ యోధతో చేతులు కలిపింది. ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్, ఎర్తింగ్ సొల్యూషన్స్‌ను అందించే దిశగా అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఎలక్ట్రిక్ వాహనాలపై అవగాహన పెంపొందించేందుకు, వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో సెప్టెంబర్ 9ని ప్రపంచ ఈవీ దినోత్సవంగా జరుపుకొంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా 5.8 కోట్ల పైచిలుకు ఈవీలు ఉండగా, భారత్‌లో ఈ ఏడాది తొలి ఎనిమిది నెలల్లో 14.2 లక్షల ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడయ్యాయి. 2030 నాటికి మొత్తం వాహనాల్లో ఈవీల వాటాను 30 శాతానికి పెంచుకోవాలని భారత్ నిర్దేశించుకుంది.

హైదరాబాద్‌లో నెమెచెక్ జీసీసీ ఏర్పాటు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రియల్ ఎస్టేట్, మీడియా తదితర రంగాలకు డిజిటల్ సొల్యూషన్స్ అందించే జర్మన్ దిగ్గజం నెమెచెక్ హైదరాబాద్‌లోని తమ కార్యాలయాన్ని విస్తరించింది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ని (జీసీసీ) ప్రారంభించింది. కంపెనీకి ప్రస్తుతం ముంబై, బెంగళూరులో కూడా కార్యాలయాలున్నాయి. భారత్‌లో సుమారు 200 మంది సిబ్బంది ఉండగా, వచ్చే కొన్నేళ్లలో దీన్ని నాలుగు రెట్లు పెంచుకోనున్నట్లు నెమెచెక్ ఇండియా ఎండీ విశాల్ మణి చెప్పారు. దేశీయంగా టాటా ప్రాజెక్ట్స్‌లాంటి దిగ్గజ సంస్థలకు డిజైనింగ్ నుంచి నిర్వహణ వరకు వివిధ దశల్లో అవసరమయ్యే



ఆర్కిటెక్చర్, ఇంజినీరింగ్, కన్‌స్ట్రక్షన్‌పరమైన సొల్యూషన్స్‌ను అందిస్తున్నట్లు వివరించారు. ఈ విభాగంలో నిపుణుల కొరతను అధిగమించే క్రమంలో నైపుణ్యాల్లో శిక్షణనిచ్చేందుకు అన్నా యూనివర్సిటీ, జేజే స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ మొదలైన వాటితో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు గ్రూప్ చీఫ్ డివిజన్ ఆఫీసర్ సునీల్ పండిత తెలిపారు. ఆదాయంలో ఆసియా వాటా 10 శాతంగా ఉండగా భారత్ వాటా అందులో 3 శాతంగా ఉందని పేర్కొన్నారు. తమకు అంతర్జాతీయంగా 50 లక్షల యూజర్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

వినియోగానికి జోష్!

- ప్రభుత్వ ఆదాయ వృద్ధికి బ్రేక్
- జీఎస్‌టీ సంస్కరణలపై మూడీస్ రేటింగ్స్
- ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉంటుందని అంచనా



న్యూఢిల్లీ: జీఎస్‌టీలో తీసుకొచ్చిన సంస్కరణలతో 375 ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గనున్నాయని, ఇది వినియోగానికి జోష్‌నిస్తుందని మూడీస్ రేటింగ్స్ తెలిపింది. అదే సమయంలో ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుందని అంచనా వేసింది. యూఎస్ నుంచి టారిఫ్ పరమైన ఒత్తిళ్లు ఎదుర్కొంటున్న తరుణంలో.. జీఎస్‌టీలో నికర రేట్లు తగ్గించడం అన్నది ప్రైవేటు వినియోగాన్ని పెంచుతుందని, ఇది ఆర్థిక వృద్ధికి మద్దతునిస్తుందని తెలిపింది. జీఎస్‌టీలో 12, 28 శాతం రేట్లను ఎత్తివేసి, ఇందులోని వస్తువులను 5, 18 శాతం శ్లాబుల్లోకి మార్చడం తెలిసిందే. ఈ రేట్లు ఈ నెల 22 నుంచి అమల్లోకి రానున్నాయి. ''జీఎస్‌టీ సంస్కరణ అన్నది గృహాలకు మరో విధానపరమైన ద్రవ్య మద్దతు. వ్యక్తిగత ఆదాయపన్నులో అధిక పరిమితులకు ఇది అదనం. దీనివల్ల చాలా వరకు మధ్యతరగతి కుటుంబాలకు పన్ను మినహాయింపు లభిస్తుంది. జీడీపీలో 61 శాతంగా ఉన్న వినియోగానికి ఈ రెండు చర్యలు మద్దతునిస్తాయి''అని మూడీస్ రేటింగ్స్ వివరించింది. అదే సమయంలో ఈ చర్యలు ఆదాయ వృద్ధిని తగ్గిస్తాయని పేర్కొంది. జీఎస్‌టీలో ప్రతిపాదిత మార్పులు ఫలితంగా వస్తు, సేవలపై సగటు పన్ను దిగొస్తుందని తెలిపింది. ధరలు తగ్గడం ద్రవ్యోల్బణాన్ని నియంత్రణలో ఉంచుతుందని అభిప్రాయపడింది. జీఎస్‌టీలో ప్రతిపాదిత మార్పులతో ఈ ఏడాది రూ.48,000 కోట్ల ఆదాయ నష్టం ఏర్పడుతుందని ప్రభుత్వం అంచనా వేస్తుండడం గమనార్హం.

ఆదాయ వృద్ధి తగ్గొచ్చు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో (ఏప్రిల్–జూలై) స్థూల పన్నుల ఆదాయం కేవలం 0.8 శాతమే వృద్ధి చెందడాన్ని మూడీస్ రేటింగ్స్ గుర్తు చేసింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం 21.3 శాతం వృద్ధి చెందినట్టు తెలిపింది. ''గడిచిన ఏడాది కాలంలో వృద్ధికి మద్దతుగా ఆదాయం కోల్పోయే చర్యలను ప్రభుత్వం చేపట్టింది. ప్రభుత్వ సాధారణ రుణం గరిష్ట స్థాయిలో ఉన్నందున.. పెట్టుబడి గ్రేడ్ రేటింగ్ కలిగిన దేశాలన్నింటిలో భారత్ రుణ స్తోమత తక్కువగా ఉంది. 2024–25లో ప్రభుత్వ ఆదాయంలో రుణ వడ్డీ చెల్లింపులు 23%గా ఉన్నాయి. అదే బీఏఏ రేటెడ్ దేశాల్లో ఇది 8.3% (మధ్యస్థం)గా ఉంది''అని మూడీస్ రేటింగ్స్ తన నివేదికలో వెల్లడించింది.

గోద్రెజ్ ఇంటెరియో విస్తరణపై దృష్టి

- 2028–29కల్లా ఆదాయం రెట్టింపు
- రూ. 300 కోట్ల పెట్టుబడులకు సై



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం గోద్రెజ్ ఎంటర్‌ప్రైజెస్ గ్రూప్ తాజాగా ఫర్నీచర్ అనుబంధ సంస్థ ఇంటెరియో విస్తరణపై దృష్టి పెట్టింది. వ్యాపార విస్తరణతోపాటు.. టెక్నాలజీ అభివృద్ధికి రూ. 300 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా 2028–29కల్లా ఆదాయాన్ని రెట్టింపునకుపైగా పెంచుకోవాలని ప్రణాళికలు వేసింది. ఆర్గనైజ్‌డ్ ఫర్నీచర్ మార్కెట్లో ఇంటెరియోకుగల ప్రస్తుత 15 శాతం వాటాను 20 శాతానికి పెంచుకోవాలని చూస్తున్నట్లు గ్రూప్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నైరికా హోల్కర్ పేర్కొన్నారు. గ్రూప్ ఆదాయంలో రెండో పెద్ద విభాగంగా అవతరించిన కంపెనీ గతేడాది(2024–25) రూ. 3,400 కోట్ల టర్నోవర్ సాధించింది. ఈ ఆర్థిక సంవత్సరం(2025–26)లో రూ. 4,000 కోట్లు అందుకునే బాటలో సాగుతున్నట్లు ఇంటెరియో బిజినెస్ హెడ్ స్వప్నీల్ నగర్కర్ వెల్లడించారు.



చాంపియన్ హైదరాబాద్


వరుసగా రెండో ఏడాది బుచ్చిబాబు ట్రోఫీ టైటిల్ సొంతం

- టీఎన్‌సీఏతో 'డ్రా'గా ముగిసిన ఫైనల్
- తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో దక్కిన ట్రోఫీ

చెన్నై: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన హైదరాబాద్ జట్టు... వరుసగా రెండో ఏడాది ఆలిండియా బుచ్చిబాబు ఇన్విటేషన్ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచింది. తమిళనాడు క్రికెట్ సంఘం (టీఎన్‌సీఏ) ప్రెసిడెంట్స్ ఎలెవన్ జట్టుతో జరిగిన ఫైనల్ 'డ్రా'గా ముగియగా... తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం ఆధారంగా డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్‌కు టైటిల్ ఖాయమైంది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులు చేయగా... టీఎన్‌సీఏ జట్టు 353 పరుగులకు పరిమితమైంది. దీంతో హైదరాబాద్ జట్టుకు 23 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 14/1తో మంగళవారం అఖరి రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ జట్టు... చివరకు 70 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. వరుణ్ గౌడ్ (122 బంతుల్లో 56 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) అజేయ అర్ధశతకంతో ఆకట్టుకోగా... రాహుల్ రాధేశ్ (133 బంతుల్లో 31 నాటౌట్; 2 ఫోర్లు), రవితేజ (87 బంతుల్లో 30; 2 ఫోర్లు) ఫర్వాలేదనిపించారు. వరుణ్ గౌడ్, రాహుల్ రాధేశ్ అబేధ్యమైన ఆరో వికెట్‌కు 85 పరుగులు జోడించారు. ప్రత్యర్థి బౌలింగ్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్న ఈ జంట అలవోకగా పరుగులు రాబట్టింది. భారీ షాట్‌లకు పోకుండా సింగిల్స్, డబుల్స్‌తో స్ట్రయిక్ రొటేట్ చేసింది. అమన్ రావు (19), హిమతేజ (11), కెప్టెన్ రాహుల్ సింగ్ (2) ఎక్కువసేపు నిలవలేకపోయారు. టీఎన్‌సీఏ బౌలర్లలో విద్యుత్, హేమచుడేశన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకొని హైదరాబాద్ జట్టు ఓవరాల్‌గా 178 పరుగుల ముందంజలో నిలిచింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరు జట్ల కెప్టెన్‌లు నిర్ణీత సమయం కంటే ముందే 'డ్రా'కు అంగీకరించారు. ఆట చివరి రోజు హైదరాబాద్ ప్లేయర్లు సాధికారికంగా ఆడారు. ఎలాంటి సంచలనాలకు తావివ్వకుండా... వరుసగా రెండో ఏడాది ట్రోఫీ చేజిక్కించుకున్నారు. తొలి ఇన్నింగ్స్‌లో భారీ హాఫ్‌సెంచరీ బాదిన హైదరాబాద్ ప్లేయర్ హిమతేజకు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', టోర్నీ ఆసాంతం రాణించిన ఆల్‌రౌండర్ వరుణ్ గౌడ్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నమెంట్' అవార్డులు దక్కాయి. విజేత హైదరాబాద్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ. 3 లక్షల నగదు బహుమతి దక్కింది. విజేతలకు భారత మాజీ ఆటగాడు రాబిన్ సింగ్, తమిళనాడు క్రికెట్ సంఘం ప్రతినిధులు బహుమతులు ప్రదానం చేశారు.

దబంగ్ ఢిల్లీ దూకుడు

పీకేఎల్‌లో వరుసగా నాలుగో విజయం



విశాఖ స్పోర్ట్స్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో దబంగ్ ఢిల్లీ జోరు కొనసాగుతోంది. తిరుగులేని ప్రదర్శనతో దూసుకెళ్తున్న దబంగ్ ఢిల్లీ లీగ్‌లో వరుసగా నాలుగో విజయం ఖాతాలో వేసుకుంది. మంగళవారం జరిగిన తొలి పోరులో దబంగ్ ఢిల్లీ 45–34 పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్‌పై సునాయాస విజయం సాధించింది. కెప్టెన్ అశు మలిక్ 16 పాయింట్లతో విజృంభించగా... అజింక్య పవార్ (8 పాయింట్లు), నీరజ్ నర్వాల్ (6 పాయింట్లు) సారథికి సహకరించారు. బెంగాల్ వారియర్స్ కెప్టెన్ దేవాంక్ 12 పాయింట్లు సాధించగా... విశ్వాస్ 9 పాయింట్లతో పోరాడాడు. అయితే మ్యాచ్ ఆరంభంలోనే దబంగ్ ఢిల్లీ ఆధిక్యం సాధించింది. నీరజ్, అజింక్య సూపర్ రెయిడ్‌లతో ఢిల్లీ జట్టు వరుస పాయింట్లు సాధించగా... ఆ తర్వాత అశు చెలరేగిపోయాడు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన దబంగ్ ఢిల్లీ 8 పాయింట్లతో పట్టిక అగ్రస్థానంలో కొనసాగుతోంది. బెంగాల్ వారియర్స్ 4 మ్యాచ్‌లాడి ఒక విజయం, 3 పరాజయాలతో 2 పాయింట్లు ఖాతాలో వేసుకొని పట్టిక అట్టడుగున ఉంది. మరో మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు 'గోల్డెన్ రైడ్'లో గుజరాత్ జెయింట్స్‌పై విజయం సాధించింది. ఇరు జట్ల మధ్య జరిగిన పోరు నిర్ణీత సమయంలో 30–30 పాయింట్లతో సమం కాగా... విజేతను నిర్ణయించేందుకు 'గోల్డెన్ రైడ్' నిర్వహించాల్సి వచ్చింది. మ్యాచ్‌లో జైపూర్ పింక్ పాంథర్స్ తరఫున నితిన్ కుమార్ 15 పాయింట్లతో సత్తా చాటగా... గుజరాత్ జెయింట్స్ తరఫున రాకేశ్ 11 పాయింట్లు సాధించాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో యు ముంబాతో తెలుగు టైటాన్స్... యూపీ యోధాస్‌తో పుణేరి పల్టన్ తలపడనున్నాయి.

భారత షూటర్లు విఫలం



రమిత

నింగ్బో (చైనా): అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచకప్ టోర్నమెంట్‌లో తొలి రోజు భారత షూటర్లు విఫలమయ్యారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లలో భారత జోడీలు ఫైనల్‌కు కూడా అర్హత పొందలేకపోయాయి. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో రమిత జిందాల్–మద్దినేని ఉమామహేశ్ (భారత్) జోడీ 628.6 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచింది. రమిత 312.9 పాయింట్లు, ఉమామహేశ్ 315.7 పాయింట్లు స్కోరు చేశారు. ఇదే విభాగంలో దివ్యాంశ్ పన్వర్–మేఘన సజ్జనార్ జోడీ 622.1 పాయింట్లు స్కోరు చేసి 34వ స్థానంతో సరిపెట్టుకుంది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో సురభి రావు–అమిత్ శర్మ ద్వయం 594 పాయింట్లతో 11వ స్థానంలో, రిథమ్ సాంగ్వాన్–నిశాంత్ రావత్ జోడీ 571 పాయింట్లతో 13వ స్థానంలో నిలిచాయి.

చిలీతో యువ భారత్ తొలి పోరు

- పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల
- నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు టోర్నమెంట్
- పాకిస్తాన్‌కు ఆహ్వానం పంపిన హాకీ ఇండియా
- చెన్నై, మదురై వేదికగా మ్యాచ్‌లు





చెన్నై: పురుషుల జూనియర్ హాకీ ప్రపంచకప్‌లో యువ భారత జట్టు తొలి మ్యాచ్‌లో చిలీ జట్టుతో తలపడనుంది. చెన్నై, మదురై వేదికగా మొత్తం 24 దేశాల మధ్య ఈ ఏడాది నవంబర్ 28 నుంచి డిసెంబర్ 10 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. పాకిస్తాన్, చిలీ, స్విట్జర్లాండ్‌తో కలిసి భారత జట్టు పూల్ 'బి' నుంచి పోటీపడుతుంది. టోర్నీ ఆరంభ రోజే చిలీతో భారత్ మ్యాచ్ జరగనుంది. మరుసటి రోజు పాకిస్తాన్‌తో... డిసెంబర్ 2న స్విట్జర్లాండ్ భారత్ మ్యాచ్‌లు ఆడనుంది. షెడ్యూల్ విడుదల కార్యక్రమంలో అంతర్జాతీయ హాకీ సమాఖ్య అధ్యక్షుడు తయ్యబ్ ఇక్రామ్, హాకీ ఇండియా (హెచ్ఐ) కార్యదర్శి భోళానాథ్ సింగ్, తమిళనాడు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు. అయితే ఈ టోర్నీలో పాల్గొనేందుకు పాకిస్తాన్ హాకీ జట్టు... భారత్‌కు వస్తుందా లేదా అనే అంశంపై మాత్రం స్పష్టత లోపించింది. ఆతిథ్య హోదాలో హాకీ ఇండియా అన్నీ ఏర్పాట్లు చేస్తోంది. 'పాకిస్తాన్ జట్టుకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నాం. ఆసియా కప్ సమయంలో కూడా పాకిస్తాన్ జట్టుకు ఆహ్వానం పంపాం. కానీ భద్రతా కారణాల దృష్ట్యా వారు రాలేదు. జూనియర్ ప్రపంచకప్‌నకు సైతం మా నుంచి అధికారిక ఆహ్వానం పంపించాం' అని హాకీ ఇండియా అధ్యక్షుడు దిలిప్ టిర్కీ అన్నారు.


పాకిస్తాన్‌లో దక్షిణాఫ్రికా పర్యటన ఖరారు

ఇస్లామాబాద్: ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2025–27లో భాగంగా డిఫెండింగ్ చాంపియన్ దక్షిణాఫ్రికా జట్టు... పాకిస్తాన్‌తో తొలి సిరీస్ ఆడనుంది. మూడు ఫార్మాట్ల సిరీస్‌లు ఆడేందుకు వచ్చేనెలలో దక్షిణాఫ్రికా జట్టు పాకిస్తాన్‌లో పర్యటించనుంది. ఈ టూర్‌లో భాగంగా రెండు టెస్టు మ్యాచ్‌లు, 3 టి20లు, 3 వన్డేలు జరగనున్నాయి. అక్టోబర్ 12 నుంచి లాహోర్ వేదికగా పాకిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈ మైదానంలో టెస్టు మ్యాచ్ జరగనుండటం మూడేళ్ల తర్వాత ఇదే తొలిసారి. చివరిసారిగా 2022 మార్చిలో ఇక్కడ పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ జరిగింది.

'గిల్‌కు బౌలింగ్ చేశా'

భారత్‌కు ప్రత్యర్థిగా ఆడనున్న స్పిన్నర్ సిమ్రన్‌జిత్





దుబాయ్: పంజాబ్‌లోని లూథియానాకు చెందిన సిమ్రన్‌జిత్ సింగ్ తన సొంత రాష్ట్రంలో వివిధ వయో విభాగాల్లో క్రికెట్ ఆడాడు. ఐపీఎల్ టీమ్ కింగ్స్ ఎలెవన్ పంజాబ్‌కు కూడా నెట్ బౌలర్‌గా సిమ్రన్‌జిత్ పని చేశాడు. 2017 రంజీ ట్రోఫీ ప్రాబబుల్స్‌లో కూడా అతను ఉన్నాడు. అయితే ఆపై సరైన అవకాశాలు రాకపోవడంతో ఇతర ప్రయత్నాలు మొదలు పెట్టాడు. ఇందులో భాగంగా 20 రోజుల ప్రత్యేక శిక్షణా శిబిరం కోసం 2021లో అతను దుబాయ్‌కు వచ్చాడు. అనూహ్యంగా కోవిడ్ కారణంగా రాకపోకలు ఆగిపోయి అతను యూఏఈ దాటలేకపోయాడు. ఇలాంటి స్థితిలో సిమ్రన్‌జిత్ పూర్తిగా అక్కడే క్రికెట్‌పై దృష్టి పెట్టి కుర్రాళ్లకు కోచింగ్ ఇస్తూ తన కెరీర్‌ను పునర్నిర్మించుకున్నాడు. ఈ క్రమంలో లెఫ్టార్మ్ స్పిన్నర్‌గా తన ఆటకు పదును పెట్టిన అతను మూడేళ్ల దేశవాళీ క్రికెట్ ఆడిన తర్వాత ఎట్టకేలకు యూఏఈ జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడం విశేషం. 35 ఏళ్ల వయసులో సిమ్రన్‌జిత్ తొలిసారి యూఏఈ తరఫున ఆడాడు. ఇప్పుడు అతను తన సొంత దేశపు టీమ్ భారత్‌కు ప్రత్యర్థిగా నేటి మ్యాచ్‌లో బరిలోకి దిగనుండటం విశేషం. ఈ నేపథ్యంలో అతను తన గతాన్ని గుర్తు చేసుకున్నాడు. ప్రస్తుత భారత టెస్టు కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌కు కూడా తాను బౌలింగ్ చేసిన విషయాన్ని అతను వెల్లడించాడు. '2011లో నేను మొహాలీలోని పీసీఏ స్టేడియంలో రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసేవాడిని. మా సెషన్ ముగిసిన తర్వాత గిల్ తన తండ్రితో కలిసి అక్కడికి వచ్చేవాడు. అయితే మా సెషన్ పూర్తయ్యాక కూడా మరింత ఎక్కువ సేపు బౌలింగ్ చేసే అలవాటు నాకు ఉండేది. ఇదే క్రమంలో గిల్‌కు చాలా సార్లు బౌలింగ్ చేసేవాడిని. అతను నన్ను గుర్తు పడతాడో లేదో తెలీదు కానీ అప్పటి ప్రాక్టీస్ సెషన్లు నాకు బాగా గుర్తున్నాయి' అని సిమ్రన్‌జిత్ సింగ్ అన్నాడు. యూఏఈ తరఫున ఇప్పటి వరకు 5 వన్డేల్లో 10 వికెట్లు తీసిన అతను...12 టి20ల్లో 15 వికెట్లు పడగొట్టాడు. ఇక తొలిసారి భారత్‌పై అతను ఎలా ఆడతాడనేది చూడాలి.

అహ్మదాబాద్‌లో 2026 టి20 ప్రపంచకప్ ఫైనల్!

వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టోర్నీ



న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) 2026 టి20 ప్రపంచకప్ ఫైనల్ అహ్మదాబాద్‌లో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ టోర్నీకి సంబంధించిన మ్యాచ్‌లు భారత్‌లోని 5 మైదానాలతో పాటు శ్రీలంకలోని రెండు గ్రౌండ్‌లలో జరగనున్నాయి. సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో భారత జట్టు పాకిస్తాన్‌లో.... పాకిస్తాన్ జట్టు భారత్‌లో మ్యాచ్‌లు ఆడని నేపథ్యంలో... ఇరు జట్ల మధ్య మ్యాచ్‌లను ఐసీసీ తటస్థ వేదికపై నిర్వహిస్తోంది. ఈ క్రమంలో పాకిస్తాన్ జట్టు టి20 వరల్డ్‌కప్ ఫైనల్‌కు అర్హత సాధిస్తే... మెగా టోర్నీ తుది సమరం కొలంబోలో జరుగుతుంది. ఐసీసీ ఒప్పందం ప్రకారం పాకిస్తాన్ ఆడాల్సిన అన్నీ మ్యాచ్‌లను శ్రీలంకలోనే నిర్వహించనున్నారు. ఈ టోర్నీకి సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ అధికారికంగా విడుదల చేయకపోయినప్పటికీ... వచ్చే ఏడాది ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 మధ్య మ్యాచ్‌లు జరిగే అవకాశాలున్నాయి. 2024 టి20 వరల్డ్‌కప్ మాదిరిగానే మొత్తం 20 జట్లను నాలుగు గ్రూప్‌లుగా విభజించనున్నారు. అందులో మెరుగైన ప్రదర్శన చేసిన జట్లు 'సూపర్–8' దశకు... అందులో మెరుగ్గా ఆడిన జట్లు సెమీఫైనల్‌కు చేరుకున్నాయి. డిఫెండింగ్ చాంపియన్ భారత్‌తో పాటు శ్రీలంక, అఫ్గానిస్తాన్, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, అమెరికా, వెస్టిండీస్, న్యూజిలాండ్, పాకిస్తాన్, ఐర్లాండ్, కెనడా, నెదర్లాండ్స్, ఇటలీ జట్లు ఇప్పటికే వరల్డ్‌కప్‌నకు అర్హత సాధించాయి. ఇందులో ఇటలీ జట్టు ప్రపంచకప్‌నకు అర్హత సాధించడం ఇదే తొలిసారి. ఇక మిగిలిన ఐదు స్థానాల కోసం క్వాలిఫయింగ్ టోర్నీలు జరగనున్నాయి. ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుంచి 2 జట్లు, తూర్పు ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్స్ నుంచి మరో మూడు జట్లు ఈ టోర్నమెంట్‌కు అర్హత సాధించనున్నాయి. 2024లో అమెరికా, వెస్టిండీస్ సంయుక్త ఆతిథ్యంలో జరిగిన టి20 ప్రపంచకప్‌ను రోహిత్ శర్మ సారథ్యంలోని భారత జట్టు గెలుచుకున్న విషయం తెలిసిందే.

జ్యోతి సురేఖకు నిరాశ



గ్వాంగ్‌జు (దక్షిణ కొరియా): ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ మహిళల కాంపౌండ్ వ్యక్తిగత విభాగంలో ఈసారి భారత క్రీడాకారిణులు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. గత మూడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో పతకాలు సాధించిన భారత స్టార్, ఆసియా క్రీడల చాంపియన్ వెన్నం జ్యోతి సురేఖ ఈసారి క్వార్టర్ ఫైనల్లోనే వెనుదిరిగింది. భారత్‌కే చెందిన పర్ణీత్ కౌర్‌తో జరిగిన క్వార్టర్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి జ్యోతి సురేఖ 147–149తో ఓడిపోయింది. సెమీఫైనల్లో ఓడిన పర్ణీత్ కౌర్‌కు కాంస్య పతకం మ్యాచ్‌లోనూ నిరాశ ఎదురైంది. సెమీఫైనల్లో 142–143తో సోఫియా పెయిజ్ (ఎల్ సాల్వడోర్) చేతిలో ఓడిన పర్ణీత్... కాంస్య పతక మ్యాచ్‌లో 144–145తో అలెజాండ్రా ఉస్కియానో (కొలంబియా) చేతిలో పరాజయం పాలైంది. మరోవైపు మహిళల రికర్వ్ టీమ్ విభాగంలో దీపిక కుమారి, గాథ, అంకితలతో కూడిన భారత జట్టు కాంస్య పతకం కోసం పోటీపడనుంది. సెమీఫైనల్లో భారత జట్టు 2–6తో (56–56, 56–58, 56–56, 51–54)తో జపాన్ జట్టు చేతిలో ఓడింది. కాంస్య పతకం కోసం కొరియా జట్టుతో భారత్ ఆడనుంది. పురుషుల రికర్వ్ టీమ్ విభాగంలో బొమ్మదేవర ధీరజ్, రాహుల్, నీరజ్‌లతో కూడిన భారత జట్టు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది. భారత్ 4–5తో (55–53, 55–53, 53–55, 54–58, 26–28) డెన్మార్క్ జట్టు చేతిలో ఓటమి పాలైంది.

పాక్ పేసర్ ఉస్మాన్ రిటైర్



కరాచీ: పాకిస్తాన్ లెఫ్టార్మ్ పేసర్ ఉస్మాన్ షిన్వారీ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 31 ఏళ్ల బౌలర్ ఆరేళ్లుగా జాతీయ జట్టులో లేడు. చివరిసారిగా 2019లో శ్రీలంకతో టెస్టు ఆడాడు. వెన్నెముక గాయంతో ఆటకు దూరమైన అతనికి తదనంతరం కూడా ఒక్క అంతర్జాతీయ మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. 2013 నుంచి 2019 వరకు సాగిన ఏడేళ్ల కెరీర్‌లో షిన్వారి మూడు ఫార్మాట్లలో కలిపి 34 మ్యాచ్‌లే ఆడాడు. ఒక టెస్టు, 17 వన్డేలు, 16 టి20ల్లో పాకిస్తాన్‌కు ప్రాతినిధ్యం వహించాడు. వన్డేల్లో 34 వికెట్లు, టి20ల్లో 13 వికెట్లు పడగొట్టాడు. ఈ ఏడాది పాకిస్తాన్ నేషనల్ టి20 కప్ బరిలో క్వెట్టా రీజియర్ తరఫున బరిలోకి దిగాడు. కానీ ఒక్క వికెట్ కూడా పడగొట్టలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినప్పటికీ లీగ్ క్రికెట్‌కు అందుబాటులో ఉంటానని ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. పాకిస్తాన్ తరఫున ఆడే అవకాశాన్ని గొప్ప గౌరవంగా భావిస్తానని, క్రికెట్‌లో తనకు అండగా నిలిచిన వారికి ధన్యవాదాలు తెలిపాడు.

ట్యునీసియా వరుసగా మూడోసారి

ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత



ట్యూనిస్: ప్రతిష్టాత్మక ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నమెంట్‌కు ట్యునీసియా జట్టు వరుసగా మూడోసారి అర్హత సాధించింది. క్వాలిఫయింగ్ టోర్నీ గ్రూప్ 'హెచ్'లో భాగంగా సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మ్యాచ్‌లో ట్యునీసియా 1–0 గోల్స్ తేడాతో ఈక్వెటోరియల్ గినియాపై విజయం సాధించింది. తద్వారా మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే 2026 వరల్డ్‌కప్ బెర్త్ దక్కించుకుంది. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో పాల్గొననుండటం ట్యునీసియాకు ఇది ఏడో సారి. ఈక్వెటోరియల్ గినియాతో మ్యాచ్‌లో ఇంజ్యూరీ సమయంలో మొహమ్మద్ అలీ బెన్ గోల్ కొట్టడంతో ట్యునీసియా ముందంజ వేసింది. ఆఫ్రికా జోన్ క్వాలిఫయింగ్‌లో ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లాడిన ట్యునీసియా ఏడింటిలో గెలిచి ఒక మ్యాచ్ 'డ్రా' చేసుకొని 22 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఇతర మ్యాచ్‌ల్లో ఘనా 1–0 గోల్స్ తేడాతో మాలీపై, లిబియా 2–0తో ఇస్వాటినిపై, రువాండా 1–0తో జింబాబ్వేపై, నమీబియా 3–0తో సావో టోమ్‌పై, నైగర్ 1–0తో టాంజానీయాపై విజయాలు సాధించాయి. వచ్చే ఏడాది అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్త ఆతిథ్యంలో ప్రపంచకప్ జరగనుంది. ఆతిథ్య హోదాలో ఈ మూడు జట్లు ప్రపంచకప్‌నకు అర్హత సాధించగా... ఆఫ్రికా నుంచి మొరాకో, ట్యునీసియా ముందడుగు వేశాయి. ఆసియా నుంచి జపాన్, ఇరాన్, జోర్డాన్, దక్షిణ కొరియా, ఉజ్బెకిస్తాన్, ఆస్ట్రేలియా అర్హత సాధించాయి. ఒసియానియా నుంచి న్యూజిలాండ్... దక్షిణ అమెరికా నుంచి అర్జెంటీనా, బ్రెజిల్, ఈక్వెడార్, ఉరుగ్వే, కొలంబియా, పరాగ్వే ప్రపంచకప్ బెర్త్‌లు దక్కించుకున్నాయి. మొత్తంగా ఇప్పటి వరకు మెగా టోర్నీకి 18 జట్లు అర్హత సాధించాయి.

దేశంలోకి రెండేళ్లలో రూ.800 కోట్ల దొంగ బంగారం

న్యూఢిల్లీ: చైనాతో సరిహద్దుగా ఉన్న వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) ద్వారా గడిచిన రెండేళ్ల కాలంలో కనీసం టన్ను బరువైన రూ.800 కోట్ల బంగారంలో దేశంలోకి దొంగచాటుగా వచ్చింది. 2023, 2024 సంవత్సరాల్లో టిబెటన్లు, చైనీయులే ఈ బంగారాన్ని స్మగ్లింగ్ చేశారు. గతేడాది జూలైలో లద్దాఖ్‌లో ఇండో–టిబెటన్ బోర్డర్ పోలీస్(ఐటీబీపీ) దళం 108 కిలోల విదేశీ బంగారం కడ్డీలను పట్టుకున్న నేపథ్యంలో ఫెమా చట్టం కింద కేసు నమోదు చేసి, ఈ మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేపట్టినట్లు మంగళవారం ఈడీ వర్గాలు తెలిపాయి. చైనాతో మనకున్న 3,488 కిలోమీటర్ల పొడవైన ఎల్‌ఏసీ రక్షణ బాధ్యతలను ఐటీబీపీయే చూసుకుంటుంది. ఈ కేసుకు సంబంధించి ఢిల్లీలోని ఐదు ప్రాంతాలు, లద్దాఖ్‌లో ఒక చోట మంగళవారం తనిఖీలు చేపట్టామని ఈడీ వివరించింది. దొంగతనంగా తీసుకువచ్చిన బంగారానికి సంబంధించిన చెల్లింపులన్నీ క్రిప్టోకరెన్సీ ద్వారానే పూర్తయినట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ) తెలిపింది. పట్టుబడిన 108 కిలోల విదేశీ బంగారాన్ని చైనాకు చెందిన భు చుమ్‌చుమ్ అనే వ్యక్తి భారత్‌లోని టెండు తాషికి ఎల్‌ఏసీ ద్వారా పంపాడని డీఆర్‌ఐ వివరించింది. ఇందుకు సంబంధించి 10 మందిని అదుపులోకి తీసుకున్నామంది.

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఓటింగ్..



బ్యాలెట్ బాక్సులో ఓటేస్తున్న నిర్మలా సీతారామన్, ప్రియాంకా గాంధీ, కంగనా రనౌత్, స్వాతి మలివాల్, సుప్రియా సూలే


ఓటు హక్కు వినియోగించుకుంటున్న అమిత్ షా, మల్లికార్జున ఖర్గే, ఓం బిర్లా, శరద్ పవార్, శత్రుఘ్న సిన్హా

చెదిరిపోతున్న కెనడా కలలు

భారతీయ విద్యార్థులకు గడ్డుకాలం

ఈ ఏడాది 80 శాతం వీసా దరఖాస్తుల తిరస్కరణ

నిబంధనలను కఠినంగా మార్చిన కెనడా ప్రభుత్వం

కెనడాలో ఉన్నత విద్య అభ్యసించడానికి భారతీయ విద్యార్థులు అమితంగా ఆసక్తి చూపుతుంటారు. అయితే, వారి ఆశలను కెనడా ప్రభుత్వం నీరుగారుస్తోంది. ఈ ఏడాది ఇప్పటిదాకా 80 శాతం ఇండియన్ స్టూడెంట్ వీసా దరఖాస్తులను తిరస్కరించింది. గత పదేళ్ల కాలంలో ఇదే అత్యధికం కావడం గమనార్హం. ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజెన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) ఈ విషయం స్వయంగా వెల్లడించింది. భారతీయ విద్యార్థులే ఎక్కువగా ప్రభావితం అయినట్లు గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఆసియాతోపాటు ఆఫ్రికా దేశాల విద్యార్థుల వీసా దరఖాస్తులు అధికంగా తిరస్కరణకు గురయ్యాయి. వీసాలు సులభంగా లభించే పరిస్థితి లేకపోవడంతో కెనడా విద్యాసంస్థల్లో విదేశీయుల ప్రవేశాలు సైతం తగ్గిపోతున్నాయి. 2024లో 1.88 లక్షల మంది భారతీయ విద్యార్థులు కెనడా విద్యాసంస్థల్లో చేరారు. రెండేళ్ల క్రితం ఈ సంఖ్య 3.60 లక్షలకు పైగానే ఉండేది. భారతీయ విద్యార్థులు ఇప్పుడు జర్మనీపై దృష్టి పెడుతున్నారు. 2022లో కెనడాకు ప్రాధాన్యం ఇచ్చిన భారతీయుల విద్యార్థులు 18 శాతం ఉండగా, 2024లో అది 9 శాతానికి పడిపోయింది. జర్మనీకి వైపు ఆసక్తి చూపినవారి సంఖ్య గత ఏడాది 31 శాతంగా ఉంది.

ఎందుకీ పరిస్థితి?

అమెరికాలో విదేశీ విద్యార్థులపై పలు ఆంక్షలు అమల్లోకి వచ్చాయి. విద్యార్థి వీసా నిబంధలను ప్రభుత్వం కఠినంగా మార్చింది. విదేశీ విద్యార్థుల రాకపై ఆంక్షలు విధించింది. కెనడా సర్కార్ సైతం ఇదే బాటలో నడుస్తున్నట్లు తెలుస్తోంది. దేశంలో ఇళ్ల కొరత వేధిస్తోంది. మౌలిక సదుపాయాలపై విపరీతమైన ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో విదేశీయుల రాకను అడ్డుకోవాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. స్థానిక రాజకీయాలకు ప్రభుత్వం తలవంచక తప్పని పరిస్థితి ఏర్పడింది. విదేశీ విద్యార్థులపైనా ఆ ప్రభావం పడుతోంది. ఆర్థిక వనరులు బలీయంగా ఉన్న విద్యార్థులకే కెనడా వీసాలు లభించే అవకాశం ఉంది. లాంగ్వేజ్ టెస్టుల్లోనూ మంచి ప్రతిభ చూపాల్సి ఉంటుంది. సమగ్రమైన స్టడీ ప్లాన్ సమర్పించాలి. అంతేకాకుండా రూల్స్ ఆఫ్ వర్క్‌ను సైతం కఠినంగా మార్చారు. చదువుకుంటూ ఖర్చుల కోసం పార్ట్‌టైమ్ జాబ్ చేయడం ఇక కష్టమేనని నిపుణులు చెబుతున్నారు.



ఈ ఏడాది విదేశీ విద్యార్థులకు 4,37,000 వీసాలు ఇవ్వాలని కెనడా ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది గత ఏడాది కంటే 10 శాతం తక్కువ కావడం విశేషం. ఇందులో 73,000 వీసాలు పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్థులకు, 2,43,000 వీసాలు అండర్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులకు నిర్దేశించారు. 1,20,000 వీసాలు రెన్యూవల్స్, పాఠశాల విద్యార్థులకు సంబంధించినవి. కెనడా వీసా చాలా ఖరీదైన అంశంగా మారిపోయింది. దరఖాస్తు, టెస్టులు, ఫీజులు తడిసిమోపెడవుతున్నాయి. ఒకసారి దరఖాస్తు తిరస్కరణకు గురైతే మళ్లీ దరఖాస్తు చేసుకోలేక చాలామంది వెనక్కి తగ్గుతున్నారు. మొత్తానికి కెనడా కలలు చెదిరిపోతున్నాయి. మరోవైపు విదేశీ విద్యార్థులపైనే ఆధారపడి మనుగడ సాగించే కెనడా కాలేజీలు, యూనివర్సిటీ పరిస్థితి దారుణంగా మారింది. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని కాలేజీలు ఇప్పటికే మూతపడ్డాయి. మరికొన్ని ఇతర కాలేజీల్లో విలీనమయ్యాయి.

గమ్యస్థానం జర్మనీ

ఇదిలా ఉండగా, కెనడాకు ద్వారాలు మూసుకుపోతుండడంతో జర్మనీ విద్యాసంస్థల్లో చేరే భారతీయుల సంఖ్య పెరుగుతోంది. 2023లో 49,500 మంది చేరారు. 2025లో ఇప్పటికే 60,000 మంది ప్రవేశాలు పొందారు. జర్మనీలో టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇంజనీరింగ్ తదితర కీలక విభాగాల్లో తక్కువ ఫీజులకే మెరుగైన విద్య లభిస్తోంది. అమెరికా, కెనడాతో పోలిస్తే జర్మనీలో జీవన వ్యయం కూడా చాలా తక్కువ. ఈ అంశాలే జర్మనీని ఉన్నత విద్యకు గమ్యస్థానంగా మారుస్తున్నాయి.

– సాక్షి, నేషనల్ డెస్క్

థాయ్‌లాండ్ మాజీ ప్రధాని షినవత్రాకు ఏడాది జైలు శిక్ష

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాజీ ప్రధానమంత్రి థక్సిన్ షినవత్రాకు అధికార దుర్వినియోగం తదితర పాత కేసుల్లో ఏడాది జైలు శిక్ష పడింది. పదేళ్ల అజ్ఞాతం అనంతరం 2023లో ఆయన స్వదేశానికి తిరిగొచ్చాక అధికారులు ఆయన కేసును తప్పుగా అన్వయించుకున్నారా అన్న ఆరోపణలపై దర్యాప్తు జరిపిన కోర్టు ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించింది. థక్సిన్‌కు విధించిన శిక్షను సరిగ్గా అమలు చేయలేదని, పోలీస్ ఆస్పత్రిలో ఆయన నిర్బంధంలో ఉన్న కాలాన్ని జైలు శిక్షగా పరిగణించలేమని పేర్కొంది. 2023లో స్వదేశానికి చేరుకున్న షినవత్రా సగం రోజు మాత్రమే జైలులో ఉన్నారు. అనంతరం ఆయన్ను అనారోగ్య కారణాలతో అన్ని వసతులుండే పోలీస్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, ఆయన అనారోగ్యం అంత తీవ్రమైంది కాదని, జైలు ఆస్పత్రిలోనే చికిత్స చేయవచ్చని తాజాగా సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయస్థానానికి షినవత్ర కుమారుడు పింటోంగ్‌టా, కుమార్తె, మాజీ ప్రధాని పెటొంగ్‌టర్న్‌తో కలిసి వచ్చారు. అనంతరం ఆయన్ను అధికారులు జైలుకు తీసుకెళ్లారు. 2001లో ప్రధానిగా పగ్గాలు చేపట్టిన థక్సిన్ 2006లో సైనిక తిరుగుబాటు జరిగే వరకు పదవిలో కొనసాగారు. అనంతరం విదేశాలకు వెళ్లిపోయారు. అప్పుడే పలు ఆరోపణలువచ్చాయి. 2008లో తిరిగొచ్చినా మళ్లీ వెంటనే దేశం విడిచారు. రాచ కుటుంబాన్ని విమర్శించిన కేసు నుంచి ఆయనకు గత నెలలో విముక్తి కలిగింది.

60 మంది తలలు నరికిన ఐఎస్

గోమా: కాంగోలో ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)అనుబంధ ఉగ్ర సంస్థ జరిపిన దాడిలో 60 మంది ప్రజలు చనిపోయారు. సోమవారం రాత్రి నార్త్ కివు రాష్ట్రంలోని ఎన్‌టొయోలో శ్మశాన వాటిక వద్ద ఈ దారుణం చోటుచేసుకుంది. అలైడ్ డెమోక్రాటిక్ ఫోర్స్(ఏడీఎఫ్) ఉగ్రమూకలు పొడవాటి కత్తులతో అక్కడికి చేరుకుని, జనాన్ని ఒక చోటకు చేరుకోవాలని హుకుం జారీ చేశారు. వారందరీ తలలను కత్తులతో నరికేశారు. కనీసం 60 మంది ఈ ఘటనలో చనిపోయినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని ఆ ప్రాంత అధికారి ఒకరు తెలిపారు. కాంగో–ఉగాండా సరిహద్దుల్లోని ఈ ప్రాంతంలో ఏడీఎఫ్ దారుణాలకు తెగబడుతోంది. జూలైలో ఈ గ్రూపు ఇటురి ప్రావిన్స్‌లోని కొమండాలోని చర్చిపై జరిపిన దాడిలో 34 మంది, అంతకుముందు ఇరుములో జరిపిన దాడిలో 66 మంది ప్రాణాలు కోల్పోయారు.

మా తండ్రి ఆస్తుల్లో వాటా ఇవ్వాలి

ఢిల్లీ హైకోర్టులో కరిష్మా కపూర్ కుమార్తె, కుమారుడి పిటిషన్

సవతి తల్లి నకిలీ విల్లు సృష్టించిందని ఆరోపణ

న్యూఢిల్లీ: తమ తండ్రి దివంగత సంజయ్ కపూర్ ఆస్తుల్లో వాటా కోసం బాలీవుడ్ నటి కరిష్మా కపూర్ కుమార్తె, కుమారుడు న్యాయ పోరాటం ప్రారంభించారు. తండ్రి ఆస్తుల్లో తమకు రావాల్సిన వాటా దక్కేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగే అవకాశం ఉంది. సంజయ్ కపూర్‌కు రూ.30,000 కోట్ల విలువైన ఆస్తులు ఉన్నట్లు సమాచారం. మరణానికి ముందు ఈ ఏడాది మార్చి 21వ తేదీన ఆయన రాసినట్లు చెబుతున్న విల్లు నకిలీదని కరిష్మా కపూర్ కుమార్తె, కుమారుడు ఆరోపించారు. ఆస్తులు మొత్తం కొట్టేయడానికి తమ సవతి తల్లి ప్రియా కపూర్(ప్రియా సచ్‌దేవ్) కుట్ర చేస్తోందని పేర్కొన్నారు. తన వ్యక్తిగత ఎస్టేట్ మొత్తం ప్రియా కపూర్‌కు దక్కేలా సంజయ్ కపూర్ విల్లు రాసినట్లు సమాచారం. అయితే, ఆ విల్లును కుట్రపూరితంగా సృష్టించారని, అది నిజమైన విల్లు కాదని కరిష్మా కపూర్ కుమార్తె, కుమారుడు తేల్చిచెప్పారు. దాని గురించి తమ తండ్రి సంజయ్ కపూర్ కానీ, సవతి తల్లి ప్రియా కపూర్ కానీ గతంలో ఎన్నడూ చెప్పలేదని వెల్లడించారు. ఇప్పుడు ప్రియా కపూర్ దురుద్దేశంతోనే హఠాత్తుగా నకిలీ విల్లును తెరపైకి తీసుకొచ్చారని విమర్శించారు. సంజయ్ కపూర్‌కు సంబంధించిన ఆస్తుల వివరాలన్నీ బయటపెట్టేలా ప్రియా కపూర్‌ను ఆదేశించాలని హైకోర్టును కోరారు.

ఏమిటీ వివాదం?

ప్రముఖ వ్యాపారవేత్త సంజయ్ కపూర్ తొలుత నందితాను వివాహం చేసుకున్నారు. 1996 నుంచి 2000 సంవత్సరం దాకా వారు కలిసున్నారు. విడాకుల తర్వాత సంజయ్ కపూర్ 2003లో కరిష్మా కపూర్‌తో వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. వారికి ఇద్దరు పిల్లలు సమైరా, కియాన్ ఉన్నారు. 2016లో అభిప్రాయభేదాల వల్ల సంజయ్ కపూర్, కరిష్మా విడిపోయారు. అనంతరం 2017 ప్రియా సచ్‌దేవ్‌ను సంజయ్ పెళ్లాడారు. సంజయ్ కపూర్ ఈ ఏడాది జూన్ 12న హఠాత్తుగా మృతిచెందిన సంగతి తెలిసిందే. లండన్‌లో పోలో ఆడుతుండగా గొంతులోకి తేనెటీగ దూసుకెళ్లింది. దాంతో ఆయన గుండెపోటుకు గురై కన్నుమూశారు. తన కుమారుడి మరణంపై అనుమానాలున్నాయని, సమగ్ర దర్యాప్తు జరిపించాలని సంజయ్ తల్లి రాణి కపూర్ యూకే ప్రభుత్వాన్ని కోరారు. సంజయ్ మరణం తర్వాత ఆయన ఆస్తులపై వివాదం మొదలైంది. రెండో భార్య సంతానం, మూడో భార్య మధ్య పోరాటం సాగుతోంది. మరోవైపు ఇన్నాళ్లూ ప్రియా సచ్‌దేవ్‌గానే ఉన్న మూడో భార్య ఇటీవలే తన పేరును ప్రియా కపూర్‌గా మార్చుకోవడం గమనార్హం. అంతేకాకుండా తన అత్త రాణి కపూర్‌పై ఒత్తిడి తెచ్చి కొన్ని రకాల పత్రాలపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నట్లు ప్రియా కపూర్‌పై ఆరోపణలు వస్తున్నాయి.

సరిహద్దు వద్ద హైఅలర్ట్

కాఠ్మండు/న్యూఢిల్లీ: నేపాల్‌లో అస్థిరత కారణంగా మెరుగైన జీవితం కోసం భారత్‌లోకి నేపాలీలు చొరబడే ప్రమాదం ఉండటంతో 1,751 కి.మీ.ల పొడవైన సరిహద్దు వెంట సశస్త్ర సీమాబల్(ఎస్‌ఎస్‌బీ) బలగాలు కాపలాను కట్టుదిట్టం చేశాయి. సున్నితమైన పాయింట్లతోపాటు బోర్డర్ పోస్టుల వద్ద భద్రతను మరింత పెంచారు. 22 ఔట్‌పోస్టుల వద్ద అదనపు బలగాలను రప్పించారు. పోలీస్, ఎస్‌ఎస్‌బీ బృందాలు పెట్రోలింగ్‌ను తీవ్రతరంచేశాయని ఉత్తరప్రదేశ్‌లోని బలరాంపూర్ పోలీస్ సూపరింటెండెంట్ వికాస్ చెప్పారు.

భారతీయులకు అడ్వైజరీ జారీ

సంక్షోభ నేపాల్‌కు వెళ్లొద్దని భారతీయులకు భారత విదేశాంగ శాఖ మంగళవారం ఒక అడ్వైజరీ జారీచేసింది. వివిధ కారణాలతో ఇప్పటికే నేపాల్‌లో ఉన్న భారతీయులు ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో హింసాత్మక ఘటనలు జరిగే ప్రాంతాల వైపు వెళ్లొద్దని సూచించింది. సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని, భారతీయ రాయబార కార్యాలయం, కాన్సులేట్‌లో అత్యవసరమైతే సంప్రతింపులు కొనసాగించాలని ఎమర్జెన్సీ ఫోన్ నంబర్లు 977 – 980 860 2881; 977 – 981 032 6134 వెల్లడించింది. అయితే గుజరాత్‌లోని భావ్‌నగర్ జిల్లాకు చెందిన 40మందికిపైగా భక్తులు తీర్థయాత్ర కోసం నేపాల్‌కు వెళ్లి అక్కడే చిక్కుకుపోయారని తాజా సమాచారం.

ప్రధాని మోదీ సమీక్ష

తాజా పరిణామాలపై భారత ప్రధాని మోదీ ఢిల్లీలో మంగళవారం సమీక్ష జరిపారు. భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ అత్యవసరంగా సమావేశమై తాజా పరిస్థితులపై చర్చించింది. తర్వాత భేటీపై మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌పెట్టారు. ''నేపాల్‌లో తాజా పరిణామాలు నన్నెంతో కలచివేశాయి. ఎందరో యువకులు బలయ్యారు. అక్కడ శాంతి నెలకొనడం తక్షణావసరం. నేపాలీలంతా సంయమనంతో మెలగాలని కోరుకుంటున్నా''అని మోదీ విజ్ఞప్తిచేశారు. నేపాల్‌లో జెన్‌జీ ఉద్యమాన్ని సుదన్ గురంగ్ అనే 36 ఏళ్ల వ్యక్తి నడుపుతున్నారు. యువత సారథ్యంలో నడిచే 'హమి నేపాల్'సంస్థకు ఇతను అధ్యక్షునిగా సేవలందిస్తున్నారు.

ఇంజనీర్, ర్యాపర్, మేయర్, ఇప్పుడు ప్రధాని?

బాలేంద్ర షా పేరును స్మరిస్తున్న జెన్ జెడ్



కాఠ్మండు: నేపాల్‌లో ఒకవైపు రాజకీయ పరిణామాలు చకచకా మారిపోతుండగా మరోవైపు, అక్కడి యువత తదుపరి ప్రధానిని మీరే చేపట్టాలంటూ కాఠ్మండు మేయర్ బాలేంద్ర షా అలియాస్ బాలేన్‌కు పెద్ద ఎత్తున మద్దతుగా ఆన్‌లైన్‌లో పోస్టులు పెడుతున్నారు. దీంతో, ఇప్పుడు బాలేన్ పేరు మారుమోగిపోతోంది. రాజధానిలో పరిణామాల నేపథ్యంలో బాలేన్ ఫేస్‌బుక్‌లో మంగళవారం ..'ర్యాలీ నిర్వాహకులు 28 ఏళ్లలోపు వాళ్లే పాల్గొనాలనే వయో పరిమితి విధించిన కారణంగానే సోమవారం జరిగిన ర్యాలీలో పాల్గొనలేకపోయా. వారి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నది నా అభిప్రాయం'అని పేర్కొన్నారు. 'ఇది జెన్ జెడ్ చేపట్టిన ఆకస్మిక ఉద్యమమన్నది సుస్పష్టం. నేను కూడా వారికి పెద్దవాడిలా అనిపించవచ్చు. వారి ఆకాంక్షలు, లక్ష్యాలు, ఆలోచనలను అర్థం చేసుకోవాలనుకుంటున్నా. రాజకీయ పార్టీలు, నాయకులు ఈ ర్యాలీని తమ సొంత ప్రయోజనాల కోసం ఉపయోగించుకోరాదు. యువతకు పూర్తి మద్దతు తెలుపుతున్నా'అని ఆయన పేర్కొన్నారు. ఈ పోస్టుతో ఆయన పేరు అన్ని రకాల సామాజిక మాధ్యమ వేదికల్లోనూ మారుమోగిపోయింది. 'బాలేన్, సారథ్యం మీరే చేపట్టండి'అని ఎక్స్‌లో ఒకరు కోరారు. 1990లో కాఠ్మండులో పుట్టిన బాలేన్ అక్కడే సివిల్ ఇంజనీరింగ్ చదువుకున్నారు. భారత్‌లోని కర్నాటకలో స్ట్రక్చరల్ ఇంజనీరింగ్‌లో పీజీ చేశారు.

ముంబైకి చేరుకున్న మారిషస్ ప్రధాని

ముంబై/వారణాసి: భారత్‌లో ఎనిమిది రోజుల పర్యటనకు గాను మారిషస్ ప్రధానమంత్రి నవీన్‌చంద్ర రామ్‌గులామ్ ముంబైకి చేరుకున్నారు. రాజధాని పోర్టు లూయిస్ నుంచి ప్రత్యేక విమానంలో మంగళవారం ఉదయం ముంబై ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. బుధవారం ఉదయం ముంబైలోని ఓ హోటల్‌లో వ్యాపారవేత్తలతో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం వారణాసికి బయలుదేరి వెళతారు. అక్కడ మూడు రోజులపాటు బస చేస్తారు. ప్రధాని మోదీ తన సొంత నియోజకవర్గం వారణాసిలో గురువారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మారిషస్ ప్రధాని రామ్‌గులామ్‌తో భేటీ అవుతారు. ఇద్దరు నేతలు ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై చర్చలు జరుపుతారు.

ఢిల్లీ సెక్రటేరియట్‌కు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో బాంబు బెదిరింపులు మరోసారి కలకలం రేపాయి. మంగళవారం ఢిల్లీ సెక్రటేరియట్, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ(ఎంఏఎంసీ), యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్స్(యూసీఎంఎస్)లకు బాంబు పెట్టామంటూ హెచ్చరికలు వచ్చాయి. హుటాహుటిన బాంబు డిటెక్షన్, డిస్పోజల్ టీమ్స్, డాగ్ స్క్వాడ్‌లతో తరలివెళ్లిన పోలీసు బృందాలు ఆమూలాగ్రం శోధించి, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు, పేలుడు పదార్థాలు కనిపించకపోవడంతో బెదిరింపులు వట్టివేనని తేల్చారు. ఉదయం 11 గంటల ప్రాంతంలో సెక్రటేరియట్, ఎంఏఎంసీ, యూసీఎంఎస్‌లలో ఆర్డీఎక్స్ పెట్టామని, పేలుడు తీవ్రతకు కిలోమీటర్ దూరంలో మొత్తం భస్మీపటలం అవుతాయంటూ ఈ మెయిల్ అందిందని డీసీపీ(షాహ్‌దారా) ప్రశాంత్ గౌతమ్ చెప్పారు. అప్పటి నుంచి మొత్తం మూడు ప్రాంతాల్లోనూ అణువణువూ సోదాలు చేపట్టి మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఎలాంటి ప్రమాదం లేదని నిర్ధారించామన్నారు.

మిగిలిన సరుకులపై ఎంఆర్‌పీ తగ్గించండి

కంపెనీలకు కేంద్ర ప్రభుత్వం సూచన

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను(జీఎస్టీ)లో కేంద్ర ప్రభుత్వ సవరణలు చేసింది. జీఎస్టీ రేట్లలో మార్పులు తీసుకొచ్చింది. దీనికి అనుగుణంగా వస్తువులు, సరుకుల ధరలు తగ్గించాల్సి ఉంటుంది. ఇప్పటిదాకా విక్రయం కాకుండా మిగిలినపోయిన వాటిపై గరిష్ఠ అమ్మకం ధర(ఎంఆర్‌పీ)ల్లో సవరణ చేయాలని కంపెనీలు, తయారీదార్లకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ 'ఎక్స్'లో పోస్టుచేశారు. 2025 డిసెంబర్ 31 దాకా అమ్ముడుపోని సరుకుల రేట్లను నూతన జీఎస్టీ రేట్ల ప్రకారం సవరించాలని పేర్కొన్నారు. స్టిక్కర్ లేదా స్టాంప్ లేదా ఆన్‌లైన్ ప్రింట్‌తో కొత్త ఎంఆర్‌పీని సరుకులపై తప్పనిసరిగా ప్రదర్శించాలని వెల్లడించారు. పాత ఎంఆర్‌పీ కూడా వినియోగదారులకు కనిపించాలని తెలిపారు. ధరల్లో సవరణ గురించి ప్రకటనలు, పబ్లిక్ నోటీసుల ద్వారా ప్రజలకు తెలియజేయాలని కంపెనీలను ఆదేశించారు.

కేంద్రమంత్రినంటూ కర్నాటక గవర్నర్‌కు ఫోన్

బెంగళూరు: కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అని చెప్పి, కర్నాటక గవర్నర్‌తో ఫోన్‌లో మాట్లాడేందుకు ఓ ఆగంతకుడు ప్రయత్నించాడు. మూడు రోజుల క్రితం ఈ ఘటన చోటుచేసుకుందని రాజ్‌భవన్ మంగళవారం వెల్లడించింది. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను అంటూ గవర్నర్ థావర్‌చంద్ గహ్లోత్‌కు పరిచయం చేసుకున్న ఈ మోసగాడు..తనకో పని చేసి పెట్టాలని కోరాడు. ఏదో తేడాగా ఉందని అనుమానించిన గవర్నర్ కొద్దిసేపటి తర్వాత తిరిగి ఆ వ్యక్తికి కాల్ చేశారు. సమాధానం రాలేదు. దీంతో, గవర్నర్ వెంటనే కేంద్ర మంత్రి ప్రదాన్‌కు విషయం తెలిపారు. తాను కాల్ చేయలేదని మంత్రి ప్రధాన్ స్పష్టం చేశారు. రాజ్‌భవన్ కార్యాలయం వెంటనే ఈ విషయమై సంబంధిత డీసీపీని అలెర్ట్ చేసింది. పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఆదేశించింది. ఆ ఫోన్ కాల్ కోల్‌కతా నుంచి వచ్చిందని తేలడంతో ఆ వ్యక్తిని పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

వరద బాధితుల కోసం జడ్జీల విరాళం

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి వరద సహాయక నిధి కోసం ప్రధాన న్యాయమూర్తి సహా సుప్రీంకోర్టు జడ్జీలు రూ.25 వేల చొప్పున స్వచ్ఛందంగా విరాళం ప్రకటించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న వరద పరిస్థితిపై జడ్జీలు ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులకు సానుభూతి ప్రకటించారు. వారికి అండగా ఎల్లప్పుడూ ఉంటామని హామీ ఇచ్చారు. పరిస్థితులు త్వరగా సాధారణ స్థాయికి చేరుకోవాలని ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

విషం ఇవ్వండి, చచ్చిపోతా..!

న్యాయమూర్తికి నటుడు దర్శన్ మొర

శివాజీనగర: 'సార్, జైలులో ఉండలేకపోతున్నా, ఈ బతుకు బతకడం కంటే చావడం మేలు, కాస్త విషం ఇప్పించండి, అది తీసుకుని చనిపోతా..'అని ప్రముఖ కన్నడ నటుడు దర్శన్ తూగుదీప న్యాయమూర్తికి మొర పెట్టుకున్నాడు. రేణుకాచార్య అనే యువకుని హత్య కేసులో అరెస్టయి బెంగళూరు పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో ఉంటున్న దర్శన్‌ను మంగళవారం 64వ సెషన్స్ కోర్టు జడ్జి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారించారు. ఈ సందర్భంగా దర్శన్ ఆవేదన వ్యక్తం చేశాడు. 'సార్, కొంచెం పాయిజన్ కావాలి, కోర్టు ద్వారా ఆర్డర్ చేయండి. నెలలుగా ఎండ, వెలుతురును చూడలేదు. చేతులకు ఫంగస్ సమస్య ఎక్కువైంది. దుస్తులు కంపుకొడుతున్నాయి. ఏం అడిగినా కూడా ఇవ్వడం లేదు, దయచేసి కోర్టు ద్వారానే ఆర్డర్ చేయండి. నా ఒక్కడికి మాత్రం విషం ఇవ్వండి.. 'అని గద్గద స్వరంతో వేడుకున్నాడు. బళ్లారి జైలుకు మార్చాలని కోరాడు. ఇందుకు న్యాయమూర్తి స్పందిస్తూ ఇలాంటి ఆదేశాలు ఇవ్వలేమని, మళ్లీ వీటిని కోరవద్దని స్పష్టం చేశారు.

గాయాలతోనే బండి నడుపుతూ ఆసుపత్రికి..

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ఫరూఖాబాద్‌లో దారుణం జరిగింది. తనతో మాట్లాడడం లేదన్న కారణంతో ఓ వ్యక్తి వివాహితకు నిప్పంటించాడు. గాయాలపాలైన బాధితురాలు నొప్పి భరిస్తూనే తానే స్వయంగా వాహనం నడుపుకుంటూ ఆసుపత్రికి చేరుకుంది. మెరుగైన చికిత్సకోసం మరో ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. వివాహిత నిషా సింగ్(33)ను దీపక్ అనే వ్యక్తి రెండు నెలలుగా వేధిస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన నిషా సింగ్ ద్విచక్ర వాహనంపై బయలుదేరగా మధ్యలో దీపక్ అడ్డుతగిలాడు. తనతో మాట్లాడాలంటూ వాగ్వాదానికి దిగాడు. ఆమె అందుకు ఇష్టపడకపోవడంతో దీపక్ మిత్రులతో కలిసి ఆమెకు నిప్పంటించి పరారయ్యాడు. గాయాలపాలైన నిషా సింగ్ అలాగే ద్విచక్ర వాహనం నడుపుతూ తమ ఫ్యామిలీ డాక్టర్ వద్దకు చేరుకుంది. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో తొలుత స్థానిక ఆసుపత్రికి, తర్వాత లోహియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హాస్పిటల్‌కు తరలిస్తుండగా మధ్యలోనే కన్నుమూసింది. దీపక్‌ను అరెస్టు చేయడానికి పోలీసులు నాలుగు బృందాలను రంగంలోకి దించారు.

ఆఫ్రికాలోనే అతిపెద్ద రిజర్వాయర్

ప్రారంభించిన ఇథియోపియా అధ్యక్షుడు

అడిస్ అబాబా: ఆఫ్రికాలోనే అత్యంత పెద్దదైన జలాశయాన్ని ఇథియోపియా మంగళవారం ప్రారంభించింది. ఈ డ్యామ్‌తో దేశం ఆర్థికంగా అభివృద్ధి బాటన పయనించడమే కాకుండా, విద్యుత్ కోతల నుంచి బయటపడనుంది. గ్యాసోలిన్‌తో నడిచే వాహనాల దిగుమతిని నిషేధించిన నేపథ్యంలో దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల వాడకం పెరగనుంది. సుడాన్‌తో సరిహద్దుకు సమీపంలో నైలు నది ఉపనదిపై నిర్మించిన ఈ జలాశయం ప్రారంభం సందర్భంగా దేశమతా పండగ వాతావరణం నెలకొంది. రాజధాని అడిస్ అబాబాలో భారీ స్క్రీన్లను ఏర్పాటు చేసి, ప్రారంభ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. దాదాపు రూ.40 వేల కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ డ్యామ్‌తో 5 వేల మెగావాట్ల విద్యుత్ సైతం ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం దేశంలో ఉత్పత్తయ్యే విద్యుత్‌తో ఇది సమానం. ఇథియోపియా అధ్యక్షుడు అబియ్ అహ్మద్ దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి పలువురు ఆఫ్రికా దేశాల నేతలు హాజరయ్యారు. అయితే, ఈ డ్యామ్ కారణంగా తమకు అందే జలాలు తగ్గుతాయంటూ ఈజిప్టు ఎప్పటి నుంచో అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. అయితే, ఈజిప్టు, సూడాన్, మరే పొరుగు దేశానికి నష్టం కలిగించడం తమ అభిమతం కానేకాదని అధ్యక్షుడు అబియ్ అహ్మద్ స్పష్టం చేశారు.

ఇండియన్ నేషనల్ ఆర్మీ ఏర్పాటైన సంవత్సరం?

ఆధునిక భారతదేశ చరిత్ర - బ్రిటిషర్ల పాలన

వైస్రాయ్‌లు

లార్డ్ చెమ్స్‌ఫర్డ్ (1916-21)

ఇతడి కాలంలో 1916లో కాంగ్రెస్ లక్నో సమావేశంలో అతివాదులు,మితవాదులు,హిందూ - ముస్లింలు ఏకమయ్యారు. 1917లో చంపారన్ సత్యాగ్రహం, 1918లో అహ్మదాబాద్‌లో నూలుమిల్లుల ఉద్యమం జరిగాయి. 1919లో మాంటెగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రవేశపెట్టారు. వీటి ద్వారా ద్వంద్వ పరిపాలన (Diarchy) కింద రాష్ట్ర ప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలు కల్పించారు. ఆర్థిక వ్యవహారాలు, శాంతిభద్రతలు గవర్నర్ ప్రత్యక్ష ఆధీనంలో (Reserved Subjects); విద్య, ఆరోగ్యం, వ్యవసాయం మొదలైనవి శాసన సంబంధమైన అంశాలు(Transferred Subjects) గా ఉంటాయి. దీని ద్వారా ఎగువసభ, దిగువ సభలు ఏర్పడ్డాయి. చెమ్స్‌ఫర్డ్ కాలంలోనే 1919లో జలియన్ వాలాబాగ్ ఊచకోత జరిగింది. 1919లో ఢిల్లీలో అఖిల భారత ఖిలాపత్ సమావేశం జరిగింది.

1920లో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించి పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలను బహిష్కరించారు. గాంధీజీ తనకు ఇచ్చిన కైజర్-ఇ-హింద్ పతకాన్ని తిరిగి ఇచ్చేశారు. 1920లో బాలగంగాధర్ తిలక్ మరణించారు. సి.ఎన్. బెనర్జీ ఇండియన్ లిబరల్ కాంగ్రెస్‌ను స్థాపించారు. ఖిలాపత్ ఉద్యమం ప్రారంభమైంది. పుణేలో మహిళా యూనివర్సిటీని ఏర్పాటు చేశారు.

లార్డ్ రీడింగ్ (1921-26)

ఇతడి కాలంలో అలీగఢ్ జామియా మిలియా ఇస్లామియా (జాతీయ ముస్లిం విశ్వవిద్యాలయం), బిహార్ విద్యాపీఠ్, కాశీ విద్యాపీఠ్, గుజరాత్ విద్యాపీఠ్ తదితర విద్యాసంస్థలను స్థాపించారు. 1921లో పంజాబ్‌లో సిక్కులు గురుద్వారాల నుంచి అవినీతిపరులైన మహంతులను తొలగించడానికి అకాలీ ఉద్యమాన్ని ప్రారంభించారు. 1922లో చౌరీచౌరాలో ప్రజలు పోలీస్‌స్టేషన్‌ను తగులబెట్టారు. ఈ ఘటనలో 22 మంది పోలీసులు మృతి చెందారు. దీంతో గాంధీజీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేశారు.

1922 డిసెంబర్‌లో చిత్తరంజన్ దాస్, మోతీలాల్ నెహ్రూ కలిసి స్వరాజ్య పార్టీని స్థాపించారు. 1921లో ఎం.ఎన్.రాయ్ భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించారు. 1926లో మతకలహాలు చెలరేగాయి. వీటిలో భాగంగా ప్రముఖ నాయకుడు, జాతీయవాది అయిన స్వామి శ్రద్ధానంద్‌ను మతఛాందసవాదులు హత్య చేశారు. కె.బి.హెగ్డేవార్, ఆర్.ఎస్.ఎస్.ను స్థాపించారు.రౌలత్ చట్టాన్ని రద్దు చేశారు.

లార్డ్ ఇర్విన్ (1926-31)

ఇర్విన్ కాలంలో 1928 ఫిబ్రవరిలో సైమన్ కమిషన్ భారతదేశానికి వచ్చింది. ఇందులో భారతీయులెవరికీ సభ్యత్వం కల్పించలేదు. దీంతో ఈ కమిషన్‌కు దేశవ్యాప్తంగా నిరసన ఎదురైంది. 1928 డిసెంబర్‌లో తొలిసారిగా అఖిల భారత యువజన కాంగ్రెస్ సమావేశం జరిగింది. సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో రైతులు 1928లో పన్నుల నిరాకరణోద్యమం సాగించారు. 1928లో చంద్రశేఖర్ ఆజాద్ నాయకత్వంలో 'హిందుస్థాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' అనే విప్లవ సంస్థ ఆవిర్భవించింది.

భగత్‌సింగ్, బి.కె. దత్తు కలిసి 1929 ఏప్రిల్ 8న కేంద్ర శాసనసభలో బాంబు విసిరారు. ప్రజారక్షణ బిల్లు ఆమోదానికి నిరసనగా వీరు ఈ ఘటనకు పాల్పడ్డారు. 1930లో చిట్టగాంగ్‌లో ప్రభుత్వ ఆయుధాగారంపై దాడి జరిగింది. సూర్యాసేన్ నేతృత్వంలో జరిగిన ఈ దాడిలో మహిళలు సైతం పాల్గొన్నారు. రాజకీయ ఖైదీలను ఉంచే జైళ్లలో దుర్భర పరిస్థితులు ఉండేవి. దీనికి నిరసనగా జతిన్‌దాస్ అనే యువకుడు 63 రోజుల పాటు ఉపవాస దీక్ష చేసి ప్రాణత్యాగం చేశాడు. 1931లో భగత్‌సింగ్, రాజ్‌గురును పోలీసు అధికారుల హత్యకేసుల్లో విచారించి ఉరితీశారు. 1929లో కాంగ్రెస్ పార్టీ లాహోర్‌లో సమావేశమైంది. 'సంపూర్ణ స్వరాజ్యం' కాంగ్రెస్ ఆశయమని ఈ సమావేశంలోనే ప్రకటించారు. అదే ఏడాది త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గాంధీజీ 1930 మార్చి 12న దండి సత్యాగ్రహం ప్రారంభించారు. ఇదే ఉప్పు సత్యాగ్రహంగా ప్రసిద్ధికెక్కింది. 1930లో జరిగిన తొలి రౌండ్ టేబుల్ సమావేశానికి భారతీయ నాయకులను ఆహ్వానించారు. కానీ, సైమన్ నివేదికపై చర్చకు నిరసనగా వీరు సమావేశాన్ని బహిష్కరించారు. తర్వాత గాంధీ-ఇర్విన్ సంధి జరిగింది. ఉద్యమాన్ని నిలిపివేశారు.

లార్డ్ వెల్లింగ్‌టన్ (1931-36)

ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ నాయకత్వంలో పఠాన్లు 'ఖుదాయ్ ఖిద్మత్ గార్' అనే సంస్థను ప్రారంభించారు. దీనికి భగవంతుడి సేవకులని అర్థం. వీరినే 'రెడ్ షర్ట్'లు అని కూడా పిలుస్తారు. మణిపూర్ వాసులు జాతీయోద్యమంలో సాహసోపేత పాత్ర పోషించారు. గాంధీజీ పిలుపు మేరకు నాగాలాండ్ వీరనారి 'రాణి గైడిన్‌లియూ' పదమూడేళ్ల వయస్సులోనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. విదేశీ పాలనకు వ్యతిరేకంగా ఆమె తిరుగుబాటు జరిపారు. 1932లో బ్రిటిష్ ప్రభుత్వం రాణికి



సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

యావజ్జీవ కారాగారశిక్ష విధించింది. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక భారత ప్రభుత్వం ఆమెను విడుదల చేసింది. 1931లో రెండో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి గాంధీజీ లండన్ వెళ్లారు. ఈ సమావేశంలో 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించారు. దీని ప్రకారం మైనారిటీలకు ప్రత్యేక నియోజక వర్గాలు కల్పించారు. దీనికి నిరసనగా గాంధీజీ నిరాహారదీక్ష చేపట్టారు.

నిమ్నజాతులకు కూడా ప్రత్యేక స్థానాలను ప్రకటించారు. గాంధీ-అంబేద్కర్ మధ్య పుణే ఒప్పందం జరిగింది. 1932లో మూడో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఓటింగ్ అర్హత, ఉమ్మడి నిధులు, రాష్ట్రాల ఆర్థిక వనరుల గురించి ఈ సమావేశంలో చర్చించారు. మహిళలకు ఓటు హక్కు కల్పించడం, రాష్ట్రాల శాసనసభ్యుల సమాఖ్య, ఎగువసభ, ప్రతినిధులను ఎన్నుకోవడం మొదలైనవి ఈ సమావేశం నిర్ణయించిన నూతన విషయాలు. గాంధీ-ఇర్విన్ ఒప్పందం తర్వాత 1933లో కాంగ్రెస్ అధికారికంగా ఉద్యమాన్ని నిలిపివేసింది. 1935 భారత ప్రభుత్వ రాజ్యాంగ చట్టం ఆమోదం పొందింది. ఈ చట్టం ప్రకారం దేశంలో ఫెడరల్ (సమాఖ్య) వ్యవస్థ ఏర్పాటైంది. రాష్ట్రాలకు స్వపరిపాలనాధికారం లభించింది. 1935 చట్టంరాజ్యాధికారాలను మూడు రకాలుగా విభజించింది. అవి:

1. సమాఖ్య అధికారాలు
2. రాష్ట్ర అధికారాలు
3. ఉమ్మడి అధికారాలు

తమ అధికార పరిధిలో శాసనాలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వాధికారం ఉంటుంది. ఉమ్మడి జాబితాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాసనం చేయవచ్చు. ఏ శాసన్నానైనా వీటో చేసే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. బిల్లులను పునఃపరిశీలించమని సూచించే లేదా బ్రిటిష్ చక్రవర్తి నిర్ణయానికి పంపే అధికారం గవర్నర్ జనరల్‌కు ఉంటుంది. ఈ చట్టం ప్రకారం ఎగువ సభలో 2/5వ వంతు, దిగువ సభలో 3/5వ వంతు స్థానాలు సంస్థానాధీశులకు కేటాయించారు. భారత్ నుంచి బర్మాను వేరు చేశారు. జయప్రకాశ్ నారాయణ్ కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీని ఏర్పాటు చేశారు. 1936లో ఆలిండియా కిసాన్ సభ ఏర్పాటైంది.

లార్డ్ లిన్‌లిత్ గో (1936-44)

భారత ప్రభుత్వ చట్టం-1935 ప్రకారం 1937 జూలై నాటికి ఎన్నికలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ చాలా రాష్ట్రాల్లో అత్యధిక స్థానాలను సాధించి, ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. 1937లో జవహర్‌లాల్ నెహ్రూ జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1936లో తొలి అఖిల భారత కిసాన్ సభ ఆవిర్భవించింది. నాటి నుంచి రైతాంగం జాతీయోద్యమంలో క్రియాశీల పాత్ర పోషించింది. 1936 లక్నో కాంగ్రెస్ సమావేశంలో సోషలిజాన్ని ఆమోదించారు.

1938లో జాతీయ కాంగ్రెస్ గుజరాత్‌లోని హరిపూర్‌లో సమావేశమైంది. దీనికి సుభాష్ చంద్రబోస్ అధ్యక్షత వహించారు. 1939లో బోస్ అధ్యక్ష పదవికి పోటీ చేశారు. గాంధీ,నెహ్రూ ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ సుభాష్ చంద్రబోస్ గెలుపొందారు. వర్కింగ్ కమిటీలో గాంధీజీ అనుయాయులు బోస్ పట్ల విముఖత చూపారు. దీంతో ఆయన అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కొందరు వామపక్ష వాదులతో కలిసి ఫార్వర్డ్ బ్లాక్ అనే కొత్త పార్టీని ప్రారంభించారు. 1927 డిసెంబర్ నాటికే అఖిల భారత సంస్థాన ప్రజాసభ ప్రారంభమైంది. 1939లో నెహ్రూ ఈ సభకు అధ్యక్షుడయ్యాడు. 1939లోనే రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైంది. భారతీయులను సంప్రదించకుండానే భారత్‌లోని బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధంలోకి అడుగుపెట్టింది. ఈ విషయమై జాతీయ కాంగ్రెస్‌కు లేదా కేంద్ర శాసనసభకు ఎన్నికైన సభ్యులకు మాట మాత్రంగా కూడా చెప్పలేదు. 1940లో ముస్లిం లీగ్ దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. అదే ఏడాది బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టు ఆఫర్ జారీ చేసింది. దీని ప్రకారం మైనారిటీలకు అధిక స్థానాలను కేటాయిస్తారు. యుద్ధం ముగిశాక నూతన రాజ్యాంగంలో ఈ విషయాన్ని పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. 1941లో సుభాష్ చంద్రబోస్ నిర్బంధం నుంచి తప్పించుకొని బెర్లిన్ వెళ్లారు. 1942లో ఆయన ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఆజాద్ హిందు ఫౌజ్)ని స్థాపించారు. భారతదేశ స్వాతంత్ర్యం కోసం విదేశాల నుంచే బోస్ పోరాడారు. ఆయన 'జైహింద్' అనే నినాదమిచ్చారు.

రెండో ప్రపంచ యుద్ధంలో భారతీయుల పూర్తి సహకారం కోసం బ్రిటన్ ప్రయత్నించింది. ఇందు కోసం 1942 మార్చిలో సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో ఒక రాయబార బృందాన్ని భారత్‌కు పంపింది. క్రిప్స్ బ్రిటిష్ మంత్రివర్గ సభ్యుడు, లేబర్ పార్టీలో రాడికల్ సభ్యుడు. వీలైనంత త్వరగా స్వపరిపాలన ప్రతిపాదించడమే తమ లక్ష్యమని క్రిప్స్ తెలిపారు. కాంగ్రెస్ కమిటీ 1942 ఆగస్టు 8న బొంబాయిలో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో క్విట్ ఇండియా తీర్మానాన్ని ఆమోదించారు. కాంగ్రెస్ పార్టీ, గాంధీజీ నాయకత్వంలో అహింసాయుత ప్రజాపోరాటాన్ని కొనసాగించింది. బ్రిటిష్ ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని సమర్థవంతంగా అణచివేసింది.

లార్డ్ వేవెల్ (1944-47)

1944లో అట్లీ బ్రిటన్ ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. 1945లో కాంగ్రెస్, ముస్లిం లీగ్ పార్టీలు లార్డ్ వేవెల్ సమక్షంలో సిమ్లాలో సమావేశమయ్యాయి. రాజ్యాంగ, మత అడ్డంకులను తొలగించేందుకు ఆ పార్టీలు జరిపిన చర్చలు విఫలమయ్యాయి. 1946లో అఖిల భారత తంతి-తపాలా కార్మికులు సమ్మె చేశారు. కౌలు రేట్ల తగ్గింపు కోసం రైతాంగ పోరాటాలు అధికమయ్యాయి. సమ్మెలు, హర్తాళ్లు, ప్రదర్శనలు నిర్వహించడంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు ప్రముఖ పాత్ర పోషించారు. ఈ పరిస్థితుల్లో బ్రిటిష్ ప్రభుత్వం 1946 మార్చిలో కేబినెట్ మిషన్‌ను పంపింది. అధికార బదిలీ గురించి భారత జాతీయ నాయకులతో ఈ మిషన్ సంప్రదింపులు జరిపింది. నూతన రాజ్యాంగం అమల్లోకి వచ్చే దాకా తాత్కాలిక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని బ్రిటిష్ రాయబార వర్గం సూచించింది. 1946 సెప్టెంబర్‌లో నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక జాతీయ ప్రభుత్వం ఏర్పాటైంది. ముస్లింలీగ్ మంత్రి వర్గంలో చేరింది. కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లింలీగ్ 1946 ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటించింది. నేవీ తిరుగుబాటు చేసింది. ఇండియన్ నేషనల్ ఆర్మీ బ్రిటిషర్లకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించింది.

లార్డ్ మౌంట్ బాటన్ (1947)

మౌంట్ బాటన్ 1947లో భారత వైస్రాయ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈయన కాంగ్రెస్, ముస్లిం లీగ్ నాయకులతో సుదీర్ఘ చర్చలు జరిపారు. భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయన్న ప్రకటన 1947 జూన్ 3న విడుదలైంది. 1947 ఆగస్టు 14న పాకిస్తాన్ నూతన దేశంగా ఆవిర్భవించింది. అదే రోజు అర్ధరాత్రి భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1948 జనవరి 30న గాడ్సే గాంధీజీని కాల్చి చంపాడు.

ముఖ్యాంశాలు

- 1929: లాహోర్‌లో నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమావేశం. 'సంపూర్ణ స్వరాజ్యమే' తమ ఆశయమని ప్రకటన.
- 1930 మార్చి 12: దండి సత్యాగ్రహాన్ని ప్రారంభించిన మహాత్మా గాంధీ.
- 1942 మార్చి: సర్ స్టాఫర్డ్ క్రిప్స్ నేతృత్వంలో భారత్‌కు రాయబార వర్గం రాక.
- 1942 ఆగస్టు 8: బొంబాయిలో కాంగ్రెస్ కమిటీ సమావేశం. క్విట్ ఇండియా తీర్మానానికి ఆమోదం.
- 1946 మార్చి: కేబినెట్ మిషన్ భారత్ రాక.
- 1946 ఆగస్టు 16: కేబినెట్ ప్లాన్‌ను అంగీకరించని ముస్లిం లీగ్, ఆగస్టు 16ను ప్రత్యక్ష చర్యాదినంగా ప్రకటన.
- 1947 జూన్ 3: భారత్, పాకిస్తాన్ స్వతంత్ర దేశాలుగా అవతరిస్తాయనే ప్రకటన విడుదల.

కోడ్‌లు గుర్తుంచుకుంటే క్యాలెండర్ సమస్యలు సులువు!

క్యాలెండర్

మాదిరి ప్రశ్నలు

మోడల్-1

1. రోహిత్ పుట్టిన తేది 2006 సెప్టెంబర్ 25 అయితే అది ఏ వారం?
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) శనివారం

ఈ తరహా ప్రశ్నలు అడిగినప్పుడు అభ్యర్థులు వారాలు, నెలలు, సంవత్సరాలకు సంబంధించిన కింది కోడ్‌లను తెలుసుకుంటే సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

వారం	కోడ్
శనివారం	0
ఆదివారం	1
సోమవారం	2
మంగళవారం	3
బుధవారం	4
గురువారం	5
శుక్రవారం	6
నెల	**కోడ్**
జనవరి	1
ఫిబ్రవరి	4
మార్చి	4
ఏప్రిల్	0
మే	2
జూన్	5
జూలై	0
ఆగస్టు	3
సెప్టెంబర్	6
అక్టోబర్	1
నవంబర్	4
డిసెంబర్	6
సంవత్సరం	**కోడ్**
1600 నుంచి 1699	6
1700 నుంచి 1799	4
1800 నుంచి 1899	2
1900 నుంచి 1999	0
2000 నుంచి 2099	6
2100 నుంచి 2199	4

సూత్రం: [ప్రశ్నలో ఇచ్చిన తేదీ + నెల కోడ్ + సంవత్సరాలు (చివరి రెండు అంకెలు) + లీపు సంవత్సరాలు + సంవత్సరం కోడ్] 7
ఇచ్చిన ప్రశ్నలో తేదీ = 25
లీపు సంవత్సరాలు = ఇచ్చిన సంవత్సరంలోని చివరి రెండంకెలను 4తో భాగిస్తే వచ్చే భాగఫలం

సూత్రం ప్రకారం
= (25 + 6 + 6 + 1 + 6) 7
7)44(6
42
2

∴ శేషం రెండు కాబట్టి వారం - కోడ్ పట్టిక ప్రకారం రోహిత్ పుట్టిన రోజు సోమవారం

2. 1776 జూలై 16న ఏ వారం అవుతుంది?
ఎ) సోమవారం బి) బుధవారం
సి) శనివారం డి) మంగళవారం
జవాబు: డి

3. 1947 ఆగస్టు 15న ఏ వారం?
ఎ) శనివారం బి) శుక్రవారం
సి) గురువారం డి) బుధవారం
జవాబు: బి

4. 2020 ఆగస్టు 15 ఏ వారం?
ఎ) గురువారం బి) శనివారం
సి) శుక్రవారం డి) ఆదివారం
జవాబు: బి

5. 2014 జనవరి 1 ఏ రోజు ?
ఎ) గురువారం బి) మంగళవారం
సి) బుధవారం డి) శుక్రవారం
జవాబు: సి

మోడల్-2

1. 2005 మార్చిలో ఏ తేదీల్లో శుక్రవారాలు వస్తాయి.
ఎ) 3, 10, 19, 23 బి) 4, 11, 18, 25
సి) 1, 8, 15, 22 సి) 2, 9, 16, 23
జవాబు: బి

వివరణ: 1-3-2005 న వచ్చే వారం
1 + 4 + 5 + 1 + 6 7 = 3
అంటే 1-3-2005 - మంగళవారం
4-3-2008 - శుక్రవారం
కాబట్టి 4, 11, 18, 25 తేదీల్లో శుక్రవారాలు వస్తాయి.

2. 2016 నవంబర్‌లో శుక్రవారాలు ఎప్పుడు వస్తాయి?
ఎ) 1, 8, 15, 22, 29 బి) 3, 10, 17, 24
సి) 5, 12, 19, 26 డి) 4, 11, 18, 25
జవాబు: డి

3. 1994 ఏప్రిల్‌లో ఏ తేదీల్లో బుధవారం వస్తుంది?
ఎ) 3, 10, 17, 24 బి) 4, 11, 18, 25
సి) 12, 19, 26 డి) 7, 18, 21, 28
జవాబు:ఎ

మోడల్-3

1. 2003 సంవత్సరం క్యాలెండర్ కిందివాటిలో ఏ సంవత్సరం క్యాలెండర్‌ను పోలి ఉంటుంది?
ఎ) 2005 బి) 2009 సి) 2014 డి) 2004
జవాబు: సి

వివరణ: 2003 నుంచి మొత్తం విషమ రోజులు సున్నా వచ్చే వరకు లెక్కించాలి. సున్నా వచ్చిన తర్వాత సంవత్సరం మొదటి క్యాలెండర్‌ను పోలి ఉంటుంది.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

మెంటల్ ఎబిలిటీ

సంవత్సరం	విషమ రోజులు
2003	1
2004	2
2005	1
2006	1
2007	1
2008	2
2009	1
2010	1
2011	1
2012	2
2013	1

మొత్తం రోజులు
= 1+ 2 + 1 + 1 + 1+ 2+ 1+1 +1 +2 + 1 = 14
విషమ రోజు = 14/7 = 0
2003 క్యాలెండర్
2014 క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.

2. 2007 క్యాలెండర్ ఏ సంవత్సరం క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.
(Communications S.I. -2012)
ఎ) 2013 బి) 2018
సి) 2008 డి) 2010
జవాబు: బి

3. 2002 సంవత్సరం క్యాలెండర్ ఏ సంవత్సరం క్యాలెండర్ ఒకేలా ఉంటాయి.
(Deputy Jailor-2012)
ఎ) 2003 బి) 2008
సి) 2030 డి) 2013
జవాబు: డి

మోడల్ : 4

1. 2006 సెప్టెంబర్ 25 సోమవారం రోహిత్ పుట్టినరోజు అయితే 2014లో రోహిత్ పుట్టినరోజు ఏ వారం?
ఎ) సోమవారం బి) గురువారం
సి) శనివారం డి) ఆదివారం
జవాబు: బి

వివరణ: 2006 సెప్టెంబర్ 25
2007 సెప్టెంబర్ 25 1 (విషమ రోజులు)
2008 సెప్టెంబర్ 25 2 (విషమరోజులు)
2009 సెప్టెంబర్ 25 1
2010 సెప్టెంబర్ 25 1
2011 సెప్టెంబర్ 25 1
2012 సెప్టెంబర్ 25 2
2013 సెప్టెంబర్ 25 1
2014 సెప్టెంబర్ 25 1
మొత్తం రోజులు 10
విషమ రోజులు 3
అంటే సోమవారం + 3 = గురువారం

2. 2012 మార్చి 6 ఆదివారం అయితే 2016 మార్చి 6 ఏ వారం అవుతుంది?
(Communications S.I. -2012)
ఎ) శుక్రవారం బి) సోమవారం
సి) శనివారం డి) గురువారం
జవాబు: ఎ

3. 2006 జనవరి 1 ఆదివారం అయితే 2010 జనవరి 1 ఏ వారం అవుతుంది?
(Communications S.I. -2012)
ఎ) సోమవారం బి) శనివారం
సి) మంగళవారం డి) శుక్రవారం
జవాబు: డి

మోడల్- 5

1. 1999 డిసెంబర్ 5 ఆదివారం అయితే 2000 మార్చి 20 ఏ వారం అవుతుంది?
ఎ) సోమవారం బి) ఆదివారం
సి) మంగళవారం డి) బుధవారం
జవాబు: ఎ

వివరణ:
1999 డిసెంబర్ 5 నుంచి 2000 మార్చి 20 సంవత్సరం మొత్తం రోజులు:
డిసెంబర్ నెలలో 5వ తేదీ తర్వాత మిగిలిన రోజులు (31-5) = 26 రోజులు
2000 సంవత్సరంలో
జనవరి = 31రోజులు
ఫిబ్రవరి = 29రోజులు
మార్చి = 20 రోజులు
మొత్తం రోజులు = 106 రోజులు
అంటే విషమ రోజుల సంఖ్య = 1
∴ 2000 మార్చి 20 → ఆదివారం + 1
= సోమవారం

2. 2013 జనవరి 1 మంగళవారం అయితే 10 అక్టోబర్ 2013 ఏ రోజు అవుతుంది?
(General SI- 2012)
ఎ) గురువారం బి) శుక్రవారం
సి) మంగళవారం డి) శనివారం
జవాబు: బి

ముఖ్యాంశాలు

- 2003 సంవత్సరానికి ముందు లీపు సంవత్సరం వచ్చి మూడేళ్లు అయితే అలాంటి సంవత్సరం కావాలంటే 2003+11= 2014
- లీపు సంవత్సరం తర్వాత 2 సంవత్సరాలు అయితే 2006 లాంటి సంవత్సరం కావాలంటే + 11 సంవత్సరాలు చేయాలి.
ఉదా. 2006 + 11 = 2017
2006 లాంటి కాలెండర్ 2017.
- లీపు సంవత్సరం వచ్చి 1 సంవత్సరం అయింది. ఉదాహరణకు 2013 లాంటి సంవత్సరం కావాలంటే + 6 సంవత్సరాలు చేయాలి.
2013+ 6 = 2019
2013 క్యాలెండర్ 2019 ఒకటే.
- లీపు సంవత్సరం అయితే + 28 సంవత్సరాలు చేయాలి
ఉదా. 2012 + 28
= 2040
2012 క్యాలెండర్ 2040 క్యాలెండర్ ఒకటే.

విద్య, ఉద్యోగ సమాచారం

జామ్-2026

దేశంలోని ఐఐటీ సంస్థల్లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి మాస్టర్స్ కోర్సుల్లో ప్రవేశానికి జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్)-2026 పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షను ఐఐటీ బాంబే నిర్వహించనుంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 30,000.
» **కోర్సుల వివరాలు:** ఎమ్మెస్సీ, ఎమ్మెస్సీ(టెక్నాలజీ), ఎంఎస్(రీసెర్చ్), ఎంఎస్సీ(ఎంటెక్) డ్యూయల్ డిగ్రీ, జాయింట్ ఎంఎస్సీ పీహెచ్‌డీ, ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ(డ్యూయల్ డిగ్రీ).
» **అర్హత:** సంబంధిత విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులే.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ద్వారా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:**05.09.2025
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 12.10.2025
» **పరీక్ష తేది:** 15.02.2025.
» **ఫలితాల ప్రకటన తేది:** 18.03.2025.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి.
» **వెబ్‌సైట్:** https://jam2026.iitb.ac.in

టీహెచ్ఎస్‌టీఐలో వివిధ ఖాళీలు

ఫరీదాబాద్(హర్యానా)లోని ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్‌స్టిట్యూట్(టీహెచ్ఎస్‌టీఐ) వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **ఖాళీల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1-01, డేటా ఎంట్రీ ఆపరేటర్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి డిగ్రీ లేదా ఇంటర్మీడియట్‌తో పాటు కంప్యూటర్ డిప్లొమా, ఎంబీబీఎస్, బీడీఎస్, బీవీఎస్సీ, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, బీఎస్ఎంఎస్, బీఎన్‌వైఎస్, బీఎస్సీ నర్సింగ్, బీపీటీ, బీఫార్మ్, ఫార్మ్‌డీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్‌కు 40 ఏళ్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.67,000, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.29,000.
» **దరఖాస్తు ఫీజు:** యూజీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్‌కు రూ.590, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.236, ఎస్సీ, ఎస్టీ, మహిళలు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.118.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరితేది:** 22.09.2025.
» **వెబ్‌సైట్:** https://thsti.res.in

సి.నారాయణరెడ్డి తెలంగాణలో ఎక్కడ జన్మించారు?



అరుదైన కోవకు చెందిన మన తరం మహానుభావుడు కాళోజీ.ఆయన నిజాయతీగా మాట్లాడారు. అనుకున్నది కుండబద్ధలు కొట్టినట్లు చెప్పారు. ప్రభుత్వంతో ఏనాడూ రాజీపడలేదు. పదవుల కోసంపాకులాడలేదు. సామాన్య ప్రజలను మర్చిపోలేదు. ఎల్లప్పుడూ ప్రజల పక్షం వహించి అనేక ప్రజాసమస్యలపై పోరాడారు. ప్రజల గొడవ.. తన గొడవగా, జనం వాణి.. తన బాణీగా వినిపిస్తూ.. నిరంతరం ఉద్యమాన్ని నడిపించారు. లోక్‌నాయక్ జయప్రకాశ్ నారాయణను ఉద్దేశించి కాళోజీ 'పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది' అని పేర్కొన్నారు. ఈ మాటలు ఆయనకూ వర్తిస్తాయి.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

తెలంగాణ వైతాళికులు

కాళోజీ నారాయణరావు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న జన్మించారు. ఈయన కుటుంబం కర్ణాటకలోని బీజాపూర్ నుంచి తెలంగాణాలోని వరంగల్ జిల్లాకు వలస వచ్చి మడికొండ గ్రామంలో స్థిరపడింది. కాళోజీ తల్లిదండ్రులు రంగారావు, రమాబాయమ్మ. ఈయన హైదరాబాద్‌లోని చౌమొహల్లా పాఠశాల, సిటీ కాలేజీలో విద్యాభ్యాసం చేశారు. 1939లో హైదరాబాద్ హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ భాషల్లో ప్రముఖ కవిగా గుర్తింపు పొందారు.

కాళోజీ జాతీయోద్యమాల్లో చురుగ్గా పాల్గొని అనేక పర్యాయాలు జైలుకు వెళ్లారు. నిజాం ప్రభుత్వ కాలంలో తన రచనల ద్వారా తెలంగాణా ప్రజల్లో దేశభక్తి రేకెత్తించారు. సామాన్య ప్రజలను విశేషంగా ఆకర్షించడం ఈయన కవిత్వానికి ఉన్న ప్రత్యేకత. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండున్నరేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించారు. హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన వందేమాతరం ఉద్యమంలో పాల్గొనడం వల్ల బహిష్కరణకు గురైన విద్యార్థులను నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేర్పించారు.

అన్యాయాన్ని ఎదిరిస్తూ కలమెత్తిన ప్రజాకవి..

కాళోజీ 1948 భారత విలీనోద్యమంలో ఏడు నెలల పాటు వరంగల్, గుల్బర్గా జైళ్లలో శిక్ష అనుభవించారు. వరంగల్‌లో నిజాం రజాకార్లు జాతీయవాది అయిన మొగులయ్యను హత్య చేసినప్పుడు కాళోజీ రాసిన గేయం ప్రజలను కదిలించింది. నిజాం ప్రధానమంత్రి మీర్జా ఇస్మాయిల్ వరంగల్ సందర్శించినప్పుడు 'ఎన్నాళ్ల నుండియో..' అనే గేయం రాశారు. 'అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు సకిలించు ఆంధ్రుడా.. చావవెందుకురా', 'అతిథివోలె వుండి.. అవని విడిచి వెళ్లతాను' లాంటి కాళోజీ కవితా పంక్తులు ప్రసిద్ధి చెందాయి.

విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి కాళోజీ వరంగల్‌లో గణపతి ఉత్సవాలు నిర్వహించారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించినందుకు ఆయన్ని నగరం నుంచి బహిష్కరించారు. హైదరాబాద్‌లో 'ఆంధ్ర సారస్వత పరిషత్' స్థాపకుల్లో ఒకరైన కాళోజీ తెలంగాణా రచయితల సంఘం ఏర్పాటులోనూ ప్రముఖపాత్ర పోషించారు.

కేంద్ర ప్రభుత్వం కాళోజీ సేవలను గుర్తించి 1992లో పద్మవిభూషణ్ బిరుదునిచ్చి సత్కరించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు 'ప్రజాకవి' బిరుదు ఇచ్చింది. 1992లో వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం కాళోజీకి గౌరవ డాక్టరేట్ బహుకరించింది.

రచనలు

కాళోజీ 'మనమే నయం', 'తెలియక ప్రేమ.. తెలిసి ద్వేషం', 'విభూతి లేక ఫేస్ పౌడర్' తదితర శీర్షికలతో కథలు రాశారు. వ్యంగ్యం, అధిక్షేపాలను కలగలిపి వీటిని రచించారు. సమాజంలో నిరుపేదలు, కష్టజీవుల బతుకులు దుర్భరంగా ఉన్నాయనే వాస్తవికతను కాళోజీ ఈ కథల్లో వ్యంగ్యంగా చిత్రీకరించారు. కె.సి. గుప్తా 1943లో సుల్తాన్ బజార్‌లోని ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీ తరఫున 'అణా గ్రంథమాల' ప్రచురణల వరసలో 24వ గ్రంథంగా 'కాళోజీ కథలు' పేరుతో పుస్తకాన్ని ముద్రించాడు. అప్పట్లో దీని వెల ఒక కల్దారు అణా మాత్రమే. నాడు హైదరాబాద్ రాష్ట్రంలో హాలీ చిక్కాలు (నాణేలు) అమల్లో ఉన్నప్పటికీ దీని ధరను కల్దారులో ప్రకటించారు. 'సుభాష్ చంద్రబోస్' అనే గ్రంథాన్ని ప్రచురించినందుకు ప్రభుత్వం కె.సి. గుప్తాకు ఒక నెల కఠిన శిక్షతో పాటు రూ. 250 జరిమానా, రచయితకు 18 నెలల కఠిన శిక్ష విధించింది. అల్లూరి సీతారామరాజుపై వెలువరించిన గ్రంథాన్ని కూడా నిషేధించింది. ఇలాంటి స్థితిగతులూ, ప్రభుత్వ నిర్బంధ విధానాలు ఉన్నప్పటికీ కాళోజీ ధైర్యంగా తన కలాన్ని కదిలించారు.

కాళోజీ 1941లో 'అణా కథలు', 1946లో 'కాళోజీ కథలు', 1953లో 'నా గొడవ' రచించారు. 1969-70లో తెలంగాణా ఉద్యమ కవితలు రచించారు. కాళోజీ ఆత్మకథ 'ఇది నా గొడవ'. దీన్ని 1995లో రచించారు.

కాళోజీ నారాయణరావు 2002 నవంబర్ 13న మరణించారు. ఆయన తన దేహాన్ని కాకతీయ మెడికల్ కాలేజీకి దానం చేశారు. తెలంగాణా రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత ఈ కళాశాల పేరును కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చారు.

రాష్ట్ర ప్రభుత్వం కాళోజీ నారాయణరావు జయంతిని 'తెలంగాణా భాషా దినోత్సవం'గా ప్రకటించింది. 2015 సెప్టెంబర్ 9న తొలిసారిగా తెలంగాణా భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ స్మారక పురస్కారం అందించారు. దీన్ని మొదటిసారిగా ప్రముఖ కవి డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్‌కు 2015 సెప్టెంబర్ 9న హైదరాబాద్‌లో ప్రదానం చేశారు.

మాదిరి ప్రశ్నలు

1. ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఏ సంవత్సరంలో జన్మించారు?
   1) 1914 సెప్టెంబర్ 9
   2) 1923 నవంబర్ 10
   3) 1925 అక్టోబర్ 1
   4) 1910 డిసెంబర్ 12
2. 'అణా గ్రంథమాల' సంపాదకుడి పేరు?
   1) వట్టికోట ఆళ్వార్ స్వామి
   2) అడవి బాపిరాజు
   3) సురవరం ప్రతాపరెడ్డి
   4) కె.సి.గుప్తా
3. 'ఇది నా గొడవ' అనే పేరుతో కాళోజీ నారాయణరావు ఆత్మకథ ఏ సంవత్సరంలో రచించారు?
   1) 1946 2) 1941
   3) 1995 4) 1953
4. కాళోజీ నారాయణరావు స్మారక ప్రథమ పురస్కార గ్రహీత ఎవరు?
   1) డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్
   2) డాక్టర్ ఎన్. గోపి
   3) డాక్టర్ వల్లూరి శివారెడ్డి
   4) అందెశ్రీ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 3; 4) 1.

ఆచార్య సి. నారాయణ రెడ్డి

ఆచార్య సింగిరెడ్డి నారాయణ రెడ్డి (సినారె) ఈ శతాబ్దపు మహాకవుల్లో ప్రముఖులు. దాదాపు ఐదు దశాబ్దాలుగా సినారెకి తెలుగు సాహితీవనంలో ప్రత్యేక స్థానం ఉంది. ఈయన తెలంగాణలోని కరీంనగర్ జిల్లా సిరిసిల్ల తాలూకా హన్మాజీపేటలో 1931 అక్టోబర్ 29న జన్మించారు. ఈయన తల్లిదండ్రులు సింగిరెడ్డి బుచ్చమ్మ, మల్లారెడ్డి. సిరిసిల్ల, కరీంనగర్‌లో సినారె ప్రాథమిక, మాధ్యమిక విద్య అభ్యసించారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ పూర్తిచేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బి.ఎ., ఎం.ఎ. పట్టాలు పొందారు. 1962లో 'ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు-ప్రయోగాలు' అనే సిద్ధాంత వ్యాసానికి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ గ్రంథాన్ని 20వ శతాబ్ద పూర్వార్ధ ప్రామాణికమైన సాహిత్య చరిత్రగా పేర్కొనవచ్చు. ఆయన కవిత్వాన్నే ఎన్నుకొని ఆయా నవీన కవితారీతులు సమగ్రంగా విశ్లేషించి ఆధునిక సాహిత్య నేపథ్యాన్ని సమన్వయించి చూపారు.

వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో కందుకూరి, గురజాడ, గిడుగు కృషి వల్ల నూతన సాహిత్య పోకడలు ఆవిష్కృతమయ్యాయి. సాహిత్యంతో పాటు కళాత్మక విలువలు కూడా పెంపొందాయి. కవితా మాధ్యమం, శిల్పమూ, ఛందమూ నూతన అందాలు సంతరించుకున్నాయి. ఈ శతాబ్దంలో మాత్రా ఛందస్సులు, గీతికలు, గేయాలు, రొమాంటిసిజంతో కాల్పనిక కవులు, రచయితలు ప్రభావితులయ్యారు. వారిలో ఆచార్య సినారె కూడా ఒకరని చెప్పుకోవచ్చు.

సాహిత్యం

ఆచార్య సి. నారాయణ రెడ్డి తెలుగు భాషకు సమగ్రపుష్టి. ప్రధానంగా ఈయన నాదకవి.



"తెలుగు కళ్లకు తెలుసు నా లలిత కళా రూపం తెలుగిళ్లకు తెలుసు నా కల గీతికా దీపం"

సినారె రచనల్లో అనేక ప్రక్రియలు కనిపిస్తాయి. గీతికలు, గేయాలు, అభినవ కవితలు హృదయాన్ని హత్తుకుంటాయి. ఈయన రచించిన 'దివ్వెల మువ్వలు' లాంటి ముక్తకాల నుంచి 'నాగార్జున సాగరం', 'కర్పూర వసంతరాయలు' లాంటి కథాకావ్యాలు, 'నవ్వని పువ్వు', 'రామప్ప విశ్వదీపం' తదితర సంగీత రూపకాల వరకూ ఈయన కవితా రచనలో నాద తరంగిణి వినిపిస్తుంది. ఈయన స్వయంగా కర్పూర వసంతరాయలు కావ్యం గానం చేస్తుంటే హృదయం పులకరిస్తుంది. ఐదు దశాబ్దాలపాటు సినారె కొన్ని వందల గేయాలు, గీతాలు రచించారు. అనేక సినిమా పాటలు కూడా రాశారు. ఆధునిక సాహిత్యంలో గేయరచనకు స్థిరస్థానం కల్పించారు. డా. సి. నారాయణరెడ్డి పేరు వినగానే కర్పూర వసంతరాయలు, నాగార్జున సాగరం, విశ్వంభర మొదలైన గేయ కథాకావ్యాలు గుర్తుకు వస్తాయి. 'తెలుగు గజళ్లు', 'ప్రపంచ పదులు' లాంటి వినూత్న రచనలు ఆయన ప్రతిభకు తార్కాణాలు. 'విశ్వంభర', 'మట్టీమనిషీ ఆకాశం' లాంటి దీర్ఘకావ్యాలు సినారె తాత్వికతకు నిదర్శనాలు. 'మట్టీ మనిషీ ఆకాశం' హిందీ, ఆంగ్ల భాషల్లోకి అనువాదమైంది. పుస్తక సమీక్షలు కూడా వచ్చాయి. డా. ముదిగొండ వీరభద్రయ్య దానిమీద వందపేజీల వ్యాఖ్యా గ్రంథం రాశారని సినారె స్వయంగా చెప్పారు. ఇవే కాకుండా ఎన్నో వచన కవితలు, గీతాలు, గజళ్లు, ప్రపంచ పదులు, ద్విపదలు రచించారు.

సినారె కవిత్వం ఒక నిరంతర ప్రస్థానం. ఎల్లలెరుగని విశ్వమానవీయత ఆయన తత్వం. అనాదిగా మానవజీవితం విశ్వంలో ఏ విధంగా ప్రతిస్పందిస్తుందీ, విశ్వంతర ప్రకృతిలో మానవ మహితాత్మ ఎలా నిరంతర యాత్ర సాగిస్తోందీ.. అనే విషయాలను తన విశ్వంభర సుదీర్ఘ కావ్యంలో ప్రతిపాదించారు. ఈ కావ్యం సినారెను ఆధునిక భారతదేశ సాహిత్య చరిత్రలో మహాకవిగా, ఆధునికాంధ్ర సార్వభౌముడిగా నిలబెట్టింది. 1988లో 'జ్ఞానపీఠ్ పురస్కారం' సాధించిపెట్టింది. ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో ముగ్గురికి మాత్రమే 'జ్ఞానపీఠ్ పురస్కారం' లభించింది. సినారెతో పాటు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ (రామాయణ కల్పవృక్షం - 1970లో), రావూరి భరద్వాజ (పాకుడు రాళ్లు - 2012లో) ఈ పురస్కారం అందుకున్నారు. 1990-91లో యుగోస్లావియాలో జరిగిన 'విశ్వకవి' సమ్మేళనంలో సినారె పాల్గొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నలభై దేశాలు, నలభై భాషల కవులు పాల్గొన్న సమ్మేళనంలో మనదేశం తరపున భారతీయ భాషల ప్రతినిధిగా నారాయణరెడ్డిని భారత ప్రభుత్వం పంపించింది. అక్కడ నియమం ప్రకారం ఆ కవి రాసిన భాషలోనే తన కవిత చదవాలి. అలా చదివిన తర్వాత దాని అనువాదం ఉంటుంది. అది విన్న పండితులు, కవులు, హర్షధ్వానాలతో నారాయణ రెడ్డిని స్వాగతించారు. ప్రపంచవ్యాప్తంగా విశేష పాఠకాదరణ ఉన్న ఇరవైమంది భారతీయ సాహితీవేత్తల్లో ఆచార్య నారాయణరెడ్డి ఒకరని 'దేశ్' అనే బెంగాలీ పత్రిక తన సర్వేలో తెలిపింది.

ఈ శతాబ్ద సాహిత్యమూర్తుల్లో విలక్షణ వ్యక్తిత్వం నారాయణ రెడ్డిది. కవితా తాత్వికుడిగా, కళావేత్తగా, గాన, సాహిత్యవేత్తగా పేరొందారు. తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడిగా, ఆంధ్రసారస్వత పరిషత్తు అధ్యక్షుడిగా, రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. ఈయన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

మాదిరి ప్రశ్నలు

1. ఆచార్య సి. నారాయణరెడ్డి తెలంగాణలో ఏ జిల్లాలో, ఎక్కడ జన్మించారు?
   1) కరీంనగర్ జిల్లా-హన్మాజీ పేట
   2) వరంగల్ జిల్లా- హనుమకొండ
   3) మహబూబ్ నగర్ అలంపురం
   4) నల్లగొండ జిల్లా - కొలనుపాక
2. ఆచార్య సి. నారాయణరెడ్డికి ఏ గ్రంథానికి 1988లో జ్ఞానపీఠ్ పురస్కారం లభించింది?
   1) కర్పూర వసంతరాయలు
   2) నాగార్జున సాగరం
   3) మట్టీ మనిషీ ఆకాశం
   4) విశ్వంభర గేయ కథాకావ్యం
3. కిందివారిలో ఎవరు నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, లాంటి రచనలు చేశారు?
   1) విశ్వనాథ సత్యనారాయణ
   2) డా. సి. నారాయణ రెడ్డి
   3) తిరుమల రామచంద్ర
   4) గుంటూరు శేషేంద్రవర్మ

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2.

We were surprised to know ...



BANK EXAMS
GENERAL ENGLISH

Model Questions

Directions (Q. 1 - 5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Though many companies (1)/ believe that it is quality not price that sells their products, (2)/ they also know the facts (3)/ that advertising sells. (4)/ No error (5)
2. Eat has the selectional restriction (1)/ that it must be following by a kind of food, (2)/ so 'I eat sky' (3) / is not possible. (4)/ No error (5)
3. There was (1)/ no way he could (2)/ keep going (3)/ below all that pressure. (4)/ No error (5)
4. It was not until morning (1)/ that the sheer scale (2)/ of the damage (3)/ could be seen. (4)/ No error (5)
5. Trade sanctions (1)/ were imposed (2)/ against any country (3)/ that refuses to sign the agreement. (4)/ No error (5)

Directions (Q. 6-10): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

6. You'll have to study <u>any books</u> on Freud before writing a paper on psychoanalysis.
   1) Much books 2) few books
   3) some books 4) more books
   5) No correction required
7. A European visitor to the Far East must accommodate <u>self from</u> the habits of life that may seem very strange to him.
   1) Himself to 2) his self to
   3) himself for 4) his self from
   5) No correction required
8. He joined postgraduate course in the same college in which he had studied <u>for the three previous years.</u>
   1) from previous three years
   2) during the previous three years
   3) three years previous
   4) during the three previous years
   5) No correction required
9. She always <u>manage</u> to hurt her mother's feelings.
   1) do manage
   2) does manage
   3) did manages
   4) do managed
   5) No correction required
10. It is the people <u>who matters</u> in a democracy.
   1) whom matters
   2) whose matters
   3) whose matter
   4) who matter
   5) No correction required

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. We were surprised to know that our friend was of royal ______.
   1) dissent 2) decent
   3) descent 4) dissuade
   5) dispute
12. ______ of the highly educated people is a huge ______ on the country's resources.
   1) Fight, draw
   2) Position, aspect
   3) Plight, drain
   4) Struggle, issue
   5) Rank, exhaust
13. No ______ reasons have been given for the sudden flight of refugees ______ this area.
   1) proper, for
   2) correct, along
   3) suitable, among
   4) valid, from
   5) compelling, counter
14. The modern ______ of communication have ______ distance.
   1) ways, deep
   2) methods, destroyed
   3) paths, shortened
   4) means, annihilated
   5) gadgets, developed
15. These remarks about the dominance of casteism in elections are quite ____ to the present ____.
   1) apposite, position
   2) opposite, fact
   3) relevance, media
   4) significance, party
   5) applaudable, generation

Directions (Q. 16 - 20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) These days technology has revolutionized the very concept of a wrist watch. 3
B) Almost a majority of the people wear a watch worn round the wrist, it measures time in minutes, hours etc. 1
C) The day is not far when we shall have a little TV fitted into a wrist watch. 4
D) A wrist watch may be wound or automatic. 2
E) Wrist watches have become an integral part of human beings, due to their utilities. 6
F) One may have a choice of leather or metal of gold or silver while choosing a strap for the wrist watch. 5

16. What is the LAST sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) E 5) F
17. What is the THIRD sentence after rearrangement?
   1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
   1)A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
   1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
   1) A 2) B 3) C 4) D 5) F

Directions (Q. 21-30): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

The international fight against Islamic State moved up a _____ (21) on Saturday as Turkish police arrested a Belgian suspect heading for Syria in connection with ____ (22) week's Paris attacks, hours after the UN Security Council unanimously ______ (23) all its members to combat the extremist group.

A day after the EU imposed ____ (24) new external border controls, authorities in Belgium raised the alert level in the capital to level four - signifying a "serious and imminent threat" as the _______ (25) for the remaining jihadi who killed 130 people in Paris entered its second week. The presumed ringleader of the Paris attacks, Abdelhamid Abaaoud, a 28-year-old Belgian national of Moroccan origin, was ______ (26) to have been in Syria but died in a ferocious seven-hour gunfight ______ (27) police at a rundown apartment in St-Denis, north of Paris, on Wednesday. Another ______ (28) member of the unit, Salah Abdelslam, a 26-year-old Frenchman living in Brussels, is the subject of an international manhunt. His brother, Brahim, who blew himself up in the attacks, spent time in a Belgian prison with Abaaoud, while a third Molenbeek resident, Bilal Hadfi, was also among the Paris suicide bombers. Belgian Special Forces ______ (29) four people in the capital's Place du Grand Sablonon Saturday afternoon, while the Brussels Metro system is expected to be shut down until Sunday afternoon at the earliest. Shops ______ (30) closed, some shopping malls were shuttered, professional football was cancelled, concerts were called off and music venues, museums, and galleries shut their doors for the weekend.

21. 1) gear 2) ahead 3) above 4) always 5) alone
22. 1) lost 2) last 3) late 4) lastly 5) lasted
23. 1) urge 2) urging 3) urged 4) pledged 5) plead
24. 1) tight 2) treat 3) tread 4) tough 5) track
25. 1) hate 2) hurt 3) heat 4) hurt 5) hunt
26. 1) thought 2) thinking 3) think 4) thinned 5) thanked
27. 1) from 2) with 3) for 4) form 5) firm
28. 1) suspense 2) suspect 3) suspected 4) suspecting 5) suspects
29. 1) convicted 2) allowed 3) acquitted 4) arrested 5) prosecuted
30. 1) are to 2) will be 3) will been 4) have been 5) were

KEY

1) 3;	2) 2;	3) 4;	4) 5;
5) 4;	6) 3;	7) 1;	8) 2;
9) 2;	10) 4;	11) 3;	12) 3;
13) 4;	14) 4;	15) 1;	16) 4;
17) 1;	18) 5;	19) 1;	20) 3;
21) 1;	22) 2;	23) 3;	24) 4;
25) 5;	26) 1;	27) 2;	28) 3;
29) 4;	30) 5.		